వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 19 సంచిక : 9 హైదరాబాద్ 238 సెప్టెంబర్ 2021 పేజీలు : 68 రు. 25

- ఫాసిస్టు ఎజెండాలో భాగమే పెగాసస్
- తెలంగాణలో పోడు భూముల సమస్య
- ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై దాడులు
- 30 ఏళ్ల ఆర్థిక సంస్కరణల తీరుతెన్నులు
- ప్రజా సమస్యలు పట్టని పార్లమెంటు
- ఈశాన్య జాతుల అంతర్గత వైరుధ్యాలు
- అఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల పునరుత్థానం

'Save Veekshanam' Campaign

వీక్షణంకు చేయూతనివ్వండి!

తెలుగు సమాజంలో రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణలో రెండు దశాబ్దాలుగా అసాధారణమైన కృషి చేస్తున్న మాసపత్రిక వీక్షణం ఆర్థిక పరిస్థితి ప్రమాదకరమైన స్థితికి చేరుకున్నది. కొవిడ్ లాక్ డౌన్ కు ముందు చందాల ద్వారా, పుస్తకాల అమ్మకాల ద్వారా, ప్రకటనల ద్వారా వచ్చిన ఆదాయానికి దాతల విరాళాలు జత కలిసి పత్రిక నడుస్తుండేది. ఏడాదిన్నరగా కొవిడ్‌తో జనజీవితమే సంక్షోభమయంగా ఉన్నందువల్ల చందాలు తగ్గిపోయాయి, పుస్తకాల అమ్మకాలు పూర్తిగా ఆగిపోయాయి, ప్రకటనలు రావడం లేదు. కేవలం దాతల విరాళాల మీదనే పత్రిక ఆధారపడవలసిన స్థితి వచ్చింది. ఏడాదిన్నరగా నెలకు యాభై వేల రూపాయల లోటుతో, అప్పులతో పత్రిక నడుస్తున్నది. ఇటువంటి స్థితిలో పత్రిక నడపలేమని నిర్వాహకులు భావిస్తున్నప్పటికీ, తెలుగు సమాజానికి ఇటువంటి ఆలోచనాస్ఫోరక పత్రిక చాల అవసరమని, ప్రస్తుత సంక్షోభ స్థితిలో ఆ అవసరం మరింత పెరుగుతున్నదని, పత్రికను ఎట్టి పరిస్థితిలోనూ ఆపగూడదని పాఠకులు, మిత్రులు, అభిమానులు కోరుతున్నారు. పందొమ్మిది సంవత్సరాలలో, 237 సంచికలలో, నాలుగున్నర వేల వ్యాసాలతో వీక్షణం ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ పరిణామాలెన్నిటినో విశ్లేషించి పాఠకుల అవగాహనలు పెరగడానికి తోడ్పడింది. ఆ మహత్తర కృషి ఆగిపోగూడదని మిత్రులు కోరుతున్నారు.

ఈ గడ్డు కాలాన్ని అధిగమించడానికి మరొకసారి మీదగ్గరికి రాక తప్పడం లేదు. మీరు ఇవ్వగలిగిన విరాళం ఎంతైనా సరే, వీక్షణం మనుగడకు అది ఉపయోగపడుతుంది. తెలుగు సమాజంలో ఒక అత్యవసరమైన ప్రయత్నానికి మీ వంతు చేయూత ఇవ్వండి. మీ వీలును బట్టి, మీ శక్తిని బట్టి మీ విరాళం ఎంత స్వల్పమైనా, ఎంత భూరి విరాళమైనా సరే. వీక్షణం మనుగడకు మీ చేయూతనివ్వండి. వీక్షణం చిరకాలం జీవించేందుకు తోడ్పడండి.

విరాళాలు పంపడానికి వివరాలు

వీక్షణం

చెక్/డిడి ద్వారా: వీక్షణం, జి1, మైత్రీ రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్ నగర్, హైదరాబాద్ 500029,
ఫోన్ : 73307 95849, ఇమెయిల్ : veekshanam2003@gmail.com,
www.veekshanam.wordpress.com

ఎలక్ట్రానిక్ ట్రాన్స్ ఫర్ ద్వారా:

Veekshanam,
Account No. 013911011002175,
Union Bank of India, Gagan Mahal Brach, Hyderabad.
IFSC Code: UBIN0801399

ఈ అకౌంట్ నంబర్‌తో ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్‌తో పాటు
గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల ద్వారా కూడా చెల్లించవచ్చు.

238

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాస పత్రిక

సెప్టెంబర్ 2021
సంపుటి : 19
సంచిక : 9

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫోన్ : 7330795849
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : నవ్య ప్రింటర్స్
అంబర్‌పేట్, హైదరాబాద్.

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై **'VEEKSHANAM'** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **UBIN0801399** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన రామిశెట్టి రోశయ్య, మధిర, ఖమ్మం – రు. 1,000; జి. బుచ్చన్న, వనపర్తి – రు. 1,000; శ్రేయోభిలాషి, పాలకొల్లు, తూర్పుగోదావరి – రు. 2,000; మిత్రులకు కృతజ్ఞతలు – సం.

'వీక్షణంను ఆదుకోండి' అంటు మీరు ప్రకటించినదాన్ని చూసి వీక్షణం ఆగిపోరాదు, అది శ్రమజీవులను గురించి అనేక మంది మేధావులు రాసే కథనాలు ఆగిపోరాదు అనే ఉద్దేశ్యంతో నేను పత్రికకు చిన్న కానుక చెక్కు పంపుతున్నాను.

– రామిశెట్టి రోశయ్య
మధిర

వీక్షణం ఆగస్టు సంచికలో వచ్చిన సంపాదకీయాలతో పాటు అన్ని వ్యాసాలు ఎంతో లోతైన విశ్లేషణలతో కూడి ఉన్నాయి. ముఖ్యంగా స్టాన్ స్వామి గురించి, ఆయన వ్యక్తిత్వం, ఆచరణ, ఆలోచనల గురించి ఫెలో వాకర్ గారు తను రాసిన 'ఫాదర్ స్టాన్ స్వామి మావోయిస్టా?' వ్యాసంలో ఎన్నో విషయాలను, ఆయనతో పంచుకున్న అనుభవాలను చాలా వివరంగా తెలియజేశారు. స్టాన్ స్వామి ఆదివాసులకు జరిగే అన్యాయాలను ప్రశ్నించడమే కాకుండా, స్వయాన ఆదివాసి గ్రామాలకు వెళ్లి, వారితో కలిసి, వారి ఇళ్లలోనే ఉండి, వారి పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాటం చేయడం చూస్తుంటే ఆయనకు అణగారిన ప్రజలపై ఉన్న అభిమానం ఎలాంటిదో అర్థం అవుతున్నది. క్రైస్తవ జీవితం ప్రారంభించన స్టాన్ స్వామి వివిధ ప్రాంతాలు తిరిగే క్రమంలో ఎన్నో అధ్యయనాలు, పరిశోధనలు చేసి, విప్లవాల గురించి తెలుసుకునేందుకు ఇతర దేశాలకు వెళ్లి ఎంతో మేధస్సును సొంతం చేసుకున్నాడు. ఆయన తన జీవితంలో చేసిన అన్ని పోరాటాల గురించి, ఆయన జీవితాన్ని గురించి తెలుసుకోవాలంటే ఈ వ్యాసం తప్పక చదవాలి. సమాజ శ్రేయస్సు కోసం, సమాజ మెరుగుదల కోసం, అణగారిన, పీడితుల, అభాగ్యుల హక్కుల కోసం పోరాటం చేయడం, ప్రజల వైపు నిలబడే ఇలాంటి వారిని ప్రశ్నించడమే నేరంగా చూస్తున్న ప్రభుత్వాలు ఎలాంటి నేరం చేయకున్నా అన్యాయంగా ఏదో ఒక నేరం మోపి జైళ్లో బంధించి, చివరికి జైళ్లోనే వారి ప్రాణాలు కూడా తీస్తున్న దుర్మార్గమైన పరిస్థితి నేడు అతి పెద్ద ప్రజాస్వామిక దేశం అనిచెప్పుకుంటున్న దేశంలో జరుగుతున్న హక్కుల హననం. అలా అన్యాయంగా ప్రాణాలు కోల్పోయిన వారిలో ఒకరు స్టాన్ స్వామి. అన్యాయాలను దీటుగా నిలబడి ప్రభుత్వాలను ప్రశ్నించే ఇలాంటి వారి గురించి, ఇంకా దేశంలో ఎక్కడో ఒకచోట జరిగే అనేక విషయాల గురించి వీక్షణంలో ఎప్పటికప్పుడు వ్యాసాల రూపంలో తీసుకొస్తూ మాలాంటి వారు మెరుగుపడడానికి వీక్షణం ఎంతో ముందుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఇంకా అనేక తప్పుడు విధానాలను ప్రతినెలా లోతైన విశ్లేషణలతో, వ్యాసాల రూపంలో వీక్షణంలో తీసుకురావడం చాలా అవసరం. ఈ మధ్య కాలంలో వీక్షణం ఆర్థిక ఇబ్బందుల గురించి వస్తున్న విజ్ఞప్తి చూస్తున్నాను పత్రిక క్రమం తప్పకుండా రావడానికి నా వంతు ఆర్థిక సహాయాన్ని అందిస్తాను. కరోనా కాలాన్ని తట్టుకొని సమాజం హితం కోసం పనిచేస్తున్న వీక్షణం లాంటి పత్రికలు నేడున్న పరిస్థితుల్లో చాలా అరుదు. కాబట్టి పత్రిక నిలబడడానికి నా మిత్రులను కూడా సంప్రదించి సహకరిస్తాను. మా లాంటి వారిని ఎప్పటికప్పుడు మేల్కొలిపేలా పత్రికను క్రమం తప్పకుండా తీసుకొస్తున్నందుకు వీక్షణం కలెక్టివ్ వ్యారికి ధన్యవాదాలు.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

ఆగస్టు నెల వీక్షణం సంచికలో అచ్చయిన వ్యాసాలు దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న వివిధ రాజకీయ పరిణామాల గురించి అనేక విశ్లేషణలతో కూడి ఉన్నాయి. కాని ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ రాష్ట్రాల నడుమ జల వివాదం కారణంగా వీక్షణంలో అరుణ్ గారు రాసిన ఒక్క వ్యాసం మాత్రమే వచ్చింది. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ లబ్ధికోసం మాత్రమే ఈ ఈ వివాదాన్ని ఎక్కువ చేశాయి. ఈ సమస్యను ఎంతో సులువుగా పరిష్కరించాల్సింది పోయి, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య వివాదం రేపే విధంగా చూస్తున్నాయి. ఈ సమస్య గురించి, జల వివాదాల అసలు కారణాల గురించి, నిజమైన వాస్తవాలతో కూడిన సమగ్రమైన వ్యాసాలు వంచే సంచికలోనైనా వస్తాయని ఆశిస్తున్నాను. ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న తప్పుడు విధానాలను ప్రజలు తెలుసుకునేందుకు ఇంకా అనేక వ్యాసాలు రావాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇంకా ఫెలో వాకర్ గారు రాసిన 'ఫాదర్ స్టాన్ స్వామి మావోయిస్టా?' వ్యాసంలో స్టాన్ స్వామి గురించి, ఆయన వ్యక్తిత్వం గురించి, ఆయన జీవిత కాలంలో ఎక్కడ అన్యాయం జరిగినా, ఆదివాసులకు, అణగారిన ప్రజల, శ్రామికుల వైపు నిలబడి పోరాడిన దాని గురించి, అతనితో తనకున్న అనుభవాలను ఇంకా అనేక విషయాలను వివరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనల గురించి, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా, వారికి ఉద్యోగ భద్రత కల్పించకుండా వారిని అక్కడి ప్రభుత్వం ఎలా మోసం చేస్తుందో, ఇంకా ఎపిలో జరిగే అనేక విషయాలను బర్నబాస్ గారు తన వ్యాసంలో తెలియజేశారు. ఇలాంటి అనేక విషయాలను ఎప్పటికప్పుడు వీక్షణం ద్వారా ప్రతినెలా అందజేస్తున్నందుకు రచయితలకు, ఎడిటోరియల్ కలెక్టివ్ వారికి కృజ్ఞతలు.

– మాధవ్ కుమార్
జహీరాబాద్

వీక్షణంలో ఈ మధ్య జరుగుతున్న రాజకీయ, సామాజిక విషయాల మీద వ్యాసాలు బాగానే వస్తున్నాయి గాని, కొన్ని వ్యాసాలు మామూలు దినపత్రికల వ్యాసాల స్థాయిలోనే ఉంటున్నాయి. ప్రజలు తెలుసుకోవలసిన మరెన్నో విషయాల మీద వ్యాసాలు రావడమే లేదు. ఈ మధ్య మొదలైన తత్వశాస్త్ర అనువాదం కాక, సిద్ధాంతపరమైన విషయాలు చాలా తక్కువగా

(మిగతాది పేజీ నెం.59)

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

'భారత్ కారుచౌక, రండి రారండి'-బందిపోట్ల ఆహ్వానాలు

మహా ఘనత వహించిన కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖామాత్యులు తమ ప్రభుత్వం తలపెట్టిన మహత్తర విక్రయ పథకాన్ని ఆడంబరంగా ప్రకటించారు. జాతీయ ఆస్తుల ద్రవ్యీకరణ ప్రణాళిక అని ఆకర్షణీయమైన పేరు పెట్టుకున్న ఈ బందిపోటు పథకపు అసలు ఉద్దేశం 2024 సార్వత్రిక ఎన్నికలలోగా దేశపు ఆస్తులను కారుచౌకగా తమ ఆశ్రితులకు అప్పగించడం. దేశంలో ఇప్పటికే కనబడుతున్న సూచనల ప్రకారం 2024 ఎన్నికల్లో భాజపా-ఎన్‌డిఏ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైనంత ఆధిక్యత సంపాదించలేకపోవచ్చు. అంటే సంఘ్‌పరివార్ పాలనకు మిగిలినది ఇంకొక మూడు సంవత్సరాలు మాత్రమే. ఈ ఉన్న వ్యవధిలోనే దీర్ఘకాలిక ప్రభావాలు వేసే చర్యలు తీసుకొని, వాటిని మళ్లీ సవరించలేని స్థితి తీసుకురావాలి. బహుళ జాతి సంస్థలకు, వారి దళారీలకు సేవ చేయడంలో, వారి ప్రయోజనాలను కాపాడడంలో ఏ ఒక్క పార్లమెంటరీ పార్టీకీ అభ్యంతరమేమీ లేదు. అన్ని పార్టీలూ కేంద్రంలోనో, రాష్ట్రాలలోనో ఆ విషయం మూడు దశాబ్దాలకు పైగా రుజువు చేస్తూనే ఉన్నాయి. కనుక 2024లో ఎవరు దిగి ఎవరు ఎక్కినా బహుళ జాతి సంస్థలకు, వారి దళారీలకు రాబోయే నష్టం ఏమీ లేదు. కాని ఈ లోగానే వారికి అప్పనంగా దోచిపెట్టి, వారికి దాసోహం అనడంలో తమను మించినవారు లేరని చూపుకోవాలని సంఘ్‌పరివార్ తాపత్రయ పడుతున్నది. తాము అధికారంలో ఉన్నప్పుడే తమ యజమానులకు సంతుష్టి పరచి, వారి శాశ్వత పోషణ దక్కించుకోవాలని చూస్తున్నది. రానున్న నాలుగు ఆర్థిక సంవత్సరాలలో పదమూడు రంగాలకు చెందిన వందలాది జాతీయ ఆస్తులను అమ్మకానికి పెట్టి ఆరు లక్షల కోట్ల రూపాయలు సంపాదిస్తానని పథకం సిద్ధం చేసింది. ఐదు సంవత్సరాలలో జాతీయ స్థాయిలో మౌలిక సౌకర్యాల కల్పన కోసం తాము 111 లక్షల కోట్ల రూపాయల పథకం రూపొందించామని, ఆ పథకం అమలు చేయాలంటే ఉన్న ఆస్తులను సమీక్షించవలసి ఉందనీ, ఆ సమీక్షలో భాగమే ఈ ఆరు లక్షల కోట్ల రూపాయల అమ్మకం పథకం అని ప్రభుత్వం చెప్పుకుంటున్నది. ప్రకటిస్తున్న భారీ పథకం గతంలోని అనేక వాగ్దానాల లాగనే నీటి మూటగా తేలిపోతుంది. ఈలోగా ఉన్న ఆస్తుల అమ్మకం మాత్రం వాస్తవంగా జరిగిపోతుంది.

కొత్త బందిపోటు ప్రణాళిక ప్రకారం దేశంలోని 26,700 కిమీ రహదారులు అమ్మి రు. 1,60,200 కోట్లు, 400 రైల్వే స్టేషన్లు, 90 రైళ్ల, 1,400 కిమీ రైలు మార్గం, 265 గూడ్స్ షెడ్లు, 15 రైల్వే స్టేడియంలు అమ్మి రు. 1,52,496 కోట్లు, 28,608 సర్క్యూట్ కిమీ విద్యుత్ సరఫరా లైన్లు అమ్మి రు. 45,200 కోట్లు, 2,86,000 కిమీ భారత్ నెట్ ఫైబర్, 14917 బిఎస్‌ఎన్‌ఎల్, ఎంటిఎన్‌ఎల్ టవర్లు అమ్మి రు. 35,199 కోట్లు, ఆరు జిగా వాట్ల విద్యుదుత్పత్తి రంగం అమ్మి రు. 39,832 కోట్లు, 8,154 కిమీ సహజ వాయువు పైప్ లైన్లు అమ్మి రు. 24,462 కోట్లు, 3,930 కిమీ పెట్రోలియం ఉత్పత్తుల పైప్ లైన్లు అమ్మి రు. 22,503 కోట్లు, ఫుడ్ కార్పొరేషన్ కు, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ కు చెందిన 210 గోడౌన్లు అమ్మి రు. 28,900 కోట్లు, 160 గనులు అమ్మి రు. 28,747 కోట్లు, 25 విమానాశ్రయాలు అమ్మి రు. 20,782 కోట్లు, తొమ్మిది ఓడరేవులకు చెందిన 31 ప్రాజెక్టులు అమ్మి రు. 12,828 కోట్లు, రెండు జాతీయ క్రీడా స్టేడియంలు, రెండు ప్రాంతీయ కేంద్రాలు అమ్మి రు. 11,450 కోట్లు, ఢిల్లీలో ఇళ్ల స్థలాలు, దేశవ్యాప్తంగా హెూటళ్లు అమ్మి రు. 15,000 కోట్లు సంపాదించనున్నామని ప్రభుత్వం భారీగా ప్రకటించింది. ఈ అమ్మకాల కోసం నీతీ ఆయోగ్ ప్రత్యేకంగా ఆడంబరంగా తయారు చేసిన రెండు సంపుటాల నివేదికలో ఇప్పుడు అమ్మజూపుతున్నవి మాత్రమే కాక ప్రభుత్వం భవిష్యత్తులో అమ్మడానికి ఏమేమి ఉన్నాయో బహుళజాతి సంస్థలకు నోరూరించే దేశ సంపద జాబితాలు ఇచ్చారు.

ప్రభుత్వం చెపుతున్న భారీ అంకెలకు మైమరచిపోకుండా, ఈ ఆస్తులు అమ్మడానికి ఈ ప్రభుత్వానికి అధికారం ఉందా, ఎందుకు అమ్ముతున్నారు, ఎవరికి అమ్ముతున్నారు, ఏ విధివిధానాలకు లోబడి అమ్ముతున్నారు, అమ్మక తప్పని స్థితి వస్తే అది దేశ ప్రజల ముందు చర్చించారా, అమ్మడం అనివార్యం అనుకుంటే విలువ ఎట్లా నిర్ణయించారు, ఆ వెల రాకపోయినా అడ్డికి పావుసేరు అమ్ముతారా, అమ్మగా వచ్చిన నిధులు ఏ ప్రజా ప్రయోజనం కోసం ఖర్చు పెట్టనున్నారు, ఈ అమ్మకం ప్రక్రియలో అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి, దుబారాకు, అక్రమాలకు అవకాశం లేకుండా ఏ చర్యలు తీసుకుంటున్నారు వంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. ఈ ప్రశ్నల్లో ఏ ఒక్క ప్రశ్నకూ ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు. ఈ ప్రశ్నల కన్న మించి, రహదారులు, రైల్వే స్టేషన్లు, రైలు మార్గాలు, రైళ్లు, ప్రభుత్వరంగ సెల్ టవర్లు, ఫైబర్ లైన్లు అమ్మడం అంటే ఆ సేవలన్నీ ప్రైవేటు లాభాపేక్షకు అప్పగించడమన్నమాట. ఆ సేవలు వాడుకోక తప్పని స్థితిలో ఉన్న ప్రజలను ప్రైవేట్ వ్యాపారస్తుల లాభాపేక్షకు బలి ఇవ్వడమన్నమాట. ఒక నాగరిక, బాధ్యతాయుత, ప్రజాస్వామిక ప్రభుత్వానికి ఈ అధికారం ఉందా? ప్రజల నుంచి వసూలు చేసే ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వల్ల మాత్రమే మనుగడలో ఉండగలుగుతున్న ప్రభుత్వం తాను ప్రజలకు అందించవలసిన సేవలను కత్తిరించి, ఆ సేవలకోసం ఒక ప్రైవేటు సంస్థ దగ్గరికిపోక తప్పనిస్థితి కల్పించడం అనైతికం. ఐదు సంవత్సరాల కోసం మాత్రమే ఇచ్చిన అధికారాన్ని ఇలా మొత్తం భవిష్యత్తును ధ్వంసం చేయడానికి దుర్వినియోగం చేయడం దుర్మార్గం. ఇలా ఒకసారి అమ్మకం జరిగిపోయినతర్వాత, రేపు ఎన్నికల్లో మరొక పార్లమెంటరీ పార్టీ, లేదా కూటమి అధికారానికి వచ్చినా వారికి ఈ నిర్ణయాన్ని తిరగదోడి, రద్దు చేసే అవకాశం ఉండదు. అప్పుడిక అత్యవసరమైన ప్రజాసేవల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య పోటీ కూడ లేకుండా ప్రైవేట్ రంగం మాత్రమే ఉన్నప్పుడు ప్రజల పరిస్థితి ఏమిటి? ఈ అక్రమం ద్వారా అందే ముడుపులు, బహుళజాతిసంస్థలకు, దళారీలకు తమ దాస్యాన్ని చూపుకునే అవకాశం కనబడి, రానున్న ఇతర పార్టీల పాలకులు కూడ ఇదే మార్గం చేపడితే దేశ ప్రజలు ఏమైపోవాలి? భారత రాజకీయార్థిక పాలక వ్యవస్థ బాగు చేయడానికి వీలులేనంత కుళ్లిపోయిందనీ, దీన్ని కూలదోయడం తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదనీ ఈ 'జాతీయ ఆస్తుల అమ్మకం' పథకం మరొకసారి చూపుతున్నది. ఇక మిగిలినది ప్రజల కార్యాచరణ మాత్రమే. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

అందరికీ బంధు అంటె అందరికీ బంద్ అనేనా!

అబ్బ, ఉజురబాద లొల్లి జబర్దస్తుగున్నది. పాపం పెద్ద దొర, శిన్న దొర తల్లడం మల్లడం అయితాండ్లు. ఆడనే కుర్చి ఏస్కోని కూసుంటాండ్లు. వశపడని వరాలు కురిపిస్తాండ్లు. చెవిన బట్టని మాటలు మాట్లాడుతాండ్లు. ఆడ ఓట్ల పండుగ ఎన్నడొస్తదో గని ఉజురబాద సొర్గం లెక్కయిపోతాందనుకో. ఇగ గది జూశి, మా ఎమ్మెల్లె గుడ రాజినాం బెడితె బాగుండు గద అని అందరు అనుకోబట్టిరి. ఉజురబాదల మునుంబెట్టిన దళిత బంధు సంగతి ఇదివరకె జెప్తి. ఈ నడిమిట్లనె దొర గాలిమోటరు మీన బొయ్యి ఆడ పది మందిని బిలిశి నపరి పది లచ్చలు ఇయ్యనే ఇచ్చె. 'వాడలన్నీ బంగారి మేడలైపాయెనే' అని పాటలు గుడ పాడిరి. మారె, గిదేడ పొద్దుగై పొడైతది అని ముక్కిరిశినోల్లు ఎల్లెక్కల బడ్డట్టు దొరవారు కిస్తి మీద కిస్తి మీద కిస్తి పన్నెండు వందల కోట్లు గుమ్మరిచ్చిరి. ఎహె, నాకు కోటి అంటె దెల్వది, పది లచ్చలంటె గుడ దెల్వది గని పొల్లగాల్లు పేపర్ల, టీవీల జూసి జెప్తాండ్లు గద. మొత్తానికి శాన పైసలనుకోరాదు. గదే కొనెల్లెదో లేదో అని అనుమానపడెటోల్లు, ఓట్ల పండుగ అయిపోంగనె అన్ని మలిశి మూలకు బెడ్తరని బరాబర్ జెప్పెటోల్లు ఉండంగనె, మాకేది మాకేది అని గయ్యర గయ్యరమనెటోల్లు మస్తు మందైరి. ఇంటింటికి మంటిపొయ్యే గద. యాడేశిన గొంగడి ఆడ్నే ఉన్నది గద. దళిత బంధు ఐతెమాయె గని, ఆదివాసి బంధు బెట్టవా, ముస్లిం బంధు బెట్టవా, బిసి బంధు బెట్టవా అని ఆడొగలు ఈడొగలు మొప్పై లొల్లి బెడ్తాండ్లు గద. బందంటే బంద్ అనుకునేవు, గది కాదు. దొరవారు ఒచ్చినాక శాన బంద్ జేశిండు, ధర్నా చౌక్ బంద్ జెయ్యలే, ఆట పాట మాట బంద్ జెయ్యలే. దఫ్తర్ కొచ్చుడు బంద్ జెయ్యలే. గిది గసొంటి బంద్ గాదు, ఇది ఏరే. బంధు అంటె సుట్టిరికమన్నట్టుగ. దొరవారికి, కాకపోతే సర్కారుకు దళితులు సుట్టాలన్నమాట. మమ్ముల గుడ సుట్టాలు జేస్కోరాదు బాంచెన్ అని లొల్లి మొపాయె. ఇగ దొరవారు మామూలోడా, అవ్వల్ దర్జ. అందరికి బంధులు బెడ్త. అందరితోని సుట్టిర్కం గలుపుకుంట, చల్ గదెంత పని, అందరు నా బంధులే అంటాండు. అయ్యా, నాకు దెల్వకడుగుత, అందరికి నపరి పది లచ్చలియ్యాల్నంటె పురాగ ఎంతయితది బాంచెన్. దొరవారి జాయిదాదంత అమ్మితె సరిపోతదా? అరె, గాయినె జాయిదాదెందుకు అమ్మాల్నంటవా? ఈ పైసలు గాయినె ఇత్తాండు గద. కాదా, మంది సొమ్మేనా ఇది. ఓర్నీ, అత్త సొమ్ము అల్లుడు దానం జేశినట్టున్నదా ఇది. సర్కారి బూములు అమ్మైనా సరే, దళిత బంధు ముంగలికి దీస్కపోతం అన్నడట గద శిన్న దొర. బాగున్నది. మంది సొమ్మే మందికి ఇత్తాండ్లన్నమాట. దానికి పెద్ద మెహర్బాని జేశినట్టు టుపాకి ఎంకట్రామని కతలు జెప్తాండ్లన్నమాట. కని మంది సొమ్ము పలారం జేసుడంటె నాకు శిన్నపుడు ఇన్న కత యాదికొత్తాంది. రాములవారి పాల కత ఎరికేనా, అందరు తలా ఇన్ని పాలు బోత్తె, పేదసాదల పిల్లలకు పంచిపెడ్త అని రాములవారు గంగాలం బెట్టిండ్రట. నా ఒక్కన్ని నీల్లు బోత్తె ఎవరికి దెలుత్తదిలే అని అందరు నీల్లే బోశిండ్రట. కొసాకరుకు నీల్ల గంగాలం మిలిగిందట. గిప్పుడు మన ఖజాన గుడ గట్లనే ఉన్నదట గద. సర్కారు నౌకర్లకు జీతాలే ఎల్లతలేవట గద. మరి గా ఖాళి ఖజాన్ల నించి దొరవారు పాలెవరికి బోత్తడు? సుట్టిర్కం ఎందరితోని గల్పుకుంటడు? ✦

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

ఆదర్శాల సమర్థనలు సరే, అసలు సంగతేమిటి?

ప్రభుత్వాలు చేపట్టే కొన్ని చర్యలు, వాటికి ప్రభుత్వాధినేతలు చెప్పే సమర్థనలు పైకి చూడడానికి ఉదాత్తంగా, ఆదర్శవంతంగా కనబడి ప్రజలను, ముఖ్యంగా మధ్యతరగతి ఆలోచనాపరులను మాయ చేస్తుంటాయి. ఆ చర్యలలో, సమర్థనలలో తప్పు పట్టవలసిందేమీ లేనట్టు అనిపిస్తుంది. కాని ఆ రూపాన్ని దాటి సారంలోకి వెళ్లి చూస్తే ఆ చర్యల వల్ల, సమర్థనల వల్ల వాస్తవంగా ప్రజలకు ఒరిగేదేమీ లేదని, అవి ప్రజా ప్రయోజనాల కోసం కాదనీ, అవి కేవలం పాలకవర్గ ముఠా తగాదాల్లో భాగమనీ తేలుతుంది. ఈ సాధారణ అవగాహనకు కళ్లకు కట్టే నిదర్శనం ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లో ప్రదర్శితమవుతున్నది. చిత్తూరు జిల్లాలో నాలుగు దశాబ్దాలుగా నడుస్తున్న అమర్ రాజా బ్యాటరీస్ అనే పారిశ్రామిక సంస్థ కాలుష్యానికి పాల్పడుతున్నదనీ, జల, వాయు, భూకాలుష్యానికి, వాతావరణంలో సీసం పరిమాణం పెరగడానికి కారణమవుతున్నదనీ, కనుక కరకంబాడి, నూనెగుండ్లపల్లి కర్మాగారాలను వెంటనే మూసివేయాలనీ ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నాలుగు నెలల కింద నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను సవాల్ చేస్తూ కంపెనీ యాజమాన్యం హైకోర్టుకు వెళ్లడమూ, మొదట ఆ నోటీసుల మీద స్టే ఇచ్చిన కోర్టు ఇప్పటికి రెండు మూడు వాయిదాలు వేసి సాగదీయడమూ ఒకవైపు జరుగుతున్నాయి. తాము పర్యావరణానికీ, ప్రజారోగ్యానికీ, కార్మికుల భద్రతకూ అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామనీ, తాము ఏ తప్పూ చేయలేదని కంపెనీ అంటున్నది. 'ఆంధ్రప్రదేశ్ మిమ్మల్ని వెళ్లగొడితే, మీకు స్థలం ఇవ్వడానికి, సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం, రండి, రారండి' అని తమిళనాడు ప్రభుత్వం పిలుస్తున్నది. 'మీ వైఖరి ఇలాగే ఉంటే ఆ ఆహ్వానాన్ని మన్నించి మేం వెళ్లిపోతాం' అని కంపెనీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నది. 'మీరు వెళ్లిపోవడం కాదు, మేమే పంపిస్తాం, మాకు మా ప్రజారోగ్యమే ముఖ్యం' అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలు ఎదురు సవాళ్లు విసురుతున్నారు. ఈ చర్య తీసుకోవలసిందే గాని, రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కాలుష్య కారక పరిశ్రమలుండగా వాటి జోలికే పోని ప్రభుత్వం అమర్ రాజా మీద మాత్రమే మూసివేత కొరడా ఝుళిపించడమేమిటనే ప్రశ్నలూ వస్తున్నాయి. విశాఖపట్నంలో డజన్లకొద్దీ పారిశ్రామిక సంస్థలు భయంకరమైన విషపదార్థాలతో జల, వాయు కాలుష్యాలకు, పర్యావరణ విధ్వంసానికి కారణమవుతుండగా, అన్నిటికన్న మించి కడప జిల్లా తుమ్మలపల్లె యురేనియం కర్మాగారం, అదే జిల్లాలోని సిమెంట్ పరిశ్రమ అక్కడి ప్రజల ఆరోగ్యాలనూ, జీవన భద్రతనూ ధ్వంసం చేస్తుండగా, పెదవి విప్పని ప్రభుత్వం అమర్ రాజా మీద ఎందుకు ఈ చర్యలకు పాల్పడుతున్నదనే ప్రశ్నలు వస్తున్నాయి. తప్పనిసరిగా అమర్ రాజా బ్యాటరీస్ కలగజేస్తున్న కాలుష్యం మీద చర్యలు తీసుకోవలసిందే. అందులో భిన్నాభిప్రాయం లేదు. కాని ఆ పరిశ్రమ తెలుగుదేశం పార్లమెంటు సభ్యుడు జయదేవ్ గల్లాకు చెందినది కాకపోయి ఉంటే, మరెవరైనా వై ఎస్ ఆర్ సి పి నాయకుడిదో, ఆశ్రితుడిదో అయి ఉంటే ఈ చర్యలు జరిగేవేనా అనే ప్రశ్న ఆలోచించవలసినదే. కొన్ని సంవత్సరాల కింద ఇట్లాగే కాలుష్యం పేరు చెప్పి ఢిల్లీ నగరం నుంచి పరిశ్రమలను శివార్లకు మార్చడంలో రియల్ ఎస్టేట్ ప్రయోజనాలున్నాయనే బహిరంగ రహస్యం ఆ తర్వాత బైటపడింది. కాలుష్యం, పర్యావరణం, ప్రజారోగ్య పరిరక్షణ అనేవి పైకి చెప్పే మాటలే తప్ప ప్రభుత్వ చర్యల వెనుక అసలు కారణాలు రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలే అనేది ఇప్పుడు మరొకసారి రుజువవుతున్నది. ✦


భూతాపాన్ని నియంత్రించకుంటే మనుగడకే ప్రమాదం

– ఎ. నర్సింహారెడ్డి

వాతావరణ పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి నియమించిన ఇంటర్ గవర్నమెంట్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (ఐపిసిసి) 195 దేశాల ఆమోదంతో ఆగస్టు 9న విడుదల చేసిన 6వ నివేదిక పర్యావరణ ముప్పుపై తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. వాతావరణంపై ఇదే నిర్లక్ష్యం కొనసాగితే రానున్న మూడు దశాబ్దాల్లో 1.5 నుండి 2 డిగ్రీల సెల్సియస్ దాకా భూతాపం పెరగనున్నట్లు తేల్చి చెప్పింది. ఉష్ణోగ్రత పెరగడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, సముద్రపు నీటిమట్టాలు పెరగడం వంటివి సాధారణమై, మనుగడ దుర్భరమౌతుంది. ఇప్పటికే ప్రపంచం నలుమూలలా అన్ని దేశాల్లో అసాధారణ వర్షాలూ, కరువులూ, వరదలూ, పంటల నష్టాలూ, కార్చిచ్చులూ అధికమయ్యాయి. 1970లలో ఏటా 1.5 సెంటిమీటర్ల ఎత్తు పెరిగే సముద్ర నీటిమట్టం నేడు ఏటా 3 సెంటిమీటర్ల చొప్పున పెరుగుతూ వస్తోంది. ఏభై సంవత్సరాల్లో పెరిగే ఉష్ణోగ్రత 10 సంవత్సరాలకే పెరుగుతూ వస్తోంది. భారత్‌లో కూడా హిమాలయాల మంచు కరగడం, వరదలు సంభవించడం అధికమయింది. ప్రపంచంలోకెల్లా మన దేశమే భూతాపం ప్రభావాన్ని అధికంగా ఎదుర్కొంటుందనడం మనకు బెంబేలెత్తించే అంశం. అన్ని సముద్రాల కంటే హిందూ మహాసముద్రమే ఎక్కువగా వేడెక్కుతోందని, విపత్తులు భీకరంగా ఉంటాయని ఐపిసిసి నివేదిక ప్రత్యేకంగా నొక్కి చెప్పింది. ప్రకృతిని ఆషామాషీగా తీసుకోవడం, విధ్వంసాన్ని అభివృద్ధిగా భావించడం వల్ల భూగోళం వేడెక్కసాగింది. రోజురోజుకు సాంకేతికత పెరుగుతున్న యుగంలో ప్రజా రవాణా, పారిశ్రామికీరణ, పట్టణీకరణ, వ్యవసాయ యాంత్రీకరణ, విద్యుత్ ఉత్పత్తి, వినియోగం, పెట్రోలు, డీజిల్ వాడకం కారణంగా భూతాపం పెరగడానికి ప్రత్యక్షంగా పెట్టుబిదారీ అభివృద్ధి నమూనానే కారణమవుతున్నది. ఈ పాపానికి తొలి వరుస ముద్దాయిలు అభివృద్ధి చెందిన దేశాలు. కేవలం మూడు సంపన్న దేశాలు, (చైనా, అమెరికా, యూరోప్ సమాఖ్య) విడుదల చేస్తున్న కర్బన ఉద్గారాలు మొత్తం వాటాలో 46 శాతం. కింది 100 దేశాల వాటా 3 శాతం మాత్రమే. అంటే వాటికంటే 16 రెట్లు ఎక్కువ అభివృద్ధి చెందిన దేశాలే ప్రపంచానికి నష్టం చేకూరుస్తున్నాయి. పోనీ అందుకు తగ్గ బాధ్యతపడుతున్నాయా అంటే అదీ లేదు. మిగతా దేశాలకు ఉద్గారాలను తగ్గించడానికి అవసరమైన సహాయమూ, టెక్నాలజీ అందించింది లేదు. చెయ్యాల్సిన నష్టమంతా చేసి బాధ్యత మాత్రం అందరం సమానంగా పంచుకోవాలంటూ అగ్రరాజ్యాలు ఉద్బోధలు చేస్తున్నాయి. అది వర్ధమాన దేశాలకు భారంగా తయారవుతోంది. తాజా నివేదిక ప్రకారం 2050 సంవత్సరానికల్లా ఉద్గారాల్ని సున్నా స్థాయికి తేగలిగితేనే రానున్న ప్రమాదానికి బ్రేకులు పడతాయి. ధనిక దేశాలు తప్పించుకొనే ధోరణి మాని అందరి తరపునా బాధ్యత తలకెత్తుకుంటేనే అది సాధ్యం. ప్రస్తుతం ఆ భరోసా లేదు. మిగతా ప్రపంచ దేశాలు ఒక్కటై వాటిని ఒప్పందానికి కట్టుబడేలా చెయ్యాలి.

వీ






❖ పరంపర – ప్రాతినిధ్య తెలంగాణ కవిత్వం – ప్రధాన సంపాదకులు: నందిని సిధారెడ్డి – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 414 పేజీలు, 1/8 డెమీ, రు. 250, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ – 500004, ఫోన్ : 040–29703142




❖ ఒంటరీకరణ – కవిత్వం – మామిడి హరికృష్ణ – స్వరాజ్యం పబ్లికేషన్స్ ప్రచురణ – 108 పేజీలు, 1/4 క్రౌన్, రు. 200, ప్రతులకు: స్వరాజ్యం పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. 804, రాయల్ పెవీలియన్ అపార్ట్‌మెంట్స్, బిగ్ బజార్ ఎదురుగా, ఆర్‌బిఐ క్వార్టర్స్ పక్కన, అమీర్‌పేట్, హైదరాబాద్ – 500016, సెల్ : 8008005231




❖ గుండె చప్పుళ్లు – కవితా సంపుటి – ప్రమోద్ ఆవంచ – 168 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: ఆవంచ ప్రమోద్ కుమార్, ఇ.నెం. 80/81, గాయత్రీనగర్, జిల్లెలగూడ, హైదరాబాద్ – 500097, ఫోన్ : 7013272452




❖ ఆరోగ్య జీవనం – (అందమైన జీవితం కోసం) – పిళ్లా కుమారస్వామి – పెట్ పబ్లికేషన్స్ ప్రచురణ – 160 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: పిళ్లా లక్ష్మీదేవి, ఔ/శీ. పి.వి. కుమారస్వామిరెడ్డి, సెల్ : 94901 22229, అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలలో




❖ ఉడుకుబెల్లం – కథలు – చింతకింది శ్రీనివాసరావు – శ్రీనిజ ప్రచురణలు – 122 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు: శ్రీనిజ పబ్లికేషన్స్, 6–60/1, రవీంద్ర నగర్, ఓల్డ్ డైరీ ఫామ్, విశాఖపట్నం – 530040, ఆంధ్రప్రదేశ్, ఫోన్ : 8897147067




❖ మహాభారతం – మతదర్శనం – 1 – (ఆదిపర్వం) – చంద్రశేఖరరెడ్డి. చేగిరెడ్డి – చేగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రచురణలు – 204 పేజీలు, 1/8 డెమీ, రు. 220,




❖ మహాభారతం – మతదర్శనం – 2 – (సభాపర్వం) – చంద్రశేఖరరెడ్డి. చేగిరెడ్డి – చేగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రచురణలు – 94 పేజీలు, 1/8 డెమీ, రు. 100,




❖ మాతృ దర్శనం – (పంచశతి) – చంద్రశేఖరరెడ్డి. చేగిరెడ్డి – చేగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రచురణలు – 122 పేజీలు, 1/8 డెమీ, రు. 120,
పై మూడు ప్రతులకు: చేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మొహిద్దీన్‌పురం పోస్ట్, అర్ధవీడు మండలం, ప్రకాశం జిల్లా – 523 336, ఫోన్ : 98663 09589



❖ తెలంగాణ బి.సి. వాద సాహిత్యం – అట్టెం దత్తయ్య – ప్రణవం పబ్లికేషన్స్ ప్రచురణ – 258 పేజీలు, 1/8 డెమీ, రు. 230, ప్రతులకు: అట్టెం లక్ష్మి, ఇ.నెం. 3–9/2, గ్రా. శట్పల్లి, మం. లింగంపేట్, జి. కామారెడ్డి – 503124, ఫోన్ : 9494715445



❖ కాల విజేత – (చైనా కవితలు) – జీది మాజా – తెలుగు అనువాదం: ఎన్. గోపి – బోధి ఫౌండేషన్ ప్రచురణ – 118 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: ఎన్. గోపి, ఇ.నెం. 13–1/5బి, శ్రీనివాసపురం, రామంతపూర్, హైదరాబాద్ – 500013, తెలంగాణ, ఫోన్ : 919391028496



❖ వెలుతురుతోవలు – హరితరేఖల సంకలనం – సంకలనం: వలేటి గోపీచంద్ – రచనా సహకారం: ఆకుల అమరయ్య – 'పద్మశ్రీ' డా. ఐ.వి. సుబ్బారావు స్మారక కమిటీ ప్రచురణ – 232 పేజీలు, 1/8 డెమీ, రు. 200, పై రెండు ప్రతులకు: వలేటి గోపీచంద్, ఫోన్ : 9441276770




❖ తిరోగమన భారతం – (సవాళ్లు–సంఘర్షణ) – తెలుగు: బోడపట్ల రవీందర్ – వైరా స్టడీ సర్కిల్ ప్రచురణ – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 125,



❖ కల్లోల భారతం – తెలుగు: బోడపట్ల రవీందర్ – వైరా స్టడీ సర్కిల్ ప్రచురణ – 112 పేజీలు, 1/8 డెమీ, రు. 100, పై రెండు ప్రతులకు: బొంతు రాంబాబు, వైరా స్టడీ సర్కిల్, బోడేపూడి భవన్, వైరా, ఖమ్మం – 507165, ఫోన్ : 9490098205, 9848412451, నవతెలంగాణ బుక్‌హౌస్ (అన్ని బ్రాంచీలలో)



❖ కవిత్వంతో నా ప్రయోగాలు – శ్రీశ్రీ – కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 75,



❖ ఫాదర్ గాడ్ – నాన్న జ్ఞాపకాలు – శ్రీశ్రీ – కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ – 48 పేజీలు, 1/8 డెమీ, రు. 45,



❖ శ్రీశ్రీ అంకితాలు – కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 55,
పై మూడు ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతీనగర్, విజయవాడ – 520004, ఫోన్ : 9246277375

అఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల పునరుత్థానం

అఫ్ఘనిస్తాన్ నుండి అమెరికన్ సైన్యం వెళ్లాక తిరిగి అధికారంకోసం తాలిబాన్ మతతత్వ శక్తులు చేస్తున్న అరాచకాలు, వీరికి వ్యతిరేకంగా స్థానిక పార్టీల, సంస్థల సన్నాహాలు అంతర్యుద్ధం వైపు వెళ్లేలా ఉన్నాయంటున్నారు **సంతోష్**

'తీవ్రవాదంపై యుద్ధం' పేరుతో 20 సంవత్సరాల క్రితం అమెరికా సైన్యాలు కూల్చిన మతతత్వ ఛాందసవాద అఫ్ఘనిస్తాన్ తాలిబాన్ల ప్రభుత్వం మళ్లీ అధికారం హస్తగతం చేసుకునేందుకు రంగం సిద్ధమైంది. సామ్రాజ్యవాద అమెరికా-నాటో సంకీర్ణ సేనలు అఫ్ఘనిస్తాన్ నుంచి వెనుదిరగడంతో తాలిబాన్ల జైత్రయాత్ర అప్రతిహతంగా నిర్విఘ్నంగా సాగింది. ఆగస్టు 15 ఉదయానికి తాలిబాన్లు అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 14న ఆ దేశ కీలుబొమ్మ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ రాజీనామా చేసి తన సన్నిహితులతో సహా దేశం విడిచి వెళ్లిపోయాడు. అధ్యక్ష భవనంలోకి తాలిబాన్లు ప్రవేశించారు. అధికార మార్పిడి కోసం చర్చల ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో పలు దేశాల దౌత్య కార్యాలయాలు ఖాళీ అయ్యాయి. తాలిబాన్లు తిరిగి అధికారం చేపట్టడంపై అంతర్జాతీయ సమాజంలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. భౌగోళిక రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ ఇతర పశ్చిమ దేశాలు తీసుకున్న వైఖరికి, అమెరికాతో వివాదమున్న రష్యా, చైనా, పాకిస్తాన్, ఇరాన్ తీసుకున్న వైఖరికి మధ్య తేడా ఉన్నది.

అల్‌ఖైదా, తాలిబాన్ల నిర్మూలన సాకుతో రెండు దశాబ్దాలు అమెరికా అఫ్ఘనిస్తాన్‌లో తిష్టవేసింది. ప్రజలపై ప్రేమ, జాలితో కాదు. అఫ్ఘనిస్తాన్ భౌగోళికంగా దక్షిణాసియాలో కీలక ప్రాంతం. ప్రపంచంలో అరుదైన ఖనిజం లిథియం అఫ్ఘనిస్తాన్‌లో పుష్కలంగా లభిస్తుంది. ఇంకా ఇతర విలువైన రాగి, బాక్సైట్, ఇనుము ఖనిజాలతో నిండివున్న వ్యూహాత్మక ప్రాంతం. రెండు దశాబ్దాలుగా ఆఫ్ఘాన్‌లోని భూగర్భ ఖనిజాలను అమెరికా దోచుకుపోయింది. ఆయుధాలు అమ్ముకుంది. అఫ్ఘనిస్తాన్‌ను బలిపశువు చేసింది. అమెరికా ఏర్పాటు చేసిన కీలుబొమ్మ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం మోపింది. పేదరికం, నిరుద్యోగం పెరిగింది. ఆర్థిక వ్యవస్థ కుంగిపోయింది. ప్రజలకు పాలకుల పట్ల, అమెరికా సేనల పట్ల వ్యతిరేకత పెరిగింది. ఏ దేశ అంతర్గత సమస్యనైనా ఆ దేశ పౌరులే తేల్చుకోవాలి తప్ప విదేశీ జోక్యం సరైంది కాదు. ప్రజలు ప్రజాతంత్ర విప్లవానికి పూనుకుంటే మద్దతు ప్రకటించవచ్చు.

ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత తాలిబాన్ల మనుగడకు, పురోగమనానికి తోడ్పడింది. తాలిబాన్లు అమెరికా సేనలతో పోరాడి చివరికి అమెరికా సేనలు దేశం విడిచి వెళ్లేలా చేశారు. అఫ్ఘనిస్తాన్‌పై రెండు దశాబ్దాలు అతిపెద్ద యుద్ధం చేసి రెండవసారి వియత్నాం తర్వాత అఫ్ఘనిస్తాన్ నుంచి మూట ముల్లె సర్దుకొని సైన్యం వెనుదిరగడం అమెరికాకు పరాభవం. అయితే అఫ్ఘనిస్తాన్ ప్రజలకు రాజకీయంగా గొప్ప విజయమేనని చెప్పవచ్చు. అఫ్ఘనిస్తాన్ ప్రజలు అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ, దోపిడీకి వ్యతిరేకంగా రెండు దశాబ్దాల రక్త తర్పణతో, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విజయం ఇది. అయినా ప్రజలకు ప్రజాతంత్ర హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, ఆ దేశ అభివృద్ధి ఫలాలు చేరవు. ఎందువల్లనంటే తిరోగమన మతతత్వవాదుల నాయకత్వంలో జరిగిన పోరాటం అయినందున. మతతత్వం సమాజ పురోగమనానికి ఆధునిక ప్రజాస్వామిక లౌకిక విలువలకు వ్యతిరేకం.

తాలిబాన్లపై అమెరికా యుద్ధానికి నేపథ్యం:

అమెరికా మిత్రుడు తాలిఖాన్ వ్యతిరేక కూటమి ఉత్తర అలయన్స్ కమాండర్ అహ్మద్ షా మసూద్‌ను 2001 సెప్టెంబర్ 9న అల్‌ఖైదా తీవ్రవాదులు హత్య చేశారు. సెప్టెంబర్ 11, 2001న ఇస్లామిక్ తీవ్రవాద గ్రూప్ అల్‌ఖైదాతో సంబంధం ఉన్న 19 మంది మిలిటెంట్లు నాలుగు అమెరికా విమానాలను హైజాక్ చేసి, అమెరికాలోని లక్ష్యాలకు వ్యతిరేకంగా ఆత్మాహుతి దాడులకు పాల్పడ్డారు. రెండు విమానాలు న్యూయార్క్ నగరంలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ జంట టవర్లను ఢీకొనగా మూడవ విమానం వాషింగ్టన్ డిసికి వెలుపల పెంటగాన్‌ను ఢీకొట్టింది, నాల్గవ విమానం పెన్సిల్వేనియాలోని శాంక్‌విల్లేలోని మైదానంలో కూలిపోయింది. అమెరికా చరిత్రలో ఇది అత్యంత ఘోరమైన తీవ్రవాద దాడి. ఆ దాడి వార్తతో భీతిల్లిన అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ బంకర్‌లో దూరిన విషయం తెలిసిందే. 9/11 తీవ్రవాద దాడుల్లో దాదాపు 3,000 మంది మరణించారు.

అమెరికాలోని ట్విన్ టవర్స్‌పై దాడికి అల్‌ఖైదా తీవ్రవాదులే కారణమన్న అభిప్రాయానికి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ వచ్చాడు. అల్‌ఖైదా తీవ్రవాదులను ఎక్కడ ఉన్నా అంతం చేస్తామని ప్రకటించాడు. ఈ దాడులకు వ్యూహకర్త అల్‌ఖైదా నాయకుడు ఒసామా బిన్ లాడెన్ అని భావించిన అమెరికా అతన్ని అమెరికాకు అప్పగించాలని అఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వాన్ని కోరింది. తాలిబాన్ ప్రభుత్వం అమెరికా ప్రతిపాదనను అంగీకరించలేదు. బిన్ లాడెన్‌కు అఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందని ఆనాటి అమెరికా అధ్యక్షుడు 'తీవ్రవాదంపై యుద్ధం' పేరిట అఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం ప్రకటించాడు. అల్‌ఖైదాకు అఫ్ఘనిస్తాన్ స్థావరం అయినప్పటికి, హైజాకర్లలో ఎవరూ అఫ్ఘనిస్తాన్ జాతీయులు లేరు. అమెరికా, నాటో సేనలు కలిసి 2001 అక్టోబర్ 7న అఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధం ప్రారంభించాయి.

అక్టోబర్ చివరలో తాలిబాన్ల ప్రభుత్వం కూలిపోయింది.

2001 అక్టోబర్ నుంచి తాలిబాన్లు వరుస దాడులు చేస్తూ అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వాలను బలహీనపరిచారు. చివరకు ఈ యుద్ధంపై ఖర్చు అమెరికాకు తలకు మించిన భారమై అక్కడి నుంచి నిష్క్రమించదలిచింది. అందుకే తాలిబాన్లతో దోహాలో 2020 ఫిబ్రవరి 29న శాంతి ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం తాలిబాన్లు అఫ్ఘనిస్తాన్ ప్రజాస్వామ్య ప్రభుత్వంతో అధికారం పంచుకోవాలి. ఒప్పందంతో తమ పని పూర్తయిందంటూ అమెరికా సేనలు హడావుడిగా అఫ్ఘనిస్తాన్ నుంచి వైదొలగడం ప్రారంభించాయి. తాలిబాన్లు మాత్రం అఫ్ఘనిస్తాన్ ప్రభుత్వంపై పోరు ప్రారంభించారు. రాజధాని కాబూల్ స్వాధీనంతో వారి లక్ష్యం నెరవేరింది. సామ్రాజ్యవాద వ్యతిరేకత, ప్రభుత్వాల అవినీతి, ఆర్థిక వ్యవస్థ కుంగుబాటు వల్ల ఏర్పడిన ప్రభుత్వ వ్యతిరేకత తాలిబాన్ల విజయానికి తోడ్పడింది.

ఎవరీ తాలిబాన్లు:

పష్తూ భాషలో తాలి అంటే విద్యార్థి అని అర్థం. స్వదేశంలో స్వజాతీయులను ఇవాళ ఇంతగా భయకంపితులను చేస్తున్న తాలిబాన్లకు ఒకప్పుడు విముక్తి వీరులుగా పేరు ఉండటం విశేషం. 1980 దశకంలో అఫ్ఘనిస్తాన్‌పై సోవియట్ యూనియన్ దురాక్రమణను వ్యతిరేకిస్తూ పోరాడిన అనేక తిరుగుబాటు దళాల్లో తాలిబాన్ ఒకటి. ప్రచ్ఛన్న యుద్ధం నేపథ్యంలో సోవియట్‌కు వ్యతిరేకంగా అమెరికా తాలిబాన్లను పెంచి పోషించింది, ఇస్లామిక్ తీవ్రవాదానికి ఊపిరిలూదింది. ఆనాటి రీగన్ ప్రభుత్వం సోవియట్ యూనియన్ దళాలకు వ్యతిరేకంగా ప్రాంతీయంగా జలాలుద్దీన్ హఖాని నేతృత్వంలో ట్రైబల్ ఆర్మీని ప్రారంభించింది. మతపరమైన తీవ్రవాద సంస్థ తాలిబాన్లను పాకిస్తాన్ గూఢచారి సంస్థ(ఐఎస్ఐ) తోడ్పాటుతో ఏర్పాటు చేసింది. వీటికి ఆయుధాలు, డాలర్ల మూటలు ఇచ్చి ప్రోత్సహించింది. చివరికి వాళ్లు అమెరికాకు ఏకు మేకయ్యారు. 1990లలో అఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ సేనలపై పోరాడిన వివిధ ముజాహిదీన్ వర్గాలు రష్యా సైన్యం నిష్క్రమణ తరువాత సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అయితే ముజాహిదీన్ నాయకులు పాలన గురించి పట్టించుకోకుండా నిరంతరం అంతర్గత కలహాల్లో మునిగి తేలేవారు. జనంపై విపరీతంగా పన్నులు వేసేవారు, డబ్బు కోసం కిడ్నాప్‌లకు తెగబడేవారు. దీంతో దేశమంతటా అరాచకం తాండవించింది.

ఈ నేపథ్యంలో 1994లో తాలిబాన్లు ముల్లా ఒమర్ నాయకత్వంలో దేశంలో సుస్థిరతను నెలకొల్పడానికి రంగంలోకి దిగారు. సౌదీ అరేబియా నిధులతో ఉత్తర పాకిస్తాన్‌లో నిర్వహించిన ఇస్లామిక్ విద్యాలయాల్లో వీరు చదువుకునేవారు. వ్యవస్థాపక సభ్యులంతా ఒమర్ విద్యార్థులే కావడం వల్ల... ఆ ముఠాకు తాలిబాన్ అని పేరు పెట్టారు. తాలిఖాన్ ముఠాలో తొలుత ముజాహిదీన్ ఫైటర్లు ఉండేవారు. పాకిస్తాన్ సైన్యం, సైనిక గూఢచారి సంస్థ ఐఎస్ఐల అండదండలతో తాలిబాన్లు అఫ్ఘనిస్తాన్ ముజాహిదీన్ వర్గాలను ఓడించి 1996కల్లా దేశాన్ని చాలవరకూ తమ ఏలుబడిలోకి తెచ్చుకుంది. 1996లో అఫ్ఘనిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన తాలిబాన్లు 2001 వరకూ కొనసాగారు. 1996లో సోవియట్ అనుయాయుడు అఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు నజీబుల్లాను ఉరి తీసి, కాబూల్ నడిబొడ్డున దీప స్తంభానికి తలకిందులుగా వేలాడదీసి తాలిబాన్లు వికటాట్టహాసం చేస్తే అమెరికా సంబరపడింది. తాలిబాన్ల పాలనలో ఆ దేశం చీకటియుగంలోకి వెళ్లింది.

తాలిబాన్ల ఆటవిక పాలన(1996-2001):

అఫ్ఘనిస్తాన్ పాలన చేపట్టిన తర్వాత తాలిబాన్లు నిజస్వరూపాన్ని చాటారు. ఇస్లామిక్ పాలన పేరిట కఠిన షరియా చట్టాన్ని అమలు చేశారు. హంతకులను, అక్రమ సంబంధానికి పాల్పడినట్లు అనుమానిస్తున్న స్త్రీ, పురుషులను బహిరంగంగా తలలు నరికారు లేదా ఉరితీశారు. చోరీలకు పాల్పడిన వారి చేతులు నరకడం వంటి మధ్యయుగాల నాటి శిక్షలు అమలు చేశారు. పురుషులు గడ్డాలు పెంచాలనీ, స్త్రీలు తప్పనిసరిగా బురఖాలు ధరించాలనీ ఆదేశించారు. 10 ఏళ్లు పైబడిన బాలికలు పాఠశాలలకు వెళ్లకూడదని ఆంక్షలు విధించారు. సంగీతం, టివి, సినిమాలనూ నిషేధించారు. పరమత సహనానికి వారి నిఘంటువులోనే స్థానం లేకుండా పోయింది. 2001లో బామియాన్ బుద్ధ విగ్రహాలను ఫిరంగులతో పేల్చేయడమే దీనికి నిదర్శనం.

తాలిబాన్లకు పుట్టినిల్లు పాకిస్తాన్ ఈ వాస్తవాన్ని పాకిస్తాన్ నాయకులు నిరాకరిస్తున్నా, తాలిబాన్ తొలితరం నాయకులు పాక్ మదర్సాల్లోనే చదివారనేది చారిత్రక సత్యం. ఒక దశలో తాలిబాన్లు పాకిస్తాన్‌లోనూ అస్థిరత సృష్టించారు. పెషావర్‌లో ఒక పాఠశాలపై దాడిచేసి విద్యార్థులను ఊచకోత కోశారు. అప్పటి నుంచి పాకిస్తాన్‌లో వారి ప్రాబల్యం క్షీణించింది. 2001 అక్టోబర్‌లో అఫ్ఘనిస్తాన్‌ను అమెరికా దురాక్రమించినప్పటి నుండి అఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి, అమెరికా నేతృత్వంలోని మిషన్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించారు. ఈ యుద్ధంలో అమెరికా మొత్తం 2000 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. 3500 మంది అమెరికా, నాటో సైనికులు మరణించారు. 20 వేల మంది సైనికులు గాయపడ్డారు. అఫ్ఘనిస్తాన్ సైనికులు 70 వేల మంది చనిపోయారు. 2 లక్షల మంది పౌరులు చనిపోయారు.

ఫలించని అమెరికా సైనిక తోడ్పాటు:

ఇరవైఏళ్ల పాటు పాశ్చాత్య దేశాల ఆధునిక బలగాల శిక్షణ, అమెరికా, నాటో సేనలు అందించిన ఆయుధాలు, 3.5 లక్షలకు పైగా బలగం... ఇన్ని ఉన్నా కనీస ప్రతిఘటన లేకుండా అఫ్ఘనిస్తాన్ సేన తాలిబాన్లకు తలొగ్గింది. తమ బలగాలు ఖాళీ చేసిన నెల రోజుల్లో దేశాన్ని తాలిబాన్లు వశం చేసుకోవచ్చన్న అగ్రరాజ్యం అంచనాలను తలకిందులు చేస్తూ కేవలం 10 రోజుల్లో అఫ్ఘనిస్తాన్ సైన్యం లొంగిపోయిన తీరు అందరినీ నివ్వెర పరుస్తోంది. ఎందుకిలా జరిగిందనే ప్రశ్నకు ముందుగా వినిపిస్తోన్న సమాధానం... అవినీతి! ఇరవై ఏళ్లుగా అఫ్ఘనిస్తాన్ సైన్యంలో అవినీతి తారాపథానికి చేరింది. సామాన్య సైనికుడి నుంచి అత్యున్నత అధికారి వరకు అంతా లంచాలకు అలవాటుపడ్డారు. ప్రపంచ దేశాలు ఇచ్చిన నిధులన్నీ అధికారులు దిగమింగి కూర్చున్నారు. స్వయంగా ఆ దేశ ఇన్‌స్పెక్టర్ జనరలే తమ దేశ బలగాలకు లంచమనే కేన్సర్ రోగం పట్టిందని చెప్పినట్లు యుఎస్ కాంగ్రెస్ నివేదిక చెబుతోంది.

2014లో ఒబామా అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అఫ్ఘనిస్తాన్ సెక్యూరిటీకి దాదాపు 88 బిలియన్ డాలర్లను యుఎస్, నాటో దళాలు వెచ్చించాయి. అఫ్ఘనిస్తాన్ వైమానిక దళంలో దాదాపు 211 విమానాలున్నాయి. కానీ వీటిని నడిపేందుకు అవసరమైన సిబ్బంది, వీరిని ప్రేరేపించే నాయకులు లేకుండా పోయారు. అందువల్ల

కాబూల్‌లోకి తాలిబాన్లు వస్తున్నా ఒక్క యుద్ధ విమానం కూడా ఎదిరించలేదు. అఫ్ఘనిస్తాన్ సేనల్లో అవినీతి మాత్రమే తాలిబాన్ల విజయానికి కారణం కాదు. ఒకప్పుడు తాలిబాన్లను గట్టిగా వ్యతిరేకించిన స్థానిక తెగల నాయకులు, ప్రజలు ఈ దఫా తాలిబాన్లకు సహకారం అందించారు. అఫ్ఘనిస్తాన్ కింది స్థాయి సైనికులు కూడ అమెరికా విధానాల పట్ల అసంతృప్తితో ఉన్నారు. సామ్రాజ్యవాద పీడన నుండి విముక్తి కావాలన్న జాతీయ భావన ఉండడంతో పలువురు తాలిబాన్లతో కలిశారు. తాలిబాన్లకు ఆయుధాలు అప్పగించి వారిని స్వాగతించారు. రెండు దశాబ్దాలు అమెరికా ఆధ్వర్యంలో పాలన జరగడం చాలా తెగలకు నచ్చలేదు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టంతో పాటు సాధారణ ప్రజల జీవితాలు ఛిద్రమయ్యాయి. ఈ పరిస్థితిని తాలిబాన్లు తమకు అనుకూలంగా తిప్పుకున్నారు.

తాలిబాన్లు క్షమాభిక్ష అంటూనే దాడులు:

అఫ్ఘనిస్తాన్‌ను తాలిబాన్లు కాబూల్‌ను ఆక్రమించి దాదాపు పదిరోజులు అయింది. మంచి పాలన అందిస్తామని వాళ్లు చెప్తున్నారు. ఆడవాళ్లూ చదువుకోవచ్చని, ఉద్యోగాలు చేసుకోవచ్చని ఈ మధ్య తాలిఖాన్ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ చెప్పారు. తాము మారామని, తమను గుర్తించాలని కోరారు. అయితే, కొన్ని చోట్ల మళ్లీ పాత పద్ధతులే కొనసాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. అఫ్ఘనిస్తాన్‌ను హస్తగతం చేసుకున్న తాలిబాన్లు తమ సహజ వైఖరికి భిన్నంగా అందరినీ కలుపుకొని పోయే ఉద్దేశంలో ఉన్నామని ప్రకటించారు. అఫ్ఘనిస్తాన్‌లో కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వంలో ఇతర రాజకీయ పార్టీల నాయకుల్ని కూడా చేర్చుకునే దిశగా చర్చలు జరుపుతున్నారు. ఆగస్టు 31 వరకు చర్చలు ఒక కొలిక్కి వస్తాయని, మహిళలు సహా ప్రభుత్వ ఉద్యోగులందరూ విధులకు హాజరు కావాలని, అఫ్ఘనిస్తాన్ పౌరులెవరు దేశం విడిచి వెళ్లకూడదని తాలిబాన్లు విజ్ఞప్తి చేయడంతో చర్చలు ముందడుగు వేసే అవకాశాలున్నాయి. తాము మారిపోయామని తాలిబాన్లు చెబుతున్నా ప్రజలు విశ్వసించడం లేదు. ముఖ్యంగా మహిళలు చాల భయాందోళనలో ఉన్నారు. వేలాది మంది దేశం విడిచి పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారు.

తాలిబాన్ సీనియర్ నాయకుడు, ఒకప్పుడు తాలిబాన్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న అమీర్ ఖాన్ ముత్తఖీ ఇప్పటికే కాబూల్‌లోని రాజకీయ పక్ష నాయకులతో పలు రౌండ్లు చర్చలు జరిపారు. ఒకప్పుడు దేశంలోని సంప్రదింపుల మండలికి నేతృత్వం వహించిన అబ్దుల్లా అబ్దుల్లా, మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్‌తో చర్చించారు. ఆగస్టు 15న కూడా హమీద్ కర్జాయ్ ఆధ్వర్యంలో తాలిఖాన్ అధికారి ముల్లా అబ్దుల్ ఘనీ బారదార్, ఖతర్ విదేశాంగ మంత్రి షేక్ మొహమ్మద్‌తో సమావేశమయ్యారు. అఫ్ఘనిస్తాన్‌లో తాజా రాజకీయ పరిస్థితులు, భద్రతా పరిస్థితులు, సాధారణ పౌరులకు కల్పించాల్సిన భద్రత, శాంతియుతంగా అధికార బదలాయింపు, దేశ పునరుజ్జీవనానికి తీసుకోవాల్సిన చర్యలు, సమగ్ర రాజకీయ పరిష్కారం వంటి అంశాలపై ఇరువురు నేతల మధ్య చర్చకు వచ్చినట్టు ఖతర్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

కొనసాగుతున్న తాలిబాన్ల దాడులు:

ఒకవైపు క్షమాభిక్ష అంటూనే పౌరులపై దాడులు చేస్తున్నారు. గందరగోళం రాజ్యమేలుతుంది. అఫ్ఘనిస్తాన్ నుంచి పారిపోయేందుకు వేలాది మంది కాబూల్ విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ జరిగిన తొక్కిసలాట, అమెరికా సైనికులు జరిపిన కాల్పులు, తాలిబాన్లు జరిపిన కాల్పుల్లో 12 మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. తమపై పోరాటంలో అమెరికా సైన్యానికి, ప్రభుత్వానికి సహకరించిన కీలక వ్యక్తుల కొరకు అన్వేషణ ముమ్మరం చేశారు. మీడియా స్వేచ్ఛను హరించబోమని ప్రకటించిన తాలిబాన్లు జర్మనీకి చెందిన 'డాయిష్‌విల్లే' సంపాదక వర్గ సభ్యుని కొరకు వెతుకుతున్నారు. ఆయన జర్మనీకి వెళ్లిపోయాడు. ఆయన బంధువులపై దాడి చేశారు. ఒక మహిళ వంట బాగా చేయలేదని మంటల్లో కాల్చి చంపారు. ఒక పోలీస్ ఆఫీసర్‌ను కూడ కాల్చి చంపారు. అమెరికాకు వ్యతిరేకంగా తాలిబాన్లు సాగించిన పోరాటానికి తజిక్‌లు, ఉజ్బెక్‌లు, హజారా జాతులు సహకరించాయి. అధికారం చేజిక్కించుకున్నాక ఈ జాతులకు ప్రాధాన్యత తగ్గింది. ఇప్పుడు హజారాలే టార్గెట్‌గా దాడులు చేస్తున్నారు.

తాలిబాన్ల హామీ నీటి మూటగా మిగిలింది. ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న దారుణాలను చూస్తుంటే అఫ్ఘనిస్తాన్‌లో పరిస్థితులు మున్ముందు మరింత దిగజారే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. కాబూల్ నుంచి అమెరికన్ల తరలింపు చరిత్రలోనే క్లిష్టప్రక్రియని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. ఈ ప్రక్రియ ఫలితం చివరకు ఎలా ఉంటుందో తాను హామీ ఇవ్వలేనన్నారు. స్త్రీల హక్కులను గౌరవిస్తామని, వారిని పనిచేసుకునేందుకు అనుమతిస్తామన్న తాలిబాన్ల హామీ కేవలం మాటలకే పరిమితమవుతోంది. మునుపటి స్వభావానికి భిన్నంగా వారేమీ ప్రవర్తించడం లేదనే వాదనలకు బలం చేకూరుస్తూ వారి క్రూరత్వాన్ని చాటే కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

మహిళలకు విద్య అందిస్తామన్న తాలిబాన్లు వారం రోజులకే వారి మొదటి ఫత్వా ఆడపిల్లల విద్యపైనే జారీ అయింది. హెరాత్ ప్రావిన్స్‌లో కో-ఎడ్యుకేషన్‌పై తాలిబాన్లు నిషేధం విధించారు. 'సమాజంలో అన్ని అరిష్టాలకు కో-ఎడ్యుకేషన్ మూలం' అని తాలిబాన్ ప్రతినిధి అఫ్ఘనిస్తాన్ ఉన్నత విద్యా విభాగం హెడ్ ముల్లా ఫరీద్ అన్నారు. వాటిని నివారించడానికి కో-ఎడ్యుకేషన్‌పై నిషేధం తప్ప మరో మార్గం లేదన్నారు. మహిళా లెక్చరర్లు కేవలం ఆడపిల్లలకే పాఠాలు బోధించాలని ఆదేశించారు. ఇంకోవైపు, అఫ్ఘనిస్తాన్ యువతులు జిహాదీలను పెండ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్నారు. మహిళలను శవ పేటికల్లో బంధించి చుట్టుపక్కల దేశాలకు సెక్స్ బానిసలుగా అమ్మేస్తున్నారు. అఫ్ఘనిస్తాన్‌లోని పర్వాన్ ప్రావిన్స్ మాజీ జడ్జి నజ్లా ఆయూబీ ఈ విషయాన్ని వెల్లడించారు.

తాలిబాన్లకు పెరుగుతున్న ప్రతిఘటన:

అఫ్ఘనిస్తాన్‌లో ఇప్పటికీ తాలిబాన్ల ఆధీనంలోకి రాని పంజ్‌షేర్ ప్రావిన్సులో దేశ ఉపాధ్యక్షుడు అమ్రుల్లా సలేహ్ నేతృత్వంలో కీలక చర్చలు కొనసాగుతున్నాయి. 'నార్దర్న్ కూటమి' పేరిట తాలిబాన్లపై సాయుధ పోరాటానికి దిగేందుకు ఇక్కడ నేతలు ప్రణాళికలు రచిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. అష్రాఫ్ ఘనీ దేశం విడిచి వెళ్లిపోయిన నేపథ్యంలో తనను తాను ఆపద్ధర్మ అధ్యక్షుడిగా సలేహ్ ప్రకటించుకున్నాడు. వివిధ రాజకీయ పార్టీల నేతల మద్దతు కూడగట్టడానికి

అమ్రుల్లా సలేహ్ ప్రయత్నిస్తున్నాడు. మరోవైపు పర్వాన్ ప్రానిన్స్‌లోని చారికర్ ప్రాంతాన్ని ఆగస్టు 19న అఫ్ఘనిస్తాన్ ఆర్మీ స్వాధీనం చేసుకుంది. హిందుకుష్ పర్వత శ్రేణుల్లో అఫ్ఘనిస్తాన్‌లోని పంజ్‌షేర్ లోయ ప్రాంతం ధిక్కారానికీ, స్వేచ్ఛా పోరాటానికీ సంకేతం. ఐదు సింహాల లోయ(పంజ్‌షేర్)గా ప్రసిద్ధిగాంచిన ఈ ప్రాంతం ఏనాడూ ఎవరికీ తలవంచలేదు. 1980ల నాటి సోవియట్ దురాక్రమణను, 90ల నాటి సోవియట్ దురాక్రమణను, 90ల నాటి తాలిబాన్‌లనూ ఎదిరించి నిలిచింది. అదే ప్రతిఘటన చేవతో తాజాగా మరోసారి తాలిబన్లను ఎదురొడ్డి నిలబడుతోంది. పంజ్‌షేర్ పోరాటయోధుడు అహ్మద్ షా మసూద్ వారసుడిగా ఆయన కుమారుడు అహ్మద్ మసూద్ తాలిబాన్ల వ్యతిరేక ధిక్కారం వినిపిస్తున్నారు. పంజ్‌షేర్ ప్రాంతంలో అఫ్ఘనిస్తాన్ ఆర్మీ దాడులు కొనసాగుతున్నాయి. అఫ్ఘనిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలు పలుచోట్ల తాలిబాన్లకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అఫ్ఘనిస్తాన్ పతాకాన్ని చాల చోట్ల ఎగురవేశారు.

అసదాబాద్‌లో తాలిబాన్ల శ్వేత పతాకాన్ని చింపివేసి అఫ్ఘనిస్తాన్ జాతీయ జెండాను రెపరెపలాడించారు. ఇక శాంతి యుత పరిస్థితులకు హామీని ఇచ్చిన తాలిబాన్లు అసదాబాద్‌లో నిరసనకారులపై గురువారం కాల్పులకు తెగబడ్డారు. దీంతో తొక్కిసలాట చోటు చేసుకొంది. కాల్పుల కారణంగానో, లేదా తొక్కిసలాట వల్లో కానీ 9 మంది మరణించినట్లు, మరికొంత మంది గాయపడ్డట్లు వార్తలు వచ్చాయి. కాబూల్ నగరంతో పాటు ఖోస్త్, నంగర్హర్, కునార్ ప్రావిన్సుల్లో నిరసనలు వెల్లువెత్తాయి. పురుషులతో పాటు మహిళలూ అఫ్ఘనిస్తాన్ జాతీయ పతాకాన్ని చేతబూని వీధుల్లోకి వచ్చారు. కాబూల్ విమానాశ్రయం సమీపంలో వందల మంది కార్లతో ర్యాలీ నిర్వహించారు. నంగర్హర్‌లో నిరసనకారులపై తాలిబాన్లు కాల్పులు జరిపారు. అక్కడ పలువురు గాయపడ్డారు.

తాత్కాలిక ప్రభుత్వంపై వారి నాయకులు మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్, అబ్దుల్లా అబ్దుల్లా, గుల్‌బుద్దీన్ హెక్మత్‌యార్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. మరోవైపున కొన్ని నగరాల్లో గురువారం స్వాతంత్ర్య దినం సందర్భంగా నిరసన ప్రదర్శకులను తాలిబాన్లు అణిచివేశారు. ఇదిలావుండగా, ఆహార కొరత ఉపద్రవం ముంచుకొచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా తమది 'ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్ఘనిస్థాన్' అని తాలిబాన్‌లు ప్రకటించుకున్నారు. అంటే ఇరాన్‌లో అయతుల్లా ఖొమేనీలాగా ముల్లా హిబతుల్లా అఖూంద్‌జాదా సర్వోన్నత నాయకునిగా (సుప్రీం లీడర్) ఉంటారు. ఆయన నియమించే వ్యక్తి దేశాధ్యక్షుడవుతారు. ఎప్పటిలోగా సాధారణ పరిస్థితులు పునరుద్ధరణ పొందుతాయో చెప్పగలిగిన స్థితిలో ఎవరూ లేరు. ఈ నేపథ్యంలో అధికార మార్పిడికి సంబంధించి చర్చించడానికి తాలిబాన్ సహ వ్యవస్థాపకుడు ముల్లా అబ్దుల్ ఘని బరాదర్ కాబూల్ చేరుకున్నారు. ఆయన తాలిబాన్ దళాధిపతులు, విధాన నిర్ణేతలు, మత పెద్దలు, ఘనీ ప్రభుత్వంలోని ముఖ్య నేతలతో చర్చించనున్నారు.

ముగింపు:

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత వలస నుండి దేశాలు విముక్తి అయ్యాక అగ్రరాజ్యాలు ఆయాదేశాల వనరులు కొల్లగొట్టడానికి, ఆధిపత్యం చెలాయించడానికి రుణాల పేరుతో, అభివృద్ధి పేరుతో జోక్యం చేసుకోవడం పెరిగింది. ప్రజలు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూనే ఉన్నారు. దేశాలపై అమెరికా, రష్యాల పెత్తనం ఏమిటి? అసలు ట్రంప్, బైడెన్, పుతిన్‌లకు ఏమి అవసరం, వాటికున్న హక్కేమిటి? అఫ్ఘనిస్తాన్ అంతరంగిక వ్యవహారాలతో వారికి పనేమిటి? అనే ప్రశ్నలు ప్రధాన స్రవంతి మీడియాలో కానీ, సోషల్ మీడియాలో కానీ చూద్దామన్నా కనిపించడం లేదు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఈ భూప్రపంచంలోని ప్రతి దేశానికీ దాని పరిధిలో సార్వభౌమాధికార హక్కు ఉన్నది. అమెరికా భూభాగంపై అమెరికాకు ఎంత సార్వభౌమాధికారం ఉన్నదో అఫ్ఘనిస్తాన్ భూభాగంపై ఆ దేశానికి అంతే అధికారం ఉన్నది. దేశం చిన్నదయినా, పెద్దదయినా న్యాయం ఒకటే. ఏ దేశ అంతరంగిక వ్యవహారాల్లో ఆ దేశవాసులే తీర్పరులు. సొంత దేశ స్వంత వ్యవహారాలను సరిదిద్దుకునే శక్తి, సామర్థ్యాలు అఫ్ఘనిస్తాన్‌కి ఉన్నాయి శతాబ్దాల తరబడి అది రుజువవుతూనే ఉంది.

నాలుగు దశాబ్దాల చరిత్రను గమనిస్తే అఫ్ఘనిస్తాన్‌ది విరోచిత చరిత్రనే. అఫ్ఘనిస్తాన్‌లోని సహజ నిక్షేపాల సంపద అగ్రరాజ్యాలను ఊరిస్తూనే వస్తున్నది. రష్యా అమెరికాలు అఫ్ఘనిస్తాన్‌ను దురాక్రమించి చేతులు కాల్చుకున్నాయి. ఇప్పుడు చైనా తాలిబాన్లకు నమ్మకమైన మిత్రుడుగా ముందుకొస్తుంది. అయితే తాలిబాన్లు ఇప్పుడు ఎటువంటి విధానం అనుసరిస్తారనేది వేచి చూడాలి. కొత్త ప్రభుత్వంలో మహిళల ప్రాతినిధ్యం గురించి చేసిన ప్రతిపాదన ఆహ్వానించదగినదే. కానీ, విద్య, పౌరుల హక్కులు, మహిళా సాధికారత, ప్రజాస్వామిక విలువలు, విదేశాంగ విధానం ఎలా ఉంటుందనేది వేచి చూడాలి. తాలిబాన్లను నడిపించే మత ఛాందస భావజాలం చాల ప్రమాదకరమైంది. తాలిబాన్ల ఉనికి, ఆలోచన, విశ్వాసాలు ఇస్లాం మతంతో ముడిపడి ఉన్నాయి. తాలిబాన్ల భావజాలం ప్రస్తుతం అఫ్ఘనిస్తాన్‌కే పరిమితమైన, భవిష్యత్తులో ఆసియా దేశాలకు పాకవచ్చు. తాలిబాన్లు అఫ్ఘనిస్తాన్‌ను ఇస్లామిక్ ఎమిరేట్‌గా ప్రకటించారు. కాబట్టి మహిళలు కోరుకుంటున్న ప్రజాస్వామిక హక్కులు వారికి దక్కవు. తాలిబాన్లతో రష్యా, చైనా, పాకిస్తాన్, ఇరాన్ దేశాలు దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నాయి.

తాలిబాన్ల అధికార ప్రతినిధి రాయిటర్స్‌తో మాట్లాడుతూ ప్రత్యర్థులకు మేం ఎటువంటి నష్టమూ చేయాలని ఎవరిపైన ప్రతీకార చర్యలకు పూనుకోవాలని భావించడం లేదు. అలా అని కాల్పుల విరమణ కూడా పాటించడం లేదు అని అన్నారు. ఎలాంటి పోరాటమూ లేకుండా శాంతియుతంగా కాబూల్‌ను తమకు అప్పగించాలని తాలిబాన్ అధికార ప్రతినిధి జబీహుల్లా తెలిపారు. మా వీరులు నగరంలో ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారంటూ హెచ్చరించారు. అధికార బదిలీ జరుగకపోతే హింసకు పాల్పడుతామన్న హెచ్చరిక అది. తాలిబాన్లు ప్రజలందరి పక్షాన ఆలోచించడం లేదు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగం అంటే వారికి విశ్వాసం లేదు. రాజ్యాధికారమే ధ్యేయంగా వాళ్ల చర్యలు కనిపిస్తున్నాయి. తాలిబాన్‌ల అభివృద్ధి నిరోధక స్వభావం ప్రజలను వారికి మరింత దూరం చేస్తుంది. ప్రజా మద్దతు లేకుండా ఏ ప్రభుత్వం నిలబడదు.

తీవ్రమవుతున్న పోడు భూముల సమస్య

పోడు భూములకు పట్టాలివ్వాలనే చట్టాలున్నా వాటి అమలుకు ఆదివాసీ గిరిజనులు పోరాడుతున్నా యాజమాన్య హక్కులు కల్పించకుండా తెలంగాణ ప్రభుత్వం వారిని నిర్బంధానికి గురిచేస్తోందని అంటున్నారు **ఎం. రవి**

పోడు భూముల సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఎన్నో ఏళ్లుగా పోడు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ గిరిజనులకు పాలకులు ఇచ్చిన హామీలు హామీలుగా మిగిలి పోతున్నాయి. ఎక్కడి సమస్య అక్కడే ఉండిపోతోంది. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలంటూ ఆదివాసీ గిరిజనులు అనేక ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటున్నారు. స్వరాష్ట్రం తెలంగాణలోనైనా తమ సమస్య పరిష్కారం అవుతుందని, పట్టాలు వస్తాయని కలలుగన్నారు. కానీ.. రాష్ట్రం వచ్చి ఏడేళ్లు అవుతున్నా.. ఒక్క ఎకరాకు కూడా పోడు భూమిపై యాజమాన్య హక్కులు కల్పించలేదని, అటవీహక్కుల చట్టాన్ని అమలు చేయలేదనే వాదన బలంగా వినిపిస్తోంది. రోజురోజుకూ పోడుసాగుదారులపై అటవీఅధికారుల దాడులు, కేసులు పెరుగుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘాలు, పలు పార్టీలు విమర్శిస్తున్నాయి.

2019 జూలైలో అసెంబ్లీలో సిఎం కెసిఆర్ హామీ..

'గిరిజనులను రక్షించాలి. తెలంగాణలో పోడు భూముల వ్యవహారాన్ని తేల్చేయాలి. అన్ని జిల్లాలకు నేనే వెళ్తా. తాలూకా కేంద్రాల్లో ప్రజా దర్బార్లు పెట్టి 'ఇదిగో ఇది భూమి.. ఇదిగో మీపట్టా' అని ఇచ్చేస్తాం. ఆర్ఓఎఫ్ఆర్(అటవీ హక్కుల చట్టం) ప్రకారం హక్కులు కల్పిస్తాం. గిరిజనులకు కూడా రైతు బంధు, రైతు బీమా రావాలి. వాళ్లూ మన బిడ్డలే..' అంటూ సిఎం కెసిఆర్ మాట్లాడారు. అయితే.. ఈ మాటలు మాటలుగానే మిగిలిపోయాయి. ఒక్క జిల్లాకూ కూడా ఆయన వెళ్లలేదు. ఒక్క ఎకరాకు కూడా యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వలేదంటూ ఆదివాసీ గిరిజన సంఘాలు, విపక్షాలు మండి పడుతున్నాయి. గిరిజన సంఘాల నేతలు మాత్రం టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఎకరంపై కూడా హక్కులు కల్పించలేదని విమర్శిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ హయాంలో కల్పించిన హక్కులే తప్ప ఆ తర్వాత ఆర్ఓఎఫ్ఆర్ చట్టాన్ని అమలు చేయలేదని సాగుదారులు అంటున్నారు. గతంలోకన్నా.. ఇప్పుడు తమపై దాడులు, కేసులు తీవ్రమవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

13 లక్షలకు పైగా ఎకరాల్లో పోడుసాగు

2006 అటవీ హక్కుల చట్టం అమలుకు నోచుకోవడం లేదు. స్వరాష్ట్రంలో కూడా టిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిజానికి.. ఈ చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 31లోపు సాగు చేసుకున్న అటవీ భూములకు హక్కు పత్రాలు అందించాలని కేంద్ర అటవీ హక్కుల చట్టం చెబుతోంది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పోడు భూములపై సర్వేచేసి, న్యాయబద్ధంగా ఉన్న కేసులకు భూ యాజమాన్య హక్కులు కల్పించాలని ఆదేశించింది. కానీ.. ఆ వైపుగా తెలంగాణ ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని పోడు సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల్లో

అఫ్ఘనిస్తాన్‌లో అనేక జాతులు తమ స్వేచ్ఛ కొరకు పోరాడు తున్నాయి. మహిళ ఉద్యమం బలంగా ఉంది. మరోవైపు పాలక వర్గాలు తమ అధికారాన్ని సులభంగా వదులుకునేట్లు లేరు. బలమైన తాలిబాన్ వ్యతిరేక కూటమి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడకపోతే అమ్రుల్లా నేతృత్వంలో అంతర్యుద్ధం జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అమెరికా, రష్యా, చైనా తమ ప్రయోజనాల కొరకు అఫ్ఘనిస్తాన్ ప్రజల్లో చీలికలు సృష్టించే అవకాశాలు ఎలాగూ ఉంటాయి. అఫ్ఘనిస్తాన్‌లో జరిగింది అమెరికా సామ్రాజ్యవాదం నుండి తాలిబాన్ అభివృద్ధి నిరోధక తిరోగమన మతోన్మాదుల చేతుల్లోకి రాజ్యాధికారం బదిలీ అయింది. ఇది జనతా ప్రజాతంత్ర విప్లవం కాదు. శ్రమజీవులు ముఖ్యంగా మహిళలు, మైనారిటీ జాతులు ప్రజాతంత్ర విప్లవం కొరకు పోరాడవలసే ఉంది.

సామాన్య ప్రజల ప్రయోజనానికి సామ్రాజ్యవాదం-మతోన్మాదం రెండు ప్రమాదకరమైనవే. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధాలు, సామ్రాజ్యవాద దేశాల దురాక్రమణలు అఫ్ఘనిస్తాన్‌లో ప్రజలు కేంద్రంగా ఏది జరుగలేదు. ప్రజల అభివృద్ధి గురించి పట్టించుకున్న నాథుడే లేడు. అమెరికా తన లాభం గురించి పనిచేసింది. ముజాహిదీన్లు తాలిబాన్‌లు తమ ప్రాబల్యం పెంచుకునేందుకు కృషి చేసారు. అధికారంలో ఉన్న నాయకులు అవినీతికి పాల్పడి సొమ్ములు చేసుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సామ్రాజ్యవాదం, మతోన్మాదం స్వప్రయోజనాలకే పాకులాడాయి తప్ప ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పనకు పూనుకోలేదు. అఫ్ఘనిస్తాన్ ప్రజలు ప్రజాతంత్ర వ్యవస్థ కొరకు ఇంకా పోరాడవలిసే ఉంది. తాలిబాన్లు ప్రజాస్వామికంగా పాలించే అవకాశాలు ఉండవన్నది స్పష్టమే. ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే అంతర్యుద్ధం చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

ఎక్కువగా పోడు భూములు ఉన్నాయి. నాటి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో పోడు భూములపై సర్వే చేయించింది. ఒక్క తెలంగాణలోనే దాదాపు 13 లక్షలకు పైగా ఎకరాల్లో పోడు సాగు చేస్తున్నట్టు ఆ సర్వేలో వెల్లడైంది. ఆ తర్వాత అప్పట్లోనే రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పోడు భూములకు యాజమాన్య హక్కులు కల్పించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో తాము సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించాలంటూ సాగుదారులు ప్రభుత్వానికి అర్జీలు పెట్టుకున్నారు. ఇలా తెలంగాణలోనే 1,86,679 దరఖాస్తులు రావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. వీటిలో 2020 మార్చి వరకు మొత్తం 1,86,679 అర్జీల్లో 94,360 పరిష్కరించామని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.

ప్రతీయేటా పోరు..

పోడుభూముల్లో పంటలు పండించడానికి ప్రతీయేటా ఆదివాసీ గిరిజనులు పోరుచేయకతప్పడం లేదు. తీవ్రమైన దాడులు, కేసులకు గురికాకతప్పడం లేదు. అటవీ అధికారుల నుంచి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. సరిహద్దు సమస్య తీవ్రమవుతోంది. హద్దులు దాటి పోడు భూముల్లో పంటలు సాగుచేస్తే.. అడ్డుకుని తీరుతామని అటవీ అధికారులు చెబుతుండగా.. మరోవైపు.. పంటలు వేసితీరుతామని సాగుదారులు తెగేసి చెబుతున్నారు. అయితే.. పంటలు చేతికొచ్చే సమయానికి.. అటవీ అధికారులు ధ్వంసం చేస్తుండడంతో గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేగాకుండా.. పోడు భూముల్లో అధికారులు గుంతలు తవ్వి.. ముళ్లకంపలు వేసి ఆగమాగం చేస్తున్నారంటూ సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మరొక విషయం ఏమిటంటే.. పోడు భూముల సరిహద్దుల వివాదం కొనసాగటానికి రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం లేకపోవటమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గతంలో సర్వే చేపట్టిన సిబ్బంది, రైతులకు రశీదులను ఇవ్వకపోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్రామ సభల్లో సాగుహక్కుదారులను గుర్తించినా ఆధారం లేదన్న సాకుతో పత్రాలు ఇవ్వడం లేదు. ఇలా ఏళ్లకొద్దీ సమస్య సమస్యగా మిగిలిపోతూ తీవ్రరూపం దాల్చుతోంది.

బ్రిటిష్ కాలం నుంచే...

బ్రిటిష్ వలస పాలనలో అటవీ సంరక్షణ చట్టాన్ని చేసి అడవులను పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో తీసుకోవడంతో తమ అటవీ హక్కులను కూడా ఆదివాసులు కోల్పోయారు. అలాగే.. 1894లో వచ్చిన భూసేకరణ చట్టం ఆదివాసులను బలవంతంగా అడవి నుంచి దూరం చేయసాగింది. ఇలా ఆనాటి నుంచి ఆదివాసీ గిరిజనులు తీవ్రమైన దోపిడీ, అణచివేతకు గురవుతూ వస్తున్నారు. అయితే.. ఇదే సమయంలో తమ హక్కులను కాపాడుకోవడానికి ఆదివాసులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. 2006లో అటవీ హక్కుల చట్టం, 1996 పీసా చట్టం, 2013 భూసేకరణ పునరావాస పరిహారం చట్టాలు ఆదివాసీల జీవన పరిస్థితుల్లో అర్థవంతమైన మార్పు తీసుకురావడంలో విఫలమయ్యాయనే వాదన ఉంది. అటవీ హక్కుల చట్టం 2006లో ప్రతి ఆదివాసి కుటుంబానికి 10 ఎకరాల అటవీ భూములు, అటవీ ఉత్పత్తుల పై హక్కు ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. తెలంగాణలో దశాబ్దాలుగా అటవీ భూమిని సాగు చేస్తున్న ఆదివాసీ ప్రజలపై సాయుధ పోలీసులను ఉపయోగించి వారి పంటలను ధ్వంసం చేసే ఘటనలు తరుచూ చోటుచేసు కుంటున్నాయి. ఆదివాసీలను తమ భూముల నుండి గెంటివేసే చర్యలు వేగవంతం అయ్యాయి.

అడుగడుగునా దాడులు.. కేసులు..

అనేక దశాబ్దాలుగా ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూముల్లో తెలంగాణకు హరితహారం పేరుతో మొక్కలు పెంచుతూ.. ఫారెస్ట్ పోలీస్ అధికారులతో ఆదివాసీ గ్రామాలపై దాడులు చేస్తూ సాగు భూముల్లో ఆదివాసులు వేసుకున్న పంటలను ధ్వంసం చేయిస్తూ భూములను ఆక్రమించుకోవడానికి టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తమ భూములను కాపాడుకోవడానికి తిరగబడిన ఆదివాసీ గిరిజనులపై అక్రమ కేసులు నెలల తరబడిన జైల్లో నిర్బంధిస్తోంది. ఇందులో పసిపిల్లల తల్లులు కూడా ఉండడం గమనార్హం. ప్రధానంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో ఈ ఏడేళ్ల కాలంలో లక్ష ఎకరాల ఆదివాసీ గిరిజనుల భూములను బలవంతంగా ఆక్రమించుకున్నట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

వరంగల్ ఉమ్మడి జిల్లాలో..

నల్లబెల్లి మండలంలోని కొండాపురం గ్రామపంచాయతీలోని గణేష్‌నగర్‌లో 20 సంవత్సరాలుగా 50 కుటుంబాలు పోడు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాయి. ఇందులో 30 ఎకరాల భూమిని బలవంతంగా లాగేసుకుని ఫారెస్ట్ సిబ్బంది మొక్కలు నాటారు. అంతేగాకుండా.. 13 మంది రైతులపై కేసులు పెట్టి జైల్లో నిర్బంధించారు. ఖానాపురం మండలం దబ్బులు పేట తండా చిలకనగర్ చిలకమ్మ తండా బండ మీద మామిడి పూత గడ్డ రావు పేట తండా గ్రామాలలో సుమారుగా 500 ఎకరాల సాగు భూమిని ఫారెస్ట్ అధికారులు పోలీసు అధికారులతో కలిసి పంటలను ధ్వంసం చేసి సాగు భూములను ఆక్రమించుకుని మొక్కలు నాటించారు. పోచారం శివారులో 1 బై 1 సర్వే నెంబర్‌లో 45 ఎకరాల సాగు భూమిలో మొక్కలు నాటించారు. ఇందులో 11 మందికి హక్కు పత్రాలు ఉన్నాయి. అయినా.. ఈ భూమిని ఆక్రమించి మొక్కలు నాటారు. బయ్యారం, మహబూబాబాద్, గూడూర్ కొత్తగూడ గంగారం ప్రాంతాల్లో వేల ఎకరాల ఆదివాసుల భూముల్లో పంటలను ధ్వంసం చేసి, మొక్కలు నాటారు. తమ భూములను కాపాడుకోవడానికి తిరగబడిన ఆదివాసీ గిరిజనులపై కేసులు పెట్టి జైలుకు పంపించారు.

ఖమ్మం జిల్లాలో..

ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని ఎల్లన్న నగర్‌కు చెందిన ఆదివాసీ గిరిజన మహిళలను పసి పిల్లలతో పాటు ఇద్దరు పిల్లలను కలిపి పన్నెండు మంది మహిళలపై కేసులు పెట్టి జైలుకు పంపిన

పోడు సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధి అవసరం

పోడు భూముల చట్టాలు సాగుదారులకు పట్టా హక్కులివ్వాలని చెపుతున్నా, ప్రభుత్వాలు ఆ సమస్య పరిష్కరించకుండా భూములు సాగుచేసుకుంటున్న ఆదివాసులపై కేసులు పెడుతున్నారని అంటున్నారు **కె. రవిచందర్**

ఆదివాసీల అభివృద్ధికి, హక్కుల రక్షణ కొరకు రాజ్యాంగంలో పొందుపరిచిన ఐదవ షెడ్యూలు, ఆరవ షెడ్యూలు - వీటి వెలుగులో ప్రత్యేకంగా తీసుకొచ్చిన 1/70 చట్టం పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం ఆచరణలో నీరుగారిపోయిన ఫలితమే నేటి ఆదివాసీల దుర్భర జీవితాలు. అలాగే నేషనల్ పాలసీ ఆన్ ట్రైబల్స్‌లో గిరిజన జీవన వికాసానికి ప్రత్యేక సంస్థలు-సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు (ఐ.టి.డి.ఎ), సమగ్ర గిరిజనాభివృద్ధి ప్రాజెక్టులు (ఐ.టి.డి.పి.), గిరిజన సహకార సంస్థలు (జి.సి.సి), సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ - పరిశోధన కోసం ట్రైకార్ సంస్థలు దశాబ్దాలుగా రాష్ట్రంలో పనిచేస్తున్నాయి. విద్యా రంగంలో ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు, షెడ్యూల్డ్ ఏరియాల్లో ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ, పశుపోషణ, చెక్‌డ్యాంల నిర్మాణం, రవాణా సౌకర్యాల కల్పన, ఆరోగ్య పరిరక్షణ - పౌష్టికాహారం కోసం బడ్జెట్‌లో అధిక మొత్తాలు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం ఆదివాసులకు వీటి ఫలితాలు అందక, అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉండిపోయారు. పైగా పాలకులు అటవీ ప్రాంతంలోని ఖనిజాలు, కలప వంటి ప్రకృతి సంపదను కొల్లగొట్టే చర్యలకు పాల్పడుతూ, అణచివేత చర్యలకు పూనుకొంటున్నారు. చివరకు ప్రధాన జీవనాధారమైన భూముల నుండి ఆదివాసులను తరిమివేసే దృశ్యాలను చూస్తున్నాం. అడవిలో సహజసిద్ధంగా లభించే అటవీ ఉత్పత్తుల సేకరణపై ఆంక్షలు, తరతరాలుగా సేద్యం చేసుకుంటున్న పోడు భూములను లాక్కొనే అప్రజాస్వామిక ధోరణి కొనసాగుతోంది.

పోడు భూములకు పట్టాలిస్తామని, ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని స్వయంగా ముఖ్యమంత్రే అనేక బహిరంగ వేదికల్లో, సాక్షాత్తు అసెంబ్లీలో ప్రకటించి ఉన్నారు. దీని కొరకు ఉన్నతస్థాయిలో సీరియస్ సమీక్ష గానీ, విధివిధానాల రూపకల్పన గానీ ఇంతవరకు రూపొందించలేదు. ఏ మేరకు అమలులోకి వచ్చాయి అనే విషయం పక్కనపెడితే-మైదాన ప్రాంతాల్లో భూమి రికార్డుల ప్రక్షాళన, ధరణిపోర్టల్ ఏర్పాటు, సమగ్ర భూసర్వే ఏర్పాటు మొదలైన పనులు జరుగుతున్నాయి కదా! మరి పోడు భూముల సమస్య పరిష్కారం పట్ల ప్రభుత్వ శీతకన్ను ఎందుకు? చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే ఆదివాసీల పోడు భూములకు పట్టాలిచ్చి, వారి బతుకుల్లో వెలుగులు నింపలేమా? 2006లో యుపిఏ ప్రభుత్వం తెచ్చిన 'షెడ్యూలు జాతుల, ఇతర సంప్రదాయ అటవీ ఉత్పత్తుల ఆధారంగా జీవించేవారు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం' పకడ్బందీ అమలుకు పూనుకొంటే పోడు

ఘటన సంచలనం రేపింది. ఆదివాసులు సాగుచేసుకుంటున్న సాగు భూములను ఆక్రమించుకున్న సందర్భంలో ఫారెస్ట్ అధికారులకు ఎదురు తిరిగారంటూ అరెస్టు చేసి జైలుకు తరలించారు. తమ పంట భూములలో పెరిగిన పత్తి పంట పీక వద్దని అడ్డుకోబోయిన 70 మందిపై హత్యాయత్నం కేసును అటవీ అధికారులు పెట్టారు. ఇలా తెలంగాణలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజనులపై ఫారెస్టు, పోలీస్ అధికారుల దాడులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అక్రమ కేసులు పెట్టి, ఆదివాసీ గిరిజనులను జైలుపాలు చేస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘాలు, విపక్షాలు మండిపడుతున్నాయి. అయితే.. తెలంగాణ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆయా ప్రాంతాల్లో సంఘాలు, పలు పార్టీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అక్రమ కేసులు తొలగించాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నాయి.

నాగర్‌కర్నూల్ జిల్లాలో..

నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ ఆదివాసులు సాగుచేసుకుంటున్న భూముల్లో అటవీ అధికారులు హరితహారం మొక్కలు నాటేందుకు ప్రయత్నాలు చేశారు. 2021 జూలై 2న నల్లమల అటవీ అధికారులు నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, మాచారం గ్రామంలోని 23 చెంచు కుటుంబాలు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమిలో హరితహారం మొక్కలు నాటేందుకు రావడంపై ఆదివాసులు మండిపడ్డారు. ఈ క్రమంలో అడ్డుకున్న వారిపై అటవీ అధికారులు కేసులు పెట్టారు. గతంలో ఏనాడూ లేని విధంగా అధికారులు ఈ సంవత్సరం ఈ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం చేయకూడదని గత నెల రోజులుగా ఇబ్బంది పెడుతున్నారని ఆదివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న తమ భూములను ఆక్రమించుకోవడం దారుణమని, ఇక తాము ఎలా బతకాలంటూ ఆదివాసులు ఆందోళనచెందుతున్నారు. స్వరాష్ట్రం తెలంగాణలోనూ ఆదివాసుల హక్కులకు రక్షణ లేకుండా పోయిందని, ఇప్పటికైనా పాలకులు ఆదివాసుల భూములకు పట్టాలు ఇచ్చి, వారి సంక్షేమానికి కృషి చేయాలనే వాదన బలంగా వినిపిస్తోంది. వీ

(రచయిత జర్నలిస్టు)

భూముల సమస్యను చాలావరకు పరిష్కరించవచ్చు.

గ్రామసభ - డివిజన్ జిల్లా స్థాయి కమిటీలు:

అటవీ హక్కుల చట్టం–2006 2005, డిసెంబర్ 13 నాటికి సాగుచేసుకొంటున్న అటవీ భూములకు హక్కు పత్రాలు లేక పట్టాలు ఇవ్వాలని నిర్దేశించింది. ఈ తేదీ నాటికి సాగుదారులు మూడు తరాలుగా లేక 75 సంవత్సరాలుగా ఆ భూములపై లేక అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న వాళ్లై ఉండవచ్చు. ఈ విషయాన్ని ధృవపరచడానికి పునాది స్థాయిలో గ్రామసభ నిర్ణయం ప్రాతిపదికగా ఉంటుంది. పెసా చట్టం–1996 ప్రకారం పంచాయితీ లేదా ఆవాసప్రాంతంలో ఏర్పాటైన గ్రామసభ–సాగుదారుల దరఖాస్తును పరిశీలించి ఎంత విస్తీర్ణంలో ఎక్కడ సాగుచేస్తున్నదీ, ఎవరెవరనే వివరాలను మ్యాపుతో సహా నిర్ధారిస్తుంది. అటవీ భూములను సమూహంగా సాగుచేసుకుంటుంటే సాగుదారులందరికి ఉమ్మడిగా పట్టాలిస్తారు. ఒకవేళ వ్యక్తిగతంగా సాగుచేసుకొంటే వ్యకిగత హక్కు పత్రాలు పొందుతారు. ఇంకా ఈ గ్రామ సభలకు 'అటవీ హక్కుల చట్టం–2006'లో విస్తృత అధికారాలు కల్పించారు. ఆ గ్రామం లేక నివాస ప్రాంతంలో ప్రభుత్వం నెలకొల్పే పాఠశాలలు, వైద్యశాలలు, అంగన్‌వాడీలు, విద్యుత్ లైన్లు, చెరువులు, చిన్న నీటి పారుదల కుంటలు–కాలువలు, రహదారులు, రేషన్ షాపులు, కమ్యూనిటీ కేంద్రాలు–వగైరాలకు అటవీ భూముల కేటాయింపులకు గ్రామసభ ఆమోదం తప్పనిసరిగా ఉండాలి. అదీ–ఒక్కొక్క సౌకర్యం కోసం కేటాయించే భూమి ఒక హెక్టారుకు మించకూడదు. కేవలం సాగు చేసుకునే భూమి మాత్రమే కాకుండా సాంప్రదాయ అటవీ ఉత్పత్తులు అయిన పండ్లు, కాయలు, వేర్లు, ఔషధ మొక్కలు, జిగురు, చీపురు పుల్లలు, బీడీ ఆకులు, ఇండ్ల నిర్మానానికి కలప లభించే భూములపై ఆదివాసులు హక్కులు పొందడానికి కూడా ప్రాథమికంగా గ్రామసభ ఆమోదం అవసరం.

ఇలా గ్రామసభ చేసిన తీర్మాణాలపై, నిర్ణయాలపై 60 రోజుల లోపు ఏమైనా ఫిర్యాదులు ఉంటే సబ్–డివిజనల్ స్థాయి కమిటీకి సెక్షన్ 3 ప్రకారం ఫిర్యాదు చేసుకోవాలి. ఈ కమిటీకి ఫిర్యాదు దారు తన వాదనను సమర్పించిన తరువాత మాత్రమే ఆ క్లెయింపై నిర్ణయం వెలువరించాలి. ఇలా తయారుచేసిన అటవీ హక్కుల రికార్డును జిల్లా స్థాయి అధికారికి పంపిస్తారు. సబ్–డివిజినల్ ఆఫీసర్ తయారు చేసిన ఈ జాబితాపై ఎవరికైనా ఫిర్యాదులుంటే 60 రోజులలోపు జిల్లా స్థాయి కమిటీ ముందుంచాలి. ఈ కమిటీ కూడా ఫిర్యాదు దారు తన వాదనను వినిపించిన తరువాత మాత్రమే ఆ ఫిర్యాదుపై నిర్ణయాన్ని వెలువరించాలి. ప్రభుత్వం నియమించిన జిల్లా స్థాయి కమిటీ అటవీ హక్కుల రికార్డును తయారు చేస్తుంది. అంతిమంగా అటవీ హక్కులకు సంబంధించి ఈ రికార్డే ఫైనల్.

ఈ మొత్తం కార్యకలాపాలను నిర్వహించడానికి రాష్ట్ర స్థాయి పర్యవేక్షక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. జిల్లా, డివిజన్, రాష్ట్ర స్థాయి కమిటీలలో రెవిన్యూ, అటవీ, గిరిజన వ్యవహారాల శాఖల నుండి ప్రభుత్వ అధికారులు, పంచాయితీరాజ్ సంస్థల నుండి ముగ్గురు ప్రతినిధులు–ఇందులో షెడ్యూల్డు తెగల నుండి ఇద్దరు, ఒక మహిళ సభ్యులుగా ఉంటారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని గిరిజన మంత్రిత్వశాఖ లేక కేంద్ర ప్రభుత్వం చేత ఆథరైజ్ చేయబడిన అధికారి అటవీ హక్కుల చట్టం–2006 అమలుకు నోడల్ అధికారిగా బాధ్యత వహిస్తారు. చట్టం అమలుకు రూపొందించబడిన నిబంధనలు మార్చే అధికారం కేవలం భారత పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. రాష్ట్రంలో గిరిజన సంక్షేమశాఖ అధికారులే నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ, కేంద్ర ప్రభుత్వ మార్గనిర్దేశకత్వంలో మాత్రమే పనిచేయాల్సి ఉంటుంది.

అటవీ హక్కుల గుర్తింపు:

వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 ప్రకారం మనుషులు, అటవీ జీవులు సహజీవనం సాధ్యం కాని పరిస్థితులలో లేక వన్యప్రాణుల ఉనికికే ప్రమాదముందని భావిస్తే, జాతీయ పార్కులు, జంతు సంరక్షణ కేంద్రాలు ఉండే అటవీ ప్రాంతాల వారికి వేరేచోట పునరావాసం కల్పించాలని అటవీ హక్కుల చట్టం–2006లోని చాప్టర్–3, సెక్షన్–4, సబ్‌సెక్షన్–2(బి)(సి)లో నిర్దేశింపబడింది. ఇంకా సబ్‌సెక్షన్–(ఇ) ప్రకారం పునరావాస ప్యాకేజి, తరలింపు ప్రక్రియకు గ్రామసభ ఆమోదం తప్పనిసరి. నిర్వాసితులకు భూమి కేటాయింపు, సౌకర్యాల కల్పన జరిగే వరకు ప్రత్యామ్నాయ స్థలాలకు ఎట్టి పరిస్థితులలోను తరలించవద్దని స్పష్టంగా సబ్‌సెక్షన్ (ఎఫ్)లో పేర్కొనబడింది. ఇలా వన్యప్రాణి సంరక్షణకు తీసుకోబడిన అటవీ ప్రాంతాన్ని, ఆ తరువాత కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వేరే పథకానికి, పనికి కేటాయించకూడదు. సెక్షన్–4, సబ్‌సెక్షన్–3 ప్రకారం షెడ్యూలు తెగలుకాని, సాంప్రదాయ అటవీ ఉత్పత్తుల సేకరణపై జీవించేవారుగాని 2005, డిసెంబర్ 13 వరకు ఆ భూమిలో సాగులేక ఇతర ఉపయోగాలకు అధీనంలో ఉండిన అటవీ భూమికి హక్కు పత్రాలు సామూహికంగా కాని, వ్యక్తిగతంగా కాని ఇవ్వాలి.

ముఖ్యంగా సెక్షన్–5 ప్రకారం క్లెయిమ్ చేసుకున్న అటవీ భూములపై హక్కులను ఖరారు చేసే క్రమంలో గుర్తింపు, వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిగా ముగిసేవరకు ఎట్టి పరిస్థితులలో అప్పటివరకు అధీనంలోవున్న అటవీ భూముల నుండి ఎవరినీ ఖాళీ చేయించరాదు.

హక్కుల నిర్ధారణకు సాక్ష్యాలు / ఆధారాలు:

హక్కు పత్రాలు (పట్టాలు) జారీ చేయడానికి ఆ భూమి లేక వనరులపై హక్కులను నిర్ధారించడానికి, వ్యక్తిగత, సామూహిక క్లెయిమ్స్‌లో 15 రకాల ఆధారాలను కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ విడుదల చేసిన 2018, జనవరి 1నాటి నోటిఫికేషన్‌లో సెక్షన్–13లో పొందుపరచింది. వ్యక్తిగత క్లెయిమ్స్‌దారులు, ప్రభుత్వ రికార్డులు, జనాభా లెక్కలు, అటవీ విచారణ నివేదికలు, ప్రభుత్వ కమిటీలు/కమీషన్ల నివేదికలు–తీర్మానాలు, ఏమైనా జి.ఓ.లు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు, ఇంటిపన్ను, భూమికి సంబంధించిన మ్యాపు లాంటివి, ఐడెంటిటీ కార్డు మొదలయినవి చూపవచ్చు.

నిర్మాణం చేసిన ఇల్లు, గుడిసె, భూమికి/వ్యక్తికి సంబంధించిన

కోర్టు తీర్పులు, పురావస్తుశాఖ వారి సర్వే ఆఫ్ ఇండియా పరిశోధన రికార్డు, పూర్వపు సంస్థానాలు జారీచేసినవి ఏమైనా–హక్కు, దానం, బహుమాన పత్రాలు, పూర్వీకుల స్మశాన వాటికలు, పవిత్రపూజా స్థలాలు, పూర్వీకుల జీన్స్‌తో సరిపోల్చుకునే జీనాలజీ ట్రేసింగ్, గ్రామ/అవాస పెద్ద మనుషుల స్టేట్‌మెంట్లు మొ॥వి వ్యక్తిగత/సామూహిక హక్కుల పత్రం జారీకి కావలసిన ఆధారాలు.

సామూహికంగా అటవీ ఉత్పత్తులు, వనరులపై హక్కుల నిర్ధారణకు కావలసిన ఆధారాలు–పశువుల మేత ప్రదేశాలు, దుంపలు, వేర్లు, అటవీనూనె తయారీ కొరకు పండ్లు, చేపల గుంటలు, నీటి పారుదల పద్ధతి, నీటి వసతి, ఔషధ మొక్కలు మున్నగునవి. ఇంకా స్థానిక తెగలు నిర్మించుకున్న నిర్మాణాల అవశేషాలు, పవిత్ర పూజా వృక్షాలు, తోపులు, నీటి గుంటలు, స్మశాన చిహ్నాలు కూడా ఆధారాలుగా చూపించవచ్చు. గ్రామకంఠంగా గతంలో గుర్తించిన ప్రభుత్వ రికార్డులు ఏమైనా, లేక రక్షిత అడవిగా గతంలో ఏమైనా ఉంటే ఆ రికార్డు, గతంలోకాని, ప్రస్తుతం కాని సాంప్రదాయ వ్యవసాయ సాగు పద్ధతులు (ఉదా॥ పోడు) లాంటివి సాక్ష్యాలుగా ఉపయోగపడతాయి. గ్రామ సభగాని, సబ్‌డివిజినల్ స్థాయి లేక జిల్లా స్థాయి కమిటీలు పై ఆధారాలలో ఒకటి కంటే ఎక్కువ ఎన్నైనా ఆధారాలుగా హక్కుల నిర్ధారణకు పరిగణించవచ్చు.

సుప్రీం కోర్టులో కేసు - ఖాళీ చేయించడం నిలిపివేత:

2008 సంవత్సరంలో 'వైల్డ్‌లైఫ్ ఫస్ట్', 'నేచర్ కన్జర్వేషన్ సొసైటీ', టైగర్ రీసెర్చ్ & కన్జర్వేషన్ ట్రస్ట్ – అనే స్వచ్ఛంద సంస్థలు అటవీ హక్కుల చట్టం–2006 ఆధారంగా అడవుల విస్తీర్ణం తగ్గిపోతుందని, అర్హులు కాని వారికి బోగస్ క్లెయిమ్‌ల ద్వారా నేషనల్ పార్కులు, జంతుసంరక్షణ అభయారణ్యాలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని సుప్రీంకోర్టులో పిటిషన్ (109/2008) దాఖలు చేసారు. సెప్టెంబర్ 2018 నాటికి 72,23,132 హెక్టార్లు భూమిని 18,89,835 పట్టాలుగా పంపిణీ చేశారని, అలాగే 19,34,345 దరఖాస్తులను తిరస్కరించారని వీనిలో 14,77,793 దరఖాస్తులు గ్రామసభ స్థాయిలోనే తిరస్కరింపబడ్డాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. తిరస్కరింపబడిన 19 లక్షల పైచిలుకు దరఖాస్తుదారుల ఆధీనంలో ఎంత భూమి ఉంది అనే విషయం మాత్రం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించలేదు. ఈ మంత్రిత్వ శాఖ నియమించిన సక్సేనా కమిటీ, మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన మరో కమిటీ, గుజరాత్ ప్రభుత్వం వేసిన భాస్కరాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ అప్లికేషన్స్ – సంస్థలు ఉపగ్రహ ఛాయా చిత్రాలను విశ్లేషించి 2005, డిసెంబర్ 13, కటాఫ్ డేట్ తరువాత అడవుల ఆక్రమణను గుర్తించారు కావున అడవులు, జంతువుల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు.

2108, మార్చి 3న జస్టిస్ మదన్ లోకూర్ ధర్మాసనం ఈ కేసును విచారించింది. 2017, డిసెంబర్ 31తేదీని కటాఫ్ డేట్‌గా నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ హక్కుల చట్టం–2006 ప్రకారం దరఖాస్తుదారుల సంఖ్య, తిరస్కరింపబడిన వాటి సంఖ్య – అందులో భూమి విస్తీర్ణం, వీరిని ఆ భూమి కబ్జా నుండి ఖాళీ చేయించారా? అలా చేయించని వారి భూమి విస్తీర్ణమెంత? మొదలగు వివరాలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. 2019, జనవరి 29న జస్టిస్ చలమేశ్వర్ ధర్మాసనం ముందుకు వచ్చిన ఈ కేసు విచారణ సందర్భంగా అడిషినల్ సొలిసిటర్ జనరల్, తిరస్కరింపబడిన దరఖాస్తుదారుల నుండి భూమిని ఆయా ప్రభుత్వాలు స్వాధీనపరచుకోవడం కోసం, వారిని ఖాళీ చేయించే చర్యలు చేపట్టవలసి ఉంటుందని తెలిపారు. దీనికి స్పందించిన కోర్టు దాదాపు జస్టిస్ మదన్ లోకూర్ ఆదేశించినట్లుగానే, దరఖాస్తుదారుల సంఖ్య, తిరస్కరింపబడినవి, వీనిలో భూమి విస్తీర్ణం, ఖాళీ చేయించడానికి ఏ చర్యలు తీసుకున్నారు – మున్నగు వివరాలతో రాష్ట్ర ప్రభుత్వాలు అఫిడవిట్ దాఖలు చేయాలని 2 వారాలకు కేసును వాయిదా వేసింది.

2019 ఫిబ్రవరి 13న జస్టిస్ అరుణ్ మిశ్రా ధర్మాసనం ఆదేశాలతో దేశం ఒక్కసారి ఉలిక్కిపడింది. 17 రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన అఫిడవిట్ల ప్రకారం 11,91,327 క్లెయిమ్స్‌ను తిరస్కరించామని చెప్పాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు తిరస్కరించిన క్లెయిమ్‌దారులను వారు సాగు చేసుకుంటున్న అటవీ భూముల నుండి వారంలోపు ఖాళీ చేయించాలనే కోర్టు ఆదేశాలు షాక్‌కు గురిచేసాయి. పెండింగ్ దరఖాస్తులపై నాలుగు నెలలలోపు చర్యలు తీసుకోవాలని, ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియాతో ఉపగ్రహ సర్వే చేయించి అటవీ భూముల కబ్జాల విస్తీర్ణం, అలాగే ఖాళీ అనంతర భూమి విస్తీర్ణంను తెలియజేస్తూ 2019 జూలై 12 నాటికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు అఫిడవిట్ దాఖలు చేయాలని, కేసును 2019 జూలై 24కి వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఖాళీ ఉత్తర్వుల నిలుపుదల:

2019 సాధారణ ఎన్నికల సందర్భంలో వెలువడిన ఈ తీర్పు వలన ఆదివాసీల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే ప్రమాదమున్నదని, ఎన్.డి.ఎ. ప్రభుత్వం స్వయంగా రంగంలోకి దిగి, ఈ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. అంతే కాకుండా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు – బీహార్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లు – ఇంకా అనేక ఆదివాసి, హక్కుల సంస్థలు కూడా సుప్రీం కోర్టులో స్టే ఇవ్వాలని కోరుతూ ఇంప్లీడ్ పిటిషన్లు వేశాయి. లక్షలాది కుటుంబాల మనుగడపై ప్రభావం చూపే ఫిబ్రవరి 13న తానే జారీ చేసిన ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ సుప్రీంకోర్టు, అదే ధర్మాసనం ఫిబ్రవరి 28న ఆదేశాలు జారీచేసింది. ఈ ఉపశమన చర్యతో ఓట్ల ప్రయోజనం కొరకు ఎన్.డి.ఎ. ప్రభుత్వం, రాష్ట్రాలు ఒకవైపు – ఆదివాసీలు తమ బతుకుల కొరకు మరోవైపు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తరువాత ఈ కేసు విచారణకు వచ్చినా స్టే మాత్రం కొనసాగుతోంది.

తెలుగు రాష్ట్రాలలో అటవీ హక్కుల చట్టం-2006 అమలు:

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 42.92 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 37.75 లక్షల ఎకరాల అటవీ భూములున్నాయి. తెలంగాణలో 2019, మార్చి 31 నాటికి ఇందులో వ్యక్తిగతంగా 93,639 మందికి 3.02 లక్షల ఎకరాలు, సామూహికంగా 721

గ్రూపులకు 4.54 లక్షల ఎకరాలకు మొత్తంగా 7.54 లక్షల ఎకరాలకు టైటిల్స్ (పట్టాలు) ఇవ్వడం జరిగింది. వ్యక్తిగతంగా, సామూహికంగా దరఖాస్తు చేసుకొన్న క్లెయిమ్స్ మొత్తం 1,86,679లో 83,757 క్లెయిమ్స్‌ను తిరస్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2019, మార్చి 31 నాటికి వ్యక్తిగతంగా 96,675 మందికి 2.40 లక్షల ఎకరాలు, సామూహికంగా 1,374 గ్రూపులకు 4.53 లక్షల ఎకరాలకు టైటిల్ (పట్టాలు) ఇచ్చారు. వ్యక్తిగతంగా, సామూహికంగా దరఖాస్తు చేసుకున్న క్లెయిమ్స్ మొత్తం 1,81,508లో 75,927 క్లెయిమ్స్‌ను తిరస్కరించారు.

అటవీ హక్కుల చట్టం-2006 అవగాహనను అక్షర జ్ఞానంలేని ఆదివాసీలకు కల్పించడానికి రెండు రాష్ట్రాలలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి అనేక రూపాలలో పోరాటాలు చేసినా ఫలితం మాత్రం అంతంత మాత్రమే. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్లిప్తత కారణంగా ఆదివాసీల జీవితాలు సంక్షోభంలోకి నెట్టబడ్డాయి.

షెడ్యూల్డు ప్రాంతాలలో పెద్ద ఎత్తున అటవీ, పోలీసు శాఖల అధికారులు దాడులు చేసి పోడు భూముల్లో ట్రెంచ్‌లు (కందకాలు) తవ్వి, హరితహారం పేరుతో ఆదివాసీలను నిరాశ్రయులు చేస్తున్నారు. హత్యాయత్నంతో సహా అనేక సెక్షన్ల కింద అక్రమ కేసులు బనాయించి స్త్రీలతో సహా వందలాది ప్రజలను జైళ్లకు పంపిస్తున్నారు. 2005 డిసెంబర్‌కు పూర్వమే గత ప్రభుత్వాలు ఆ భూములపై ఇచ్చిన బి1 పట్టా కాగితాలు, రెవిన్యూశాఖ రికార్డులు, రశీదులు మొదలైన ఆధారాలు చూపించినా - అటవీశాఖ రికార్డుల్లో ఆ భూములు ఫారెస్టు డిపార్టుమెంట్‌కే చెందినట్లుగా ఉన్నవని చెప్పి బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారు. అటవీ హక్కుల చట్టం-2006, 2007 రూల్స్ ప్రకారం సెక్షన్ 13లో పేర్కొన్నట్లు హక్కుల నిర్ధారణకు ఆధారాలు రైతులు చూపించినా, లెక్క చేయకుండా భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. అదే విధంగా తిరస్కరించిన, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ భూములపై కోర్టు స్టే అమలులో ఉన్నా, ధిక్కరిస్తూ ఖాళీల పర్వం కొనసాగుతోంది. 2007లో చట్టం వచ్చిన విషయం గాని, పట్టాల కొరకు దరఖాస్తు చేసుకోవాలనే సంగతి కాని, ఏమీ తెలియని ఆదివాసీలు, తరతరాలుగా ఆ భూముల్లో సాగుచేసుకొంటున్నా హక్కుల పత్రాలు పొందలేక ప్రభుత్వ దాష్టీకానికి గురవుతున్నారు. చట్టప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికీ 90 శాతం ఆదివాసీలు లక్షలాది ఎకరాల అటవీ భూములకు హక్కు పత్రాలు పొందలేకపోవడం అత్యంత విషాదకరం.

నిర్దిష్టంగా ఏమిచేయాలి:

1) ప్రధానంగా చట్టం పట్ల విస్తృత అవగాహన పెంచాలి. పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి.

2) ఫారెస్టు, రెవెన్యూ, ట్రైబల్ శాఖలు సమన్వయంతో చట్టం అమలుకు నిర్ణీత కాలవ్యవధి కార్యక్రమంతో ప్రణాళిక రూపొందించుకోవాలి.

3) చట్టంలోని నిబంధన 6(1) ప్రకారం దరఖాస్తు ఫారాలు ఎ,బి,సి నమూనాలు వేర్వేరుగా వ్యక్తిగత, సామూహిక, అటవీ వనరులు ఉత్పత్తుల హక్కుల కోసం క్లెయిమ్ చేసుకోవడానికి అసంఖ్యాకంగా అందుబాటులో ఉంచాలి.

4) రెవెన్యూ, గిరిజన సంక్షేమ, అటవీ, పంచాయితీరాజ్ శాఖల కార్యదర్శులు, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, గిరిజన సలహామండలి నుండి ముగ్గురు ఎస్.టి. సభ్యులు - సభ్యులుగా, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ మెంబర్ సెక్రటరీగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్‌పర్సన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీని నియమించాలి.

5) ముఖ్యంగా గిరిజన సంక్షేమ శాఖ అధికారులే నోడల్ ఆఫీసర్లుగా మొత్తంగా చట్టం అమలుకు కేంద్ర బిందువుగా, చొరవతో పనిచేయాలి.

6) అటవీ భూములు, అటవీ ఉత్పత్తుల వనరుల లభ్యతకు సంబంధించిన సమస్త సమాచారాన్ని - రికార్డులు - మ్యాపులు - కోర్టు తీర్పులు, వివిధ శాఖల - పథకాల వివరాలు వ్యక్తులకు, గ్రామ, డివిజన్, జిల్లా స్థాయి కమిటీలకు అందుబాటులో ఉంచాలి.

7) ఎప్పటికప్పుడు క్లెయిమ్స్‌ను పరిశీలించి హక్కు పత్రాలు (పట్టాలు) ఇస్తూ, ఆదివాసులలో విశ్వాసం పెంపొందించాలి.

(అధ్యక్షుడు, తెలంగాణ ప్రజాఫ్రంట్) వీ

ఫాసిస్టు ఎజెండాలో భాగమే పెగాసస్

ప్రజల ఆలోచనలను పసిగట్టే ఫాసిస్టు కార్యక్రమంలో భాగంగానే పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తున్నారని అంటున్నారు

సతీష్ బైరెడ్డి

సంఘ్ పరివార్-బిజెపిలకు ఇజ్రాయెల్ దేశం అనేక అంశాల్లో ఆదర్శప్రాయంగా కన్పిస్తుంటది. యూదులు తనది కాని భౌగోళిక ప్రదేశాన్ని ఆక్రమించుకొని అక్కడి భూమి పుత్రులైన అరబ్బులను తమ యుద్ధోన్మాదంతో చెట్టుకొకరు పుట్టకొకరిని చేయడంతో అతివాద జాతీయ రాజకీయాల కేంద్రంగా ఇజ్రాయెల్ మారిపోయింది. అమెరికా అండదండలు, పుష్కలమైన ఆయుధ సంపత్తి కలిగి పాలస్తీనా అస్తిత్వం మీద మోపిన ఇనుప పాదాన్ని ఇప్పటికీ కొనసాగిస్తోంది. ఇండియాలో తన హిందూత్వనే జాతీయ వాదంగా మార్చే పనిలో ఉన్న సంఘ్ పరివార్‌కి సహజంగానే యూదుల ఆధిపత్య రాజకీయాలు, రక్షణ విధానాలు ప్రియంగా అనిపిస్తుంటవి. అక్కడి ఇంటిలిజెన్స్ సంస్థ అయినా మొసాద్ కావొచ్చు, మొత్తంగా నిర్బంధ మిలిటరీ విధానాల వంటి వాటిని చూసి ముచ్చట పడుతుంటది. అలాంటి విధానాలే భారతదేశంలో ప్రవేశపెట్టాలని తహ తహ లాడుతున్నది. అక్కడ ఉండే ఏదైనా ప్రయోజనకరమైన, అభివృద్ధి పరమైన అంశంపై పెద్దగా దృష్టి పెట్టదనుకోండి. యూదులు ఉత్కృష్ట జాతి, ఉన్నత మానవ సమూహం అని బలంగా విశ్వసిస్తున్నట్టే అలాంటి విశిష్ట జాతి ఒకటి ఈ దేశంలో కూడా పండిత వర్గంగా సనాతన కాలం నుండి దేశానికి జ్ఞానాన్ని అందిస్తున్నదని సంఘ్ పరివార్ కూడా భావిస్తుంటది. అందుకే సంఘ్ పరివార్ రాతలల్లో, సంభాషణల్లో ఇజ్రాయెల్ ప్రస్తావన ఇతర దేశాల కంటే ఎక్కువగా వస్తుంటది. అక్కడి నిర్బంధ చట్టాల లాంటి వాటిని, అక్కడి అణచి వేత సాధనాలను ఏవైనా మన దేశంలో ఉండాల్సిందే అనే తరహాలోనే బిజెపికి పరివార్ ఉపదేశిస్తుంటది. దేశంలో తన రాజకీయ విధానాలతో ఓట్లను తెచ్చుకొని సీట్లను గెలుచుకోవడం వరకే పరిమితం కాకుండా మరో రాజకీయ పార్టీ గానీ, మరో భావజాలం గానీ మనుగడలో ఉండకూడదనేలా గత 7 సంవత్సరాలుగా వ్యవహరిస్తోంది. దాని కోసం ఏ అవకాశాన్ని, సాధనాన్ని చేజార్చుకోవడం లేదు. అందుకే మనుషుల మస్తిష్కాల మీద తిష్ట వేయడానికి, వారి ఆలోచనలను పసిగట్టే పనిలో పడింది. అలా అంది వచ్చిందే, తనకిష్టమైన దేశం నుండి కొనుక్కొచ్చుకున్నదే పెగాసస్.

నేడు అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు, వ్యవహారాలు అంతర్జాల (ఇంటర్నెట్) ఆధారంగా, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిర్మితమవుతున్నవే. సాఫ్ట్ వేర్ ఆయుధాలతో నిరంతరం సాఫ్ట్ యుద్ధం కూడా నడుస్తూనే ఉన్నది. ఎథికల్ హాకింగ్ పేరుతో అనేక దేశాల్లోని అనేక సాఫ్ట్ వేర్ సంస్థలు అవి ప్రభుత్వ రంగంలోని వైనా, ప్రైవేటు వైనా ఇతర ఇంటర్నెట్ ఆధారిత వ్యవస్థలపై దాడులు చేస్తున్నాయి. ఓ మేరకు వాటికి ఈ పోటీ ప్రపంచంలో ఆమోదనీయత కూడా వచ్చి పడింది. వ్యాపార,రక్షణ, ఇంధన, బ్యాంకింగ్ ఒక్కటనేమిటి అనేక వ్యవస్థల పైన 'ప్రత్యర్థులు' నిరంతరం ఏదో ఒక దాడికి పాల్పడుతూనే ఉంటారు. ఒక దేశంలోని ఎన్నికలను మరో దేశం ప్రభావితం చేసే, నిర్దేశించే స్థితికి కూడా చేరుకున్నవి. అంతర్జాలంలోని సామాజిక మాధ్యమ వేదికలు కోట్లాది వినియోగ దార్ల వ్యక్తిగత సమాచారంతో 'డేటా బ్యాంకు'ను ఏర్పరిచి భారీ వ్యాపారంతో భారీ లాభాలను అందుకుంటున్నాయి. ప్రపంచమంతా ఫోన్లకు అతుక్కుని పోయేలా చేయడంతో అంతర్జాలంలో ఆదమరిచే ప్రతి ఒక్కరి వివరాలు ఎప్పటికప్పుడు గుట్టలు గుట్టలుగా పోగుపడుతూనే ఉన్నవి. అడిగిన ప్రతి సమాచారాన్ని మనం సమర్పించుకునేల 'సెట్టింగ్స్' పెట్టి మరీ మనదనుకున్నదంతా మార్కెట్ అయ్యేలా మనల్ని మాయ చేస్తున్నవి అసంఖ్యాక 'ఆప్'లు. వీటన్నిటిని తలదన్నే సూపర్ నిఘా సాఫ్ట్ వేర్ పెగాసస్. పెగాసస్ కన్ను నీ ఫోన్ పైన పడిందంటే నీ ప్రతి కదలిక నమోదు అవుతున్నట్టే. ఇజ్రాయెల్ దేశానికి చెందిన ఔూ అనే ప్రైవేటు సంస్థ ఇజ్రాయెల్ ప్రభుత్వ అనుమతితో కేవలం ఆయా దేశాల్లోని 'ప్రభుత్వ సంస్థల'కు మాత్రమే అమ్ముతామంటున్నది. ఇటీవలి కాలంలో దీని రంగంతా బహిరంగమయ్యింది. మన దేశానికి చెందిన "ది వైర్" అనే ఆన్ లైన్ మీడియా సంస్థ వాషింగ్టన్ పోస్ట్, ది గార్డియన్, ఫ్రాన్స్‌కి చెందిన లీ మాండ్‌తో పాటు మరో 16 మీడియా సంస్థలు పెగాసస్ బండారాన్ని బట్టబయలు చేశాయి. ఇజ్రాయెల్ దేశానికి చెందిన డబ్ల్యుఎస్ఓ అనే ప్రైవేటు సంస్థ ప్రపంచంలోని 50 దేశాలకు పైగా ఈ నిఘా సాఫ్ట్ వేర్‌ను విక్రయించినట్టు, 50 వేలకు పైగా భిన్న రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తుల ఫోన్లను పూర్తిగా ట్యాప్ చేసే విధంగా ఆయా ప్రభుత్వాలు, అక్కడి నిఘా సంస్థలు వీటిని చట్ట విరుద్ధంగా ఉపయోగించినట్టు వెల్లడించాయి. ఈ పెగాసస్ నిఘా కంట్లో పడ్డ వాళ్లలో ఆయా దేశాల్లోని ప్రతిపక్ష పార్టీల నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు, ప్రభుత్వాధికారులు, పదవీ విరమణ పొందిన అధికారులు,అనేక ప్రాంతాలలో జరుగుతున్న అనేక ప్రజా ఉద్యమ కార్యకర్తలు ఉన్నారు. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా తన ఫోరెన్సిక్ ప్రయోగశాలలో మెజారిటీ కేసులను నిరూపించింది. నిజానికి 2019లోనే వాట్సాప్ డబ్ల్యుఎస్ఓ పైన గోప్యంగా ఉండాల్సిన తన ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు బయటి ప్రపంచానికి తెలిసేలా ఈ పెగాసస్ సాఫ్ట్ వేర్ పనిచేసిందని ఫిర్యాదు చేసింది. లక్షిత ఫోన్ నంబర్‌కి చిన్న సంకేతం, సమాచారం పంపిస్తే చాలు సకల సమాచారం వారి నుండి రాబట్టేందుకు వీలయ్యేలా ఈ సాఫ్ట్ వేర్ రూపొందించబడింది. భారత దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రధానంగా రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, కశ్మీర్

రాజకీయ నాయకుల ఫోన్లతో పాటు దేశంలో ప్రముఖ జర్నలిస్టుల, ప్రభుత్వ విమర్శకుల ఫోన్లు కూడా పెగాసస్ నిఘా సాఫ్ట్ వేర్ ద్వారా హ్యాకింగ్ కు గురైనట్టు వెల్లడయింది. ప్రభుత్వానికి ప్రియమైన అంబానీ కూడా ఈ లిస్ట్‌లో ఉన్నాడు. ఆశ్చర్యకరంగా కొందరు పోలీసు అధికారులు ఉన్నారు. కేంద్ర మంత్రులు కూడా ఈ లిస్ట్‌లో ఉండటం విశేషం. అంతర్జాతీయంగా అనేక దేశాల నేతలు కూడా దీని బాధితులే! అందులో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ కూడా ఉన్నాడు. ఈ నిఘా వ్యవహారం పైన ఫ్రాన్స్, ఇజ్రాయెల్ ప్రభుత్వాలు విచారణకు ఆదేశించాయి. భారత ప్రభుత్వం మాత్రం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయినా, దేశమంతా గగ్గోలు పెట్టినా, సుప్రీంకోర్టులో పిటిషన్లు పడ్డప్పటికీనీ రక్షణ శాఖ ఇజ్రాయెల్ దేశ ప్రైవేటు సంస్థ నుండి ఏ నిఘా సాఫ్ట్ వేర్‌ను కొనుగోలు చేయలేదనే ఏక వాక్య ప్రకటనకు పరిమితమయ్యింది. అలా జరిగే వీలు లేదని, దేశం ఆమోదించదని, అలా జరగడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఇదంతా ప్రతిపక్షాల అభూత కల్పితమని, ఆధార రహితమని తనకేమీ తెలియదన్నట్టు నాటకాన్ని బాగానే రక్తికట్టించింది.

అంతర్జాతీయంగా అనేక దేశాలు టెర్రరిస్టుల అణచివేత పేరుతో, జాతీయ భద్రత పేరుతో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇజ్రాయెల్ దేశపు ప్రైవేటు సంస్థ నుండి కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటివరకు ప్రపంచంలో ఏ దేశంలో కూడా పెద్ద టెర్రరిస్టు దుశ్చర్యగా చెప్పబడ్డ వాటిలో సైతం ఇలాంటి నిఘా సాఫ్ట్ వేర్ ఉపయోగించి నేరస్తులను పట్టి విచారించి, శిక్షించినట్టుగానీ అసలు అలాంటి విధ్వంసాలు జరగకుండానే నిరోధించినట్టు గానీ సాక్ష్యాధారాలు పెద్దగా ఏమీ లేవు! కేవలం ప్రభుత్వాన్ని నడిపే పార్టీల నేతల రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఇలాంటి నిఘా వ్యవస్థ ఎక్కువ ఉపయోగపడింది తప్ప దేశ భద్రత అనేది సాకు మాత్రమే. దేశ భద్రత పేరుతో మానవ హక్కులను ఉల్లంఘించడం, అసమ్మతిని అణచివేయడం, ప్రజాస్వామిక విలువలను ధ్వంసం చేయడం తప్ప మరొకటి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఈ నిఘా సాఫ్ట్ వేర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో టర్కీ, సౌదీఅరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్‌లతో పాటు భారతదేశం కూడా ఒకటని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదికలో పేర్కొన్నది. వికీలీక్స్, అమెరికాకు చెందిన స్నోడెన్ బహిర్గత పర్చిన వేలాది డాక్యుమెంట్లు ద్వారా ఆయా దేశాల దుశ్చర్యలు ప్రధానంగా మిలిటరీ పరమైనవి ప్రపంచానికి తెలిసొచ్చినవి. టెర్రరిస్టుల అణచివేత పేరుతో ప్రపంచ వ్యాప్తంగా పౌర స్వేచ్ఛలు ఏ విధంగా ఉల్లంఘించబడుతున్నాయో, ఎంత క్రూరమైన చట్టాలను రూపకల్పన చేస్తున్నారో కూడా పాత చరిత్రేమి కాదు. ఇలాంటి నిఘా సాంకేతిక పరిజ్ఞానంతోనే ఇజ్రాయెల్ ఇరాన్ లాంటి దేశాలను ఎట్లా కవ్విస్తున్నదో ఫలితంగా ఆ ప్రాంతమంతా ఎలాంటి భయానక వాతావరణానికి గురువ్వుతున్నదో ప్రతినిత్యం చూస్తూనే ఉన్నాం. దేశాల మధ్య ఆధిపత్యం కోసం, అంతర్గతంగా ఆయా సమూహాల ఆధిపత్యం కోసం ఇలాంటి నిఘా వ్యవస్థను తయారు చేసుకుంటున్నారు. ఈ నిఘా సాంకేతిక పరిజ్ఞానం మొత్తం ఆధిపత్య భావజాలాల విస్తరణ కోసం, స్థిరీకరణ కోసం మొత్తంగా సమాజాన్ని గుప్పిట్లో పెట్టుకోవడానికే ఉపయోగించ బడుతున్నది.

భారత ప్రభుత్వం నుండి పెగాసస్ నిఘా సాఫ్ట్ వేర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని కొన్నదా లేదా అనే అంశంపై స్పష్టమైన ప్రకటన రాలేదు. కేవలం రక్షణ శాఖ నుండి మాత్రమే పెగాసస్‌ను కొనుగోలు చేయలేదనే ఒక సంక్షిప్త ప్రకటన వెలువరించింది. అలా అయిన పక్షంలో ఎటువంటి విచారణకైనా అంగీకరించాల్సి ఉండే కానీ అలా జరగలేదు. సుప్రీంకోర్టుకు కూడా అరకొర సమాచారాన్ని మాత్రమే అందించారు. దేశంలో ఇప్పటికే 22 నిఘా సంస్థలు వివిధ పేర్లతో పని చేస్తున్నాయి. అవేవి పార్లమెంట్‌కు జవాబుదారీతనం వహించేవి కావు. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడినవి అస్సలు కావు. ఆయా సందర్భాలాల్లో ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా ఏర్పర్చబడినవి. ఇవి సమాచార చట్ట పరిధిలోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. హోమ్, రక్షణ శాఖ, దేశ భద్రతా సలహాదారుడి కింద ఇలా అనేక శాఖల నేతృత్వంలో నిఘా సంస్థలు పని చేస్తున్నాయి. భద్రతా సలహాదారుని కార్యాలయ బడ్జెట్టు గత ఏడేళ్లలో 33 కోట్ల నుండి 880 కోట్లకు చేరుకున్నదంటే ఎంతగా లెక్కలు పత్రాలు లేని ప్రజల డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. నిఘా విభాగం కోసం కేటాయించే బడ్జెట్ లెక్కలు అడిగే సాహసం ఎవరు చేయరు. చేస్తే దేశ ద్రోహమే కదా!! అయినా ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్రాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుకోవడం ఏ స్వేచ్ఛా వాయువుల్ని ఆస్వాదించడానికి? అసలు దేశ భద్రత, సమైక్యత పేరుతో ఒక భావజాలాన్ని, ఒక పార్టీ రాజకీయ ప్రయోజనాలను కాపాడటం తప్ప మరొకటి జరగడం లేదు. ఇంకా చెప్పాలంటే ఒక్కరిద్దరి పలుకుబడి, ప్రాభవం పెంచడం కోసమే. రాజకీయ ప్రత్యర్థులను దెబ్బకొట్టడం కోసం, అసమ్మతి స్వరాలను అణచివేయడం కోసమే. అన్ని రాజ్యాంగ వ్యవస్థల పీఠాల్లో కూర్చున్నవారి వ్యక్తిగత జీవితాల పైన నిఘా పెట్టి వారిని తమ చెప్పుచేతుల్లో పెట్టుకొని తమకు అనుకూలమైన నిర్ణయాలు, చర్యలు తీసుకునేలా బెదిరించడం సర్వసాధారణం అయిపోయింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గగోయ్‌పై అత్యాచార ఆరోపణలు చేసిన మహిళపై కూడా ఈ నిఘాను పెట్టారంటే ఎవరిని ఎలా రక్షించుకోవాలో, ఎవర్ని బెదిరించాలో పక్కా ప్రణాళికతోనే ప్రభుత్వ పెద్దలు పని చేస్తున్నట్టు అర్థమవుతుంది.

ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ పెగాసస్ నిఘా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే అక్కడి ప్రభుత్వాలను పడగొట్టి తమ ప్రభుత్వాన్ని బిజెపి ఏర్పర్చుకున్నదని అంతర్జాతీయ మీడియా సంస్థల దర్యాప్తులో వెల్లడయింది. దానికి పెద్ద ఉదాహరణగా కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అధికార మార్పును ప్రస్తావించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో డబ్ల్యుఎస్ఓ అధికారులు పర్యటించారని స్వయంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించాడు. ఇంత దుమారం రేపుతున్న ఈ విషయం పై అటు ఇజ్రాయెల్ దేశపు డబ్ల్యుఎస్ఓ మేము భారత ప్రభుత్వానికి ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని విక్రయించలేదని గానీ, ఇటు మేము కొనలేదని గానీ భారత ప్రభుత్వం నిష్కర్షగా ప్రకటించలేకపోతున్నాయి. మనిషి కంటే మతం ప్రధాన ఎజెండాగా ఉన్న సంఘ్ పరివార్-బిజెపి రాజకీయాల్లో రాజ్యాంగ ఆదర్శాలు, ప్రజాస్వామిక విలువలు, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్రాల కంటే 'అఖండ హైందవ భారత్' కలలే ఆధిపత్యం వహిస్తాయి. అలాంటి ఎజెండాను ఎత్తుకున్న వాళ్లకు వ్యక్తిగత గోప్యత, గౌరవం, ప్రతిష్టల పట్ల అస్సలు పట్టింపు ఉండదు. దేశ భద్రత, దేశ భక్తి, జాతీయ వాదం పేరుతో ఎంతకైనా తెగిస్తున్నారు. ఏ చట్టం, ఏ

గ్రామీణ ఉపాధి హామీ పథకంపై దుష్ప్రచారం

గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంత అరకొరగా అమలవుతున్నదో వివరాలు తెల్పుతూ, దుష్ప్రచారం మాని చర్చించాలంటున్నారు **కన్నెగంటి రవి**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం/పథకంపై జరిగినంత దుష్ప్రచారం ఇంకే పథకంపై జరిగి ఉండదు. మొత్తంగా ఈ చట్టం కొన్ని మంచి లక్ష్యాలతో ముందుకు వచ్చినా, అందులో మూల సారాన్ని ప్రభుత్వాలు నీరు కార్చాయి. చట్టం ప్రకారం గ్రామ సభలు ఈ పథకం అమలులో కీలకపాత్ర పోషించాలి. స్వయంగా తమకు అవసరమైన పనుల ఎంపిక చేసుకోవాలి.

కాని మొదటి నుండీ ప్రభుత్వాలు ప్రజల పాత్రను పూర్తిగా దూరం చేసి, తమకు ఇష్టమొచ్చినట్లుగా ఈ పథకం అమలు చేస్తూ వస్తున్నాయి. అసలు ఏమి జరుగుతుందో, పనులు ఎక్కడ నిర్ణయం అవుతున్నాయో, పనుల పర్యవేక్షణ ఎలా చేస్తారో, సామాజిక తనిఖీ ప్రాధాన్యత ఏమిటో, ఏ పనులు ఈ పథకం కింద ప్రజలు చేయించుకోవచ్చో ప్రజలకు అర్థం కాకుండా చేయడంలో ప్రభుత్వాలు విజయం సాధించాయి. అందుకే ఈ పథకం లోతుపాతులు తెలియనివాళ్లు, క్షేత్రస్థాయి అనుభవాలు పొందని వాళ్లు కూడా ఈ పథకాన్ని విమర్శిస్తూ మాట్లాడతారు.

ఈ పథకం అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పథకం నిధులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వానివి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేసుకోవాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని దాని నిజమైన స్ఫూర్తితో కాకుండా, తనకు తోచిన విధంగా అమలు చేస్తున్నది. పైగా పథకం సూచించినట్లు జాబ్ కార్డ్ పొందిన కుటుంబాలకు 100 రోజుల పని కల్పించడంలో కూడా ప్రభుత్వం వైఫల్యం చెందింది. తెలంగాణలో గత ఏడేళ్ల అనుభవం అదే చెబుతున్నది.

ఈ పథకం కింద గత 5 సంవత్సరాలుగా ఆమోదించిన లేబర్ బడ్జెట్‌లను పరిశీలిస్తే మొత్తం శ్రామికుల సంఖ్యతో పోల్చి చూసినప్పుడు బడ్జెట్ అతి తక్కువ మాత్రమే అనిపిస్తుంది. 2016- 17లో లేబర్ బడ్జెట్ రు. 1467,22,65,640 (రాష్ట్ర జిడిపి రు. 6,41,985 కోట్లలో 0.228 శాతం), 2017-18లో రు. 1658,91,67,160 (రాష్ట్ర జిడిపి రు. 7,32,657 కోట్లలో 0.226 శాతం), 2018-19లో రు. 1759,34,78,450 (రాష్ట్ర జిడిపి రు. 8,42,631 కోట్లలో 0.208 శాతం), 2019-20లో రు. 1684,56,65,900 (రాష్ట్ర జిడిపి రు. 9,69,418 కోట్లలో 0.173 శాతం), 2020-21లో రు. 1563,04,87,090 (రాష్ట్ర జిడిపి రు. 9,78,373 కోట్లలో 0.159 శాతం) మాత్రమే. లక్షలాది మంది గ్రామీణ ప్రజల ఉపాధి హామీకి ఏ ప్రభుత్వమైనా ఇంత మొత్తాలను కూడా కేటాయించకపోతే వలసలు మరింత పెరుగుతాయి. ఆకలి చావులు పెరుగుతాయి.

రాష్ట్ర గ్రామీణ ప్రాంతంలో 2020-2021 నాటికి జారీ చేసిన మొత్తం జాబ్ కార్డులు 53,15,400 మాత్రమే. ఇంకా చాలా మందికి ఇప్పటికీ జాబ్ కార్డులు లేవు. జారీ చేసిన వాటిలో కూడా 31,65,984 జాబ్ కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. అంటే ఈ కుటుంబాలు మాత్రమే ఎప్పుడో ఒకప్పుడు ఆ సంవత్సరంలో ఉపాధి హామీ పనిలో పాల్గొన్నాయి అని అర్థం. ఉపాధి హామీ పని పూర్తిగా అనిపుణ శ్రమ. అయినా దాని కోసం ఇన్ని కుటుంబాలు ఎదురు చూసి పనిలో పాల్గొంటున్నాయి అంటే, ఆ మేరకు ఆ కుటుంబాలు, చేతినిండా తగిన సొంత పని లేక, లేదా తగిన ఆదాయాలు లేక ఉన్నాయని అర్థం.

2020-2021 నాటికి మొత్తం జారీ చేసిన జాబ్ కార్డులలో

కోర్టు తీర్పులు వారికి అడ్డం అన్పించడం లేదు.అసలు పౌరుల వ్యక్తిగత హక్కులు,స్వేచ్ఛకు రక్షణగా నిలవాల్సిన సంస్థలే వాటిని ఘోరంగా ఉల్లంఘిస్తున్నాయి. 2017లో కెఎస్ పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ప్రభుత్వం కేసులో వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కులో అంతర్భాగమని విస్పష్టమైన తీర్పును వెలువరించింది. ఆ తీర్పు ద్వారా వ్యక్తిగత గోప్యత అనేది ఒక రాజ్యాంగ విలువగా వ్యవస్తీకృతం చేయాల్సింది పోయి నిట్ట నిలువునా పాతరేసే పనికి పూనుకున్నది. అదే పుట్టస్వామి కేసులో దేశ భద్రత దృష్ట్యా నిఘా అనివార్యమయితే సరైన, సమయోచితమైన పద్దతిలో రాజ్యాంగ రక్షణలకు లోబడి వ్యవహరించాలని కూడా నిర్దేశించింది. ఇతర మార్గాలు విఫలమైనపుడు మాత్రమే అలాంటి చర్యలు చేపట్టాలని కూడా చెప్పింది. నిజానికి పుట్టస్వామి కేసులో ఇచ్చిన తీర్పు తర్వాత దేశ భద్రతా, టెర్రరిస్టు వ్యతిరేక చర్యల పేరుతో ప్రజల స్వేచ్ఛా, స్వతంత్రాలను కాలరాసేలా వ్యవహరిస్తున్న నిఘా సంస్థలన్నీ రాజ్యాంగేతరమైనవే. ఇవేవీ పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పర్చబడ్డవి కావు. ఏ జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తున్నవే. పరిస్థితి ఇలానే ఉంటే రేపు ఇదే పెగాసస్ లాంటి నిఘా సాఫ్ట్ వేర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రైవేటు సంస్థలు కూడా సంపాదించుకోవడం ఏ మాత్రం కష్టం కాదు. పౌరుల పైన ప్రభుత్వాలతో పాటు ప్రైవేటు వ్యక్తుల పెత్తనం పెరిగి మనుషులుగా వారికుండే ఏ హక్కుకు విలువ ఉండదు. స్వేచ్ఛా, హక్కులు రాజ్య దయాదాక్షిణ్యాల పైన ఆధారపడ్డట్టు కార్పొరేట్ శక్తుల మీద కూడా ఆధారపడే ప్రమాద ఘడియలు ముంచుకు రాకముందే మేల్కోవడం మనుషులుగా మనందరి చారిత్రక బాధ్యత. దానికోసం ఇప్పటికే నడుస్తున్న ప్రజాతంత్ర హక్కుల ఉద్యమాలతో కలసి నడవడం, వాటిని మరింత బలోపేతం చేయడం తప్ప మరో మార్గం లేదు. వీ

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు)

ఉన్న శ్రామికుల సంఖ్య 1,14,41,943 మంది కాగా అందులో కూడా యాక్టివ్‌గా ఉన్న శ్రామికుల సంఖ్య 54,91,824 మంది మాత్రమే. ఈ శ్రామికులలో పురుషులు, మహిళలు, అన్ని కులాల ప్రజలు ఉంటున్నారు. వికలాంగులకు కూడా కొన్ని నిర్దిష్ట శ్రమ శక్తి సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వాలు తగిన బాధ్యత తీసుకుని 100 రోజుల పని కల్పిస్తే చాలా కుటుంబాలు ఈ పని చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. అదే సమయంలో చేసిన పనికి సకాలంలో (చట్టం చెప్పిన గడువు లోపు) వేతనాలు చెల్లించకపోవడం వల్ల కూడా శ్రామిక కుటుంబాలు ఈ పనికి దూరం అవుతున్నాయి. ప్రభుత్వాలు ఈ పథకాన్ని నీరు కారుస్తూ పోవడం వల్ల గ్రామీణ ప్రాంతంలో పూర్తి కావల్సిన పనులు కూడా పెండింగ్‌లో ఉంటున్నాయి.

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలు తప్పకుండా గ్రామీణ పేదలలో బేరమాడే శక్తిని పెంచింది. వారికి పనిని నిర్ణయించుకోగలిగిన ఆత్మగౌరవాన్ని ఇచ్చింది. వ్యవసాయ రంగంలో పనులు దొరకని కాలంలో కొంత ఆదాయాన్ని కూడా ఆయా కుటుంబాలకు అందించింది. మరో వైపు మహిళా, పురుష కార్మికులకు సమాన వేతనాలను అందించిన ఏకైక పథకం ఇది.

ఇదే సమయంలో ఎంతో మంది పేదలు, ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు మొదటిసారి తమ భూములను అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కల్పించింది ఈ పథకం. చాలా గ్రామాలలో నీటి వనరులు బాగుపడ్డాయి, అభివృద్ధి చెందాయి. పొలం కుంటలు వేల సంఖ్యలో వచ్చాయి. కాలువలు బాగుపడ్డాయి. ఉద్యాన పంటల రైతులకు ఈ పథకం వల్ల సహాయం అందింది. ఇవన్నీ ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించడం వల్లనే సాధ్యమయ్యాయని గుర్తించాలి. ఈ పథకం తోనే గ్రామాలలో హరితహారం పేరుతో మొక్కల పెంపకం సాధ్యమైంది. డొంకలు, స్కూల్ భవనాలు, అంగన్ వాడీ భవనాలు, పంచాయితీ భవనాలు, రైతు వేదికలు, పశువులకు నీళ్లతొట్లు, పశు వులకు పాకలు, వ్యక్తిగత మరుగుదొడ్లు – ఇలా ఎన్నో ఆస్తులు ఏర్పడ్డాయి. ఇప్పుడు తాజాగా పొలాల మధ్య డ్రైయింగ్ యార్డుల నిర్మాణం ఈ పథకం తోనే చేపడుతున్నారు. వీటన్నింటినీ స్వయంగా గ్రామీణ ప్రజలు వాళ్ల కొద్దిపాటి ఆదాయాలతో ఏర్పాటు చేసుకోవాలంటే సాధ్యం అయ్యేది కాదు. ప్రభుత్వాలు ప్రత్యేకంగా బడ్జెట్‌లు కూడా ఇంత కేటాయించేవి కావు.

ఈ పథకంలో లోపాలను సవరించుకుంటూ, మరింతగా గ్రామీణ ప్రజలకు ఉపయోగపడేలా చూడడానికి ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో గ్రామ సభలకు, గ్రామీణ ప్రాంతంలో పనిచేసే ప్రజా సంఘాలకు కూడా అంతే బాధ్యత ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం స్ఫూర్తిని నీరు కార్చడానికి చేసే అన్ని ప్రయత్నాలను మనం తిప్పికొట్టాలి.

ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతంలో కూలీలు దొరకడం లేదని, అక్కడ పని చేయకపోయినా కూలీ వస్తుందని, అందుకే వ్యవసాయ పనులకు రారని ఒక విమర్శ ఉంది. కాని అది నిజం కాదని గత ఏడేళ్ల తెలంగాణ రాష్ట్ర గణాంకాలు చెబుతున్నాయి. చట్టం అన్ని కుటుంబాలకు 100 రోజుల పని కల్పించాలని చెబుతున్నా, 2016-17లో 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాలు 1,75,540 కాగా, 2017-18లో 2,03,530 కుటుంబాలు, 2018-19లో 2,27,210 కుటుంబాలు, 2019-20లో 1,75,660 కుటుంబాలు, 2020-21లో కేవలం 20,800 కుటుంబాలు మాత్రమే 100 రోజుల పని పొందాయి. అంటే మొత్తం పనిలో పాల్గొన్న యాక్టివ్ కుటుంబాలలో ఇవి 10 శాతం మాత్రమే.

ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు 2016-2017లో 42.28, 2017-18లో 45.32, 2018-19లో 46.65, 2019-20లో 43.20, 2020-21లో కేవలం 38.58 రోజులు మాత్రమే సగటు పనిదినాలు లభించాయి. శ్రామికులకు లభించిన సగటు వేతనం 2016-17లో రు. 138. 80 కాగా, 2017-18లో రు. 139.78, 2018-19లో రు. 148.47, 2019-20లో రు. 153.87, 2020-21లో రు. 164.55 మాత్రమే. అంటే ఉపాధి హామీ పథకంలో రోజు కూలీ 200 రూపాయలకు పైగా ఉన్నా పని కోరుకునే కార్మికుల సంఖ్య, చేసిన పని విస్తీర్ణంకు నిర్దేశించిన వేతనాలను బట్టి వారికి అతి తక్కువ కూలీ మాత్రమే పడుతున్నది.

2020-21 సంవత్సరంలో నెలల వారీగా ఉపాధి హామీ పని దినాలను చూస్తే, ఈ పథకంపై మరో విమర్శ కూడా అబద్ధమని తేలుతుంది. 2020 ఏప్రిల్‌లో 22,21,096 మంది కార్మికులు పని పొందారు. మే నెలలో 53,99,280 మంది కార్మికులు, జూన్ నెలలో 36,72,963 మంది శ్రామికులు పని పొందారు. అకస్మాత్తుగా ఈ సంఖ్య జూలై నెలలో 5,93,211 మందికి పడిపోయింది. ఆగస్ట్‌లో కేవలం 1,78,987 మంది, సెప్టెంబర్‌లో 1,79,384 మంది, అక్టోబర్‌లో 2,55,453 మంది, నవంబర్‌లో 3,55,175 మంది మాత్రమే ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఇది పూర్తి వానాకాలం సీజన్. అంటే గ్రామాలలో వ్యవసాయ కూలీల కొరతకు ఈ పథకం కారణం కాదని అర్థం అవుతుంది.

ఇతర కారణాలు ఏమిటో నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి. అందరికీ ఒకేసారి కూలీలు అవసరం అయ్యేలా పంటల పొందికలో వచ్చిన మార్పులు, గ్రామాలలో ఉన్న కుల పెత్తందారీ వ్యవస్థ అణచివేత ధోరణులు, సాంస్కృతికంగా అన్ని కుటుంబాలలో శ్రమ పట్ల మారిన ఆలోచనా ధోరణులు, అన్ని కుటుంబాలలోని యువతరం కొత్త పనులు వెతుక్కుంటూ పట్టణాలకు చేరడం, మగవాళ్లలో పెరిగిన తాగుడు వ్యసనం – వీటన్నిటినీ పరిశీలించాలి.

రూపాయికి కిలో బియ్యం, పెన్షన్ లాంటి ఈజీ మనీ, ప్రభుత్వాల ఇతర ఉచిత పథకాల వల్ల కూలీలు సరిగా పని చేయడం లేదనే విమర్శ ఉంది. అది ఎంతమాత్రమూ కారణం కాదని, మొత్తం గ్రామీణ కుటుంబానికి వివిధ రూపాలలో వచ్చే మొత్తం ఆదాయాన్ని దృష్టిలోకి తీసుకుని పరిశీలించినప్పుడు అర్థం అవుతుంది. అయితే మొత్తంగా పని సంస్కృతిలో మార్పు వచ్చిన మాట నిజం. వచ్చిన మార్పుకు కేవలం కూలీ మాత్రమే కాదు, మొత్తం సమాజమే గురైంది. దాని ఫలితాలను మనం చూస్తున్నాం. ఆ సమస్యను ఎట్లా పరిష్కరించుకుంటాం అన్నది విడిగానే చర్చించాలి.

(రచయిత రైతు స్వరాజ్య వేదిక నాయకులు) వీ

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై పెరిగిన హత్యాకాండ

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై జరిగే దాడులకు కారణాలను, ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, ఇలాంటి దాడులను ప్రజా ఉద్యమాల ద్వారానే ఆపగలమని సూచిస్తున్నారు **చిమ్మె. జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్‌లో రోజు రోజుకూ మహిళలపై, పిల్లలపై అత్యాచారాలు, హత్యలు, లేకుంటే ఆత్మహత్యలకు పాల్పడడం ఎక్కువైపోయింది. ఆగస్ట్ 15న గుంటూరు – విజయవాడ హైవే పక్కనున్న పెదకాకాని మండల కేంద్రానికి సమీపంలోని 'పరమయ్యకుంట'లో రోడ్డు మీదే బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని నల్లపు రమ్యను శశికృష్ణ అనే యువకుడు దారుణంగా హత్య చేశాడు. దాదాపు 40 – 50 మంది చూస్తుండగానే ఈ హత్య జరిగింది. అధికారులందరూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నిమగ్నమై ఉండగానే ఈ ఘటన జరిగింది. రాష్ట్ర డిజిపి కార్యాలయానికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలోనే ఈ ఘటన జరిగింది. గుంటూరు రూరల్ పోలీస్ స్టేషన్, పెదకాకాని పోలీస్ స్టేషన్‌లు రెండూ కూతవేటు దూరంలోనే ఉంటాయి. అసలు ఎన్‌ఎచ్–9 నేషనల్ హైవే పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ తిరుగుతూ ఉండే రోడ్డు మీదే ఈ సంఘటన పట్టపగలు జరిగిందంటే అది ఎవరి వైఫల్యమనే చర్చ ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిలోనూ జరుగుతూ ఉంది. ఈ సంఘటన జరిగిన రోజే ప్రకాశం జిల్లాలో ఒక భర్త తన భార్యనూ, బిడ్డనూ కత్తితో పొడవగా తల్లి చనిపోయింది, బిడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. ఇలాంటి సంఘటనలూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ ఏదో ఒక కారణం చేత పునరావృతమౌతూనే ఉన్నాయి. ఇదే గుంటూరు జిల్లాలోని నకరికల్లులో అధికార వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు పొలంలో ఒక గిరిజన మహిళను ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశాడు.

ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు కొత్త విషయం ఏమంటే నిందితులు బహిరంగంగా, యథేచ్ఛగా, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు, మా వెనుక అధికార పార్టీ ఉందనే ధైర్యంతో, పోలీసుల అండతోనే ఈ హత్యాకాండ జరుగుతూ ఉంది. రాష్ట్ర డిజిపి కార్యాలయం కూతవేటు దూరంలోనే కత్తులతో స్వైర విహారం చేస్తూ, హత్యలు చేస్తూ ఉంటే పోలీసుల పహారా, దిశ యాప్, దిశ చట్టం ఏ విధంగా పనిచేస్తున్నాయో మనందరికీ అర్థమౌతూనే ఉంది. దళిత మహిళా హోం మంత్రి మేకతోటి సుచరిత సొంత జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక మూలన ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి లేదా వారు ప్రాతినిధ్యం వహిస్తున్న సామాజిక వర్గంలోని పెద్ద మనుషుల నుంచి ఎలాంటి స్పందన, భరోసా లేక మహిళలు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విచారించాల్సిన విషయం ఏమంటే చిన్న పిల్లలను ఉరివేసి చంపి, తామూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు తల్లులు. జన్మనిచ్చిన తల్లే చిన్న పిల్లలను చంపేస్తున్న మానసిక దుస్థితిలో నేటి మహిళలు ఉన్నారంటే ఈ సమాజం ఎంత భావ దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్నదో ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం.

కుటుంబం, కుల వ్యవస్థ, మత పెద్దలు, ప్రభుత్వ సంస్థలు (పోలీస్, శిశు సంక్షేమ శాఖ మొదలగునవి) అన్నీ మహిళలలో ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపలేని పరిస్థితులలోనే దిక్కుతోచని స్థితిలో చాలా మంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అటు భర్తతో భరించలేక, పుట్టినింటికి వెళ్లలేక మధ్యలోనే ప్రాణాలు తీసుకుంటు న్నారు. చివరకు మెడిసిన్, ఇంజనీరింగ్, పిహెచ్‌డి లాంటి ఉన్నత విద్యావంతులు సైతం ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి వచ్చిందంటే అందుకు ఈ వ్యవస్థలో ఇమిడలేక, ఈ వ్యవస్థలో పోరాడలేక, భరోసా ఇవ్వలేని ప్రభుత్వంతో చూస్తూ ఊరకుండలేక, భరించలేక, బతుకు భారమై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థినీలు కూడా కుటుంబంలోని పెద్దల సరైన పోకడలు లేక, కుటుంబ సభ్యుల ఆదరణ లేనివారే చాలా మట్టుకు వేరే పిల్లల సహవాసంతో కొంతవరకు పయనించి, కలిసి తిరిగి హత్యలకు గురవుతున్నారు, లేదా వికటిస్తే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బతికీ సాధించాలనే దృక్పథాన్ని విడనాడి, బతకడం కన్నా చావడమే మేలు అనే ఒక పెడధోరణికి లోనవుతూ జీవితాలను ముగిస్తున్నారు. ఎంతో కష్టపడి చదివి, ఉన్నత విద్యలను అభ్యసిస్తూ, ఈ ప్రపంచంలో మనకంటూ ఒక స్థానం సంపాదించుకోవాలనే కృత నిశ్చయాన్ని వదిలివేసి కృత్రిమ విషయాలకు బానిసలుగా మారి, కృత్రిమ ప్రేమలకు, మాయ మాటలకు లొంగిపోయి, అన్నింటికంటే ముఖ్యంగా ఇప్పుడున్న ఆండ్రాయిడ్ ఫోన్‌ల మాయలో పడిపోతూ, జీవితానికి అవసరమైనవి కాకుండా అనవసర విషయాలపై ఆసక్తి చూపుతూ తమ జీవన ప్రమాణాలకు సంబంధించినవి కాకుండా, వేరే విషయాలపై ఆసక్తి పెంచుతు జీవితాలను మధ్యలోనే ముగించుకుంటున్నారు. ఈ పరిస్థితి ఈ వ్యవస్థ మనుగడకే ప్రమాదకరమైనది.

మహిళలపై హత్యలు, ఆత్మహత్యలు, దాడులు ఎన్నో కుటుంబా లను అస్తవ్యస్థం చేస్తున్నవి. వారి జీవన ప్రమాణాలను తగ్గించి వేస్తున్నవి. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కూడా ప్రజలలో స్పందన వచ్చినప్పుడు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే దిశగా ప్రజా వెల్లువ వస్తుంటే ఈ ప్రభుత్వం పోలీసుల ద్వారా దీనిని అణిచివేయాలని చూస్తున్నది. అనగా వరుసగా జరుగుతున్న సంఘటనలకు ఒక పరిష్కారాన్ని కనుగొనాల్సిన పోలీసులు, నిరసనను వ్యక్తం చేసిన ప్రజలపై బల ప్రయోగం చేయడం, అక్రమంగా నిర్బంధించి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తిప్పుతూ ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం, సెక్షన్ 15/సిఆర్.పి.సి. కింద కేసులను నమోదు చేయడం ద్వారా ప్రజా సంఘాలను ఏదో ఒక విధంగా అణిచివేసే చర్యలకు పూనుకుంటున్నారు. వాస్తవాలను బయటికి పొక్కకుండా చేయడమే లక్ష్యంగా పోలీస్ వ్యవస్థ పనిచేస్తున్నది.

రమ్య హత్య జరగడానికి రెండు రోజుల ముందు రాష్ట్ర డిజిపి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి – సంక్షేమ చర్యలకు ఆకర్షితులై దళితులు, ఆదివాసులు, గిరిజనులు అభివృద్ధి పథం వైపు నడుస్తున్నారనీ, తద్వారా మావోయిస్ట్ పార్టీ చాలా బలహీనపడిందనీ వ్యాఖ్యానించాడు. అదే నిజమైతే తన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఎందుకు మహిళలు హత్యలకు గురవుతున్నారు? కనీసం పెట్రోలింగ్ కూడా చేయలేని దుస్థితిలో హైవే పెట్రోలింగ్ పోలీస్ ఉందా? హైదరాబాద్‌లో గత సంవత్సరం క్రితం జరిగిన 'దిశ' అనే మహిళపై అత్యాచారం, ఆ తర్వాత పెట్రోల్‌తో దహనం చేసిన సంఘటనను చూసి కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ గుణపాఠం నేర్చుకోలేదనడానికి ఈ సంఘటన ఒక మచ్చుతునక. వాస్తవానికి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన 27 నెలల కాలంలో రాష్ట్రంలో దాదాపుగా 500 మంది మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగినట్లు ఒక అంచనా.

రాష్ట్రంలో 'దిశ' చట్టం అనేది ఏ మేరకు మహిళలు వినియోగిస్తున్నారు అనేది, అసలు అది మహిళలకు ఉపయోగపడే విధానం, అవగాహనకు సంబంధించి ఏ మేరకు మహిళలు దిశ చట్టాన్ని వాడుకుంటున్నారనే దానికి ఈ ఘటన ఒక మచ్చుతునక. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం – తాడేపల్లి నివాస గృహానికి అతి సమీపంలోని సీతానగరం కృష్ణా నది బ్రిడ్జి వద్ద ఇసుక తిన్నెలలో కాబోయే పెళ్లి జంటపై దాడిచేసి, మహిళపై అత్యాచారం జరిపి, హత్య చేసిన సంఘటన మరువక ముందే మళ్లీ పెదకాకాని వద్ద ఈ సంఘటన జరిగింది. సీతానగరం సంఘటనలో నిందితులను ఇంతవరకూ పట్టుకోలేదు. ఇది పూర్తిగా పోలీసుల నిర్లక్ష్యమే. ఒక నిందితుని అరెస్ట్ చూపించి, మిగతా ముగ్గురి పేర్లు ప్రకటించి దర్యాప్తు చేస్తున్నామని చెప్పి గాలికి వదిలివేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి ఘటనలు రోజూ ఏదో ఒక మూలన జరుగుతూనే ఉన్నాయి. అయితే పత్రికలకు, ఎలక్ట్రానిక్ మీడియాకు బహిరంగ పరచబడిన వాటిని మాత్రమే మనం పరిగణనలోకి తీసుకుంటున్నాం. వాస్తవానికి 80 శాతం సంఘటనలు పత్రికల దృష్టి మళ్లించి రాజీ మార్గంలో నడుస్తున్నాయి. పోలీసులు, గ్రామాల పెద్ద మనుషులు ఇరువురూ ఒప్పందాలు చేసుకొని మహిళలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. అంతే కాకుండా పోలీస్ స్టేషన్ – కోర్టులకు ఎక్కితే తమ పరువు పోతుందని మహిళలను హెచ్చరిస్తున్నారు. కావున మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు ఎల్లప్పుడూ అప్రమత్తతతో మహిళలను ఆత్మగౌరవం – ఆత్మ విశ్వాసంతో తమపై జరుగుతున్న అన్యాయాలను ప్రతిఘటించే విధంగా తయారు చేసుకోవాలి. ఎవరైతే దురలవాట్లకు బానిసలై, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారో దానికి మూల కారణం అయిన మద్యం, పేకాట, వ్యభిచారం, చైన్ స్నాకింగ్ లాంటి వాటిని పురుషులతో మాన్పించే చర్యలకు పూనుకోవాలి. ప్రభుత్వాలు, అధికార పార్టీ నాయకులు మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా మార్చుకొని సామాన్య పౌరులపై 'ఒక పీడ'గా మద్యాన్ని మార్చి వేశారు. ఇది దుర్మార్గమైన విధానం, ప్రక్రియ.

విద్యార్థినీలు అత్యాచారాలకు గురైనప్పుడు ప్రభుత్వం కేవలం రు. 10 లక్షలు బాధితులకు నష్టపరిహారం చెల్లించి బాధితుల కుటుంబాలను ఆదుకుంటున్నట్లు, భవిష్యత్తులో ఇంకా ఆదుకుంటామని ప్రకటిస్తున్నది. ఆ జిల్లాకు సంబంధించిన మంత్రిని బాధితులను ఓదార్చడానికి పంపించి, కుటుంబాలను పరామర్శించి హామీని ఇన్నా చేతులు దులిపేసుకుంటున్నది. రెండు రోజులు మీడియాలో ప్రసారమై ఆ తర్వాత కేసును పోలీసులు పట్టించుకోవడం మానేస్తున్నారు. ఒక దళిత మహిళ హత్యకు గురైతే, అది కూడా హైవేపై పట్ట పగలు, స్వాతంత్ర్య దినోత్సవం నాడు, ముఖ్యమంత్రి నివాసానికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో కత్తిపోట్లకు గురై చనిపోతే ప్రాణం ఖరీదు రు. 10 లక్షలుగా ప్రభుత్వం పరిగణిస్తే దానితో బాధితులు మెత్తబడి, ప్రభుత్వ వైఫల్యాన్ని పట్టించుకోవడం మానేస్తారని ప్రభుత్వ పెద్దల అభిప్రాయంగా ఉన్నది. డబ్బే పరమావధిగా భావిస్తే మరి ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు కూడా ఇదే జరిగితే పరిహారం కోటి రూపాయలిస్తే ముఖ్యమంత్రి ఊరక ఉంటారనేది ప్రభుత్వం స్పష్టపరచ వలసి ఉన్నది.

పోలీసు అధికారులు కూడా ఎస్‌సి/ఎస్‌టి కేసుల పట్ల చాలా ఉదాసీనంగా ఉంటున్నారు. అందులో అత్యాచారం లేదా హత్యకు గురైన దళిత మహిళల పట్ల పోలీసు ఉన్నతాధికారుల వైఖరి చాలా విచారకరంగా ఉంటున్నది. నేర శిక్షా స్మృతి దృష్టితో కాకుండా సామాజిక కోణం (కులం) దృష్టితో కేసులను వివక్షతతో చూస్తున్నారు. ఇది విచారకరం. తమ కుటుంబ సభ్యులకు ఇలాంటివి జరిగితే వారు ఇదే విధంగా వ్యవహరిస్తారా అనేది ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. కాబట్టి కేసులను బాధితుల సామాజిక హోదాను బట్టి కాకుండా, మహిళలకు జరిగిన అన్యాయానికి చేయాల్సిన పరిహార పద్ధతులను ప్రభుత్వం పాటించాలి. ఒక సంఘటన జరిగితే వెంటనే మరో చోట మరో సంఘటన జరుగుతున్నది. ఈ ప్రభుత్వానికి ఇలాంటి సంఘటనల పట్ల తీవ్రమైన వైఖరి ఉంటే ఇలా ఎందుకు జరుగుతుంది. కంటితుడుపు చర్యలకు స్వస్తి పలికి, మహిళలకు న్యాయం జరిగే విధంగా ఈ ప్రభుత్వం వ్యవహరించాలి. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఐఎఎస్/ఐపిఎస్‌ల వైఖరులలో మార్పులు రావలసిన అవసరం ఉన్నది. ప్రభుత్వ పెద్దలకు చట్టాలకు సంబంధించిన విధానం, న్యాయ పద్ధతులపై ఉండవలసిన సీరియస్‌నెస్ కేవలం ప్రజా పోరాటాల ద్వారానే కలిగించవచ్చు తప్ప, ప్రభుత్వ వైఖరిలో మార్పు రాదు. కాబట్టి మరింత తీవ్రమైన పోరాటాలు చేయడం ద్వారానే ప్రభుత్వాల మెడలు వంచవచ్చు.

ప్రజా పోరాటాలు ఏదో ఒక రూపంలో అణచివేతకు గురవ్వడం, ప్రజలలో అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రతిఘటించే స్వభావాన్ని పెంపొందించకపోవడం ఇలాంటి సంఘటనలు జరగడానికి ఒక కారణం. కేవలం 'మనది' అనే స్వభావం బదులు 'నాది', నా కుటుంబం అనే స్వార్థపూరిత చింతన ఎప్పుడైతే ప్రారంభమైందో, వ్యాపార విలువలు పెంపొందించబడి, ఒకరికొకరు దూరమయ్యే పరిస్థితి గ్రామాల్లో సైతం వచ్చేసింది. కొన్ని పదుల మంది చూస్తుండగానే ఒక విద్యార్థిని బహిరంగంగా 6 కత్తిపోట్లకు గురైందంటే, ఎవరూ నిందితున్ని నివారించే సాహసం చేయలేకపోయారంటేనే ఈ విషయం సుస్పష్టమవుతున్నది. నివారించి ఉంటే కనీసం ప్రాణాలతో నైనా రమ్య బతికి ఉండేదనేది ఒక అభిప్రాయం. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు పోరాడడం ఒకవైపు జరుపుతూనే, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా నివారించడం ఎలాగో విద్యార్థినీలను తీర్చి దిద్దాలి. సహజ న్యాయం, సమన్యాయం, పౌరహక్కులు, రాజ్యాంగ హక్కులు అన్నీ కేవలం గ్రంథాలలోనే కాదు, ఆచరణలో వాటిని పోరాడి, సాధించి, మహిళలు ప్రగతికి, వ్యవస్థ మార్పుకు చుక్కానిలా ఉండాలనేది ఎంతో మంది అమరులైన మాతృ మూర్తుల లక్ష్యం. ఆ లక్ష్యాన్ని సాధించడంలో మహిళలు ముందుంటారనీ, సమ సమాజం కోసం పోరాడే సైనికుల్లా తయారు కావాలనేదే నా ఆకాంక్ష.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

ప్రజా సమస్యలు పట్టని పార్లమెంటు

పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రజా సమస్యలను చర్చించకుండా సభను వాయిదా వేస్తూ ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ బిల్లులను ఎటువంటి చర్చలేకుండా చట్టాలు చేసిందని అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

వర్షాకాల పార్లమెంటు సమావేశాలను నిర్దేశించిన షెడ్యూల్ కన్నా రెండు రోజుల ముందే ముగించిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. జూన్ 19న సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి అర్థాంతరంగా స్వస్తి వాక్యం పలికిన ఆగస్టు 11 వరకు ఒక్కటంటే ఒక్క ప్రజా సమస్యపై కూడా ఉభయ సభల్లో చర్చ జరగలేదు. ఓబిసిల రిజర్వేషన్లకు సంబంధించిన చట్ట సవరణ బిల్లు ఒక్కటే దీనికి మినహాయింపు! ఈ చట్టంపై రాజకీయ అవసరాల రీత్యా అన్ని పార్టీలు చర్చల్లోకి వచ్చాయి. పేరుకు 24 రోజుల పాటు పార్లమెంటు కొనసాగినప్పటికీ.. కార్యకలాపాలు నడిచింది మాత్రం లోక్‌సభలో కేవలం 21 గంటల 14 నిమిషాలు. రాజ్యసభలోనూ అంతంత మాత్రమే. అంటే, కనీసం ఒక్కరోజు (24 గంటలు) కూడా ఉభయ సభలు పూర్తిగా నడవలేదు. మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని గొప్పగా చెబుతారు. అటువంటి ప్రజాస్వామ్యానికి కేంద్రస్థానమైన పార్లమెంటులో ప్రజా సమస్యలు చర్చించకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యం. అధికార, విపక్షాల మధ్య సమన్వయం పూర్తిగా కొరవడిందనడానికి ఇది నిదర్శనంగా ఉంది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చట్టసభల పాత్ర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇవి రాను రాను మొక్కుబడి సమావేశాలుగా దిగజారిపోయాయి. దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని పదేపదే చెప్పుకొంటున్న మోడీ ప్రభుత్వం అసలు ప్రజా సమస్యలు చర్చించడానికే అవకాశం ఇవ్వలేదు. ప్రజల సమస్యలు, పాలన విధానాలు, నూతన చట్టాల కోసం ప్రవేశపెట్టే బిల్లులపైన సమగ్ర చర్చ జరపడం ఆనవాయితీ. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షం బలంగా ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుంది. ప్రజా శ్రేయస్సుకు సంబంధించిన బిల్లులను సమర్థిస్తూ, ప్రజా శ్రేయస్సుకు, రాజ్యాంగ లక్ష్యానికి భిన్నంగా ఉండే వాటిని వ్యతిరేకించడం ప్రతిపక్షాల బాధ్యత. చట్టసభలు అంటే అవి ప్రజల ప్రయోజనం కొరకు చట్టాలను రూపొందించాలి. చర్చల ద్వారా ప్రజా వ్యతిరేక చట్టాలను నిరోధించడం విపక్షం బాధ్యత. ఇటీవలి కాలంలో మూజువాణి ఓటుతో చర్చ జరుగకుండానే బిల్లులు చట్టాలుగా మారుతున్నాయి. ఈసారి వర్షాకాల సమావేశాల్లో మొదటి తొమ్మిది రోజులు ఏ అంశం చర్చకు రానే లేదు. ప్రతిపక్షాలు అన్నీ ఉమ్మడిగా ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలు చర్చించి తీరాలని పట్టుబట్టాయి. ప్రభుత్వం మొండికేసిన తీరు గర్హనీయం.

ప్రధానంగా వ్యవసాయ రంగం కుదేలైపోతుంది. రైతులు అప్పుల పాలవుతున్నారు. కార్పొరేట్ అనుకూలంగా ప్రభుత్వం తీసుకొచ్చిన సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు 9 మాసాలుగా ఆందోళన చేస్తున్నారు. పౌరుల గోప్యతపై నిఘా పెరిగింది. ప్రతి వస్తువు ధర పెరిగింది. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రజా నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తోంది. ప్రజానాయకులపై, మేధావులపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధిస్తోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తీరాలన్న మోడీ ప్రభుత్వ నిర్ణయంపైనా, పెగాసస్ స్పైవేర్‌తో ప్రముఖులపై చేసిన నిఘా నికృష్టపు చర్యలపైనా, ఎన్నడూలేని విధంగా రు.100 దాటిన పెట్రోల్, డీజిల్ ధరలు, ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల వస్తువుల ధరలపై చర్చ జరిగి తీరాలన్న ప్రతిపక్షాల డిమాండ్లను పార్లమెంటు సమావేశాల ప్రారంభపు రోజు నుండి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఏ దశలోనూ వీటిపై చర్చకు అనుమతించలేదు. అధికార పక్షం ఒంటెద్దు పోకడల నుండి ప్రజా శ్రేయస్సును కాపాడవల్సిన బాధ్యత విపక్షాలకు ఉంటుంది. వాయిదా తీర్మానాలతో పాటు, వివిధ రూపాల్లో ప్రతిపక్ష సభ్యులు ఈ అంశాలపై చర్చకు ప్రయత్నాలు చేసినప్పటికీ మోడీ సర్కారు మోకాలడ్డింది. దీంతో ప్రతిష్టంభన అనివార్యమైంది. దీనిని అవకాశంగా తీసుకున్న కేంద్రం ఉభయ సభలను వాయిదాల బాట పట్టించింది.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మొదటి వారంలోనే మోడీ ప్రభుత్వ స్వభావం గురించి చాలా విషయాలు వెల్లడయ్యాయి. కొద్ది రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం రెండు అబద్ధాలను నమోదు చేసింది. దేశాన్ని, ప్రపంచాన్ని ఊపేస్తున్న పెగాసస్ స్పైవేర్‌ను భారత్‌లో ఉపయోగించడంపై మీడియాలో వచ్చిన వార్తలను సమాచార సాంకేతిక శాఖ మంత్రి నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతూ ఒక ప్రకటన చేశారు. అనధికారికంగా ఎవరిపైనా ఎలాంటి నిఘా లేదని అన్నారు. విచిత్రమేమిటంటే ఆయనపై కూడ నిఘా ఉందన్న వార్త భగ్గుమంది. ఇజ్రాయిల్ దేశానికి చెందిన నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ(ఎన్ఎస్ఓ) మాత్రం ప్రభుత్వాలు కోరితేనే నిఘా పెడుతున్నామని స్పష్టం చేసింది. ఈ స్పైవేర్ (గూఢచార పరికరం)ను తీవ్రవాదుల ఉనికిని, వ్యూహాలను తెలుసుకోవడం కోసం, ఇతర తీవ్ర నేరాల పరిశోధనలోనూ ఉపయోగపడేందుకు ప్రభుత్వ సంస్థలకు మాత్రమే అమ్ముతామని ఆ సంస్థ స్పష్టంగా ప్రకటించింది. అందుచేత అనుమానపు ముల్లు సహజంగానే కేంద్ర ప్రభుత్వం వైపు చూపుతుంది. అందుకే ప్రతిపక్షాలు పార్లమెంటులో దీనిపై కేంద్రాన్ని నిలదీశాయి. సమగ్ర దర్యాప్తు జరిపించాలని, హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం మాత్రం తనకేమీ తెలీదని, ఇదంతా కట్టుకథ అని బుకాయిస్తోంది.

దేశంలో కొవిడ్ మరణాలకు సంబంధించి రాజ్యసభ సభ్యులొకరు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ ఆరోగ్య శాఖ సహాయ మంత్రి, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆక్సిజన్ కొరత కారణంగా ఎవరూ మరణించలేదంటూ దిగ్భ్రాంతికరమైన రీతిలో ప్రకటించారు. ఈ తప్పుడు ప్రకటన మోడీ ప్రభుత్వ నిరంకుశవాదాన్ని తెలియజేస్తోంది. ప్రభుత్వం వైఖరి పార్లమెంట్ పట్ల, ప్రజల పట్ల ధిక్కారాన్ని తెలియజేస్తోంది. వాస్తవాలను తిరస్కరించడం, అబద్ధాలు చెప్పడం, దబాయించడం ఈ ప్రభుత్వం వైఖరిగా మారిపోయింది. దేశం వ్యాక్సిన్ కొరతను ఎదుర్కొంటున్న సమయంలో ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం చెప్తూ వచ్చింది. పైగా వ్యాక్సిన్ కొరత గురించి ఫిర్యాదు చేసిన రాష్ట్రాలు రాజకీయాలకు పాల్పడుతున్నాయంటూ ఆరోపించింది.

కోవిషీల్డ్, కోవాక్సిన్ తయారీ సంస్థలు ఉత్పత్తి చేసిన వ్యాక్సిన్ల సంఖ్య, టీకా వేసేందుకు అందుబాటులో ఉన్న డోసుల సంఖ్యను పార్లమెంట్‌కు వెల్లడించడంలో ప్రభుత్వం మూడు భిన్నమైన కథనాలు వినిపించింది. వ్యాక్సిన్ ఉత్పత్తి రేటు పెరగలేదన్నది. అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ల సంఖ్యను ప్రభుత్వం ఎక్కువ చేసి చూపింది. కొవిడ్ వల్ల మరణించిన వారి సంఖ్యను తక్కువ చేసి చెప్తోంది. అయితే అధికారిక మృతుల సంఖ్యకు కనీసం పది రెట్లు ఎక్కువగా మరణాలు సంభవించాయని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. కొవిడ్ విపత్తుని ఎదుర్కొనడంలో ఉత్తరప్రదేశ్‌లోని ఆదిత్యనాథ్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రధాని ప్రశంసించడంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది.

వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి కొద్ది రోజుల ముందుగా జూలై 15న వారణాసిలో పలు అధ్యయనాలకు 'సరిపోలని'విగా కొవిడ్ మరణాల సంఖ్యను, వాక్సిన్ అందుబాటును వాస్తవాలకు భిన్నంగా ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లో కరోనా సెకండ్ వేవ్‌ను ఎదుర్కొనడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమవడం. గంగా నదిలో శవాలు తేలుతూ కనిపించడం, వందలాది మృతదేహాలను గంగానది ఒడ్డున ఒకే చోట పూడ్చి పెట్టడం. ఎలాంటి చికిత్సలు అందుబాటులో లేకుండా గ్రామాలకు గ్రామాలు వైరస్ దాడితో విలవిల్లాడిపోతున్నాయని వచ్చిన వార్తలతో నిమిత్తం లేకుండా మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించింది.

పార్లమెంటు స్థంభించిపోవడానికి ప్రతిపక్షాలనే కారణంగా చిత్రీకరించే ప్రయత్నాన్ని అడుగడుగునా మోడీ ప్రభుత్వం చేసింది. అదే సమయంలో ప్రతిపక్షాల రగడే తనకు మేలు అన్నట్లుగా లోక్‌సభలో 20 బిల్లులను, రాజ్యసభలో 19 బిల్లులను చర్చ లేకుండానే ఆమోదింపచేసుకుంది. బిల్లుల ఆమోదానికి అడ్డుకాని నిరసనలు సభ నిర్వహణకు, ప్రజా సమస్యలపై చర్చకు ఎలా అడ్డు అయ్యాయో ప్రభుత్వానికే తెలియాలి. ఒకవైపు విలువైన సమయాన్ని వృథా చేశారని, సంప్రదాయాలను పాటించలేదంటూ ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూనే మరోవైపు నిరసనల మధ్యే ఏమాత్రం చర్చ లేకుండా ఒకదాని తరువాత ఒకటిగా బిల్లులను ఆమోదించుకుంటూ పోవడం పార్లమెంటరీ సంప్రదాయానికి విరుద్ధం, ప్రభుత్వ నిరంకుశ ధోరణికి పరాకాష్ట. ప్రభుత్వ ఏకపక్ష నిరంకుశ ధోరణికి నిరసనగా విపక్షం ఏకతాటిపై నిలిచి ఆగస్టు 12న వాకౌట్ చేసిన తరువాత సభను నిరవధికంగా వాయిదా వేశారు.

ఇవాళ సమస్త రాజ్యాంగ వ్యవస్థలూ తీవ్రమైన దాడికి గురవుతున్న కాలంలో మనమున్నాం. ఇందుకు భారత పార్లమెంటూ మినహాయింపు కాదని అర్థం చేసుకోవాలి. దాదాపు ఇరవైకి పైగా బిల్లులు ఏ చర్చాలేకుండానే, ఆమోదం పొంది చట్టాలుగా మారిపోయాయి. ప్రజాస్వామ్యానికి ఇంతకంటే అనర్థం మరొకటుంటుందా?! చట్టసభల ప్రతిష్ట మసకబారుతున్న తరుణంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సభలో చర్చకు అవకాశం లేని గందరగోళ పరిస్థితులు తలెత్తినప్పుడు బిల్లులను పార్లమెంటరీ సెలక్ట్ కమిటీకి పంపడం ఒక పార్లమెంటరీ సంప్రదాయం. అన్ని పార్టీల ప్రతినిధులతో కూడిన ఆ కమిటీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిపై నివేదిక ఇస్తుంది. దాని ఆధారంగా ఆ బిల్లులను చట్టంగా ఆమోదించవచ్చు. కానీ బిజెపి అధికారంలోకొచ్చాక ఈ పార్లమెంటరీ కమిటీలు కూడా ఉనికిని కోల్పోవడం మరో విషాదం. ఉదాహరణకు గత కాంగ్రెస్ ప్రభుత్వ చివరి ఐదేండ్ల కాలంలో 71 శాతం బిల్లులు పార్లమెంటరీ కమిటీల పరిశీలనకు వెళ్లగా, అదే బిజెపి మొదటి విడత ప్రభుత్వంలో 27 శాతానికి, ప్రస్తుత రెండవ విడతలో 12 శాతానికి పడిపోయింది. దీనిని బట్టి ఏం అర్థమవుతోంది? పార్లమెంటులో చర్చించరు. సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపించరు. ఏ చర్చా లేకుండానే, ఏకపక్షంగా చట్టాలు తయారు చేస్తారు, ఆమోదించుకుంటారు! ఇదేమిటని ప్రశ్నిస్తే సభకు అడ్డుపడుతున్నారని ఎదురు దాడి చేస్తారు. అలాంటప్పుడు ఇక పార్లమెంటు ఎందుకు? దానికోసం ఇంత ప్రహసనం ఎందుకు?

పార్లమెంటు సమావేశాలకు ఒకరోజు ముందు దేశంలోని పలువురు ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ఎన్నికల సంఘం మాజీ కమీషనర్, చివరికి ఇద్దరు కేంద్ర మంత్రులపై కూడా పెగాసస్ స్పైవేర్ సాయంతో నిఘా పెట్టారని మీడియాలో వెల్లడి కావడం సంచలనం సృష్టించింది. యావత్ విపక్షం దీనిపై భగ్గుమన్నది. మోడీ సర్కారు పెట్టిన నిఘా నేరుగా రాజ్యాంగంపై దాడి చేయడంతో పాటు, ఒక రకంగా దేశ భద్రతకూ ప్రమాదకరమైనదే! ఈ అంశం మీద చర్చించాలని ఉభయసభల్లో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. కానీ ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో సభా కార్యకలాపాలను రోజుల తరబడి ప్రతిపక్ష ఎంపిలు అడ్డుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారంటూ వారిపై మోడీ సర్కార్ ఆరోపణలకు దిగింది గానీ పెగాసస్‌పై చర్చకు మాత్రం ముందుకు రాలేదు. పెగాసస్ వ్యవహారం చాలా తీవ్రమైనది. పలుదేశాల్లో ప్రభుత్వాలు దీనిపై దర్యాప్తునకు చర్యలు చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం పెద్దగా స్పందించలేదు. ఆ స్పైవేర్‌ను తయారుచేసే ఇజ్రాయెల్ సంస్థతో ఎటువంటి లావాదేవీలు జరపలేదంటూ ఏ సమాచార శాఖో, విదేశాంగ వ్యవహారాల శాఖో, హోం శాఖో కాకుండా రక్షణ శాఖ సహాయ మంత్రిచే ఒక చిన్న ప్రకటన చేయించి ఊరుకుంది.

పెగాసస్ వివాదంలో ప్రజల ప్రాథమిక హక్కు అయిన గోప్యతకు విఘాతం కలిగినట్టు స్పష్టమవుతున్నది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఇందుకు తలపడడం ఎంత మాత్రం సమంజసం కాదు. అటువంటి ఆరోపణ ఈ స్థాయిలో వచ్చినప్పుడు పాలకులు అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలి. పార్లమెంటులో చర్చకు అనుమతించడంతో పాటు స్వతంత్రమైన దర్యాప్తు సంస్థ చేత లేదా ఉన్నత న్యాయస్థానాల

న్యాయమూర్తుల చేత దానిలోని నిజా నిజాలను శోధింప చేయాలి. అదేమీ చేయకుండా అదంతా అబద్ధం, బూటకం అని కొట్టి పారేయడం ఎంత మాత్రం సమంజసం కాదు. ప్రభుత్వం తన బాధ్యత నుంచి ఈ విధంగా తప్పుకోవడం ప్రజాస్వామ్యయుత జవాబుదారీతనం నుంచి పారిపోవడంగానే పరిగణించవలసి ఉంటుంది.

ప్రతిష్టంభనను అడ్డం పెట్టుకొని సాధారణ భీమా వ్యాపార (జాతీయకరణ) సవరణ వంటి అత్యంత ముఖ్యమైన, జన జీవితంపై విశేషంగా ప్రభావం చూపగల బిల్లులను సభలో ప్రవేశ పెట్టింది. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ప్రభుత్వ వాటాల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తున్న సవరణ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను రాజ్యసభలో ప్రభుత్వం తిరస్కరించి బిల్లును ఆమోదింపజేసుకుంది. ఇంత ముఖ్యమైన బిల్లును చర్చకు పెట్టకుండా ప్రభుత్వం మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదం సాధించుకోవడం ఎంత మాత్రం ప్రజాస్వామ్యయుతం కాదు. మోడీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వీటిపై చర్చను స్వాగతించి ఉండేది. దేశ ప్రజలకు వివరణ ఇచ్చి ఉండేది. కానీ, జరిగింది వేరు. ఏ దశలోనూ చర్చకు సిద్ధపడకపోగా ఏ అంశం ముందుకొచ్చినా 'ఆ ఒక్కటి తప్ప...' అనే ధోరణిని ప్రదర్శించింది. పైగా చట్టసభల్లో అలవోకగా అసత్యాలు చెప్పి దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. మరోవైపు ప్రతిపక్షాలను చీల్చడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోగా ఐక్య కార్యాచరణ పెరుగుతుండడంతో పార్లమెంటు సమావేశాలను అనూహ్యంగా వాయిదా వేసి పలాయనమంత్రం పఠించింది. చట్టసభలను మందబలంతో నడపవచ్చేమో కానీ, ప్రజా క్షేత్రంలో గుణపాఠం నేర్చుకోక తప్పదని మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు.

పార్లమెంటులో గట్టి మెజారిటీ ఉండడం ప్రతిపక్షాన్ని అణగదొక్కడానికి కాదన్న స్పృహ నానాటికీ క్షీణిస్తోంది. అధికార పక్షం కత్తిగట్టినట్టు ప్రవర్తిస్తున్న సందర్భాలు నిత్యకృత్యం అయిపోయింది. ప్రజల గోడు పార్లమెంటు పట్టించుకోలేదు. మరి ఎవరు పట్టించుకోవాలి? దేశ ఆహార భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని రైతాంగం చేపట్టిన ఆందోళన తొమ్మిది నెలలుగా ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంత సుదీర్ఘకాలం, ఇంత తీవ్ర స్థాయిలో రైతుల ఆందోళన కొనసాగడం ఇదే మొదటిసారి. తొమ్మిది నెలల నుండి ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలియజేస్తున్న పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన రోజు నుండి జంతర్‌మంతర్ వద్ద రైతులు సమాంతర పార్లమెంటు నిర్వహించారు. అందులో మరో విశేషం ఏమిటంటే ప్రత్యేకంగా మహిళలు నిర్వహించినవికూడా ఉన్నాయి. ఇది కేవలం నిరసన కాదు. పార్లమెంటు పట్టించుకోనితనాన్ని ప్రజలకు తెలియజెప్పడం.

రాజ్యసభలో చివరి రెండ్రోజులు జరిగిన ఘటనలు (ఒక సభ్యుడు కుర్చీ ఎక్కి రూల్సు బుక్‌ను సభాధ్యక్షునివైపు విసిరివేయడం, కొందరు సభ్యులు రిపోర్ట్స్ బల్లపై ఎక్కడం, మార్షల్స్-మహిళా సభ్యుల మధ్య తోపులాట వగైరా) సభ పవిత్రతను భంగపరచడంగా అభివర్ణిస్తూ చైర్మన్ వెంకయ్య నాయుడు బాధపడ్డారు. అయితే సభా కార్యక్రమాలను భగ్నం చేయడమనే ప్రక్రియను ప్రారంభించింది ఆయన పార్టీ బిజెపియేనని ప్రత్యేకించి గుర్తు చేయనవసరం లేదు. పార్లమెంటు ఉన్నది సమస్యల్ని చర్చించడానికే గానీ, రాజకీయ కొట్లాటకు కాదని ఇప్పుడు ఉప రాష్ట్రపతిగా రాజ్యసభ చైర్మన్ స్థానంలో ఉన్నందున ప్రతిపక్షాలకు ఆయన హితోపదేశాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు మొదటి నుంచి కోరుతున్నది పెగాసస్ నిఘాపై, రైతు ఉద్యమంపై, పెరుగుతున్న నిత్యావసరాల వస్తువుల ధరలపై చర్చించాలనే కదా. ఆ చర్చ కోసమేనన్న వాస్తవాన్ని చూడ నిరాకరించడం దేశ ఉపాధ్యక్షుడు వెంకయ్యనాయుడి చాతుర్యం.

అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా సభా కార్యక్రమాలకు ప్రతిపక్షాల అడ్డంకులపట్ల బాధ వ్యక్తం చేశారు. సభలో నినాదాలు ఇవ్వడాన్ని, ప్లకార్డులు చూపడాన్ని తప్పు పట్టిన స్పీకర్ ఇవి ఉన్నత పార్లమెంటరీ సాంప్రదాయాలకు విరుద్దమన్నారు. సభ గౌరవాన్ని కాపాడాలని ఎంపిలకు హితవు చెప్పారు. అయితే ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ప్రతిపక్షాలు కోరిన అంశాలపై చర్చకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం వల్లనే కదా! సభాధ్యక్షులు ప్రతిపక్షాలకేగాని సభ నడిపేందుకు దోహదం చేయాలని ప్రభుత్వానికి హితవులేవీ చెప్పరా? సమావేశాలను సజావుగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత. తమ వాణిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినప్పుడే ప్రతిపక్షాలు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతాయి. సభా కార్యక్రమాలను అడ్డుకోవడం కూడా వాటిలో ఒకటి.

మోడీ మొదటి సారి పార్లమెంటులోకి ప్రవేశించినప్పుడు ఆ భవన్ మెట్లకు మొక్కడం జనాన్ని ఆకర్షించడానికే తప్ప, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించడానికి కాదని అడుగడుగునా రుజువు అవుతూనే ఉంది. ఏ ప్రజా సమస్యలపైనైనా చర్చకు సిద్ధమేనంటున్న అధికారపక్షం తీరా పెగాసస్ అంశాన్ని చర్చించవలసి వచ్చేటప్పటికి ఆ విషయం తప్ప ఏ అంశాన్ని అయినా చర్చిస్తామంటోంది. పౌరుల మౌలిక హక్కులకు సంబంధించిన వ్యవహారాన్ని చర్చించడానికి పార్లమెంటుకే అవకాశం లేనప్పుడు ఇక దేని మీద చర్చిస్తారు? అధికార పక్షానికి ఉన్న విపరీతమైన మెజారిటీని ఉపయోగించుకుని తమ మాటే చెల్లాలని వాదించడం ఏ లెక్కనా చూసినా పార్లమెంటరీ సంప్రదాయం కాదు. మరోవైపు రాజ్యసభలో ఆడా మగా కలిసి 40 మంది మార్షల్లను వినియోగించడం మునుపెన్నడూ లేనిదే. పురుష ఎంపిలున్న చోట మహిళా మార్షల్లను, మహిళలు ఉన్న చోట పురుష మార్షల్లను నియమించడం కొత్త ఎత్తుగడే. గత ఇరవై ఏళ్ల సభా కార్యకలాపాలను పరిశీలిస్తే ఇంతకన్నా ఎక్కువ కాలం సభా సమయం వృధా అయిన సందర్భాలు 2012, 2013లోనూ ఉన్నాయి. యు.పి.ఎ అధికారంలో ఉన్నప్పుడు 2010లో పార్లమెంటు శీతాకాల సమావేశాలు మొత్తం తుడిచి పెట్టుకు పోవడానికి అప్పటి ప్రతిపక్షమైన బిజెపి పాత్ర లేదంటే ఎలా!

కీలక సమస్యలకు జవాబు చెప్పే సత్తా లేనందువల్లే పాలకపక్షం చర్చకు అంగీకరించడం లేదు. ప్రతిపక్షాలున్నది ప్రభుత్వాన్ని నిలదీయడానికే. ఈ పని వీలైనంత మర్యాద పూర్వకంగా జరగాలన్న విషయాన్ని ఎవరైనా అంగీకరించవలసిందే. కాని సభ సక్రమంగా

ఈశాన్య రాష్ట్రాల జాతుల వైరుధ్యాలు

దేశంలోని జాతుల సమస్యను పాలకులు ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించక దాటవేయడం వల్లే సమస్యలు వస్తున్నాయని, ప్రజల భాగస్వామ్యంతో వాటిని పరిష్కరించుకోవాలని అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాలంటే మనకు తక్షణం స్ఫురించేది జాతుల సమస్య. మిలిటెంట్ పోరాటాలకు కాణాచి ఈశాన్య భారతం. కానీ, కాలక్రమేణా జాతుల సమస్యతో సతమతమవుతున్న వారందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించకుండానే సమస్యను పక్కదోవ పట్టించారు. జాతుల సమస్య దేశ ఎజెండాలోనే లేకుండా, దాని ఊసే ఎత్తకుండా ప్రభుత్వాలు జాగ్రత్త పడుతూ కాలం గడిపేయాలని చూస్తున్నాయి గాని, ఎప్పుడో ఒకప్పుడు జాతుల సమస్య భీకరంగా మరో వికృత రూపం దాల్చి వ్యవస్థను కుదిపెయ్యక మానదు.

ఈ మధ్యకాలంలో రెండు ఈశాన్య రాష్ట్రాల మధ్య భీకర పోరు జరిగింది. ఒకే దేశంలోని రెండు రాష్ట్రాలు అస్సాం, మిజోరాం. ఈ రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం. సరిహద్దు వివాదం విషయంలో భారత్, పాకిస్తాన్ దేశాలు, భారత్ చైనాల మధ్య సాయుధ పోరులో ఇరు వైపులా మరణాలు, సైనికులు క్షతగాత్రులవడం చూశాం. కానీ విచిత్రంగా ఈ సంవత్సరం (2021) జూలై 26న భారతదేశంలోని రెండు ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం – మిజోరాం మధ్య సరిహద్దు వివాదం చిలికి చిలికి గాలి వానై రెండు రాష్ట్రాలకు చెందిన భద్రతా దళాలు కాల్పులు జరుపుకొని అస్సాం పోలీసులు ఆరుగురు, ఒక పౌరుడు మృతి చెందారు. అస్సాంకు చెందిన ఒక జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌తో సహా 60 మంది సాధారణ పౌరులు తీవ్రంగా గాయపడ్డారు. ఆ కాల్పులకు కారణం మీరంటే మీరని ఇద్దరు ముఖ్యమంత్రులు పరస్పరం అచ్చం భారత్ – పాకిస్తాన్ దేశాల రక్షణ శాఖా మంత్రుల లాగా విమర్శించుకున్నారు.

గమనించవలసిన విషయమేమిటంటే, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజ్యమేలుతున్నది. అస్సాంలో బిజెపి ప్రభుత్వమే కొలువు తీరి ఉంది. మిజోరాంలో బిజెపి మిత్ర పక్షం మిజో నేషనల్ ఫ్రంట్ అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రాలన్నీ కూడా బిజెపి లేదా దాని మిత్రపక్షంతో కూడిన ఎన్‌డిఏ పాలనలోనే ఉన్నాయి. ఆ రాష్ట్రాలన్నీ వాటి అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలని సంకల్పం చెప్పుకొని అందరు ముఖ్యమంత్రులతో 'నెడా' (నార్త్ ఈస్ట్ డెమోక్రటిక్ అలయన్స్) అన్న సంఘటనను ఏర్పాటు చేసుకొన్నారు. దాని సంధాన కర్త అస్సాం ముఖ్యమంత్రి బిజెపి నేత హిమంత బిశ్వ శర్మ. అంతా ఒక గూటి పక్షులే. ఒక తాను గుడ్డలే. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇద్దరు ముఖ్యమంత్రులను పిలిచి అడపా దడపా మాట్లాడుతూనే ఉన్నాడు. జూలై చివరి వారంలో జరిగిన కాల్పుల సంఘటన అమిత్ షాతో భేటీ ముగిసిన రెండు రోజులకే జరిగింది. 'కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముందు మౌనంగా తలూపి, సామరస్యంగా ఉంటామని ఒప్పుకొని తిరిగి వచ్చిన అస్సాం ముఖ్యమంత్రి రెండు కంపెనీల పోలీసులను, వారితో పాటు కొంతమంది పౌరులను మా

కొనసాగడానికి అనువైన వాతావరణం ఉండేట్టు చూడడం అధికారపక్షం బాధ్యతే. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నదే అందుకు. సభా వ్యవహారాల కమిటీ ఉద్దేశం కూడా చర్చనీయాంశాలను ఖరారు చేయడంతో పాటు పార్లమెంటు నిర్వహణకు దోహదం చేయడమే. కానీ ఈ సంప్రదాయాలను పాటించే లక్షణం మోడీ సర్కారుకు ఏ కోశానా లేదు. ఏడేళ్లుగా రుజువైంది ఇదే. కాంగ్రెస్ హయాంలో పెట్రోల్ ధర స్వల్పంగా పెంచినప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి పార్లమెంటుకు ఎడ్లబండి మీద వచ్చి నిరసన తెలియజేశారు. మొన్నీమధ్య రాహుల్ గాంధీ ట్రాక్టర్ మీద వచ్చారు. ఆయనతో పాటు ప్రతిపక్ష నాయకులు సైకిళ్ల మీద వచ్చారు. ఇవన్నీ ప్రతీకాత్మకమైన నిరసనలే.

ప్రతిపక్షం సభలో ప్రజా సమస్యలపై చర్చించాలని కోరుతున్న దశలో ప్రభుత్వం మంద బలంతో వ్యవహరించడం, ప్రజా సమస్యలు, విపక్షాల అభిప్రాయాలు ఆలకించని ప్రభుత్వం నిరంకుశమైందిగానే భావించాలి. కొవిడ్–19 మహమ్మారి రెండో దశలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందన్న అభిప్రాయం మెజారిటీ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. మూడో దశ మహమ్మారి పొంచి ఉందని ప్రజలను హెచ్చరించిన మోడీ కనీసం కోట్లాది ప్రజల జీవన్మరణ సమస్యను సైతం సభలో చర్చించకపోవడం దారుణం. ప్రతిపక్షాలు చర్చకు డిమాండు చేస్తున్న సమస్యలు అత్యంత తీవ్రమైనవి. అయినా చర్చించడానికి మోడీ సుముఖత వ్యక్తం చేయలేదు. 300 మంది సభ్యులు తమ వైపు ఉన్నందున ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరన్న ప్రజా ధిక్కార ఆలోచన గల మోడీ పాలన తీరుతెన్నులను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు. పార్లమెంటు సమావేశాలు చక్కగా నిర్వహించడానికి ప్రభుత్వమే ప్రధాన పాత్ర వహించవలసి ఉంటుంది. ప్రతిపక్షాలపై ఆరోపణలు చేసి నిందలు వేసినంత మాత్రాన తమ బాధ్యత తీరిపోదు. పార్లమెంటు ఉభయ సభలు జరిగిన తీరు ప్రజాస్వామ్య లౌకిక వాదులకు తీవ్ర ఆవేదన, వ్యవస్థ పట్ల అవిశ్వాసం పెరిగింది. ఇది వ్యవస్థ మనుగడకు ప్రమాదకరం. పెగాసస్ అంతర్జాతీయ కుట్రగా ప్రచారం చేసినా, దేశంలో దీన్ని ఎవరు కొనుగోలు చేశారన్న సత్యం సుప్రీంకోర్టు విచారణలోనైనా నిగ్గు తేల్చాలని ప్రజలు కోరు కుంటున్నారు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

భూభాగంలోవున్న వేరెంగటి అన్న గ్రామం పైకి పంపి లాఠీ చార్జి, బాష్పవాయు ప్రయోగం చేసి కాల్పులు కూడా జరిపార'ని మిజోరాం ముఖ్యమంత్రి ప్రకటన చేస్తే, అస్సాం పోలీసులు వెంటనే వెనక్కి వెళ్లిపోవాలని, లేకుంటే మా ప్రజలు శాంతించరని, హింస ఆగదని కోలాసిబ్ (మిజోరాంలోని ఒక సరిహద్దు ప్రాంతం) జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మాకు వర్తమానం పంపాడని, ఇదేమి పరిపాలన పోలీసు సూపరింటెండెంట్‌లు కూడా మాకు తాఖీదులు పంపిస్తూ ఉంటే మేమెట్లా పరిపాలించేది అని అస్సాం ముఖ్యమంత్రి ఎదురు ప్రకటన చేశాడు. దాడి జరిగిన రోజు కొంతమంది 'గుర్తు తెలియని' వ్యక్తులు మిజోరాం సరిహద్దు గ్రామంలో ఒక గ్రామస్తునిపై జులుం చేస్తే, దానికి ప్రతీకారంగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు మిజోరాం భద్రతా సిబ్బందితో కలిసి సరిహద్దు వద్ద ఉన్న అస్సాం పోలీసులపై కాల్పులు జరిపారు. తుపాకులు, చేతి బాంబులు, బాష్పవాయువు యథేచ్ఛగా ప్రయోగించారు.

ఆ మరునాడే అస్సాం ముఖ్యమంత్రి 4,000 మంది పోలీసు కమెండోలను మిజోరాం – అస్సాం సరిహద్దుల గుండా మోహరించి మిజోరాంకు ప్రయాణాలు మానుకోవాలని తమ ప్రజలను హెచ్చరించాడు. అటు వైపు నుండి మిజోరాం పోలీసులు అస్సాం ముఖ్యమంత్రిపై 'హత్యా యత్నం' నేరం మోపుతూ కేసు నమోదు చేశారు. ఆ కేసులో నలుగురు పోలీస్ ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. అస్సాం వాళ్లూ ఊరుకోలేదు. మిజో రాష్ట్రానికి చెందిన ఒక పార్లమెంట్ సభ్యుని మీద, ఆరుగురు పోలీసు అధికారుల మీదా అస్సాం ప్రజలలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. అస్సాం దక్షిణ ప్రాంతంలోని బారక్ వ్యాలీలో స్థానికులు మిజోరాం వైపు వెళ్లే దారులను నిరవధికంగా దిగ్బంధం చేస్తున్నామని ప్రకటించి కొవిడ్ నిర్ధారణ కిట్స్‌తో సహా అన్ని నిత్యావసర వస్తువుల సరఫరా అడ్డుకున్నారు. మిజోరాంలోని ముఖ్యమైన వ్యాపార కేంద్రంకు ఉన్న ఒకే ఒక్క రైల్వే లైన్‌ను అసోంలోని ఆందోళనకారులు ధ్వంసం చేశారు. 'రోడ్డు దిగ్బంధం, రైల్వే లైన్ ధ్వంసం కావడం కారణంగా రాబోయే కొద్ది రోజులు నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడవచ్చు. కాబట్టి వినియోగాన్ని కొంత తగ్గించి, పొదుపుగా వాడుకునేలా జాగ్రత్తలు తీసుకుంటే మన దగ్గర ఉన్న వస్తువులు ఎక్కువ రోజులు మనం వినియోగించుకోవచ్చు. అందుచేత ప్రజలు అన్ని వస్తువులు పరిమితంగా వాడుకోవాల'ని మిజోరాం ప్రభుత్వం తమ ప్రజలకు విజ్ఞప్తి చేసేదాకా సమస్య సాగదీయబడింది. తదనంతర పరిణామాలలో ఇరు ప్రభుత్వాల ప్రతినిధులు ప్రాథమికంగా చర్చలు జరిపి పోలీసు కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలని నిర్ణయించారు. అలాగే శాశ్వత పరిష్కారం లభించేంత వరకు వివాదాస్పదంగా ఉన్న సరిహద్దు రేఖల నుండి నాలుగు కిలోమీటర్ల దూరం వరకు పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలని కూడా ఓ అంగీకారానికి వచ్చారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య గొడవలా లేదు, రెండు శత్రు దేశాల మధ్య ఘర్షణలా ఉంది.

దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా నీటి పంపకం విషయంలో, సరిహద్దుల విషయంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. కానీ, ఈశాన్య రాష్ట్రాల సమస్యల లాగా అవి సాయుధ ఘర్షణల రూపం తీసుకోలేదు. ఉదాహరణకు, ప్రస్తుతం తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రగులుతున్న కృష్ణ నదీజలాల పంపకం సమస్య. అలాగే, 1956 రాష్ట్రాల పునర్విభజన చట్టం రూపొందినప్పటి నుండి కర్ణాటక – మహారాష్ట్రల మధ్య నానుతూ ఉన్న సరిహద్దు సమస్య, కర్ణాటక – చెన్నైల మధ్య పలుమార్లు పతాక శీర్షికలలో నిలిచిన కావేరీ నదీజలాల సమస్య, ఇంకా తమిళనాడు – కేరళల మధ్య అప్పుడప్పుడూ తలెత్తే నదీజలాల పంపకం సమస్య. వీటన్నింటికీ ఈశాన్య రాష్ట్రాల సరిహద్దు వివాదానికి మౌలికమైన వైవిధ్యం ఏదైనా ఉందా అని ఆలోచిస్తే అపరిష్కృతంగా మిగిలిపోయిన జాతుల సమస్య నేపథ్యం గుర్తుకు వస్తుంది. వివిధ జాతుల ఉనికి, మైనారిటీ జాతుల మీద మెజారిటీ మతం ఆధిపత్యం, ఆయా జాతులకుండే పోరాట నేపథ్యం తప్పకుండా స్ఫురిస్తుంది.

ఈశాన్య రాష్ట్రాలను ఏడుగురు అక్క చెల్లెళ్లు అని పిలవడం ఆనవాయితీ. ఆ తర్వాత సిక్కింను కూడా కలిపి ఏడుగురు అక్క చెల్లెళ్లు, ఒక తమ్ముడు అని కూడా కొంతమంది రచయితలు పేర్కొన్నారు. ఏమైనా ఈశాన్య రాష్ట్రాలు ఇవి: అరుణాచల్‌ప్రదేశ్, అస్సామ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, సిక్కిం. హిమాలయ పర్వత శ్రేణుల ప్రాంతం, బ్రహ్మపుత్ర నదిలో విలీనం అయ్యే పలు ఉపనదులు, ఖనిజ నిక్షేపాలతో కూడిన కొండలు, గుట్టలు, అడవులు కోకొల్లలుగా ఉన్న ప్రాంతం. తేయాకు, రబ్బరు తోటలు విలసిల్లే ప్రాంతం. దేశంలో కెల్లా అత్యధిక వర్షపాతం కలిగిన ప్రాంతం. మేఘాలయ రాష్ట్రంలో నెలకొని ఉన్న చిరాపుంజి ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రదేశం.

ఈశాన్య రాష్ట్రాలలో 220కి పైగా వివిధ జాతులు, ఇదే సంఖ్యలో మాండలికాలు ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ లాంటి కొండ ప్రాంతాలు అధికంగా గల రాష్ట్రాలలో ఆదివాసీ తెగలు, లెక్కకు మిక్కిలి ఉపతెగలు తమతమ సంస్కృతులతో, జీవన విధానాలతో జీవిస్తూ ఉంటాయి. పురాతన కాలం నుండి ఉనికిలో ఉన్న తెగలతో పాటు టిబెట్ నుండి, హిమాలయ పర్వత సానువుల నుండి, గంగానదీ పరీవాహక ప్రాంతాల నుండి, బంగ్లాదేశ్ నుండి పొట్ట చేతబట్టుకొని నిరంతరం వలస వచ్చే ఆదివాసీ తెగల ప్రజలు, బౌద్ధులు, ముస్లింలకు ఈశాన్య రాష్ట్రాలు ఆవాసం కల్పిస్తూ ఉంటాయి. ఆ రాష్ట్రాలలో హిందువుల, క్రిష్టియన్‌ల జనాభా కూడా గణనీయంగానే ఉంటుంది.

ఈశాన్య రాష్ట్రాల సరిహద్దు తగాదాలకు ఒక శతాబ్దంన్నర (150 సంవత్సరాల) నేపథ్యం ఉంది. దీని మూలాలు బ్రిటిష్ వలస పాలనలో ఉన్నాయి. 1875లో ఒకసారి, 1933లో మరొకసారి వలస ప్రభుత్వం ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి సరిహద్దులను నిర్ణయించింది. ఆ సరిహద్దుల నిర్ణయం సామ్రాజ్యవాదుల దోపిడీ అవసరాల రీత్యా వారి పరిపాలనా సౌలభ్యం కోసం జరిగినది కాని ప్రజల జాతుల, భాషల, వారి అస్తిత్వాలను పరిగణనలోకి తీసుకొని చేసినది కాదు. 150 ఏళ్ల క్రితమో, 80 ఏళ్ల క్రితమో జరిగిన సరిహద్దు పంపకాలు తు.చ. తప్పకుండా ఇప్పటికీ పాటించాలా? ఈనాటి ప్రజల అవసరాలు,

జాతుల, తెగల అస్తిత్వాలు, ఆకాంక్షలు దృష్టిలో ఉంచుకొని సరిహద్దు వివాదాలను పరిష్కరించు కోవాలన్నది ఈశాన్య ప్రాంత ప్రజల వాదన.

ఆ కాలంలో ఈశాన్య ప్రాంతంగా అస్సాం, అప్పటి సంస్థానాలైన మణిపూర్, త్రిపురలు ఉండేవి. 1947లో దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత అస్సాంను విభజించి నాగాలాండ్, మిజోరాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. మిజోరాంకు 1987లో ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి సిద్ధించింది. అస్సాం - మిజోరాం రాష్ట్రాల మధ్య 165 కిలోమీటర్ల సరిహద్దు, అస్సాం - నాగాలాండ్‌ల మధ్య 500 కిలోమీటర్ల సరిహద్దు, అస్సాం - అరుణాచల్ ప్రదేశ్ మధ్య 800 కిలోమీటర్ల సరిహద్దు, అస్సాం - మేఘాలయల మధ్య 884 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. ఈ రాష్ట్రాల మధ్య సరిహద్దు తగాదాలు తీవ్ర స్థాయిలోనే ఉన్నాయి. ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నాయో అస్సాం- మిజోరాం మధ్య సాయుధ సంఘర్షణ, ఆ ఘర్షణలో ప్రాణనష్టం, పలువురు గాయాల పాలు కావడమే తార్కాణం. ఈ సరిహద్దు తగాదాల నేపథ్యంలో బిజెపికి ఆ ప్రాంతంలో ముఖ్య నాయకుడు అస్సాం ముఖ్యమంత్రి అయిన హిమంత బిశ్వ శర్మ ఈశాన్య రాష్ట్రాలలో తన ప్రాబల్యం ప్రదర్శించడానికి, తన ఆధిపత్యం నిలుపుకోవడానికి పక్కా వ్యూహంతో దుందుడుకు చర్యలకు పాల్పడి అస్సాం-మిజోరాం మధ్య సాయుధ ఘర్షణకు కారకుడయ్యాడని కొన్ని పత్రికలు విశ్లేషించాయి.

ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆగ్రహ ఆవేశాలు నివురుగప్పిన నిప్పులా దాగి ఉన్నాయని ఇటీవల మేఘాలయ రాష్ట్రంలో జరిగిన సంఘటన రుజువు పరుస్తుంది. మాజీ మిలిటెంట్ చెస్టర్ ఫీల్డ్ థాన్ గ్యును ఆగస్టు 13 నాడు ఉదయం మేఘాలయ పోలీసులు సోదా నెపంతో ఆయన ఇంటికి వెళ్లి ఆయన్ను కాల్చి చంపారు. చెస్టర్ ఫీల్డ్ థాన్ గ్యు గతంలో హైన్యూట్రిప్ నేషనల్ కౌన్సిల్ అన్న సంస్థను స్థాపించాడు. స్థాపించిన కొద్దికాలం తర్వాత ప్రభుత్వం ఆ సంస్థను నిషేధానికి గురి చేసింది. చెస్టర్ ఫీల్డ్ తాను సాయుధ పోరాట పంథా నుండి తప్పుకుంటున్నానని కూడా ప్రకటించాడు. కొంతకాలం క్రితం జరిగిన బాంబు పేలుళ్లకు ఆయన కారకుడని అనుమానంతో ఆయన ఇంటిని సోదా చేయడానికి వచ్చిన పోలీసు బృందం జరిపిన కాల్పులలో చెస్టర్ ఫీల్డ్ ప్రాణాలు కోల్పోయాడు. దాంతో షిల్లాంగ్ నగరమంతా అట్టుడికిపోయింది. అతలాకుతలమైన నగరంలో మామూలు స్థితిని నెలకొల్పడానికి కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. కనీసం నాలుగు జిల్లాలలో ఇంటర్నెట్‌ను సస్పెండ్ చేశారు. రాష్ట్ర హోం మంత్రి రాజీనామా చేశాడు. ఎన్‌కౌంటర్ మృతిపై ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. రాజీనామా చేస్తూ హోం మంత్రి కూడా న్యాయ విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరాడు.

ఈశాన్య రాష్ట్రాల ప్రజలలో ప్రవహించే చైతన్య ప్రవంతిలో ఓ ప్రత్యేకత ఉంది. నాగాలాండ్ రాష్ట్రంలో ఇప్పుడు ప్రతిపక్షం లేదు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలోనే అరుదుగా సంభవించే సంఘటన. నాగాలాండ్ అసెంబ్లీలో 60 సీట్లు ఉన్నాయి. ఒక ఎంఎల్ఏ మృతి వల్ల ఒక సీటు ఖాళీగా ఉంది. నేషనలిస్ట్ డెమోక్రటిక్ పార్టీ, బిజెపి, ఇద్దరు స్వతంత్ర ఎంఎల్ఏలు కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. నాగా పీపుల్స్ ఫ్రంట్ 25 అసెంబ్లీ స్థానాలలో గెలిచి ప్రధాన ప్రతిపక్ష స్థానంలో కూచుంది. అయినా నాగాలాండ్ ప్రత్యేకతను నిలుపుకొంటూ నాగా పీపుల్స్ ఫ్రంట్ కూడా ప్రభుత్వంలో పాలుపంచుకొనేందుకు ముందుకు వచ్చింది. దీంతో నాగాలాండ్‌లో ప్రతిపక్షం లేకుండా పోయింది. ఇప్పుడు నాగాలాండ్ అసెంబ్లీకి ఎన్నికైన 59 మంది శాసన సభ్యులు పాలకపక్షమే. అన్ని పార్టీలు కలిసి నాగాలాండ్ యునైటెడ్ గవర్నమెంట్ పేరుతో ప్రభుత్వం నడుపుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియను సూక్ష్మంగా విశ్లేషించే పరిశీలకులను అబ్బురపరిచే పరిణామం ఇది.

వాణిజ్య వ్యాపారాలకు ఈశాన్య రాష్ట్రాలు బంగారు గని లాంటివి. చమురు, తేయాకు, కలపలకు సమృద్ధిగా వనరులు ఉన్న ప్రాంతం. వాటి మీద నియంత్రణ కోసం చేసే ప్రయత్నాలు ఘర్షణకు దారితీస్తాయి. సరిహద్దు రేఖలు సమృద్ధిగా ఉన్న వనరులపై నియంత్రణ కోసం ఏర్పాటు చేసుకున్నవే గాని జాతి, సంస్కృతి, భాషల, మాండలికాల, ప్రజల మనోభావాల ప్రాతిపదికన ఏర్పాటైనవి కావు. బంగ్లాదేశ్, భూటాన్, మయన్‌మార్, నేపాల్, చైనా దేశాలు ఈశాన్య రాష్ట్రాలతో సరిహద్దులు పంచుకుంటాయి. ఈ కారణాన ఈశాన్య రాష్ట్రాలు భారతదేశ ప్రయోజనాల రీత్యా చాలా వ్యూహాత్మక పాత్ర వహిస్తాయి. ఈశాన్య రాష్ట్రాలకు సమీపంలోనే ఉన్న పొరుగు దేశం మయన్‌మార్‌లో ఈ సంవత్సరం (2021) ఫిబ్రవరిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని హింసాత్మకమైన ఘాతుక చర్య ద్వారా సైనిక శక్తులు కూలదోసి మిలిటరీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ తదుపరి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్న నినాదంతో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న ఉద్యమకారులపై జరిపిన దమనకాండలో దాదాపు 1,000 పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. గత సంవత్సరం నుండి కూడా ఆ దేశంలో పరిస్థితులు గందరగోళంగానే ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల ప్రజల మీద సైనిక తిరుగుబాటు, ఆ దేశంలో జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమాల ప్రభావం ఉండే అవకాశం ఎంతైనా ఉంది.

ఈ ఏడు దశాబ్దాలుగా ఈ రాష్ట్రాల సరిహద్దు సమస్య ముదిరిపోయి అపరిష్కృతంగా మిగిలిపోయి ఉంది. విభిన్న జాతుల, విభిన్న మతాల, వివిధ భాషల, భిన్న సంస్కృతుల విచిత్రమైన కూడలి ఈశాన్య రాష్ట్రాలు. జాతుల అస్తిత్వాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోకుండా, ఆయా జాతుల సంస్కృతులను గౌరవించకుండా వ్యవహరిస్తే సరిహద్దుల సమస్య కూడా అపరిష్కృతంగానే మిగిలిపోతుందన్నది సరి అయిన ఆలోచన. సమస్యకు నిజమైన పరిష్కారం లభించాలంటే సరిహద్దు ప్రాంతాలలో నివసించే ప్రజల మనోభావాలు, ఉపాధి అవకాశాలు ముఖ్యంగా దృష్టిలో ఉంచుకోవాలి. కోర్టు తీర్పుల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. నాగాలాండ్, అస్సాంల మధ్య, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌ల మధ్య ఉన్న వివాదాలు సుప్రీం కోర్టులో ఉన్నాయి. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ మధ్య ఉన్న వివాదం గురించి 1989లో సుప్రీం కోర్టులో వ్యాజ్యం దాఖలు చేస్తే అది ఇంకా విచారణ దశలోనే ఉండడం గమనార్హం. ఇటీవల అస్సాం, మిజోరాం మధ్య జరిగిన సాయుధ ఘర్షణ నేపథ్యంలో సరిహద్దు సమస్య పరిష్కారానికి సుప్రీంకోర్టు తలుపు తడతానంటున్నాడు అస్సాం ముఖ్యమంత్రి. అలా

30 ఏళ్ల ఆర్థిక సంస్కరణల తీరుతెన్నులు

భారతదేశంలో అభివృద్ధి పేరుతో అమలు చేసిన సంస్కరణల వల్ల సామాన్య ప్రజల జీవన ప్రమాణాల్లో ఆశించిన మార్పు రాకపోగా అవి కొద్ది మంది వృద్ధికే ఉపయోగపడ్డాయని అంటున్నారు **డా. ఎ. పున్నయ్య**

సామ్రాజ్యవాద బ్రిటిష్ పాలనాధికార బదిలీ అనంతరం భారత జాతీయోద్యమ ఆకాంక్షల మేరకు ఉత్పత్తి సంబంధాలలో మౌలికమైన మార్పు కొరకు కనీస ప్రయత్నం జరగలేదు. ప్రభుత్వం అనుసరించిన స్వామ్యవాద ఆర్థిక, పారిశ్రామిక తీర్మానాలు 'రూపంలో' మిశ్రమ ఆర్థిక విధానాలుగా కనిపించినప్పటికీ 'సారంలో' మాత్రం పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనాగానే బలపడ్డాయి. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పేరుతో రెండు శతాబ్దాలకు పైగా ఒక్క బ్రిటన్‌కు వలసగా ఉండిన భారతదేశం 1947 తర్వాత అర్ధవలసగా మారి అన్ని సామ్రాజ్యవాద దేశాలకు, దేశీయ బడా బుర్జువా, బడా భూస్వామ్య అనుకూల పెట్టుబడిదారీ విధానాలను ఆహ్వానించింది. సాధారణంగా అధికార బదిలీ అనంతరం సామ్రాజ్యవాద పెట్టుబడిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని జాతీయం చేయాలి. కానీ మిశ్రమ ఆర్థిక విధానాల కొనసాగింపు ముసుగులో గతంలోని విదేశీ పెట్టుబడులను చట్టబద్ధం చేయడంతో పాటు తిరిగి విదేశీ పెట్టుబడులకు ఎర్ర తివాచీతో సామ్రాజ్యవాద దోపిడీ విధానానికి బాటలు వేసింది. విదేశీ పెట్టుబడి ప్రజాస్వామ్య, నైతిక విలువలను హరించడంతో పాటు ప్రభుత్వ రంగానికి దేశ సమగ్రాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగించింది. కానీ భారత ప్రభుత్వం పెట్టుబడిదారుల కొరకు అవస్థాపన మౌలిక వసతులైన భారీ యంత్రాలు, విద్యుత్, నౌకా నిర్మాణం, చమురు, గనుల తవ్వకం, చమురు శుద్ధిచేయడం మొదలైనవన్నీ ప్రభుత్వ రంగంలో కొనసాగించారు. ఈ విధానంలో 1951-52లో 29 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన 5 ప్రభుత్వ రంగ సంస్థలు 1991-92 నాటికీ 118 వేల కోట్ల పెట్టుబడితో 237 ప్రభుత్వ రంగ సంస్థలుగా విస్తరించినాయి. ఈ సంస్థలన్నీ ప్రైవేట్ రంగ సంస్థలకు ఉద్దీపనలుగా పనిచేశాయి. దీనితో ప్రైవేట్ పెట్టుబడిదారులు వినియోగ సరుకుల ఉత్పత్తి, పంపిణీ ద్వారా వచ్చిన లాభాలతో ఆస్తులు పెంచుకున్నారు.

నూతన ఆర్థిక సంస్కరణలు:

అంతర్జాతీయంగా వచ్చిన అనేక ఒత్తిళ్ల వలన 1966లో మొదటి సారి సరళీకరణకు ప్రయత్నం జరిగింది. ఇక 1981లో అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అప్పు కోసం వ్యవస్థాత్మక సంస్కరణలు అమలు చేయడానికి ఇందిరా గాంధీ ప్రభుత్వం అంగీకరించిన నాటి నుంచి ఆ తర్వాత 1985లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం దిగుమతుల సరళీకరణ విధానం ప్రకటించినప్పటికీ 1991 వరకు భారత ఆర్థిక వ్యవస్థ స్థూలంగా ప్రభుత్వ నియంత్రణలో ఉంటూ దేశీయ ప్రైవేట్ రంగ సంస్థల వ్యాప్తికి దోహదం చేసింది. 1990-91 నాటికీ ఒకవైపు పాలకులు అవలంబించిన ద్వంద్వ ఆర్థిక విధానాలతో పాటుగా పర్యవేక్షణ లోపం వలన ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉత్పత్తి గణనీయంగా క్షీణించి మెజారిటీ పరిశ్రమలు ఖాయిలా స్థితికి చేరుకున్నాయి. ప్రైవేట్ ఉత్పత్తి రంగంపై పెరిగిన విపరీత నియంత్రణ ఫలితంగా అనేక పరిశ్రమలు నష్టాల బారిన పడ్డాయి. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం గణనీయంగా పెరిగి రెండంకెలకు చేరింది. ద్రవ్య లోటుతో పాటు అంతర్గత రుణాలు, ప్రణాళికేతర వ్యయం, వడ్డీ చెల్లింపులు భారీగా పెరిగినాయి. మరొక వైపు ప్రపంచ వ్యాప్తంగా నూతన ఆర్థిక విధానాలు మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థల సంస్కరణలు బయలు దేరాయి. ఈ సంస్కరణలకు కొన్ని దేశాలు ఆకర్షించబడిన వృద్ధిరేటు అంతంత మాత్రంగానే కన్పిస్తున్న భారతదేశ భౌగోళిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను లోతుగా అంచనా వేయకుండా ఆనాటి సంకీర్ణ ప్రభుత్వాలు అనివార్యంగా ఆర్థిక సంస్కరణల సరళీకరణను సమర్థించాయి.

భారతదేశ సరళీకృత విధానాలు - అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ:

నిజానికి నాలుగు దశాబ్దాల పరిపాలనలో వచ్చిన అనేక అపసవ్య విధానాల ఫలితంగా విదేశీ మారక ద్రవ్య నిల్వలు రోజు రోజుకూ తగ్గిపోయినాయి. డాలర్‌తో రూపాయి అనధికార మారకపు రేటు అంతకంతకూ పెరిగిపోయింది. ఎగుమతిదారులు, దిగుమతిదారులు భయాందోళనలతో స్తంభించిపోవడంతో ఆర్థిక వ్యవస్థలో అంధకారం అలుముకుంది. విదేశీ మారక నిల్వలు తరుగుదల రూపంలో

కాకుండా, ప్రజల భాగస్వామ్యంతో సమస్యను పరిష్కరించుకొనే ఆలోచన చేస్తే సత్ ఫలితం వచ్చే అవకాశం మెండుగా ఉంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం ఈశాన్య రాష్ట్రాల విద్యార్థి సంఘం (నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) ఏర్పడింది. దానిలో ఈశాన్య ప్రాంతానికి చెందిన అన్ని రాష్ట్రాల విద్యార్థి ప్రతినిధులు ఉన్నారు. ఆ కాలంలో అస్సాం, మిజోరాం మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి జరిగిన చర్చలలో పాల్గొనమని ఆ సంఘానికి ఆహ్వానం అందింది. ఆ సంఘ ప్రతినిధులు ఆ చర్చల్లో పాల్గొన్నారు. కొన్ని సంవత్సరాలు ఆ రెండు రాష్ట్రాలు సరిహద్దు వివాదాలేమీ లేకుండా సామరస్యంగా మసులు కోవడానికి ఆ చర్చలు దోహదపడ్డాయి. ఆ రకంగా ప్రజల భాగస్వామ్యంతో జరిగే కార్యక్రమాలు ప్రజలలో ఆత్మవిశ్వాసం పెంచుతాయి, ప్రజల మధ్య సంబంధాలు పెరుగుతాయి. చాలా సమస్యలు పరిష్కారమవుతాయి.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

1985లోనే ఆర్థిక సంక్షోభం మొదలై, 1991 నాటికీ దారుణ స్థితికి చేరింది. దిగుమతులకు చెల్లించడానికి అంతర్జాతీయ ద్రవ్య నిల్వలు లేవు. అంతర్జాతీయ చెల్లింపుల సంక్షోభం వలన భారతదేశం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థతో విమోచన ఒప్పందం చేసుకుంది. ఒప్పందంలో భాగంగా స్మగ్లర్ల నుండి జప్తు చేసిన బంగారాన్ని కేంద్ర ప్రభుత్వం స్విట్జర్లాండ్‌లోని ఒక బ్యాంకులో తనఖా పెట్టింది. బంగారం తనఖా పెట్టడం వల్ల వచ్చిన మొత్తం కేవలం 400 మిలియన్ డాలర్లు మాత్రమే. దీనితో భారత ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం కలగలేదు.

ఆర్థిక సంక్షోభం పెరుగుతూనే ఉంది. అటువంటి సంక్లిష్ట పరిస్థితిలోనే గల్ఫ్ యుద్ధం ప్రారంభమైంది. ఇది భారతదేశానికి రెండు రకాల సమస్యలను తెచ్చిపెట్టింది. మొదటిది దౌత్యపరంగా ఇరాక్, అమెరికాలలో ఎవరికి మద్దతివ్వాలో నిర్ణయించుకోవాల్సి రావడం. రెండవది యుద్ధం కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరలను అదుపు చేయడం. యుద్ధానికి ముందు భారతదేశం ప్రతి నెలా చమురు దిగుమతుల కోసం రు. 500 కోట్లు ఖర్చు చేసేది. యుద్ధం ప్రారంభమైన తరువాత ఆ ఖర్చు నెలకు రు. 1,200 కోట్లకు చేరింది. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ఆనాటి ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థని సంప్రదించవలసి వచ్చింది. గల్ఫ్ యుద్ధంలో పాల్గొనే విమానాలకు ఇంధనం నింపడానికి భారత విమానాశ్రయాలను ఉపయోగించడానికి అమెరికాకు అనుమతి అవసరం. ఒప్పందం కుదిరిన మరుసటి రోజు మొదటి అమెరికా విమానం భారతదేశంలో ల్యాండ్ అయింది. ఆ తర్వాత నాలుగైదు రోజుల తర్వాత భారతదేశపు రుణ విజ్ఞప్తిని ఐఎంఎఫ్ అంగీకరించి 25 షరతులు విధించింది. ఇందులో భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఓపెన్ ఎకానమీగా మార్చడం, ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ, సరళీకృత ఆర్థిక సంస్కరణలు లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలను అవలంబించవలసిన అవసరం ఉన్నదని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ సూచించింది.

ఆర్థిక సంస్కరణల అమలుకు ప్రభుత్వ చర్యలు:

ఈ విధానాల్లో భాగంగా భారత ప్రభుత్వం 1991 నుండి ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించింది. విదేశీ పెట్టుబడులను, సంస్థలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం మొదటిగా జూలై 1న రూపాయి విలువను 9 శాతం, జూలై 3న మరో 10 శాతం తగ్గించారు. వాణిజ్య విధానంలో మార్పుల కొరకు జూలై 4న 13 అంశాలతో రూపొందించిన కొత్త వాణిజ్య విధానాన్ని ప్రకటించారు. ఈ కొత్త విధానానికి అనుగుణంగా ద్రవ్య, పారిశ్రామిక విధానాలలో మార్పులు, విదేశీ పెట్టుబడుల విషయంలో చేపట్టవలసిన చర్యల గురించి స్పష్టపరిచారు. దిగుమతి లైసెన్స్‌లలో చాలా వాటిని రద్దు చేస్తూ నూతన పారిశ్రామిక తీర్మానాలతో జూలై 24న చారిత్రాత్మక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వాణిజ్య వ్యవస్థలో సత్వరమే మౌలిక మార్పులు తీసుకు వచ్చేందుకు ఛీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ ఆఫీస్‌ను రద్దుచేసి ఇండియన్ ట్రేడ్ సర్వీస్‌ను నిలిపివేశారు. దశాబ్దాల పాటు దేశ వ్యాపార వ్యవస్థలో కొనసాగిన నిబంధనలను రద్దుచేసి సమగ్రమైన కొత్త విదేశీ వాణిజ్య విధానాన్ని 1992 మార్చి 31న విడుదల చేశారు.

సంస్కరణల ప్రభావంతో కనుమరుగైన ప్రభుత్వ రంగం:

ఈ సంక్షోభ సమయంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం భారత ఆర్థిక వ్యవస్థను సంస్కరణల పేరుతో సామ్రాజ్యవాదుల ముంగిట్లో పడేశారు. మొదటగా ప్రభుత్వ రంగంలో రు. లక్షా 75 వేల కోట్ల పెట్టుబడులు ఉపసంహరించుకుంది. ఆ తర్వాత ఏర్పడ్డ ఎన్‌డిఏ ప్రభుత్వం 1998 నుండి 2004 వరకు ప్రభుత్వ సంస్థల అమ్మకం కోసం ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పరిచింది. ఆ శాఖ ద్వారా లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను సహితం విక్రయించడం మొదలు పెట్టింది. 2004లో యుపిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణనే అనుసరించింది. 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఏ మరింత దూకుడుగా పెట్టుబడిదారులు, బహుళజాతి సంస్థలకు ఉపయోగపడే విధానాల ద్వారా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టడం జరిగింది. ఇక రెండవసారి అధికారం చేపట్టాక ప్రభుత్వ ఆర్థిక విధానాలలో పూర్తిగా ప్రజా వ్యతిరేక కార్పొరేట్, ఆశ్రిత పెట్టుబడి అనుకూల ఆర్థిక విధానాలు ప్రజలపై బలవంతంగా రుద్దబడుతున్నాయి. 2014-19 మధ్య కాలంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలను ప్రభుత్వం సమీకరించింది. కార్పొరేట్ల కోసం పాలకులు, పాలకుల కోసం కార్పొరేట్లు! క్విడ్ ప్రోకో ఆట యథేచ్ఛగా సాగిపోతోంది. అన్నీ అమ్మివేయడమే ప్రభుత్వ విధానంగా మారింది. నేడు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో 100 శాతం పెట్టుబడుల ఉపసంహరణ దిశగా కేంద్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. అందుకు అనుగుణంగా బిపిసిఎల్, ఎయిర్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కంటైనర్ కార్పొరేషన్, ఐడిబిఐ బ్యాంక్, బిఇఎంఎల్ తదితర సంస్థలలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు రంగం సిద్ధం చేస్తోంది.

వృద్ధి వేగాన్ని మొదట పెంచి తగ్గుముఖం పట్టించిన సంస్కరణలు:

ఆర్థిక సంస్కరణల అమలు మొదలైన దశాబ్దంన్నర అనంతరం స్థూల దేశీయ ఉత్పత్తి అత్యధికంగా 9 శాతం నమోదు కావడంతో భారతదేశం సరళీకరణ అత్యుత్తమ ఫలితాలు అందుకొన్నట్లైనది. దీనితో భారతదేశం ప్రపంచంలో అతివేగంగా ఎదుగుతోన్న ఆర్థిక శక్తులలో చైనా తర్వాతి ద్వితీయ స్థానంలో నిలబడనుందని ఆశించినారు. కానీ ఉపాధి రహిత వృద్ధి 2012 ప్రథమార్థానికి ఈ ఎదుగుదల తగ్గడం ప్రారంభమై 2014 నుండి మరింతగా తగ్గుముఖం పట్టింది. 2018లో జిడిపి వృద్ధి 6.8 శాతం, 2019లో 6.5 శాతం, 2020లో 4 శాతం వరకు క్షీణించి కరోనా అనంతర కాలంలో రుణాత్మకంగా దిగజారినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

దిగజారిన మానవాభివృద్ధి సూచిక:

మానవాభివృద్ధి సూచికలైన స్థూల దేశీయోత్పత్తి, ఆయుర్దాయం, విద్య వంటి అంశాల కలయికతో కూడిన సూచి 1991లో 0.433

శాతం ఉండగా అది 2020 నాటికి 0.645 శాతానికి మెరుగుపడింది. కానీ ఈ సూచీకి సంబంధించి భారత్ ప్రపంచ దేశాలతో పోలిస్తే 114 నుంచి ఇప్పుడు 131కి దిగజారిపోయింది. ప్రపంచ వ్యాపితంగా 2019లో వంద మంది జనాభాకు సగటున 104 ఫోన్ కనెక్షన్లు ఉన్నాయి. భారత్‌లో 2020లో 110.18, చైనాలో 113.38, క్యూబాలో 11.6(2011) ఉన్నాయి. అంటే భారతదేశం సెల్ ఫోన్ వినియోగంలో చైనాకు దగ్గరగా ఉంది. కానీ ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 2020 మానవాభివృద్ధి సూచికలో 189 దేశాలకు గాను క్యూబా 70వ స్థానంలో, చైనా 85, భారతదేశం 131 స్థానంలో ఉంది. సంస్కరణల లక్ష్యం కేవలం సెల్‌ఫోన్‌ల కనెక్షన్‌లలో పెరిగింది కానీ, మానవాభివృద్ధిలో కన్పించకపోవడంతో సంస్కరణలు క్షేత్ర స్థాయిలో ఫలించలేదని నిరూపితమైంది.

ఆర్థిక సంస్కరణల అనంతర స్థితి:

ప్రధానంగా ఆర్థిక సంస్కరణల వల్ల టెలిఫోన్, బ్యాంకింగ్ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. సంస్కరణల తరువాత ఉపాధి రహిత వృద్ధి సంభవించి సమాజంలో ఆర్థిక అంతరాలు భారీగా పెరిగాయి. విద్యారంగంలో ప్రైవేట్ సంస్థల ప్రవేశంతో విద్య వ్యాపారమై నేడు పేదలకు అందని ద్రాక్షలా మారింది. మెడికల్, ఇంగినీరింగ్ సీట్లు అంగట్లో పెట్టి అమ్ముతున్నారు. ప్రజా ఆరోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేసి, వైద్య రంగంలోకి ప్రైవేట్ వ్యక్తులకు అవకాశం ఇవ్వడంతో సామాన్యులకు వైద్యం అందడం లేదు. కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే స్తోమత లేక కరోనా సమయంలో పేదలు పిట్టల్లా రాలిపోయారు. సంస్కరణల తరువాత సిద్ధించిన అభివృద్ధి అంతా అంతర్జాతీయ మార్కెట్‌లో మార్పుల వల్ల, ఎడాపెడా చేసిన రుణాల వల్ల సాధించినదే. ఆందోళనకరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కంపెనీలు భారీగా అప్పులతో ముందుకు కొనసాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు 1991లో 5.89 కోట్ల రుణ ఖాతాలు ఉండగా, 2020 కల్లా వాటి సంఖ్య 27.25 కోట్లకు పెరిగింది. బ్యాంకింగ్ సంస్కరణల వలన 1991లో మొత్తం బ్యాంకు రుణాలు రు. 2.85 లక్షల కోట్లయితే, 2021 మార్చి నాటికి అవి రు.109.49 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగిపోయాయి. ఇది స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో 60.5 శాతం. వీటిలో మూడోవంతు వ్యక్తిగత రుణాలే. ఇక రాష్ట్ర ప్రభుత్వాల రుణ భారం 1991లో రు. 1.28 లక్షల కోట్లయితే, 2020 కల్లా అది రు. 52.58 లక్షల కోట్లకు పెరిగింది.

సంస్కరణలు పెంచిన పేదరికం:

ముప్పై ఏళ్ల సంస్కరణలు పేదలపై ఎలాంటి ప్రభావం చూపలేదు. పేదరిక నిర్మూలనకు తాత్కాలిక భరోసానిస్తున్నాయి కానీ, శాశ్వత నివారణకు చర్యలు లేవు. దేశంలో ప్రభుత్వం విద్య, వైద్యం, ఉద్యోగ ఉపాధిని అందించినప్పుడే పేదరికం పూర్తి స్థాయిలో దూరమౌతుంది. కానీ అవి మూడు దశాబ్దాలుగా జరగలేదు. ఆర్థిక విశ్లేషకులు పేదరికాన్ని శాస్త్రీయంగా ఆహార ధాన్యాల వినియోగాన్ని కేలరీల విలువలో అంచనా వేస్తారు. దాని ప్రకారం తలసరి ఆహారం 2200 కేలరీల కన్నా తక్కువ లభించేవారంతా పేదరిక స్థాయికి దిగువన ఉన్నట్టుగా పరిగణించాలన్నది ప్రభుత్వమే నిర్ణయించింది. గ్రామీణ జనాభాలో తలసరి 2,200 కేలరీల కన్నా తక్కువ విలువ ఉన్న ఆహార ధాన్యాలు పొందినవారు 1993-94 నాటికి 58 శాతం ఉంటే, 2011-12 నాటికి వారి శాతం 68కి పెరిగింది. పట్టణ ప్రాంతాలకు 2,100 కేలరీలు నిర్ణయించారు. 1993-94లో పట్టణ ప్రాంతాల్లో 2,100 కన్నా తక్కువ కేలరీల విలువ గల ఆహార ధాన్యాలను పొందినవారి శాతం 57 కాగా, అది 2011-12 నాటికి 65కు పెరిగింది. 2011 తర్వాత పరిస్థితులు మరింత ఘోరంగా దిగజారాయి. 2017-18 జాతీయ శాంపిల్ సర్వే వెల్లడించిన గణాంకాలు ఎంత గగుర్పాటును కలిగించాయంటే మోడీ ప్రభుత్వం ఆ గణాంకాలను కప్పిపెట్టడమే గాక, ఆ పద్ధతులలో ఇకముందు సర్వేలు జరపకూడదని నిర్ణయించింది. ఈ విధంగా కప్పిపుచ్చే లోపుగానే కొన్ని గణాంకాలు బైటకు పొక్కాయి. ఆ వివరాలను బట్టి 2011 నుండి 2017 మధ్య గ్రామీణ ప్రాంతాలలో తలసరి వినియోగం ఏకంగా 9 శాతం మేరకు తగ్గిపోయింది. ఎప్పుడో, పంటలు దారుణంగా దెబ్బతిన్న కాలాల్లో తప్ప స్వతంత్ర భారతదేశంలో ఎన్నడూ ఇంత అన్యాయంగా వినియోగం తగ్గిపోయింది లేదన్నది చారిత్రక సత్యం. ఇక కరోనా కోట్లాది మందికి జీవనోపాధి లేకుండా చేసింది. పరిశ్రమల్లో పనిచేసేవారు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు, ఉపాధులు కోల్పోయినారు. ఇప్పుడు రోజుకు రు. 150 కన్నా తక్కువ ఆదాయం గల నిరుపేదల సంఖ్య 6 కోట్ల నుంచి 13.4 కోట్లకు పెరిగింది. పేదరిక నిర్మూలన జరగాలంటే విద్య, వైద్యం, ఉపాధికి నిధుల పెంపకంతోనే సాధ్యం అవుతుంది.

ఆర్థిక అసమానతలను తీవ్రతరం చేసిన సంస్కరణలు:

సరళీకరణ కేవలం ఆర్థిక వృద్ధికై అవలంబించిన ఒక ప్రణాళిక మాత్రమే. దీనివలన 1992 నుండి భారత్‌లో నిరుపేద వర్గాలలో వినియోగం స్థిరంగా ఉండడం, సంపన్న వర్గాలలో వినియోగం పెరగడం వలన రాబడులలో అసమతుల్యత నెలకొన్నది. ఇప్పుడు భారతదేశంతో సహా ప్రపంచమంతటా సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానాలు ఆదాయాల్లో అసమానతలను తీవ్రంగా పెంచివేశాయి. ప్రసిద్ధ ఆర్థిక వేత్తలు పికెటీ, చాన్సెల్ వేసిన అంచనాల ప్రకారం 1982 నాటికి మన దేశంలోని జాతీయ ఆదాయంలో ఒక్క శాతం మాత్రమే ఉన్న అత్యంత సంపన్నుల వాటా 6 శాతంగా ఉండేది. అది కాస్తా 2013-14 వచ్చేసరికి 22 శాతానికి అమాంతం పెరిగిపోయింది. ఇది గత శతాబ్దంలోకెల్లా అత్యంత అధికమైన పెరుగుదల. దేశ జనాభాలో ఎక్కువ వినియోగం చేసేది శ్రామిక ప్రజలు. అతి స్వల్పంగా వినియోగం చేసే సంపన్నుల వైపుకు సంపద అధిక మొత్తంలో తరలిపోయింది. అందువలన శ్రామిక ప్రజల వినియోగం మొత్తం మీద తగ్గిపోతున్నది. అంటే మొత్తం మీద వినియోగ డిమాండ్ పడిపోతున్నది. అందువలన పెట్టుబడి పెట్టడం తగ్గిపోతున్నది. దానివలన వృద్ధిరేటు తగ్గిపోతోంది.

వ్యవసాయ రంగంపై సంస్కరణల ప్రభావం:

దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరైన వ్యవసాయ రంగంపై ఈ

సంస్కరణల ప్రభావం తీవ్రంగా పడింది. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికీ జీవనోపాధికి వ్యవసాయం మీద ఆధారపడిన రైతుల జీవితాల్లో ముప్పై ఏళ్లలో మార్పు రాలేదు. ఆర్థిక సంస్కరణలు చేపట్టిన తరువాత దేశ ఆర్థిక వృద్ధిలో వ్యవసాయ వాటా గణనీయంగా తగ్గనారంభించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ కొనసాగిన కాలంలో చిన్న రైతు వ్యవసాయానికి లభించిన రక్షణ అంతా ఆర్థిక సంస్కరణల కాలంలో అంతరించిపోయింది. దాంతో వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోయింది. 1991 నుండి 2011 మధ్య పంటలు పండించే రైతుల సంఖ్య కోటి యాభై లక్షలు తగ్గిపోయింది. ఈ కాలంలోనే మనం మూడు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్న హృదయ విదారక సంఘటనలను చూశాం. వాస్తవానికి చిన్న రైతు వ్యవసాయం మీద సామ్రాజ్యవాద పెట్టుబడిదారుల దాడి ఇంకా తీవ్రం అవుతూనే ఉంది. 1991లో దేశ జనాభాలో 64.8 శాతానికి ఉపాధి కల్పించిన వ్యవసాయ రంగంలో నేడు 40 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. తాజాగా జారీ చేసిన మూడు వ్యవసాయ చట్టాలూ ఆ చిన్న రైతాంగాన్ని బలిపెట్టి బడా కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చే లక్ష్యంతోటే రూపొందాయి. ఈ చట్టాలు అంత దారుణంగా ఉండబట్టే దేశంలోని రైతాంగం, ముఖ్యంగా దేశ రాజధాని చుట్టుపట్ల ఉండే రైతాంగం ఆ చట్టాలను ఉపసంహరించాలని కోరుతూ భారీ సంఖ్యలో ఢిల్లీకి తరలి వచ్చి ధర్నాలు, దీక్షలు చేస్తూనే, పార్లమెంట్‌ను సహితం స్తంభింపజేస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధిపై సంస్కరణల ప్రభావం:

ఉపాధి విషయంలో ఆర్థిక సంస్కరణల వలన పెద్దగా ఒరిగిందేమీ లేదు. తొలుతగా సంస్కరణలు యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని నమ్మబలికినారు. కానీ కావలసిన స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగలేదు. కొత్తగా పుట్టుకొచ్చిన ఉద్యోగాలన్నీ ప్రైవేట్, అసంఘటిత రంగాలవే. వీటిలో కూడా అధిక వేతనాలు ఇవ్వగల ఉద్యోగాల శాతం బాగా తక్కువ. భారత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తికాల ప్రాతిపదికపై కాకుండా ఒప్పంద, తాత్కాలిక పద్ధతుల్లో సిబ్బందిని నియమించుకుంటూ, తక్కువ జీతభత్యాలను చెల్లిస్తున్నాయి. సమాన పనికి సమాన వేతనమివ్వాలని చెప్పిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ ప్రభుత్వాలు తుంగలో తొక్కినాయి. ప్రస్తుతం భారత్‌లోని 51 కోట్ల కార్మిక బలగంలో అత్యధికులు ప్రైవేట్, అసంఘటిత రంగాల్లోనే పని చేస్తున్నారు. కరోనా మహమ్మారి రాక మునుపే, 2019 నాటికే ఇక్కడ నిరుద్యోగం గత 45 ఏళ్లలోనూ అత్యధిక రేటుకు చేరింది.

తగ్గుముఖం పడుతున్న విదేశీ మిగులు:

1991నాటి సంస్కరణలకు విదేశీ చెల్లింపుల సమస్య తలెత్తడం ఒక ప్రధాన కారణం. ఆనాడు మన దేశ ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉన్నాయి. అంటే మనకు అవసరమైన విదేశీ మారక ద్రవ్యం లోటులోనే ఉంది. నేడు ఏ ప్రభుత్వ ఘనత అయినా విదేశీ మిగులు సాధన మీదనే ఆధారపడుతుంది. 2021 జూలై 16 నాటి ఆర్‌బిఐ సమాచారం ప్రకారం విదేశీ మిగులు 612 బిలియన్ డాలర్లు దాటినప్పటికీ, మరోసారి చెల్లింపుల సంక్షోభం తలెత్తవచ్చుని ఐఎంఎఫ్‌ను ఆశ్రయించే పరిస్థితి కూడా లేకపోలేదని ప్రముఖ ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ప్రథమ స్థానంలో ఉన్న చైనా, జపాన్, స్విడ్జర్లాండ్, రష్యా తరువాత అధిక విదేశీ మారక డాలర్ల ద్రవ్యం ఉన్న దేశంగా భారతదేశం ఐదవ స్థానానికి చేరింది. ఈ మొత్తం పదిహేను నెలల పాటు మనం దిగుమతులు చేసుకొనేందుకు సరిపోనున్నాయి. స్విడ్జర్లాండ్ దగ్గర ఉన్న నిధులు 39 నెలలు, జపాన్ 22, రష్యా 20, చైనా 16 నెలల పాటు దిగుమతులు చేసుకొనేందుకు సరిపోతాయని, మన దేశం దగ్గర పదిహేను నెలలకు సరిపడా ఉన్నందున మన పరిస్థితి మెరుగ్గా ఉందని కొందరు నమ్మబలుకుతున్నారు. చైనా వాణిజ్య మిగులులో ఉంది తప్ప తరుగులో లేదు. అందువలన మన పరిస్థితిని ఇతరులతో పోల్చుకోకుండా మన మిగులును పెంచుకునే ప్రయత్నాలు చేయాలని పాలకులు గుర్తించాలి.

ముగింపు:

ప్రభుత్వాలు భారత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల గురించి గొప్పలు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. కానీ భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి క్రమం 1991 ఆర్థిక సంస్కరణల తర్వాతే ముందడుగు వేసిందని చెప్పడం వాస్తవాన్ని వక్రీకరించడమే. అనేక అభివృద్ధి సూచీల విషయంలో గతం కంటే నేడు వెనుకపడిందన్నది కఠోర సత్యం. ఆదాయ పెరుగుదలలో అత్యధిక వృద్ధి రేటు, అధిక ఉపాధి కల్పన, విలువ ఆధారిత కార్యక్రమాల్లో వైవిధ్యం సాధించడం వంటివి సంస్కరణల లక్ష్యంగా చెప్పుకున్నప్పటికీ, వీటిలో అధిక ఆదాయ వృద్ధిని మాత్రమే సాధించారు. ఇది కూడా సంస్థాగత మార్పులు చేయకుండానే భారీ ఎత్తున పర్యావరణ విధ్వంసం పునాది పైనే జరిగింది. రోడ్డు, జల, వాయు కాలుష్యం పెరిగింది. ఇక ఉపాధి కల్పన స్తబ్దతకు గురై 2011 నాటికి మరింత దిగజారి పోయింది. సంస్కరణల ముందు సాధించిన దానికంటే తక్కువ స్థాయికి పారిశ్రామికీకరణ పడిపోయింది. చాలా మంది కార్మికులు తక్కువ వేతనాలు ఉండే అనియత సేవా రంగంలోనే చిక్కుకుపోయారు. మహిళల ఉద్యోగ కల్పన దారుణంగా పడిపోయింది. వ్యవసాయం ప్రమాదంలో పడిపోయింది. దేశంలో చాలా మందికి పని అవకాశాలు కల్పించే చిన్న, సూక్ష్మ పరిశ్రమలు తీవ్రమైన ఆర్థిక దుస్థితిలో చిక్కుకు పోయాయి.

నేడు మనదేశంలోని 58 మంది బిలియనీర్ల దగ్గర దేశంలోని 70 శాతం మంది జనాభా సంతోషంగా జీవించే సంపద కేంద్రీకృతం అయింది. పేదలు మరింత నిరుపేదలవుతుండగా ధనికులు మరింత సంపన్నులవుతున్నారు. అందువలన ఆర్థిక వేత్తల ఆచరణాత్మక విశ్లేషణను అనుసరించి అనివార్యమైన సంస్కరణల నేపథ్యంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ, ప్రపంచ బ్యాంక్ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు పరిమితం కాకుండా, సంస్కరణల ఫలితాలు సామాన్య జన ప్రయోజనంగా అమలు పరిచినపుడే దేశ సమగ్రాభివృద్ధికి మార్గం సుగమమౌతుంది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

కృష్ణా జలాల పునఃపంపిణీయే పరిష్కారం

సహజ వనరుల పంపిణీ అప్పటికే అనుభవిస్తున్న వాళ్ల హక్కుల ప్రాతిపదికన కాకుండా వాటికి దూరం చేయబడ్డ వారి వేదన కేంద్రంగా జరగాలంటున్నారు **ఎం. రాఘవాచారి**

కృష్ణా నదీ జలాలు అనే పదాలకి వివాదాలు అనే మరో పదం చేర్చితే తప్ప మాట్లాడుకోలేని పరిస్థితి దాపురించింది. ఇది ఒక తార్కిక ముగింపు దశకి ఎప్పటికి చేరుతుందో ఇప్పటికిప్పుడు చెప్పలేం. సహజ వనరుల మీద హక్కులు నిరంతరం పంపిణీకి గురవుతుండాలని, ఈ పంపిణీ అనుభవిస్తున్న వాళ్ల హక్కుల ప్రాతిపదికన కాక అనుభవానికి దూరమై అగచాట్లు పడుతున్న వారికి న్యాయం అనే ప్రాతిపదికతో జరగాలనే అవగాహన సమాజంలో పెరిగితే ఈ సమస్యకైనా, ఇలాంటి ఏ సమస్యలకైనా పరిష్కారం కాస్త సులభం అవుతుంది. కృష్ణా నది నీటి పంపిణీ ఎట్లా జరగాలి అనే విషయంలో ప్రభుత్వాలకి గానీ, ప్రజల మధ్యన పనిచేస్తున్న రాజకీయ పార్టీలకు గానీ స్పష్టత లేకపోవడం వల్ల చర్చ స్వార్థపూరితం గానూ, మొరటుగానూ జరుగుతున్నది. పరిస్థితిని అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ అధికార ప్రయోజనాలకు అనుగుణంగా, ప్రత్యర్థి రాజకీయ పార్టీలు తాము అధికారం పొందడానికి సాధనంగా ఉపయోగించుకునే పోటా పోటీ ప్రయత్నాలలో, ఎత్తుగడలలో ఉండడం వల్ల ఆ నదిని పంచుకునే రాష్ట్రాల మధ్య, ఆయా రాష్ట్రాల లోపల వివాదాలు నానాటికి తీవ్రమవుతున్నాయి. కృష్ణా నదీ జల వివాదాలు ఒక తార్కిక ముగింపు దశకు చేరకపోవడానికి ఈ అవకాశవాద రాజకీయాలే ప్రధాన కారణం.

కృష్ణా నదీ జల వివాదాల చర్చ, చరిత్ర చాలా లోతైనది. దీర్ఘకాలానికి సంబంధించినది. ఆ చరిత్రంతా చర్చించడానికి ఇక్కడ సాధ్యం కాదు. కానీ, సమీప గత చర్చను, చరిత్రను స్థూలంగానైనా చూద్దాం. కృష్ణా నదీ మీద ప్రకాశం బ్యారేజీ నిర్మాణం, కృష్ణా నదికి ప్రధాన ఉపనది తుంగభద్ర మీద కెసి కాలువ నిర్మాణం పందొమ్మిదవ శతాబ్ది మధ్య కాలంలో జరగగా, తుంగభద్ర నది మీద తుంగభద్ర డ్యాం ఇరవయ్యవ శతాబ్ది తొలి అర్థ భాగంలో జరిగింది. అప్పటికి బ్రిటిష్ ఇండియా వేరుగాను, సంస్థాన రాజ్యాల ఇండియా వేరుగానూ ఉండడం వల్ల నీటి ఒప్పందాలు మద్రాస్, మైసూర్, హైదరాబాద్ రాజ్యాల మధ్య జరిగాయి. ఎవరి ఏలుబడి ప్రాంతాలలో వారు నీటి ప్రాజెక్టుల ఆలోచనలు కూడా చేశారు. ఇరవయ్యవ శతాబ్ది మొదటి సంవత్సరాలలో ప్రకాశం బ్యారేజి ఎగువన కృష్ణా, తుంగభద్ర తీర ప్రాంతాల పరిశీలన చేసిన ఇండియన్ ఇరిగేషన్ కమిషన్ ఏ నదీ తీరంలో ఇంత దుర్భిక్ష ప్రాంతాలుండవు అని కామెంట్ చేసింది. దిగువ నుండి అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతూ వచ్చినందువల్ల ఎగువన దుర్భిక్ష పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. సమస్యను ప్రదర్శించడానికి పాలకులు నీరందని ప్రాంతాలు చూపడం, అమలు దగ్గరికి వచ్చేటప్పటికి నీరందిన ప్రాంతాలలోని ఆయకట్టుకు మరింత నీటి నమ్మకం, హామీ లభించే విధంగా నిర్మాణాలు చేపట్టడం ఒక విధానంగానే అమలవుతున్నది. ఫలితంగా నీరందని ప్రాంతాలు అందని ప్రాంతాలుగానే మిగిలిపోతున్నాయి. ఇది పట్టించుకోవలసిన తీవ్ర సమస్యగా ఉంది. పాలకులు తప్పించుకుంటున్నారు తప్ప బాధ్యత వహించడం లేదు.

మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి భాష ప్రాతిపదికన రాష్ట్రాల విభజన చర్చ జరుగుతూ ఆ ఉద్యమం తీవ్రమయ్యే కాలంలో ఆంధ్ర – రాయలసీమ మధ్య ఐక్య ఉద్యమాల కోసం తొలి షరతుగా 'శ్రీబాగ్' ఒప్పందం కుదిరింది. కాల గమనంలో ఆ ఒప్పందం చెదిరిపోయింది. ఈ గాయం రాయలసీమను సలుపుతూనే ఉంది. అట్లాగే దేశంలో రాష్ట్రాల విభజన ఏర్పాటు కోసం ఫజుల్ అలీ కమిషన్ పనిచేసి నివేదిక ఇచ్చింది. ఆ కమిషన్ ముందు హైదరాబాద్ రాష్ట్ర ప్రజలు, (తెలంగాణ ప్రజలు) రాజకీయ పెద్దలు వ్యక్తపరిచిన అనుమానాలు, ఆ తరువాత రోజులలో కుదిరిన పెద్ద మనుషుల ఒప్పందాలు, అనేక సూత్రాల అనేక పథకాలు గాయాలు గాయాలుగా తెలంగాణను సలుపుతూనే ఉన్నాయి. ఈ గాయాల పరిణామాలు తెలంగాణ ఏర్పాటుకు దోహదపడగా రాయలసీమలో మాకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే చర్చను సజీవంగా నిలబెడుతున్నాయి. ఈ మొత్తం చర్చలో జలవనరులు కీలకాంశం కావడం, కలిసిన రెండు రాష్ట్రాలు విడిపోయిన తరువాత కూడా ఈ చర్చ తీవ్రం కావడం గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రత్యేకించి రాయలసీమ ప్రాంత నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని వదిలి తెలంగాణతో చర్చకు దిగడం, ఆ ప్రాంత పార్టీలన్నీ ఒకరిని మించి ఒకరు పోటీపడుతూ తామే ఛాంపియన్లుగా ప్రదర్శన ఇస్తుండడం చూస్తున్నాం. సరిగ్గా అదే తీరున తెలంగాణ నేతలు ప్రత్యేకించి దక్షిణ తెలంగాణ ప్రాంత నేతలు, పార్టీలు తెలంగాణ ప్రభుత్వాన్ని వదిలి ఆంధ్రప్రదేశ్‌తో, రాయలసీమతో సంవాదానికి, ప్రదర్శనకు దిగడం చూస్తున్నాం. తక్షణ సమస్యలకు, సంవాదానికి కారణమైన ప్రభుత్వాలు రక్షిత ప్రాంతంలో చలి కాచుకుంటున్నాయి.

కృష్ణా నది మీద చేపట్టవలసిన ప్రాజెక్టుల ప్రతిపాదనలను, స్థలాలను, లాభ నష్టాలను ఖోస్లా కమిటి 1950ల తొలి సంవత్సరాలలో పరిశీలించింది. పులిచింతల, నందికొండ, సిద్దేశ్వరం ప్రాజెక్టులు, కృష్ణా – పెన్నార్ లింకును చర్చించింది. వీటిలో కృష్ణా – పెన్నా లింకులో ప్రయోజనమూ, నష్టమూ దాదాపు ఒకే స్థాయిలో ఉన్నాయని, హైదరాబాద్ నందికొండను ప్లాన్ చేసిందని చర్చించింది. తరువాతి రోజుల్లో ప్రభుత్వాలు నందికొండను వదిలి నాగార్జునసాగర్, సిద్దేశ్వరం వదిలి శ్రీశైలం నిర్మించాయి. తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయే ముందు పులిచింతల ప్రాజెక్టు నిర్మాణమైంది. శ్రీశైలం కుడి కాలువ కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం,

విస్తరణ, తెలుగు గంగ కాలువ నిర్మాణం, ఎస్కేప్ చానల్ నిర్మాణం, కాలువల వెంట రిజర్వాయర్ల నిర్మాణం జరిగాయి. సుంకేశుల అడ్డుకట్ట ఆధునీకరణ జరిగింది. ఇటు తెలంగాణ వైపు ఘోరమైన వివక్ష కొనసాగింది. శ్రీశైలం ఎడమ కాలువ పనులు టన్నెల్‌లోనే ఆగాయి. ఆర్‌డిఎస్ ధ్వంసమైంది. కల్వకుర్తి, నెట్టెంపాడు పథకాలు వరద జలాలతో చేపట్టినా భీమా, కోయిల్ సాగర్ నికర జలాలతో చేపట్టినా ఈ పథకాలకు నిర్దేశించిన నీరు తీసుకునే దాకా నదిలో, ప్రాజెక్టులలో నీటి లభ్యత ఉండదు. ఇవన్నీ ఎత్తిపోతల పథకాలు కావడం, సామర్థ్యం చిన్నది కావడం, ఈ పథకాల మీద నిలువ నీటి రిజర్వాయర్లే లేకపోవడం సీరియస్ విషయం. అటు ఆంధ్రప్రదేశ్‌కి వాలు వల్ల భౌగోళిక సౌలభ్యం కలిసి వచ్చింది. చేపట్టిన ఎత్తిపోతల పథకాల సామర్థ్యం తెలంగాణతో పోల్చినప్పుడు ఎక్కువ. తక్కువ రోజులలోనే నీరు తీసుకోగలుగుతాయి. ఈ వివక్ష తెలంగాణ ఉద్యమ కాలమంతా చర్చకు వచ్చింది. తొలి తెలంగాణ ఉద్యమ కాలంలో జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్ మలి తెలంగాణ ఉద్యమ కాలంలో జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ పనిచేశాయి. ఈ తీర్పులలోనూ న్యాయం దొరకలేదు. కోర్టుల పరిశీలనలు సైతం ఎంత అన్యాయంగా ఉన్నాయో చర్చించాలి.

జస్టిస్ బ్రిజేశ్ ట్రిబ్యునల్ పనులు ఒకవైపున మొదలవుతుండగా ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం జలయజ్ఞం ప్రారంభించింది. రాయలసీమ మహానాడు అధ్యక్షుడుగా ఆయన ఏ జల విధానం రాయలసీమ విషయంలో అమలు కావాలనుకున్నాడో అది అమలు చేశాడు. చిన్నా చితకా పనులు తెలంగాణలో కృష్ణ మీద అమలు చేసి రాయలసీమ వైపు మూడు షెట్టర్ల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు మరో పది షెట్టర్లు జత చేశాడు. ఇవి శ్రీశైలం లోపలి నీటిని తరలిస్తాయి. ఈ తరలింపు వివాదం కాకుండా, కృష్ణా డెల్టా ఆగ్రహపడకుండా సాఫీగా పనులు జరగడం కోసం బలప్రయోగానికి పాల్పడుతూ పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం చేశాడు. ఆ రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్టు విద్యుత్తు ప్రాజెక్టు అని నిర్మించారు గనుక కుడి ఎడమ కాలువల నిర్మాణం చేపట్టలేదు. అనేక ఉద్యమాల తరువాత రెండు కాలువలు చేపట్టక తప్పలేదు. కాకపోతే ఎడమ కాలువ వివక్షకు బలైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి తుంగభద్ర ప్రవేశించక ముందే పూర్వ హైదరాబాద్ రాజ్యంలో నిర్మాణమైన రాజోలిబండ ఆనకట్ట దగ్గర ఆంధ్ర వైపు నీరిచ్చేందుకు కుడి కాలువ లేదు. అలాగే సుంకేశుల ఆనకట్ట దగ్గర తెలంగాణకు నీరిచ్చేందుకు ఎడమ కాలువ లేదు. పులిచింతల ప్రాజెక్టు దగ్గర కూడా ఇదే పరిస్థితి. మొత్తంగా అన్ని ప్రాజెక్టుల కాలువలను, ఎత్తిపోతల పథకాలను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ వైపు ప్రతిరోజు 20 టిఎంసిలకు మించి నీరు తీసుకునే అవకాశాలుండగా, తెలంగాణ వైపు కనీసం నాలుగు టిఎంసిల నీరు తీసుకునే వ్యవస్థలు కూడా లేవు. మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, జూరాల, భీమాఫేజ్ 1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ అన్నీ కలిపి రోజుకి ఒక టిఎంసి నీరు కూడా తీసుకోజాలవు. నదిలో ఎక్కువ రోజులు నీరుండదు. వెలవెలబోయే పథకాల సామర్థ్యం రైతుల్ని వెక్కిరిస్తుంటుంది. రంగారెడ్డి జిల్లాలోనైతే కురిసిన వానలకు నిండే తలదాకా పూడిక పేరిన పాత చెరువులే కానీ ఈ ఏడు దశాబ్దాలలో నీరందించే ఏ నిర్మాణమూ చేపట్టలేదు.

జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్ తీర్పు తరువాత తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లాలో 1981లో టంగుటూరి అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జూరాల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంతకాలం పట్టిందో అతికొద్ది నీరు నిలిపే ఈ చిన్న ప్రాజెక్టు నిర్మాణానికి అంతకాలం తీసుకున్నారు. నిధులు కేటాయించరు, కేటాయించినవి ఖర్చు చేయరు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడిగా ఉండి చేపట్టిన ప్రాజెక్టులను, చేసిన నిధుల వ్యయాన్ని అంత లోతుగా పరిశీలించిన రచనలున్నాయేమో కానీ నా పరిశీలనకు రాలేదు. చేసిన నిర్మాణాలను పరిశీలిస్తే ఏం జరిగిందో తేటతెల్లమవుతుంది. ఆయా ప్రాజెక్టులకు, ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వాలు ట్రిబ్యునల్స్‌ను కోరిన నీటి తీరు తెన్నులు కూడా వివక్షాపూరితంగా ఉన్నాయి. రాజోలిబండ కుడి కాలువలాగా సుంకేశుల ఎడమ కాలువ అడిగి ఉంటే, ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా నీరు తీసుకునే వ్యవస్థల నిర్మాణం విషయంలో కనీస సమదృష్టి, న్యాయ దృష్టి పాటించి ఉంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకవర్గం అవమానకరంగా తేలిపోయేది కాదు. కనీసం రాష్ట్ర విభజనకు జలవనరుల పంపిణీ ప్రధాన సమస్య అయ్యేది కాదు. రైతాంగాన్ని నీటి సమస్య తెలంగాణ ఉద్యమంలోకి కదిలించింది. తెలంగాణ ఉద్యమకారులందరూ మహబూబ్‌నగర్ కరువు, వలసలు, రంగారెడ్డి భూముల దురాక్రమణ, నల్లగొండ ఫ్లోరైడ్ సమస్య సాగు, తాగు నీటితో కలిపి చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుగా విడిపోయింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రబలంగా చర్చకు వచ్చిన మరొక అంశం నీటిని బేసిన్‌లోనే ఉపయోగించాలని ఒక వాదన, కాగా అది కుదరదు అవసరాల ప్రాతిపదికన నీరు పంచాలని మరో వాదన. తీవ్ర చర్చ జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంది. తెలంగాణ వైపు నుంచి బేసిన్ ప్రాతిపదికన నీరు పంచాలని, ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి బేసిన్ వాదన చెల్లదని. తెలంగాణలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాలు వంద శాతం కృష్ణా బేసిన్‌లో ఉన్నాయి. ఖమ్మం పాక్షికంగా బేసిన్‌లో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణ, తుంగభద్ర, పెన్న, గోదావరి నదులన్నీ బేసిన్ దాటి ఉపయోగంలో ఉన్నాయి. 1972లో ఎన్.డి. గుల్హతి ప్రచురించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఇంటర్ స్టేట్ రివర్స్, లా అండ్ ప్రాక్టీస్ ఇన్ ఇండియా' అనే పుస్తకం కావేరి నుండి సట్లెజ్ దాకా పది నదులను బేసిన్ దాటించి పారిస్తున్న వివరాలు పేర్కొంది. కృష్ణా – గోదావరి కమిషన్ కూడా ఈ వివరాలు చర్చించింది. ఆ మేరకు మహానది 0.9, సట్లజ్, బియాస్, రావి 2.0, గోదావరి 3.5, పెరియార్ 7.0 కాగా, కృష్ణా నది 20 శాతం నీటిని బేసిన్ దాటిస్తున్నాయి. ఈ యాభై ఏండ్లలో అన్ని నదుల లెక్కలు మారి ఉంటాయి కానీ, కృష్ణా నది తరలింపు చాలా ఎక్కువ. పెన్నా నది పరిస్థితి కూడా అంతే. బేసిన్‌లో నీరందిన తరువాత నీరు తరలించడాన్ని తప్పు పట్టలేం కానీ, బేసిన్‌కు నీరు లేకుండా తరలించడం బలవంతుల న్యాయమే కదా. ఈ అన్యాయానికే దక్షిణ తెలంగాణ ఎగువ ప్రాంతం బలవుతున్నది.

బేసిన్ వాదుల లోగొంతులను సైతం అదుపు చేయడానికి నదుల అనుసంధానం అనే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. భారత పాలక వర్గాలు గంగా – కావేరి అనుసంధానం అన్నాయి. పర్యావరణ ఉద్యమకారులు, మేధావులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. సమదృష్టితో, న్యాయ దృష్టితో చేసే పర్యావరణ హితకరమైన ప్రతిపాదనలను కూడా వ్యతిరేకించడం, మొండిగా అమలు పరచడం పాలకవర్గ నీతి. ఈ నీతిని పాటించడంలో భారతీయ జనతా పార్టీ ఓ అడుగు ముందరుండడం ప్రజానుభవం. ఏ ప్రయోజనాలు పనిచేశాయో

కానీ, తమిళనాడు – కావేరి మధ్య వివాదాలు ముదరడంతో గోదావరి – కావేరి అనుసంధానం అనే చర్చను ముందుకు తెచ్చారు. రాష్ట్రాలు విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 80 టిఎంసిల నీరు తరలించే పట్టిసీమ పథకం పూర్తిచేసి గోదావరి – కృష్ణ అనుసంధానం చేశాను అన్నాడు. తెలంగాణ ముఖ్యమంత్రి రెండోసారి గెలిచిన తరువాత గోదావరి నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు తరలించి రాయలసీమను సస్యశ్యామలం చేస్తానన్నాడు. ఆయన పార్టీ అనుచరగణం తప్ప అందరూ వ్యతిరేకించారు. ఆంధ్రప్రదేశ్‌కు నష్టం లేదు. నీళ్లు వస్తుంటే ఎవరు వద్దంటారు. అయినా అనుసంధానం చర్చ చేసేవాళ్లు దిగువన అనుసంధానం చేస్తే ఎక్కువ ప్రయోజనం కలుగదని, సొమ్ము పోయి దిమ్మపడుతుందని ఎగువ ప్రాంత బాధితులకు నష్టమే మిగులుతుందని ఎందుకు గుర్తించరు.

దరిదాపు ఆరు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తనకు స్థానికంగా అందే నీటిని, ఎగువ నుంచి తరలివచ్చే నీటిని ఏ విధంగా ఎక్కువ భూమికి నీరివ్వగలం, ఎక్కువ ప్రయోజనం సాధించగలం, నిర్వాసితులకు, వలస బాధితులకు గౌరవప్రదమైన జీవన పరిస్థితులు ఎలా కల్పించగలం అని ఏనాడూ ఆలోచించిన పాపానపోలేదు. సంక్షేమాన్నే శాస్త్రీయంగా ఆలోచించని వాళ్లు సహజ హక్కుల మీద సామాన్యుల అధికారాన్ని నిలబెట్టగలరని అనుకోవడం అత్యాశే అవుతుంది కదా. దొంతుల లక్ష్మీనారాయణ వంటి తెలంగాణ ఇంజనీర్లు లెక్కలు తీసి కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 47,556 చదరపు కిలోమీటర్లతో 68.5 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 21,869 చదరపు కిలోమీటర్లతో 31.5 శాతం ఉందని, దీనికి ప్రతిగా ప్రాజెక్టుల వారీగా ట్రిబ్యునళ్లు చేసిన నీటి కేటాయింపులు తెలంగాణకు 37 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 63 శాతంగా ఉన్నాయని చెబుతున్నారు. రెండవ ట్రిబ్యునల్ తరువాత కూడా ఈ శాతాలలో మార్పు రాలేదు.

మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నీటి తగాదాల పరిష్కారానికి ఇప్పటికి రెండు ట్రిబ్యునళ్లు పనిచేశాయి. బచావత్ ట్రిబ్యునల్ ఈ రాష్ట్రాలకు వరుసగా 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 560+25, 700+34, 800+11 టిఎంసిల చొప్పున కేటాయించింది. బ్రిజేశ్ ట్రిబ్యునల్ 65 శాతం నీటి లభ్యత ఆధారంగా 666, 907, 1005 టిఎంసిల చొప్పున పంచింది. ఈ పంపకాలు మూడు రాష్ట్రాల మధ్య జరిగిన పంపకాలు. నాలుగు రాష్ట్రాలుగా కానీ, రాష్ట్రాల లోపల ప్రాంతాల వారీగా కానీ నీటి పంపిణీ జరుగలేదు. ఎగువన ఉన్న రెండు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటినే రెండు రాష్ట్రాల మధ్య పంచాలంటున్నారు. బ్రిజేశ్ ట్రిబ్యునల్ కొనసాగుతున్నా నీటి పంపిణీ పరిష్కారం కాలేదు. ఇప్పుడు రెండు రాష్ట్రాల ముందర రెండు ప్రధానమైన పనులున్నాయి. ఒకటి మారిన పరిస్థితులను, స్థానిక అవసరాలను గుర్తించి ప్రాజెక్టులు నిర్మించుకోవడం. రెండవది ఎవరి వాదనలు వాళ్లు ముందర పెట్టి న్యాయమైన వాటా నీరు సాధించుకోవడం. నిజానికి ఈ ఏడు సంవత్సరాలలో ఈ రెండు పనులు ముగిసి ఉండవలసింది. తెలంగాణకు సంబంధించినంతవరకు ఇవి తొలి అడుగు కూడా దాటలేదు.

తెలంగాణ ప్రభుత్వం జల వనరుల సాధనకు, వినియోగానికి సంబంధించి చాలా బలహీనమైన వాదనలతో, నష్టకరమైన విధానాలతో పనిచేస్తున్నది. కృష్ణా – గోదావరి నదుల వినియోగం విషయంలో పాలనా వైఫల్యం ఫలితాన్ని తెలంగాణ అనుభవిస్తున్నది. కాళేశ్వరం రీడిజైన్ వల్ల వ్యయం పెరిగింది. మునుపు గుర్తించిన నీరందే ప్రాంతాలకి ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాకు తీవ్ర నష్టం జరిగింది. ఎత్తిపోసిన నీరు తిప్పిపోసే దుస్థితి దాపురించింది. కృష్ణా నది మీద ఈ వైఫల్యం తారా స్థాయికి చేరింది. రాజోలిబండ పథకాన్ని వదిలేశారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను మరిచిపోయారు. పాలమూరు – రంగారెడ్డి పథకాన్ని పడమటి మహబూబ్‌నగర్ – రంగారెడ్డి జిల్లాలకు ఉపయోగపడే విధంగా కాకుండా స్థలం మార్చి వ్యయం, భూముల ముంపు, ఇతర పథకాలలోని ఆయకట్టు ముంపు పెంచారు. అక్కడితో ఆగకుండా నీటి కొరతతో తండ్లాడుతున్న స్థితి మరిచి ఈ పథకానికే పాలమూరు – డిండి అనే మరో కొత్త పథకాన్ని జోడించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా చంద్రసాగర్ మీద చేపట్టవలసిన అమ్రాబాద్ ఎత్తిపోతల, తుమ్మన్‌పేట నుండి చేపట్టవలసిన బల్మూరు ఎత్తిపోతల పథకాలను ఉత్తకోతలుగా మిగిలించారు. జూరాల దగ్గర నడిగడ్డ సాగు కోసం గట్టు మండలం కోసం చేపట్టవలసిన గట్టు ఎత్తిపోతల పథకం ఒక్క అడుగు కూడా కదలలేదు. ఇవి చాలా చిన్న పథకాలు. కొల్లాపూర్, వనపర్తి నియోజకవర్గాలలో శ్రీశైలం ప్రాజెక్టులో ముంపుకు గురైన ఏటిగడ్డ పల్లెల రైతులు వెల్టూరు – గొందిమల్ల బ్యారేజీ ప్రతిపాదించారు. మూడేండ్లు అవుతున్నా చిన్న పనిచేయలేదు. దీనినే జోగులాంబ బ్యారేజీగా కట్టితీరుతామని ప్రకటనలు మాత్రం గుప్పిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన సాగునీటి పథకాలన్నీ దాదాపు నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన పాలమూరు – రంగారెడ్డి పథకాన్ని మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధి నుండి నాగర్ కర్నూల్ వైపు మార్చారు. ఒక విధానం లేదు, బాధ్యత లేదు.

తెలంగాణకు కృష్ణ నీటిలో న్యాయమైన వాటా సాధించే విషయంలోను ఇదే పరిస్థితి. ఈ ఏడేండ్లలో రెండంటే రెండే అపెక్స్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. మొదటి సమావేశంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి తెలంగాణ వైపు కేటాయింపున్న నీరు చాలని, ఒక్క టిఎంసి కూడా అదనంగా అవసరం లేదని ప్రకటించారు. అట్లయితే దక్షిణ తెలంగాణలో నిర్మిస్తామని చెప్పిన సాగునీటి పథకాలు ఏం చేస్తారు? అన్నీ ఎత్తిపోతల పథకాలే కనుక, సీజన్‌లో తప్ప నీరుండదు కనుక ఎత్తిపోతల పథకాలు నిర్మించకుండా, నీటి నిలువ రిజర్వాయర్లు లేకుండా, అసలు నీరు తీసుకోకుండా సాగు అవసరాలు ఎట్లా తీరుస్తారు? పోనీ గోదావరి నీరు తెలంగాణలో ఎత్తైన షాద్‌నగర్ దాకా, లక్ష్మీదేవిపల్లి దాకా తెచ్చినారా అంటే అదీ లేదు. పాలమూరు – రంగారెడ్డి పథకంలో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం లక్ష్మీదేవిపల్లి నిర్మాణం వదిలేశారు. పోనీ బస్వాపూర్ నుండి డిండి లింక్ చేపట్టి గోదావరి నీరు తరలించారా అంటే లేదు. తెలంగాణ జిల్లాల మధ్య వైరుధ్యాలకి తెరతీశారు. అంత మాత్రమే కాదు, అసలు ప్రతిపాదించ తగని జూరాల – పాకాల పథకాన్ని ముందుకు తెచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఏడేండ్ల కాలం వృథా చేసి కృష్ణా జల వివాదాన్ని రెండు రాష్ట్రాల మధ్య తీవ్ర వివాదంగా ముందుకు తెచ్చారు. కానీ, మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల భూములకు, పూర్వ రంగారెడ్డి జిల్లా భూములకు సాగునీటి కోసం జూరాల ప్రాజెక్టు లోపలి నీటితో వరద కాలంలో రోజుకు 5 టిఎంసిల నీరు తీసుకునే విధంగా ఒక ఎత్తిపోతల పథకం చేపట్టాలని రైతులు ఎంత గోస

పెట్టినా పట్టించుకోలేదు. ముక్కు ఏది అంటే చుట్టూ తిప్పి చూపినట్టుగా, పాదాలు తడుపుకుంటే తల తడుపుకున్నట్టే అని కబుర్లు చెబుతున్నారు. దీనినంతా కప్పిపుచ్చుకునే ప్రయత్నంలోనే మరోసారి జల జగడం రేగింది. తెలంగాణ రాష్ట్రం కరెంటు ఉత్పత్తి కోసం ఎడమగట్టు నుండి నీళ్లు వదలడం ఒక తక్షణ వివాదంగా కనిపించింది కానీ, ఈ వివాదం 203 జిఒ విడుదల దగ్గర మొదలైంది. ఇంకా చెప్పాలంటే ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి గుసగుసలు పోయిన చోట, గోదావరి నీళ్లు శ్రీశైలం ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తామన్నచోట, ఏడేండ్లు వృథా చేసిన దగ్గర మొదలైంది. సరిగా పరిశీలిస్తే శ్రీశైలంలో ఏ లెవెల్స్‌లో నీరు నిలపాలనేది ఆంధ్రప్రదేశ్‌లో అంతర్గత సమస్య. కృష్ణా డెల్టాకు, రాయలసీమకు చెందిన సమస్య. ఈ విషయంలో తెలంగాణ థర్డ్ పార్టీయే. ఈ జగడం కేంద్ర ప్రమేయం దాకా వెళ్లాలనే ముందస్తు ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా అనేది ముమ్ముందు తెలుస్తుంది.

కేంద్రం రెండు రాష్ట్రాలను కూర్చోబెట్టి, పది సమావేశాలు జరిపి చర్చించింది లేదు. అధికారుల స్థాయిలో కూడా అవగాహనలు పెంచుకునే చర్చలు జరిగింది లేదు. పోనీ కేంద్రమే గత, వర్తమాన చర్చలు, నివేదికలు పరిశీలించి తానొక ప్రతిపాదన చేసింది లేదు. బ్రిజేశ్ ట్రిబ్యునల్ తీర్పు కాల పరిమితి 2050 దాకా ఉంటుంది కనుక వివాదం అంతకాలం సాగడం రెండు రాష్ట్రాలకు, కేంద్రానికి మంచిది కాదు. కాబట్టి ఉన్న ట్రిబ్యునల్‌తో కానీ, కొత్త ట్రిబ్యునల్‌తో కానీ పంపిణీ న్యాయబద్ధంగా ముగించి ఉండవచ్చు. ఈ పని ఏదీ చేయకుండా తెలంగాణ ప్రభుత్వంతో సుప్రీంకోర్టు కేసు విరమింపజేసిన కేంద్రం కృష్ణా, గోదావరి నదుల నిర్వహణకి బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు జూలై 15న ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ ఉత్తర్వును ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం విడుదల చేసినప్పటికీ దీనిలో చర్చించవలసినవి, నిరసించవలసినవి అనేక విషయాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీరు తీసుకుంటున్నది కనుక చాలా సహజంగా ఈ చర్యను స్వాగతించింది. తెలంగాణ వ్యతిరేకించింది. నదులను, నదుల మీద నిర్మాణాలను, నిర్వహణ అధికారాలను కేంద్రం తన పెత్తనం కిందికి తెచ్చుకున్నది. కానీ, నీరందని ప్రాంతాల విషయంలో బాధ్యత వహిస్తుందా? ఈ ఉత్తర్వు అనేక సవాళ్లను చర్చకు తెచ్చింది. అది చాలా లోతుగా జరగవలసిన చర్చ.

1953లో తుంగభద్ర డ్యామ్ నిర్మాణం ముగిసే క్రమంలో తుంగభద్ర బోర్డు నియామకం జరిగింది. బోర్డు విధి విధానాలలో ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. అవేవీ మౌలికమైన మార్పులు చేర్పులు కావు. 2018లో కావేరీ నదీ నిర్వహణ అథారిటీ ఏర్పరిచారు. సుప్రీంకోర్టు తుది తీర్పును అమలు పరిచే విధులు దానికి అప్పగించారు. ఈ రెండింటిలో నదీ పరివాహక ప్రాంత ఇరిగేషన్, విద్యుత్తు శాఖల ఇంజనీర్లు ఉంటారు. కానీ కృష్ణా, గోదావరి బోర్డులలో ఈ రెండు రాష్ట్రాల వాళ్లు ఉండరని కేంద్రం చెప్పింది. రక్షణ వ్యవహారం స్థానిక పోలీస్ విభాగాలు కాకుండా కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాలు (సిఐఎస్ఎఫ్) చూసుకుంటాయని చెప్పింది. ఆర్థిక భారం రెండు రాష్ట్రాలు సమానంగా భరించాలని, తక్షణం ఒక్కొక్క బోర్డుకు చెరి రు. 200 కోట్ల చొప్పున జమచేయాలని చెప్పింది. ఆదేశాలు పాటించకపోతే పెనాల్టీలుంటాయని చెప్పింది. ఇతర నదీ నిర్వహణ వ్యవస్థల లాగా ఇవి ఎందుకు లేవు. రెండు రాష్ట్రాల జల జగడమే దీనికి కారణమా? ఎంతమాత్రం కాదు. కేంద్ర అధికార లాలన ప్రధాన కారణం. ఈ విషయంలో బిజెపి రెండడుగులు ముందరుండడం ఒక కారణమైతే, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు స్వాభిమానం లేకుండా, విధానపరమైన విమర్శ లేకుండా లొంగి ఉండడం మరో కారణం. నీళ్ల కోసం బయల్దేరిన నెనరు లేని, న్యాయం లేని, స్వాభిమానం లేని, ప్రజల పట్ల బాధ్యత లేని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నదులనే కేంద్రం పెత్తనానికి వదిలేశారు. ఆయా నదుల మీద, వేల కోట్లతో నిర్మించిన అనేక నిర్మాణాల మీద, వాటి నిర్వహణ మీద అధికారం కోల్పోయారు. భారతదేశంలో ప్రత్యక్ష వలస పాలన ముగిసిన తరువాత, రాజ్యాంగం రూపొందించుకున్న తరువాత, దేశాన్ని ఒక యూనియన్‌గా, సమాఖ్య దేశంగా ప్రకటించుకున్న తరువాత ఈ డెబ్బై ఏండ్లలో నీటి మీద, నదుల మీద ఇంతటి దాడి ఏ రాష్ట్రం మీద కూడా జరగలేదు. ఒకనాడు కేంద్రంతో అనేక పోరాటాలు చేసిన చరిత్ర, ధిక్కరించి స్వతంత్ర రాజ్యాలు ప్రకటించుకున్న చరిత్ర తెలుగు ప్రజల నేపథ్యంలో ఉంది. కేంద్రం మిథ్య అన్నదాకా వెళ్లిన చైతన్యం ఉండింది. ఇపుడు రాష్ట్రాలు మిథ్య అయిపోతున్నాయా? ఇలాంటి దాస్యాల్ని ప్రశ్నించే చైతన్యం తెలుగు ప్రజలు కోల్పోతున్నారా? ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు ఆధిపత్య విధానాలుగా అన్ని శక్తుల్నీ అబ్జార్బ్ చేసుకుంటున్నాయా చాలా చర్చ జరగాలి. తెలుగు రాష్ట్రాల వికాసానికి, నాగరికతకు మూలమైన రెండు మహా నదుల మీద, వాటిపై నిర్మించుకున్న ప్రాజెక్టులు, కాలువల మీద కేంద్ర పెత్తనం ముమ్ముందు అనేక విపరిణామాలకు దారితీయవచ్చు. రాజకీయ శాస్త్రవేత్తలు విశ్లేషించాలి.

నిజానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఏం చేసి ఉండవచ్చు. పట్టు విడుపులతో కనీస న్యాయం జరిగే విధంగా నీటి పంపిణీకి చర్చలు జరిపి ఒక విధాన పత్రం రాసుకుని అమలుకు కోరి ఉండవచ్చు. నీటి లభ్యతపై రెండు రాష్ట్రాల ప్రజలకు వివరించి తమ తమ రాష్ట్రాలలో ప్రతి ఎకరా భూమికి ఒక పంటకైనా సాగునీరందించే విధాన రచన చేసి, వాన నీరు, నదుల నీరు, భూగర్భ జలాలను శాస్త్రీయమైన సమన్వయంతో సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి నిర్వహించే చర్యలు ప్రారంభించి ఉండవచ్చు. వర్షాలు అధికంగా ఉన్నప్పుడు ఎక్కువ నీరు తీసుకుని నిలుపుకునే మధ్యస్థాయి రిజర్వాయర్లు నిర్మించి ఉండవచ్చు. రెండు రాష్ట్రాలలోను కృష్ణా నది నీటిపై ఒత్తిడి ఎక్కువ ఉంది గనుక తప్పనిసరిగా కృష్ణ నీరు పారించవలసిన ప్రాంతాలను గుర్తించి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో గోదావరి నీరు లిఫ్టు చేసుకునే ప్రణాళికలు రూపొందించి ఉండవచ్చు. ఇటువంటి చర్యలు ఏవీ చేపట్టకుండా పోటీపడి వివాదాలు రెచ్చగొట్టారు. రాజకీయ పార్టీలన్నీ జాతీయ, ప్రాంతీయ, సామ్యవాద పార్టీలన్నీ ఆ ప్రాంత పార్టీలుగా మారి ఒకరిని మించి మరొకరు మాట్లాడారు. ఈ అందరూ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను ఉత్త తోలు బొమ్మలను లేక దిష్టి బొమ్మలను చేసే కేంద్ర ఉత్తర్వులను వ్యతిరేకించడంలో వెనుకబడి పోయారు. రాష్ట్రాలే విడిపోయిన తరువాత నీళ్ల పంపకాల దగ్గర మొండితనం కానీ, తగవులు కానీ లేకుండా నీటి పంపిణీ ముగించలేమా? కనీస న్యాయం సాధించలేమా? రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణా నదిలో తాము ఏయే ప్రదేశాల నుండి (సోర్స్ పాయింట్స్ నుండి) ఎంతెంత నీరు తీసుకోగలుగుతున్నారో, అందుకు ఆధారంగా ఉన్న వ్యవస్థలు ఏమిటో నిజాలు ప్రజలకు – ముఖ్యంగా నీరందని ప్రజలకు – వివరించే శ్వేత పత్రాలతో రెండు రాష్ట్రాల మధ్య విజ్ఞతతో కూడిన చర్చను ప్రారంభించలేరా? ఈ పనికి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జల వివాదాలు

పాలకులు జల వివాదాలను న్యాయబద్ధంగా పరిష్కరించకుండా తమ అవకాశవాద రాజకీయాలకు వాడుకుంటున్నారని అంటున్నారు **పబ్బతి వెంకటేశ్వర్లు**

ప్రకృతి ప్రసాదిత జలం ప్రతి జీవరాశికి ప్రాణాధారం. జీవకోటి మనుగడకు, అభివృద్ధికి, సామాజిక సంక్షేమం కోసం ఈ నీరే మౌలిక వనరు. జీవన గమనానికి అత్యంత ప్రభావవంతమైన నీరు అన్ని ప్రాంతాల్లో అందరికి దక్కక, దక్కినవారు తమ అవసరాలే పరమావధిగా వాడుకోవడంతో, అసమానతలు, విభేదాలు పొడసూపుతున్నాయి. ఈ నీటి బొట్టే ప్రాంతాల మధ్య జగడాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. నీటి నిర్వహణ విధానాలు చక్కగా అమలుపరిచి జాగ్రత్తగా వినియోగించుకోకుండా పరిమిత వనరును అపరిమిత అవసరాలకు వాడుకోవడం మూలంగా జలవివాదాలు సహజంగానే చోటుచేసుకుంటున్నాయి.

ఈ పరిస్థితికి అశాస్త్రీయ జల విధానాలు ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణం. ఆధార వనరు అయిన ఈ నీటి పంపిణీ వినియోగంలో అసమానతల కారణంగా దేశంలోని రాష్ట్రాల మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. దీనికితోడు అనునిత్యం ఓట్ల కోసం గాలాలు పట్టుకుని తిరిగే రాజకీయ నాయకులు నీటిలోనే మంటలు రాజేస్తూ ఉండటంతో ఈ రకమైన జలవివాదాలు భారతదేశ వ్యాప్తంగా రాష్ట్రాల మధ్య చోటుచేసుకుంటున్నాయి. ఉత్పన్నమైన వివాదాలు శాశ్వత పరిష్కారం పొందడంలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రాల మధ్య తలెత్తే సమస్యలకు కేంద్రం, సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే పరిస్థితి దాపురించింది.

భారతదేశంలో అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలు అత్యంత వివాదాస్పదమైన పరిష్కారం దొరకని సమస్యలుగా ఉన్నాయి. ఉదాహరణకు కృష్ణా గోదావరి జల వివాదం, కావేరి జల వివాదం, సట్లేజ్ యమునా లింక్ కెనాల్. వీటి పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్స్ కూడా రకరకాల సమస్యలతో సతమతమవుతూ, పరిష్కారం చేయలేని స్థితిలో ఉన్నాయి. రాష్ట్రాల మధ్య నదీజలాలపైనా, నదీ లోయలలోని జలాలపైన తలెత్తే విభేదాలు పరిష్కరించేందుకు వీలుగా అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం 1956ను తీసుకొని వచ్చారు. నీటి వివాదాలను విచారించే బాధ్యత నుంచి సుప్రీంకోర్టును ఆ చట్టం మినహాయించింది.. కానీ ఫలానా వివాదం నీటి వివాదం అవునో కాదో నిర్ణయించే అధికారం మాత్రం సుప్రీంకోర్టుకు ఉన్నది. వివాదం తలెత్తినప్పుడు కానీ, ఏదైనా రాష్ట్రం అభ్యర్థించినప్పుడు కానీ కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యూనల్ ను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న జల వివాదాల పరిష్కారం కోసం ఏర్పాటైన ముఖ్యమైన ట్రిబ్యునల్స్:

- కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2004 (కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర.)
- మహానది జల వివాదాల ట్రిబ్యునల్ 2018 (ఒడిస్సా, ఛత్తీస్ ఘడ్)
- మహదాయి జల వివాదాల ట్రిబ్యునల్ 2010 (గోవా, కర్ణాటక, మహారాష్ట్ర)
- రావి, బియాస్ జల వివాదాల ట్రిబ్యునల్ 1986 (పంజాబ్, హర్యానా, రాజస్థాన్)
- వంశధార జల వివాదాల ట్రిబ్యునల్ 2010 (ఆంధ్రప్రదేశ్, ఒడిశా)

ఈ ట్రిబ్యునల్స్ ఏర్పాటులోనే తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఈ సమస్యను పరిష్కరించడం కోసం ఏర్పడిన ట్రిబ్యునల్స్ అంతర్గతంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు గోదావరి నీటి వివాదం విషయంలో 1967లో అభ్యర్థిస్తే అది 1968లో ఏర్పడి 1979లో నివేదిక ఇస్తే 1980లో గెజిట్లో ప్రచురింపబడింది. 1990 లో ఏర్పడ్డ కావేరి జల వివాదాల ట్రిబ్యునల్ 2007 తుది అవార్డును ఇచ్చింది. ఇంత సుదీర్ఘ సమయం తీసుకోవటంతో రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారిపోయి, వారి రాజకీయ ఆలోచనలు అభిప్రాయాలు మారిపోయి సమస్యలు జటిలమవుతున్నాయి. ఈ సందర్భంలో తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల విషయంలో వివాదం ఎందుకో? దీనిలో కేంద్రం పాత్ర ఏమిటో? చూడాల్సి ఉంది.

ప్రభుత్వాలు పూనుకోకపోతే ఈ విషయాల పట్ల ఆసక్తిగల తెలుగు ప్రజలు, సాంకేతిక నిపుణులు పూనుకోవాలి కదా. సహజ వనరుల మీద ఆధారపడే స్థానిక ప్రజల అధికారాన్ని ఆలోచించకుండా సామాజిక పరివర్తనను ఎట్లా ఆలోచిస్తారు.

రెండు రాష్ట్రాలలోను ప్రభుత్వాలు కృష్ణా నదీ జలాల సాధనలో, వినియోగంలో ప్రజాామోదమైన, ప్రామాణికమైన పద్ధతులు రూపొందించలేదని, ప్రజల్ని రెచ్చగొట్టి తమ తమ అధికారాలు కాపాడుకునే పద్ధతులు మాత్రమే ముందుకు తెస్తున్నారని అర్థమైపోయింది. ఈ పరిస్థితిలో కేంద్రం పెత్తనానికి వచ్చింది. ఏ రాష్ట్ర ప్రజలు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడగలరు. తమ సాగునీటి సమస్యను ఎజెండా చేయగలరు. కానీ రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు తమ భుజాల మీద 'తుంట్ల'నే కాదు, తలమీదికి చేర్చిన మొద్దునూ మోయవలసిన పరిస్థితి వచ్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను తన పద్ధతిలో అదుపులో ఉంచుకోగలదేమో కానీ, సాగునీటికి నోచుకోని రైతాంగాన్ని అదుపుచేయగలదా?

(రచయిత పాలమూరు అధ్యయన వేదిక) వీ

ఆంధ్రతెలంగాణ జల వివాదం:

భారతదేశంలో నాలుగవ పెద్ద నది కృష్ణా నది. ఇది మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లలో ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. దాదాపు పదమూడు వందల కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పటి నుండి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య వివాదాలు ఉండేవి. అలాగే ఒకే రాష్ట్రం అయినా సరే ఆంధ్ర, తెలంగాణ మధ్య నీటి విషయంలో వివాదం ఉండేది. ఈ రాష్ట్రాల మధ్య నీటి వివాద పరిష్కారం కోసం బచావత్ ట్రిబ్యునల్ ఆర్ఎస్ బచావత్ అధ్యక్షుడిగా 1969 లో ఏర్పాటై 1976లో తీర్పునిచ్చింది. నది నీటిలో 75 శాతం నీటిని లెక్కలేసి 2060 టిఎంసిలు నికరంగా ఉంటాయని మహారాష్ట్రకు 585 టిఎంసిలు, కర్ణాటక 734 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్ కు 811 టిఎంసిలు పంచింది. అలాగే మిగులు జలాలు కూడా పంచారు.దీని మీద అనేక విబేదాలు వాదోపవాదాలు నడుస్తూనే ఉన్నాయి ఈ లోగా బచావత్ అవార్డు గడువు ముగియడంతో కృష్ణా జలాలను పునఃపంపిణీ చేయాలని అన్ని రాష్ట్రాలు కోరడంతో అంతర రాష్ట్ర జల వివాదాల చట్టం - 1956 ప్రకారం జస్టిస్ బ్రిజేష్ కుమార్ అధ్యక్షతన 2004లో ఏప్రిల్ 2న కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. దీని పేరు కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-2. దీన్నే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ గా పిలుస్తారు. 2007లో పని ప్రారంభించి తుది తీర్పు 2013 నవంబర్ 13న ఇచ్చింది. మొత్తం 65 శాతం నీటిని అందుబాటులోకి తీసుకొని ఆంధ్రప్రదేశ్‌కు 1001 టిఎంసిలు, కర్ణాటకకు 911 టిఎంసిలు, మహారాష్ట్రకు 666 టిఎంసిలు కేటాయించింది.అయితే ఈ తీర్పు సవాల్ చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అలాగే ఆ తర్వాత తెలంగాణ కూడా స్పెషల్ లీవ్ పిటిషన్ సుప్రీంకోర్టు లో దాఖలు చేసింది. విచారణ కొనసాగుచున్నది.కానీ నీటి కేటాయింపులు పూర్తికాలేదు.కాబట్టి బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన నీటి పంపకాలపై వివాదం కొనసాగుతున్నది.

నీళ్లు, నిధులు, నియామకాలే ఎజెండాగా జరిగిన సుదీర్ఘ ప్రజా ఉద్యమ ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కృష్ణ గోదావరి జలాల అసమాన పంపిణీ జరుగుతుందని పిర్యాదు చేయటానికీ ఆనాడు తెలంగాణా ప్రాంతం రాష్ట్రం కాకపోవటం మూలంగా, రాజ్యంగహోదా లేక పోవడం మూలంగా అవకాశం లేకుండా పోయింది. అందుకే రాష్ట్రం కావాలని ఉద్యమం సాగింది. నీటి కోసం ఎప్పటి నుండో రగులుతున్న జల వివాదం ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత ఆంధ్ర, తెలంగాణ మధ్య జల వివాదం మరింత ముదిరింది. తెలంగాణా రాష్ట్రం , కృష్ణా నది తెలంగాణలో 70 శాతం ప్రవహిస్తున్న కారణంగా 50 శాతం నీళ్ళు కావాలని డిమాండ్ చేస్తున్నది. 2014లో ఏపీ విభజన విభజన చట్టం ప్రకారం తెలంగాణలో కృష్ణ నదీ పరివాహక ప్రాంతం 60 శాతం ఉంటే, నీటి వాటా 37% ,కాగా ఆంధ్రలో కృష్ణా బేసిన్ 32 శాతం ఉంటే 65 శాతం నీటి వాటా వచ్చింది.అయితే అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలోని కృష్ణా నీటి వాటా 811 టిఎంసిలలో ఆంధ్రప్రదేశ్ కు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు తాత్కాలిక సర్దుబాటుగా నిర్ణయించుకున్నారు. ఇది తీర్పు కాదు. ఒప్పందం మాత్రమే , అయితే ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డులు ఏర్పాటు చేశారు. విడిపోయిన తర్వాత నీటి పంపకాలు కూడా కొత్తగా చేయాలని తెలంగాణ కోరింది. ఆంధ్ర ప్రదేశ్ కు దక్కిన 811 టిఎంసిలలో పరివాహక ప్రాంతం ఆధారంగా తమకు ఎక్కువ వస్తుందని వాదిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ ఫస్ట్ యూజర్ రూల్(ఫస్ట్ ఇన్ యూజ్, ఫస్ట్ ఇన్ రైట్) ప్రకారం తమకు ఎక్కువ నీటి కేటాయింపులు జరగాలని కోరుతున్నది. ఇదిలా ఉండగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు రెండు కూడా కొత్త ప్రాజెక్టుల పేరుతో మరో కొత్త వివాదానికి తెరలేపాయి. రాయలసీమ ఎత్తిపోతల పథకం తో బాటు రాజోలిబండ మళ్లింపు పథకం కుడి కాలువ పనులు ఎటువంటి అనుమతులు లేకుండా ఏపి నిర్మాణ పనులు చేపదుతుందని తెలంగాణా ఆరోపిస్తూ ఎన్జీటిలో కేసు వేసింది. అలాగే పాలమూరు %--% రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకం పై ఏపి కూడా ఇప్పటికే ఎన్జీటిలో కేసులు వేసింది. ఈ రెండు రాష్ట్రాలు కీచులాడుకుంటుండగా ఇన్నాళ్ళు ఏమీ మాట్లాడని కేంద్రం హఠాత్తుగా రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండానే రెండు నదులపై ఉన్న ప్రాజెక్టులన్నింటిని బోర్డులకు అప్పగిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి రాష్ట్రాలకున్న ఉన్న అధికారాలన్నీ కేంద్రం తన చేతుల్లోకి తీసుకుంది.

కేంద్ర జల సంఘం గెజిట్ :

15 జూలై 2021న. కృష్ణా, గోదావరి మేనేజ్‌మెంట్ బోర్డుల (కెఆర్ఎంబి, జిఆర్ఎంబి) పరిధులను నిర్ణయిస్తూ కృష్ణా గోదావరి జలాల వినియోగంలో తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలకు స్వస్తి పలకటానికి కేంద్ర జల శక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఈ ఏడాది అక్టోబర్ 14 నుంచి కృష్ణా గోదావరి నదుల మీద ఉన్న ప్రాజెక్టులన్నీ ఈ రెండు బోర్డుల పరిధిలోకి రానున్నాయి. దీనిని ఏపి స్వాగతిస్తుండగా, నీటి కెటాయింపులు తేలకుండా బోర్డులకు ఎలా అప్పగిస్తారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. ఈ బోర్డుల పరిధిలోకి రెండు రాష్ట్రాల్లోని కృష్ణా బేసిన్‌లోని 36 ప్రాజెక్టులు, గోదావరి బేసిన్‌లోని 71 ప్రాజెక్టులు వస్తాయి. ఉమ్మడి ప్రాజెక్టులను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఎత్తిపోతల పథకాల పై అజమాయిషి, ఆయకట్టుకు నీటిని విడుదల చేయడం బోర్డులే నిర్వహిస్తాయి. అనుమతి తీసుకోకుండా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను నోటిఫికేషన్లో పేర్కొన్నంత మాత్రాన వాటిని ఆమోదించినట్లు కాదని, ఎలాంటి అనుమతి తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలు ప్రాజెక్టు పనులను ఆపివేయాలని పేర్కొన్నది. ఈ నోటిఫికేషన్ ప్రచురించిన రోజు నుంచి ఆరు నెలల్లోగా వాటికి అనుమతులు తెచ్చుకోవాలని , తెచ్చుకోవడంలో విఫలమైతే ఆ ప్రాజెక్టు నిలిపివేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గేట్లు, ప్రాజెక్టులు, విద్యుత్తు ప్రాజెక్టుల నిర్వాహణ రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకోవాలి.పూర్తి పర్యవేక్షణాధికారం మాత్రం బోర్డుదే. సీజన్ల వారిగా ఎంత నీరు కావాలో బోర్డుకు తెలిపి ఆమోదం తీసుకోవాలి. ఈ ప్రాజెక్టు నుండి ఎంత నీరు విడుదల చేశారో ఇరు రాష్ట్రాలకు సమాచారం ఇస్తుంది. విడుదల చేసే నీటిని ఏ అవసరాలకు వినియోగించారో కూడా బోర్డులకు తెలపాలి. ప్రాజెక్టుల నుంచి విడుదల చేసే ప్రతి నీటిచుక్కను టెలిమెట్రి పరికరంతో లెక్కించనున్నారు ప్రాజెక్టుల కార్యకలాపాలు, నిర్వహణా ఖర్చులు తెలుగు రాష్ట్రాలు చెరిసగం భరించాలి ఈ బోర్డులు సమర్థవంతంగా పనిచేసేందుకు 60 రోజుల్లోగా సీడ్ మనీ కింద ఒక్కో బోర్డుకు ఒకేసారి రెండు వందల కోట్ల చొప్పున మొత్తం 400 కోట్లు జమ చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కృష్ణా గోదావరి బోర్డు ఛైర్మన్లు,

చీఫ్ ఇంజనీర్‌లను రెండు రాష్ట్రాలకు చెందని వారిని నియమించాలి. కృష్ణా-గోదావరి బోర్డుల స్వరూపాన్ని నిర్ణయించే అధికారం ఈ బోర్డులకే ఉంటుంది. గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించిన రోజు నుంచి 30 రోజుల్లోగా బోర్డులు నిర్దేశించుకున్న స్వరూపం ఏర్పాటు చేసుకోవాలి. ప్రాజెక్టు పరిధిలోని రెండు రాష్ట్రాల ఉద్యోగులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తో సహా అందరూ బోర్డు పర్యవేక్షణలోనే పని చేయాలి.ప్రాజెక్టులకు సిఐఎస్ఎఫ్ బలగాలతో భద్రత కల్పిస్తారు. బోర్డులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నీటిని రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను అనుసరించి నీటిని పంపిణీ చేయడం ప్రాజెక్టులో ఉత్పత్తి అయ్యే విద్యుత్తును రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడం ప్రధాన బాధ్యత.' కృష్ణా గోదావరి పై రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా చేపట్టిన ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక పరిశీలించి కేంద్ర జలసంఘ సాంకేతిక సలహా మండలికి పంపుతుంది. ప్రాజెక్టుల విషయంలో వివాదం తలెత్తితే నిర్ణయం తీసుకునే అధికారం కేంద్రానిదే.గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 14 నుండి అమలులోకి రానున్న సందర్భంలో బోర్డుల స్వరూపాన్ని ఖరారు చేయడానికి నిర్వహిస్తున్న సమావేశాలకు తెలంగాణా ప్రభుత్వ ప్రతినిధులు గైర్హాజరు అవుతున్నారు.తిరిగి ఈ సమావేశం ఆగష్టు 27న జరుగనున్నది.గెజెట్ ప్రకారం అన్ని ప్రాజెక్టుల సమాచారాన్ని ఇవ్వమని కోరితే అం.ప్ర. మాత్రమే స్పందించింది.బోర్డు తీసుకొనే నిర్ణయాల అమలు బాధ్యతా రాష్ట్రాలదే.లేని పక్షంలో జరిమానాలు విధించే అధికారం బోర్డుకు కలదు.

జల వివాదాల పరిష్కారం కోసం ఏర్పడ్డ ట్రిబ్యునళ్లు, యాజమాన్య బోర్డులూ, ఏర్పడిన చాల సంవత్సరాల తర్వాత కేంద్రం వాటి హద్దులను నిర్ణయించింది. ఇటీవల నల్సార్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ "హద్దులు నిర్ణయించడం అంటే మొత్తం నదులనూ, జలవిద్యుత్ కేంద్రాలతో సహా సొంత పరిధిలోకి తీసుకోవడం. నదులపైనా, విద్యుత్ కేంద్రాలపైనా నియంత్రణను తీసుకోవడమే కాదు మొత్తం ఆస్తిపాస్తులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి లాక్కోవడం, రివర్ మేనేజ్ మెంట్ బోర్డుల పేరుమీద కేంద్రానికి దఖలు పరచడం".అని విమర్శించారు.. నిజానికి వివాదం తీర్చమని అడిగితే ప్రాజెక్టులపై ఉన్న అధికారాలన్నీ కేంద్ర లాక్కొన్నది. ప్రాజెక్టుల నిర్వహణలో ఉన్న వ్యయప్రయాలసన్నింటినీ రాష్ట్రాల నెత్తిన పెట్టింది. గతంలో నదీ జలాల నిర్వహణలో తెలుగు రాష్ట్రాలకు స్వయం నిర్ణయాధికారాలు ఉండేవి . కేంద్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల పరిధి నుంచి నదీ జలాలను అమాంతంగా కాజేయడం ద్వారా సమాఖ్య సూత్రాన్ని నీరు కార్చింది. తెలుగు రాష్ట్రాలలోని నదులను తమ చెప్పు చేతుల్లోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. అన్ని రాష్ట్రాలకి బిన్నంగా కేంద్రం ఈ రాష్ట్రాల పట్ల వ్యవహరిస్తున్నది.ఇలా కేంద్రం వ్యవహరిచడం అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలనే సహజ న్యాయానికి తూట్లు పొడవటమే .నీరు రాష్ట్ర జాబితాలో ఉంటే దానిని ఉమ్మడి జాబితాలో ఉన్నదని కేంద్రం వక్రభాష్యం చెబుతున్నది. ప్రాజెక్టుల నిర్వహణ వ్యయాలను రాష్ట్రాలు భరించాలి గానీ వీటి పై వాటికి ఏ అధికారం ఉండదు. రాష్ట్రాలు తమ అవసరాలకు ఎంత నీరు కావాలి ఎంత విద్యుత్తు కావాలో బోర్డులకు విన్నవించుకోవాలి. అవి పరిశీలించి వాటిని కేటాయిస్తాయి.రాష్టాల భవిష్యత్తు అంతా బోర్డుల పైనే అంటే ఒక రకంగా కేంద్రం దయాదాక్షిణ్యాల మీద అధారపడటమే అవుతుంది. .బోర్డుల నియామకం లోనూ, విభేదాలు ఏర్పడ్డప్పుడు కేంద్రానికే అంతిమ అధికారం ఉంటుంది. కాబట్టి కేంద్రం దీనిని రాజకీయంగా వాడుకునే అవకాశం ఉన్నది. ప్రజలకు రాష్ట్రాలకు నీరు విద్యుత్తు ప్రధానమైనవి. వీటిని రాష్ట్రాల దగ్గరినుండి లాక్కోవడం రాజ్యాంగ విరుద్ధం. విభేదాలు ఏర్పడితే సమస్య ను పెద్దరికంతో పరిష్కరించక తానే ఆ అధికారాలను లాక్కోవడం సరియైనది కాదు. అలాగే ఈ బోర్డులకు నాయకత్వం వహించే చైర్మన్లు, చీఫ్ ఇంజనీర్లు ఈ రెండు రాష్ట్రాలకు చెందిన వారు ఉండకూడదనటం, ఈ బోర్డులు తీసుకునే ఈ నిర్ణయాల్లోనూ ఈ రాష్ట్రాలకు ఏ మాత్రం ప్రమేయం లేకపోవడం శోచనీయం. రాష్ట్రాలకు సంబంధించిన అవసరాల గురించి వాటి మంచి చెడుల గురించి ఏ మాత్రం అవగాహన లేని అధికారులు పెత్తనం చేయబోతున్నారు. కేంద్రం రాష్టాల మీద పెత్తనం చేయబోతున్నదన్న విమర్శలు సహేతుకంగానే కనబడుతున్నాయి. కేంద్రానికి అనుకూలంగా ఉండే ప్రభుత్వాలకు ఒకింత ఎక్కువ లాభం జరుగబోతున్నది. నీరు గానీ విద్యుత్తు గానీ ఏ అవసరాలకు వాడుతున్నారో చెప్పాల్సి రావడం అంటే రాష్ట్రాలకు స్వేచ్ఛ లేని స్థితి కి తీసుకు రావడమే. ప్రజల అవసరాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసినట్టుగా బోర్డు చైర్మన్లకు, అధికారులకు, ఇంజనీర్లకు అర్ధమయ్యే పరిస్థితి ఉండదు. పైగా వారి నిర్ణయాలే చెల్లుబాటు అవుతాయి కాబట్టి వీరంతా కేంద్రం చే నియమించబడతారు కాబట్టి పరోక్షంగా రాష్ట్రాలపై కేంద్ర పాలన సాగుతున్నట్టుగానే భావించాల్సి వస్తున్నది.

ముగింపు:

ఈ మొత్తం పరిశీలనలో రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలను సాకుగా చూపి రాష్ట్రాలపైన గుత్తపెత్తనానికి పూనుకుందని అవగతమవుతున్నది. రాష్ట్రాలలో ఉన్న తక్షణ నీటి అవసరాల ప్రాజెక్టుల పూర్తి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొనాల్సి ఉన్నది. కానీ రెండు రాష్ట్రాల మధ్య మొదలైన తాజా వివాదాలు చిలికి చిలికి గాలి వానగా మారి, వారి అధికారాలు ఎగిరిపోయి కేంద్ర చేతికి చిక్కాయి. పైకి రెండు రాష్ట్రాలు రాజీకి వస్తే కేంద్రం జోక్యం చేసుకోనంటున్నది కాని కేంద్ర అంతరంగాన్ని అర్ధం చేసుకొని, ఇప్పటికైనా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ లబ్ధి కోసం ఓట్ల కోసం కాకుండా, తమ ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సమస్యను చర్చల ద్వారా శాంతి యుతంగా పరిష్కరించుకోవాలి. ఇందులో అనవర దూషణ, భాషణలకు తావివ్వకు ండా ప్రాజెక్టుల దగ్గర తమ బలగాలను మొహరించి కయ్యానికి కాలు దువ్వి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. కేంద్రం చేతుల్లో నలిగి పోయే స్థితి నుండి బయటపడటానికి, వివాదాలకు చరమగీతం పాడడానికి అనువైన మార్గాలు అన్వేషించాలి. ఇటీవలే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయ పడినట్లు రెండు రాష్ట్రాలు పరస్పరం మధ్యవర్తుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి. దానితో పాటు రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కూర్చడానికి ప్రజాపక్షం వహించే మేధావులు,నీటి రంగ నిపుణులు చొరవ తీసుకోవాలి. అప్పుడే రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తిని కాపాడి సుధీర్ఘ జల వివాదానికి చరమ గీతం పాడవచ్చు.

(రచయిత డి.టి.ఎఫ్. రాష్ట్ర కౌన్సిలర్) వీ

ప్రభుత్వరంగ సంస్థలు - ఐక్య ప్రజా ఉద్యమాలు

మోడీ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలుగా వున్నవి ఇక నుంచి ప్రైవేట్ పరం కావడమే కాకుండా లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు అసంఘటిత రంగంలోకి మారతారని అంటున్నారు **బి ఎస్ రాజు**

ప్రభుత్వ రంగమా? ప్రైవేటు రంగమా? ఏది గొప్ప? ఏది నాసి? ఏది వాసి? అనే చర్చ మన దేశంలోనే కాదు, ప్రపంచమంతటా ఎడతెరిపి లేకుండా సాగేదే! ఈ చర్చ ఎంత పాతదో, అంత కొత్తది కూడా! ఈ చర్చ అధిక శాతం ఉబుసుపోక, యాదాలాప, ఊకదంపుడు చర్చ. కొద్ది శాతం మట్టుకే ఉపయోగయుక్తమైన రాజకీయ అర్థశాస్త్ర చర్చ. ఈ చర్చ శాఖోప శాఖలుగా, చిలవలు పలవలుగా విస్తరించి ఉంది. రాజకీయ సిద్ధాంత రంగంలో, అర్థశాస్త్ర రంగంలో ఏర్పడ్డ భిన్న ధోరణుల నుండి ఈ చర్చ విస్తృతి చెందింది.

ఇటువంటి విస్తృత చర్చలోనికి పోకుండా, ఇప్పుడు మన దేశంలో మొత్తం ప్రభుత్వరంగ వ్యవస్థలన్నిటినీ కూల్చివేసే అత్యంత ప్రమాదకరమైన, ఉప్పెనలా విరుచుకుపడుతున్న రాజకీయ నీతిపై చర్చను కేంద్రీకరించాలి. ఈ ముప్పును దేశ ప్రజలు ఎలా ఎదుర్కోవాలనేది ప్రధాన సమస్యగా పరిగణించాలి.

ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న భారతీయ జనతా పార్టీ అత్యంత దూకుడుగా ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలను ఫాసిస్టు దమనకాండతో జోడించి అమలు చేస్తోంది. ఈ విధానాలు, ఈ దేశ శ్రామిక రాసులనే గాక అత్యధిక శాతం ప్రజలను నిరంతర సంక్షోభంలోనికి నెట్టివేస్తున్నాయి. ఇటువంటి విధానాలు అమలు చేస్తూ, దేశ వనరులన్నిటినీ గుప్పెడు ఆశ్రిత బూటకపు పెట్టుబడిదారీ ముఠాల పాదా క్రాంతం చేస్తున్నది. అద్దు, ఆపూ లేకుండా ప్రజల కుత్తుకులపై కత్తిపెట్టి అమలు చేస్తున్న ఈ విధానాలను అడ్డుకునే, నిలువరించే, తిప్పికొట్టే విస్తృత ఐక్య ప్రజా ప్రతిఘటనా ఉద్యమాలు కరువయ్యాయి. అటువంటి ఉద్యమ నిర్మాణ కృషి అత్యంత పేలవంగా ఉంది. ఈ ఉద్యమ బలహీన స్థితి పాలకుల దూకుడుకు మరింత ఊతాన్నిస్తోంది. అయితే ఇటువంటి స్తబ్ధతకు, పేలవమైన ప్రజా ప్రతిఘటనా స్థితికి దారితీసిన కారణాలేమిటి? వాటి మూలాలేమిటి? పరిశీలించాల్సిందే! విశ్లేషించాల్సిందే!

సాధారణ సామాజిక అవగాహనతో చూస్తే 1980ల తర్వాత గడచిన 40 దశాబ్దాల్లో ప్రజల్లో విడివిడి గానూ, సమూహ స్థాయిలోనూ ఓ కొత్త సైకీ, ఓ నూతన మానసిక స్థితి స్థిరపడింది. ఈ స్థితి ఏమంటే... ఏ సమస్య అయినా వ్యక్తిగత మైనదని, ఏ వ్యక్తికి ఆ వ్యక్తే, తన పరిధిలోనే ఆ సమస్యకు సమాధానం వెతుక్కోవాలి గాని అన్యదా శరణం నాస్తి అనే భావన కమ్ముకు పోవడం. సమస్యలకు మూలాలు వ్యక్తులు నివసించే సమాజంలో ఉంటాయనే సామాజిక స్పృహ, చైతన్యం కరువవ్వడం. అటువంటి చైతన్యం పొందే అవకాశాలు, అటువంటి విద్య, ఇంటా, బయట అడుగంటి పోతున్న ఓ దుర్భర వాతావరణం సర్వత్రా ఆవరించి ఉండటం.

అయితే ఇటువంటి మానసిక స్థితి ఆకాశం నుండి ఊడి పడిందా? పైనుండి పరమాత్మ ప్రజలపై ప్రయోగించినదా? దీని వెనుక ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కారణాలు ఉండవా? ఇవి మనకు మనం సంధించుకోవాల్సిన ప్రశ్నలు.

స్వాతంత్రపు తొలి నాళ్లలో అప్పటి కాంగ్రెస్ పార్టీ పాలకులు వారికున్న భావజాలాన్ని బట్టి, దేశాన్ని తిరిగి పట్టాలెక్కించడానికి మిశ్రమ ఆర్థిక విధానాలను, తదనుగుణ పాలనా నీతిని ప్రవేశ పెట్టారు. ఉదార పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని, పాలనా పర్యవేక్షణకై కొన్ని స్వతంత్ర ప్రతిపత్తిగల వ్యవస్థలను ఏర్పాటు చేశారు. నిజానికి ఈ విధానాలన్నీ దేశ స్వతంత్ర ప్రకటనకు పూర్వమే బ్రిటిష్ వారి నిర్దేశకత్వంలో రచించ బడ్డవే!

దేశీయ బడా పారిశ్రామిక వేత్తలు, గుత్త దళారీ వ్యాపారులు, జమీందారీ, భూస్వామ్య, పెత్తందారీ కుటుంబాలు కాంగ్రెస్ పార్టీని తమ నమ్మకమైన రాజకీయ బంటు లేక ఏజెంట్‌గా, బ్రిటిష్ వారితో తమ తరపున బేరసారాలు సాగించే రాజకీయ పార్టీగా నిలిపి, దానికి పూర్తి సహాయ సహకారాలందించారు. ఇక మిగిలింది ఒక అరేంజ్మెంట్, 3-1 ఒడంబడిక. ఈ ఒడంబడిక ప్రకారం బ్రిటిష్ వాళ్లు ఇండియాకు స్వాతంత్రం ప్రకటిస్తారు. కాంగ్రెస్ పార్టీ పాలనాధికారం చేబడుతుంది. దేశీయ పెట్టుబడి, విదేశీ పెట్టుబడితో చెట్టాపట్టాలేసుకుని తమ వ్యాపార, పారిశ్రామిక సామ్రాజ్యాలను విస్తరించు కోవచ్చు. ఈ అవగాహన నుండి పుట్టుకొచ్చిందే మిశ్రమ ఆర్థిక విధానం.

అప్పటికి అంటే స్వాతంత్రపు తొలినాళ్లలో దేశీయ ప్రైవేటు పెట్టుబడికి దేశ మౌలిక ఆర్థిక పారిశ్రామిక ఉత్పత్తి రంగాల్లో ప్రవేశించే సత్తా లేదు. అంచేత ప్రభుత్వమే ఆపని చేస్తే ఆ మౌలిక రంగ పునాదిపై ప్రజలకు కావాల్సిన నిత్యావసర, వినియోగ వస్తూత్పత్తి రంగంలోనూ, మౌలిక ఉత్పత్తులను చౌకగా పొందుతూ వాటి అనుబంధ (ఇంకా డౌన్ స్ట్రీమ్) పరిశ్రమల స్థాపన ద్వారా తమ వ్యాపార సామ్రాజ్యాల విస్తరణ చేసుకునే వ్యూహం ఇంచుమించు 1980ల వరకు కొనసాగింది.

ఈ మిశ్రమ ఆర్థిక విధానం నుండే మనకు భారీ ఉక్కు కార్మాగారాలు, భారీ యంత్ర నిర్మాణ పరిశ్రమలు సమకూరాయి. దేశానికి అవిచేసిన మేలు వెలగట్ట లేనిది. ప్రభుత్వ రంగ సంస్థల భుజాలపై ఎక్కి ప్రైవేటు రంగం చెట్ల ఫలాలను కోసుకుని పుష్టి చెందింది.

ప్రభుత్వ రంగ సంస్థలకున్న ఆస్తులు, ఇతర వనరులు ఇప్పుడు కారుచవుకగా ప్రైవేటు రంగానికి, అదీ ఆశ్రిత బృందాలకు ధారాదత్తం చెయ్యడమే ఇప్పటి బిజెపి ప్రభుత్వపు ఏకైక ఎజెండా. ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలలో ఉన్నాయనో లేక ఒకవేళ లాభాల్లో ఉంటే వాటిని అమ్మి ఆ సొమ్మును ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఖర్చుపెట్టాలనో అనే కపట బూటకపు వాదనను వినిపిస్తూ ప్రభుత్వ రంగాన్ని కొల్లగొట్టి దోచుకోవడానికి కార్మిక, ఉద్యోగ వర్గాలను బజారు పాలు చేయడానికి గట్టిగా ప్రయత్నిస్తోంది బిజెపి ప్రభుత్వం.

స్వాతంత్రం వచ్చిన తొలి దశాబ్దాల్లో ప్రభుత్వాలను తెరవెనుక నుండి నడిపించిన, లైసెన్స్ కంట్రోల్ రాజ్ సర్కారును తమ ఎదుగుదలకు ఉపయోగించుకున్న గుప్పెడు పారిశ్రామిక, వ్యాపార సంస్థలు సకల వినియోగ వస్తూత్పత్తులపై గుత్తాధిపత్యం సంపాదించడం ద్వారా నిత్యావసర వస్తువుల, వినియోగ వస్తువుల దారుణమైన, దుర్భరమైన కృత్రిమ కొరతను సృష్టించి ప్రజలను రాచి రంపాన పెట్టాయి. ప్రజలు కనీస సేవలు అందక విసిగి వేసారి పోయారు. ఇటువంటి కంటక వాతావరణం, ప్రభుత్వ వైఫల్యంగా మారింది. ప్రజల సైకీని, మానసికస్థితిని ప్రభుత్వ రంగమంటేనే ఏవగింపు కలిగే స్థాయికి చేర్చింది. పిండుకు తినడానికి, దండుకు తినడానికి ప్రభుత్వరంగ సంస్థలు పుట్టుకొచ్చాయనే తప్పుడు ధోరణి అటు ఉద్యోగుల్లోనూ, ఇటు యాజమాన్యాల్లోనూ వేళ్లూనుకుని ప్రజారంగంలో ఎనలేని నష్టం జరిగింది. డిమాండ్లు, కోరికలు తీర్చుకోవడానికే తప్ప సరైన ప్రజా ఆలోచన, ఆచరణ ప్రోది చెయ్యాలనే భావన యూనియన్లకు లేకుండా పోయింది.

ఈ క్రమంలోనే ప్రపంచమంతా సోషలిస్టు వ్యవస్థలు కుప్పకూలాయి. మన దేశంలో ప్రవేశించిన ఆర్థిక సరళీకరణ విధానాలు ప్రజలకు కృత్రిమ కొరత నుండి, పరమ నాసిరకం సేవల నుండి ఉపశమనం కలగజేసాయి. ఈ పరిణామాలు ప్రజల మెదళ్లలో సర్వం ప్రైవేటు చేయడమే అత్యుత్తమమేమో అనే భావన పెంపొందడానికి, ప్రభుత్వరంగ మంటేనే ఏవగింపు కలగడానికి కారణమయ్యాయి. మన ప్రభుత్వాలు, పేరుకు ఏవైనా, అన్నిటికన్నీ కూడా ప్రభుత్వ రంగ ఆస్తిపాస్తులను ప్రైవేటు పరంచేసే ప్రక్రియ వేగాన్ని పెంచుకుంటూ పోయాయి. ఆ వేగం ఇప్పుడు ఎంతవరకు వచ్చిందంటే ప్రభుత్వరంగ సంస్థలనేవి ఏవైనాకాని, అవి లాభాల్లో ఉన్నా, లేక నష్టాల్లో ఉన్నా వాటి ఉనికన్నది లేకుండా చేయడం వరకు వచ్చింది.

ప్రభుత్వరంగ బ్యాంకులు, జీవిత బీమా సంస్థలు, ఇంధన సంస్థలు, టెలికాం రంగం, విద్యుత్ రంగం, ఇనుము ఉక్కు పరిశ్రమలు, బొగ్గు ఇతర ఖనిజ గనులు, విమాన నౌకా ఆశ్రయాలు ఇక ప్రభుత్వం చేతిలో ఉండకూడదు. వీటిలో పనిచేసే ఉద్యోగులు, ఉత్పత్తి కార్మికులు ఎవరి దారి వారు వెతుక్కోవాలి. అసంఘటితులై చెదిరిపోవాలి. ఇప్పటికే బలహీనపడి ఉన్న సంఘటిత ఉద్యోగ కార్మిక శక్తులకు అసలు ఉనికన్నదే లేకుండా చేయాలి. ప్రైవేటు పెట్టుబడికి ఏ ఆటంకము ఉండకూడదు.

పెట్టుబడి ప్రపంచీకరణ వెల్లువలో సరుకుల ఉత్పత్తి ఖండాంతరాలుగా విస్తరించింది. ఉత్పత్తి యాంత్రీకరణ తీవ్రమై అంతర్జాతీయంగా శ్రమశక్తి పెట్టుబడికి పూర్తిగా సలాములు కొట్టే దశకు చేరుకుంది. అంతర్జాల సరుకుల వ్యాపార విజృంభణతో అసంఘటిత, తాత్కాలిక, ఏ గంటకాగంట పనివారి సంఖ్య పెరిగి శ్రామిక వర్గమనే పదానికి కాలం చెల్లిపోయింది. సరుకుల రవాణా, ప్రజా ప్రయాణం వ్యక్తిగతమై వాహన ఉత్పత్తి వాటి ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలన్నీ ప్రైవేటీకరణ సంద్రమైనాయి.

ఇవ్వాళ మోడీకి సరళీకరణ దూకుడు మాస్టర్‌గా కిరీటం పెడుతున్నారుగాని, 'గవర్నమెంట్ హాస్ నో బిజినెస్ టు బి ఇన్ బిజినెస్', వ్యాపారం చేయడం ప్రభుత్వాల వ్యాపార వ్యవహారం కాకూడదనేది ఉదారవాద పెట్టుబడి మూలసూత్రం. ఈ పంథాలో దేశాన్ని నడిపించాలనుకొనే వారెవరైనా నా ఈ దారిలో నడవాల్సిందే!

ఏ సంస్థకైనా, అది ప్రైవేటైనా, పబ్లిక్ఐనా, గీటురాయి సమర్థవంత పని విధానం, అందులో పనిచేసేవారితో ఆ సంస్థ సంబంధ బాంధవ్యాలు, ఆ సంస్థ నిర్వర్తించాల్సిన సామాజిక బాధ్యత, ప్రజా సంక్షేమానికి అది అందించే చేయూత.

అలానే ఆయా సంస్థల్లో పనిచేసేవారు, ఆ సంస్థలను ఏమేరకు తమదిగా భావిస్తూ తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు? ఆ సంస్థలు గాడి తప్పకుండా, తమ చేజారిపోకుండా, కాపాడుకొని నిలబెట్టుకోవాలనే స్పృహ, చైతన్యంతో ఉన్నారు? ఈ అంశాల్లో ఓ నూతన అవగాహన సమాజంలో చోటుచేసుకోకుండా, ప్రజల మానసిక స్థితి ఓ కొత్త మలుపు తిరగకుండా ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజారంగ ఆస్తిపాస్తులన్నీ ప్రజల చేజారిపోతాయి. ఏ రంగాన్ని భ్రష్టు పట్టించినా నష్టపోయేది ప్రజలే కదా!

ఈ దేశంలో ఇప్పుడు దిగడి ఉన్న శ్రామిక పక్షపాత ధోరణి కాలం చెల్లిన సత్తు బేడ కాసు లేక ఓ చిల్లు కానీ! అన్ని రంగాల్లో పనిచేసే అన్ని దొంతరల పనివారు, ఉద్యోగులు తమ యోగక్షేమం గురించి, తమ భావితరాల బాగోగుల గురించి ఇప్పుడే ఓ నూతన ఆలోచన, సంఘటిత పదే ఐక్య కార్యాచరణకు పూనుకొని ప్రజా ఉద్యమాల్లో సంఘటిత పడడం మినహా వేరే మార్గం లేదు. ఒకింత అటో, ఇటో, ఈ పరిణామం చోటు చేసుకోవడం అనివార్యం.. వీ

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు)

పుప్పాల రాఘవయ్య మృతి

సామాజిక కార్యకర్త పుప్పాల రాఘవయ్య(92) అనారోగ్యంతో జూలై 30న మచిలీపట్నంలో మృతిచెందారు. ఆయన కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో జన్మించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ తరువాత కాలంలో పౌర హక్కుల సంఘం, యువజన సంఘాలతో కలిసి పనిచేశారు ఆ ప్రాంతాలలో జరిగిన ప్రజా సంఘాల సభలు, సమావేశాలకు ఎంతో సహకరించేవారు ఆయన కొండపల్లి సీతారామయ్య, సత్యమూర్తి గార్లతో ప్రభావితమై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి విప్లవోద్యమం వైపు వచ్చి చివరి వరకు ఆ భావజాలంతోనే ఉన్నారు. గంజి రామారావు గారితో కలిసి అనేక ఉద్యమాల్లో ఆ జిల్లాలో పాల్గొన్నారు.

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ

ఏడు సంవత్సరాల పాలనలో నరేంద్రమోడీ ప్రభుత్వం అమలుచేసిన ఆర్థిక విధానాల ఫలితాలను సమీక్షిస్తున్నారు

రాంపల్లి శశికుమార్

నరేంద్ర మోడీ గారూ... ఏడు సంవత్సరాలు భారతదేశ ప్రధాన మంత్రిగా అత్యంత బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పటికీ కనీసం ఒక్కసారైనా మీరు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి విలేఖరుల ప్రశ్నలకు జవాబులు ఇవ్వలేదు కాబట్టి ఇలా బహిరంగంగా కొన్ని ప్రశ్నలు అడగవలసి వస్తోంది. సమాధానాలు వస్తాయనే ఆశతో కాదు కానీ ప్రశ్నించే హక్కుతో పాటు బాధ్యత కూడా కాబట్టి మాత్రమే...

1). 2014 ఎన్నికల ప్రచారంలో అనేకచోట్ల ప్రసంగిస్తూ విదేశాలలో మూలుగుతున్న భారతీయ నల్లధనాన్ని వెనక్కి రప్పిస్తా అని హామీ ఇచ్చారు. గత ఏడు సంవత్సరాలలో ఎంత నల్లధనం విదేశాల నుంచి భారతదేశంలోకి తీసుకురాగలిగారు?

2). నేరారోపణలు ఉన్న శాసన సభ్యుల, పార్లమెంట్ సభ్యుల పైన కేసుల విచారణకై స్పెషల్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ చేపట్టి ఒక సంవత్సరంలోగా దోషులను జైలుకు పంపిస్తానని 2014లో చెప్పారు. అలా ఎంత మంది క్రిమినల్ ఎంపి, ఎంఎల్ఏలను ఇప్పటివరకు శిక్షించగలిగారు?

3). 100 పట్టణాలను స్మార్ట్ సిటీస్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అందులో ఎన్ని పట్టణాలు అనుకున్న విధంగా స్మార్ట్ సిటీస్ అయ్యాయి?

4). జన్ ధన్ ఖాతాలు దేశ ప్రజలకు అందుబాటులోకి తెచ్చే సమయంలో ప్రతి ఖాతాకు ఐదు వేల రూపాయలు ఓవర్‌డ్రాఫ్ట్ (తాత్కాలిక రుణం) సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఆ తర్వాత దాన్ని 10 వేల రూపాయలకు పెంచారు. 2021 మే నాటికి సుమారుగా 42 కోట్ల జన్ ధన్ ఖాతాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఖాతాలు అన్నిటిపై ఎంత ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం ఇప్పటివరకు కల్పించారు?

5). ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద ఇప్పటివరకు ప్రజల నుంచి ఎంత ప్రీమియం వసూలు చేశారు? ఎంత మొత్తం క్లెయిమ్‌ల కింద చెల్లించారు? ఆయా పథకాలలో కేంద్ర ప్రభుత్వ వాటాగా చెల్లించ వలసిన మొత్తాలను చెల్లించకపోగా, రాష్ట్ర ప్రభుత్వాలకే ఆ బాధ్యతను బదలాయించిన తర్వాత కూడా వాటి పేర్లలో ప్రధానమంత్రి అనే పదం ఇంకా వాడుతూ ఉండటం సబబేనా?

6) ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇప్పటివరకు రైతుల నుంచి ఎంత ప్రీమియం వసూలు చేశారు? ఎంత మొత్తం క్లెయిమ్‌ల కింద చెల్లించారు? ఆ పథకం రైతులకు ఉపయోగ పడుతోందా లేక ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎక్కువ ఉపయోగపడుతోందా?

7). 2015లో అట్టహాసంగా ప్రవేశపెట్టిన గోల్డ్ మానిటైజేషన్ పథకం ప్రకటిత లక్ష్యాలను సాధించగలిగిందా లేక సాగిలపడి ఉందా?

8). 2016లో అమలు అయిన ఆదాయ వెల్లడి పథకం (ఐడిఎస్) ద్వారా ఎంత మేరకు నల్లధనం వెల్లడించబడింది? దానిపై ఎంత పన్నుని కేంద్ర ప్రభుత్వం వసూలు చేయగలిగింది?

9). పెద్ద నోట్ల రద్దు (డిమానిటైజేషన్) వల్ల ఎంతమేరకు నల్లధనం నిర్వీర్యపరచబడింది? నకిలీ కరెన్సీ చలామణి ఆగిందా? అవినీతికి అడ్డుకట్ట పడిందా? దేశంలో ఇప్పుడు ఎవరి వద్ద నల్లధనం లేదా?

10). పెద్ద నోట్ల రద్దు సమయంలో కొత్త నోట్ల సైజు పాత నోట్ల సైజు కన్నా భిన్నంగా ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయని ఊహించలేకపోవటం భారీ వైఫల్యం కాదా? అయినా అంత చిన్న లాజిక్ ఎలా మిస్సయ్యారు సార్?

11). పెద్ద నోట్ల రద్దు అంత గొప్ప నిర్ణయమే అయితే, అప్పటి నుంచి ఇప్పటి దాకా భారతదేశపు జిడిపి వృద్ధిరేటు ఎందుకు తగ్గుతూనే ఉంది?

12). పెద్ద నోట్ల రద్దు కారణంగా దేశవ్యాప్తంగా చనిపోయిన అభాగ్యుల మరణాలకు (జవాబుదారి సంగతి అటుంచి) కనీసం సంతాపం అయినా తెలిపారా?

13). ప్రధానమంత్రి కాకముందు ఆధార్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన మీరు ప్రధానమంత్రి అయిన తర్వాత ఎందుకు సకల వ్యవస్థలను ఆధార్ కార్డుకు అనుసంధానించే విధానం అవలంబించారు? మీ ఆలోచనలో మార్పుకు కారణం ఏమిటి?

14). అమెరికన్ డాలర్‌తో రూపాయి మారకం విలువ దిగజారడానికి అప్పటి కేంద్ర ప్రభుత్వపు చేతకానితనం కారణమని తీవ్రంగా నిందించిన మీరు గత ఏడు సంవత్సరాలుగా దిగజారుతున్న రూపాయి మారకపు విలువకు ఎవరి చేతకానితనం కారణమంటారు?

15). గత ఏడు సంవత్సరాలలో కొత్తగా స్థాపించబడిన పరిశ్రమలు ఎన్ని? మూతపడిన పరిశ్రమలు ఎన్ని?

16). గత ఏడు సంవత్సరాలలో కొత్తగా సృష్టించబడిన ఉద్యోగాలు ఎన్ని? ఊడిపోయిన ఉద్యోగాలు ఎన్ని?

17). కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని గత ఏడు సంవత్సరాలలో పెట్రోలుపై 247 శాతం, డీజిల్ పై 793 శాతం పెంచి సామాన్యుల నడ్డి విరగగొట్టటమే అచ్చేదిన్ (మంచి రోజులు) తీసుకువచ్చినట్లు

అని మీరు భావిస్తున్నారా?

18). ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు తగ్గుతూ ఉండగా, భారతదేశంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఎందుకు పైపైకే పోతున్నాయి? అంతర్జాతీయ ముడి చమురు ధరల తగ్గుదల వల్ల వచ్చిన లాభాన్ని ప్రజలకు బదలాయించకుండా ఎందుకు సైంధవుడిలా అడ్డుపడుతున్నారు?

19). గ్యాస్ సిలెండర్లపై పేద, మధ్య తరగతి వారికి ఇచ్చే సబ్సిడీకి చడీ చప్పుడు కాకుండా ఎందుకు భారీ కోత పెట్టారు? కనీసం ఆ మేరకు ఒక ప్రకటన సైతం చేయలేదేం?

20). గత ప్రభుత్వాల అవినీతి కార్యకలాపాలపై విచారణ ఎంత వరకు వచ్చింది? బొగ్గు కుంభకోణం, 2జి, ఆగస్టా, కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణం వగైరా అవినీతి కుంభకోణాలలో ఎన్ని రుజువు చేయగలిగారు? ఎంత మందిని శిక్షించగలిగారు? రాబర్ట్ వాద్రా ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నాడేం?

21). పనామా పేపర్లు వెల్లడించిన భారతీయ నల్లధనాధీశుల పైన విచారణ జరుగుతోందా? ఒకవేళ జరిగితే దాని పురోగతి ఏమిటి?

22). గత ఏడు సంవత్సరాలుగా పేదవారు మరింత పేదలుగా, ధనవంతులు అత్యంత ధనవంతులుగా మారుతూ ఆదాయ అసమానతలు, సంపద అసమానతలు పెరుగుతూనే పోతున్నాయి. ఈ సరళిని మార్చేందుకు మీ వద్ద ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా? లేక ఇదే మీరు కలలు కన్న నవభారతమా?

23). స్వచ్ఛ భారత్ అభియాన్ కింద దేశవ్యాప్తంగా ఎన్ని మరుగుదొడ్లు నిర్మించారు? అందులో ఎన్నింటికి నీటి పంపు సౌకర్యం ఉంది? వాటిలో ఎన్నింటిలో నిజంగా నీళ్లు వస్తాయి?

24). కెమెరాల ముందు పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగిన మీరు, సాటి మానవుల మల మూత్రాదులను శుభ్రం చేయవలసిన దీన స్థితిలో వందలాది మంది పారిశుద్ధ్య కార్మికులు మరణిస్తూ ఉంటే వారికి ఎంత మొత్తం నష్ట పరిహారం చెల్లించారు? అసలు అలా ఎవరూ చనిపోలేదని పార్లమెంటు సాక్షిగా బొంకటం మానవత్వమేనా?

25). వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) ప్రవేశపెట్టిన తరువాత మన దేశపు జి.డి.పి వృద్ధి రేటు కనీసం రెండు శాతం పెరుగుతుందని అంతకుముందు ఊదర కొట్టినప్పటికీ, నిజానికి అది తగ్గుతూనే పోతోందని మీరు గమనించడం లేదా? ఈ తగ్గుదలకు మీరు సైతం జవాబుదారీ కాదా?

26). స్కిల్ ఇండియా ప్రోగ్రాం కింద ఇప్పటివరకు ఎంతమంది యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి జరిగింది? అందులో ఎంతమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి?

27). దేశద్రోహి కన్నయ్య కుమార్ కేసు విచారణ ఎంత వరకు వచ్చింది? ఎందుకు త్వరత్వరగా అతని నేరం రుజువు పరచి జైలుకు పంపరు?

28). మా ప్రియతమ ప్రధానమంత్రి అయిన మీ హత్యకే కుట్ర పన్నిన కరుడు కట్టిన దేశ ద్రోహుల కేసులు ముందుకు కదలవెందుకు? తగిన ఆధారాలు ఉంటే వాటిని నిరూపించడానికి ఇంత సమయం ఎందుకు పడుతోంది? ఇలాంటి అతి ముఖ్యమైన కేసులే నత్తనడక నడుస్తుంటే సామాన్యులకు చట్టబద్ధ పాలనపై నమ్మకం ఎలా కుదురుతుంది?

29). ప్రతి ఎన్నికలకు ముందు ఆదాయపు పన్ను శాఖ కేవలం మీ ప్రతిపక్ష నాయకుల పై మాత్రమే ఎందుకు దాడులు చేస్తుంది? ఎన్నికల తర్వాత సైతం ఆ దాడులలో నిజంగా ఏమి పట్టుకున్నారు అనే విషయం ఎందుకు బహిర్గతం చేయరు?

30). మీరు అవినీతిని అస్సలు సహించరని అంతా అనుకున్నాము. కానీ ఇతర పార్టీలనించి అత్యంత అవినీతిపరులను మీ పార్టీలోకి ఎందుకు చేర్చుకుంటున్నారు? అవినీతిని అంతమొందించకుండా ఇతరుల అవినీతిని బ్లాక్ మెయిల్ రాజకీయాలకు వాడుకోవడం మీ స్థాయికి తగునా?

31). ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ మీ ప్రభుత్వం తీసుకొచ్చిన సిఏఏ, ఎన్‌ఆర్‌సిలను వ్యతిరేకించేవారిని వారి బట్టలు చూసే గుర్తుపట్టవచ్చు అని చెప్పారు. కానీ అవి ఎలాంటి బట్టలో చెప్పలేదు. దయచేసి చెప్తారా?

32). భారతదేశానికి గర్వకారణమైన ఐఐటిలలో 38 శాతం, ఐఐఎంలలో 74 శాతం అధ్యాపక పోస్టులు ఎందుకు ఖాళీగా ఉంచారు?

33). ఆత్మనిర్భర భారతం సాధించాలంటే విద్యపై ప్రభుత్వ ఖర్చు పెంచవలసి ఉండగా గత ఏడు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వపు విద్యా మంత్రిత్వ శాఖకు కేటాయింపులు మన జిడిపిలో శాతంగా ఎందుకు తగ్గిస్తూ వస్తున్నారు?

34). రాజ్యాంగబద్ధ సంస్థ అయిన కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా) రెక్కలు కత్తిరించి, వారి రిపోర్టులను బుట్టదాఖలు చేస్తూ జవాబుదారీతనం నుండి పారిపోవడం గుడ్ గవర్నెన్స్ అనిపించుకుంటుందా?

35). ఐదు సంవత్సరాల క్రితం బడ్జెట్ ప్రసంగంలో దేశవ్యాప్తంగా రెండు వేల డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఎన్ని ఏర్పాటు చేశారు?

36). 2022 నాటికల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని 2016లో ప్రకటించారు. ఆ లక్ష్య సాధన ఎంతవరకు వచ్చింది? అందుకు గడువు ఇంకొక్క సంవత్సరమే ఉందని మీకు గుర్తుందా?

37). మీ పార్టీ మేనిఫెస్టోలోనే పెట్టిన హామీలలో ఒకటైన స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలు సాధ్యం కాదని మీ ప్రభుత్వమే సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం సబబేనా?

38). ఓటేసిన పాపానికి ఓటిపి బ్రతుకులుగా మార్చి దేశ ప్రజల దైనందిన కార్యకలాపాలను మొబైల్‌లకు, స్మార్ట్ ఫోన్‌లకు, ఇంటర్నెట్‌కు ముడి వేసిన డిజిటల్ ఇండియాలో వీటికి నోచుకోని అభాగ్యులకు స్థానం లేదా? గ్రామీణ భారతం గోడు చెవిని పట్టదా?

39). 2018లో ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకం యాభై కోట్ల మంది భారతీయులకు ఆరోగ్య రక్షణ కల్పిస్తుందని భారీ ప్రకటన చేసినప్పటికీ ఆ పథకం లబ్ధిదారులు ఇంకా ఒకటిన్నర కోట్లకు మించలేదెందుకు? ఆ పథకానికి కేటాయించిన నిధులకు,

పెడుతున్న ఖర్చుకు అంత అంతరం ఎందుకు ఉంటోంది?

40). చిల్లర వ్యాపారస్తులకు పెన్షన్ పథకం 2019లో ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు ఆ పథకానికి కేంద్ర ప్రభుత్వం తరపు వాటా ఎంత జమ చేసారో చెప్పగలరా?

41). ప్రజాస్వామ్యపు దేవాలయం అని కొనియాడుతూ పార్లమెంట్ మెట్లకు నమస్కరించి ప్రవేశించిన మీరే ముఖ్యమైన చట్టాలను సైతం పార్లమెంటరీ కమిటీలకు పంపకుండా, ఆరోగ్యకరమైన చర్చను చేపట్టకుండా, వ్యవసాయ చట్టాల విషయంలో అయితే కనీసం ఓటింగ్ కూడా (రాజ్యసభలో) పెట్టకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు మౌలిక సూత్రాలను తుంగలో తొక్కడం విరోధాభాస కాదా?

42). అవినీతి వ్యతిరేక లోక్‌పాల్ ఉద్యమం నుంచి రాజకీయంగా లాభపడి, అవినీతి వ్యతిరేక సామ్రాట్‌గా కీర్తించబడుతున్న మీరు ప్రధానమంత్రి అయిన నాలుగు సంవత్సరాలకు గాని లోక్‌పాల్‌ను నియమించకపోవడం, నియమితులైన లోక్‌పాల్ సైతం అచేతనంగా మిగిలిపోవడం ఏ రకంగా సమర్థనీయం?

43). ఒకపక్క ధార్మిక, సేవా సంస్థలకు విదేశీ విరాళాలను బహిష్కరిస్తూ లేదా క్లిష్టతరం చేస్తూ, అదే సమయంలో రాజకీయ పార్టీలు మాత్రం అడ్డదారిలో విదేశీ విరాళాలు తీసుకోవచ్చు అనే చట్ట సవరణలు చేసుకోవడం అసమంజసం కాదా?

44). తమ లాభాలలో ఎంత శాతం అయినా రాజకీయ పార్టీలకు కార్పొరేట్ కంపెనీలు విరాళం ఇవ్వచ్చు అనే సవరణ, ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో రాజకీయ పార్టీలు రహస్యంగా ఎంతైనా విరాళాలు సేకరించవచ్చు అనే సవరణ 'కేంద్రీకృత', 'వ్యవస్థీకృత' రాజకీయ అవినీతికి పరాకాష్ట కాదా? దీనినే పారదర్శకత అంటారా? అవినీతి రహిత పాలన అంటే ఇదేనా?

45). ఆదాని గ్రూపుకు 2013లో దేశవ్యాప్తంగా 44 ప్రాజెక్టులు మాత్రమే ఉండగా ఇప్పుడు అవి 100కు పైబడి పెరగడం కేవలం కాకతాళీయమేనా? ఇందులో మీ ప్రభుత్వ హస్తం ఏమీ లేదంటారా? ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలను తీవ్రంగా విమర్శించిన మీరు సైతం అదే ఒరవడి కొనసాగించడం సబబేనా?

46). దేశంలో నిరుద్యోగతా శాతం నాలుగు దశాబ్దాలలోనే అత్యధికంగా ఉందనే నివేదికని 2018లోనే గణాంక శాఖ ఇచ్చినప్పటికీ దానిని కేవలం ఎన్నికల లబ్ధి కోసం తొక్కి పెట్టి గట్టెక్కారు. మరలా ఆ తరువాత ఎటువంటి అధికారిక నివేదిక రాలేదు. ఎప్పటికి దానిని ఆశించవచ్చు?

47). గత ఏడు సంవత్సరాలలో ఏడు లక్షల కోట్ల రూపాయలకు పైగా మొండి బాకీలు మన బ్యాంకులు రద్దు చేయగా, చౌకీదార్ అని చెప్పుకునే మీరు అటువంటి బాకీల వసూళ్లకు ఏ చర్యలు తీసుకున్నారు? ఎందుకు అంత పెద్ద మొత్తంలో వాటిని రద్దు చేయవలసి వచ్చింది? బ్యాంకుల వద్ద సామాన్య ప్రజలు దాచుకున్న ఆ డబ్బుకు జవాబుదారీ ఎవరు?

48). మన కళ్లముందే విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, మేహుల్ చౌక్సి వంటి ఘరానా మోసగాళ్లు దేశం దాటి వెళ్లిపోగా, ఇంకా బ్యాంకింగ్ రంగపు మోసాలు కేవలం గత మూడు సంవత్సరాలలోనే సుమారు 4 లక్షల కోట్ల రూపాయల మేరకు జరిగాయంటే ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థ మీద నమ్మకం సన్నగిల్లిపోదా? అటువంటి విపత్కర పరిస్థితిని నివారించడానికి ఏ చర్యలు చేపడుతున్నారు?

49). క్యాబినెట్ అనుమతి లేకుండానే కేవలం నాలుగు గంటల వ్యవధిలో అకస్మాత్తుగా మీరు విధించిన లాక్ డౌన్ వేలాది మంది వలస కార్మికుల, కటిక పేదల దైనందిన జీవితాలను ఛిన్నాభిన్నం చేయనుంది అని మీకు ముందుగా తెలియలేదా? ఒకవేళ తర్వాత అర్థమైనా "వలస కార్మికులు ఎవరూ రోడ్లపై లేరు" అని అధికారికంగా మీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయటం క్రూర హాస్యం కాదా?

50). వ్యవసాయ చట్టాల రద్దు కోసం పోరాటం చేస్తూ తమ ప్రజాస్వామిక హక్కులకై నినదిస్తున్న లక్షలాది మంది రైతుల గోస మీకు వినపడడం లేదా? వందలాది మంది రైతులు ప్రాణాలు సైతం కోల్పోయినప్పటికీ కనీసం సంతాపం అయినా వ్యక్తం చేశారా? దేశానికే అన్నదాతలైన వారినే ఆందోళన జీవులని గేలి చెయ్యడం సంస్కారమేనా?

51). గత సంవత్సరం మీరు ప్రకటించిన 20 లక్షల కోట్ల రూపాయల పైచిలుకు ఆత్మనిర్భర్ ఆర్థిక ప్యాకేజీలో ఎంత మొత్తం సామాన్య ప్రజల జేబుల్లోకి చేరింది?

52). మీరే నియమించిన నిపుణుల కమిటీ కరోనా రెండవ తరంగం రానుందని మార్చి 2021లోనే హెచ్చరించినప్పటికీ చెవిన పెట్టక మీరు ఎలక్షన్లలో తలమునకలై ఉండడం భారతదేశ ప్రజల పాలిట శాపంగా పరిణమించలేదా? మీ నిర్లక్ష్య ధోరణి వల్ల కోల్పోయిన లక్షలాది ప్రాణాలకు ఎవరు జవాబుదారీ అవుతారు?

53). మీకు గతంలో లక్షల విలువైన సూటును బహూకరించిన వారికే వెంటిలేటర్లు తయారుచేసే కాంట్రాక్ట్ (పిఎం కేర్స్ ఫండ్ నుంచి) ఇచ్చారని వార్తలు వస్తున్నాయి. అది నిజమేనా? ఆ వెంటిలేటర్లు చాలా చోట్ల పని చేయట్లేదు అని సైతం ఆరోపణలు వస్తున్నాయి. దీనికి మీ సమాధానం ఏమిటి? అసలు పిఎం కేర్స్ ఫండ్‌లోకి ఎంత మొత్తం విరాళాలు వచ్చాయి? మీ మీద నమ్మకంతో విరాళాలు ఇచ్చిన వారికి పారదర్శకంగా ఆ ఫండ్ వివరాలను వెల్లడించాల్సిన బాధ్యత మీకు లేదా?

54). మీ మన్ కీ బాత్ యూట్యూబ్ వీడియోలని ఎంతమంది ఇష్టపడుతున్నారో, ఎంతమంది ఇష్టపడడం లేదో పారదర్శకంగా అందరూ తెలుసుకునే అవకాశాన్ని ఈ మధ్యనే ఎందుకు రద్దు చేశారు? ప్రజాభిప్రాయం అంటే భయమా? చులకనా? లేక ఏవగింపా?

55). దేశ భద్రతను గాలికి వదిలేసి, ప్రజల ప్రాథమిక హక్కు అయిన వ్యక్తిగత గోప్యతను పూర్తిగా హరిస్తూ జర్నలిస్టులపై, రాజకీయ ప్రత్యర్థులపై, చివరికి మహిళలపై సైతం దొంగచాటు నిఘా విధించటమే మీరు తరచూ చెపుతూ ఉండే నవ భారతం యొక్క స్పెషాలిటీనా?

56). ప్రపంచంలో ఏ ప్రభుత్వాధినేతా ప్రెస్ కాన్ఫరెన్స్ సైతం నిర్వహించకుండా ప్రజాస్వామ్య వ్యవస్థలను నడపలేదు. మీకు ఆ చెడ్డపేరు చరిత్రలో మిగిలిపోవటం మాకు ఇష్టం లేదు. కనుక దయచేసి ప్రెస్ కాన్ఫరెన్స్ ఎప్పుడు పెడుతున్నారో సెలవివ్వండి.

(రచయిత చార్టర్డ్ అకౌంటెంట్) వీ

ప్రైవేటైజేషన్‌తో రిజర్వేషన్లు హుళక్కే

దేశాభివృద్ధికి దోహదపడిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల సమాజం నష్టపోతుందని, సామాజిక న్యాయం కోసం ఉద్దేశించిన రిజర్వేషన్‌లు అమలు కావని అంటున్నారు **తండా సదానందం**

సుమారు రెండు వందల సంవత్సరాలు బ్రిటిష్ పాలనలో నలిగిన భారతదేశం దాస్య శృంఖలాలను తెంచుకొని 75 సంవత్సరాలు కావస్తున్నది. బ్రిటిష్ పరిపాలన పూర్వం, బ్రిటిష్ పరిపాలనలో చతుర్వర్ణ వ్యవస్థ విస్తృతంగా అమలులో ఉంది. శూద్రులు బానిసల వలె శ్రమ చేస్తూ పై కులాల వారికి ఊడిగం చేస్తున్న పరిస్థితులలో వీటన్నింటికీ పరిష్కారం, దేశానికి స్వాతంత్ర్యం రావడమేనని కాంక్షించి భారత జాతి మొత్తం జాతీయోద్యవ ం కదన రంగంలోకి దూకింది. వీరోచిత పోరాటంతో, ఎందరో నాయకుల అమరత్వపునాదులపై, వారు చిందించిన రక్తపు సాక్షిగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అనేక రాజ్య సంస్థానాలుగా విడగొట్టబడి రాచరిక పాలనలో ప్రజలు కులం అడ్డుగోడగా, అసమానతల అంతరాల సమాజంలో బతుకు బండిని లాక్కెళ్తూ ఉన్నటువంటి పరిస్థితుల్లో స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆనాటి జాతీయ నాయకులు అన్ని సంస్థానాలను కలిపి భారతదేశంగా పరిపాలించుటకు, అంతరాలులేని సమాజంగా తీర్చిదిద్దుటకు, అట్టడుగు వర్గాల వారికి సామాజికంగా విద్యాపరంగా ప్రత్యేక సదుపాయాలు కల్పించుటకు రిజర్వేషన్లను తీసుకురావడం జరిగింది. స్వాతంత్ర్యానికి పూర్వమే బ్రిటిష్ పాలనలోని కొన్ని ప్రాంతాలలో, కొన్ని స్వదేశీ సంస్థానాలలో రిజర్వేషన్లు ఉండేవి.

భారతదేశంలో భిన్న పరిస్థితులు అనగా వివిధ మతాలవారు, కులాలవారు వైరుధ్యాలతో కూడిన వాతావరణ పరిస్థితి గల ప్రాంతాలు, వివిధ రకాల వేషభాషలు కలిగి అనేక రకాలుగా భిన్నత్వాన్ని కలిగి ఉన్న ప్రజా సమూహాన్ని ఏకతాటిపైకి తెచ్చి ప్రజలందరి ఆకాంక్షల మేరకు పరిపాలన కొనసాగించాలనే ఆలోచనతో పూర్తిగా సామ్యవాద వ్యవస్థగా కాకుండా, పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థగా కాకుండా కలగలిపి మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అమలు చేయాలని నిర్ణయించినప్పటికీ అంతిమంగా సామ్యవాద స్ఫూర్తిని కలిగి ఉండాలని, ఆ దిశగా పాలన కొనసాగించి సాధ్యమైనంత త్వరగా అసమానతలు లేని సమాజాన్ని నెలకొల్పాలనే ధ్యేయంతో, తొలి ప్రధానిగా నెహ్రూ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రష్యా ప్రభావానికి గురై భావిభారత అభివృద్ధికి, మన దేశంలో కూడా ప్రణాళికలు ఉండాలని తలచి ప్రణాళికా సంఘం ఏర్పరిచి 1951-52 నుండి పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించాడు. పార్లమెంటులో ప్రణాళికల గురించి మాట్లాడుతూ నెహ్రూ ప్రభుత్వ రంగాన్ని పెంచుతూ, ఉత్పత్తి రంగాలను ప్రభుత్వపరం చేస్తూ వీటి ఫలితాలను ప్రజలకు అందేలా చేయాల్సి ఉందని ప్రజాస్వామ్య స్థాపనకు దోహదం చేస్తూ ఆర్థిక పారిశ్రామిక రంగాలలో ప్రగతిని సాధించడమే ఆర్థిక ప్రణాళికల ముఖ్య ఉద్దేశమని అన్నారు.. ఆ ఫలితమే 1950లో ప్రణాళికా సంఘం ఏర్పడింది. ఆరవ పంచవర్ష ప్రణాళికనుండి ప్రభుత్వరంగం వాటా క్రమంగా తగ్గిపోతు, ప్రైవేట్ రంగం వాటా పెరుగుతూ వచ్చింది. ఈ విధంగా స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో పాలకులు సామ్యవాద స్ఫూర్తితో సమాజంలోని అంతరాలు అసమానతలను రూపుమాపడానికి కృషి చేసినట్లు స్వయం సమృద్ధి స్వావలంబన దిశగా ప్రయత్నాలు చేసినట్లు కనిపిస్తుంది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పాలకులు ప్రభుత్వరంగ వాటాను తగ్గిస్తూ... ప్రైవేట్ పరం చేస్తూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను సైతం సామాజిక బాధ్యతతో సమకూర్చాల్సింది పోయి ఆ బాధ్యతలనుంచి తప్పించుకుంటూ ప్రభుత్వ మంత్రిత్వశాఖలో డిజిన్వెస్ట్‌మెంట్ శాఖను సైతం ప్రవేశపెట్టడం జరిగింది. మరి 2014 నుండి నేటి వరకు పూర్తిగా ప్రైవేటీకరణకు ధారాదత్తం చేస్తున్నట్లు కనిపిస్తోంది.

సాక్షాత్తూ ప్రధానమంత్రి మోడీ ప్రతి రంగాన్ని ప్రైవేటుపరం చేస్తాం, ప్రభుత్వాలు వ్యాపారం చేయవు అని ప్రకటించారు. అ దిశలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కూడా పెట్టుబడుల ఉపసంహరణ తప్పదు అని కరాఖండిగా ప్రకటిస్తూ, మొండిగా ప్రైవేటీకరణ విధానాలను ముందుకు తీసుకెళుతున్నారు. దీంతో సామాన్యులు తమ జీవనాన్ని కొనసాగించుటకు విలవిలలాడుతున్న పరిస్థితులు కళ్లముందు కదలాడుతున్నాయి. కరోనా కాలంలో ప్రజలను ఆదుకోవాల్సింది పోయి అనాలోచితంగా లాక్‌డౌన్ విధించడంతో వలస కార్మికులు సామాన్యులు పడిన పాట్లు హృదయ విదారకం.

కరోనా వైరస్ కాటుకు పలువురు ఉద్యోగాలు కోల్పోయి వ్యాపారాలు సజావుగా సాగక, ఉపాధిని కోల్పోయి ఆర్థికంగా చితికి పోయి వున్న వారిని ఆదుకోకుండా, వారికి ఊరట కల్పించకుండా పలు చట్టాలలో మార్పులు తీసుకురావడం, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడంతో సామాన్యుల జీవన మనుగడ కష్టసాధ్యంగా మారింది.

కోవిడ్ కాలంలో పలు చట్టాల్లో మార్పులు తీసుకువచ్చి సామాన్యులకు వ్యతిరేకంగా కార్పొరేట్ల అభివృద్ధికి పనికివచ్చే చర్యలు చేపట్టడం జరిగింది. వాటిలో మచ్చుకు కొన్నింటిని పరిశీలిద్దాం.

1) నూతన వ్యవసాయ సాగు చట్టాలు :

నూటికి అరవై శాతం పైగా ప్రజలు నేటికీ ప్రాథమిక రంగమైన

వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారు. అందులో 80 శాతం పైగా చిన్న సన్నకారు రైతులకు, ఆరుగాలం శ్రమించి మట్టినుండి బువ్వను తీసి ప్రజలకు అందిస్తున్న అన్నదాతలకు ఆసరాగా ఉండి బ్రతుకు భరోసాను ఇవ్వాల్సింది పోయి, 2022 నాటికి రెట్టింపు ఆదాయం చేస్తామని ప్రగల్భాలు పలికి, కనీస మద్దతు ధరను ఎత్తి వేసేవిధంగా, కాంట్రాక్టు వ్యవసాయంతో వ్యవసాయదారులు తమ పొలాల్లోనే కూలీలుగా మారే విధంగా, వ్యవసాయ మార్కెట్ కనుమరుగయ్యే విధానాలతో కూడిన నూతన సాగు చట్టాలను కరోనా కల్లోలిత విపత్కర పరిస్థితులలో గత సంవత్సరం సెప్టెంబర్ 27న రూపకల్పన చేయడం జరిగింది. ఈ చట్టాల రూపకల్పనలో ప్రజాస్వామిక విలువలు పాటించలేదు. ఈ నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని నవంబర్ 26, 2020 నుండి నేటి వరకు ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమం చేస్తున్న రైతన్నల పోరాట పటిమ ఆదర్శనీయం. అనేక రకాల ఇబ్బందులకు గురిచేసి కేసులు పెట్టినా, అవి రద్దు చేసేవరకు విశ్రమించేది లేదని పోరాట జైత్ర యాత్రను కొనసాగిస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితులలో 11 దఫాలుగా చర్చలు జరిపినా అవి నామమాత్రంగానే ముగిశాయి. అలా ఒకటిన్నర సంవత్సరం పాటు తాత్కాలిక వాయిదా వేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, 20-24 వరకైనా అవి పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌తో రైతులు కదనరంగంలో నిలబడడం శుభపరిణామం. దేశ భవిష్యత్తుకు, సామాన్య రైతుల జీవన మనుగడకు ఈ దేశాన్ని కార్పొరేటు దారులకు అప్పనంగ అప్పగించడాన్ని అడ్డుకుంటానికి రైతుల ఉద్యమాన్ని బలపరచడం, అన్నం తినే ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించవలసిన సమయం ఆసన్నమైంది.

2) బొగ్గు గనుల ప్రైవేటీకరణ :

ప్రభుత్వ రంగానికి చెందిన కీలక పరిశ్రమలలో ఒకటయిన బొగ్గు గనులను కూడా బడా కార్పొరేట్ పెత్తందార్లకు అప్పగించడానికి రంగం సిద్ధమైంది. మొదటగా సింగరేణితో సహా 50 కోల్ ఇండియా బ్లాకులను భవిష్యత్ కాలంలో మరో 500 బ్లాకులను ప్రైవేటీకరించడం జరుగుతుందని, 100 శాతం ఎఫ్‌డిఐలకు అవకాశం ఇస్తున్నట్లు ప్రస్తుత పాలక ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ప్రైవేటీకరించనున్న 50 బొగ్గు గనుల బ్లాకులను కొనుగోలు చేసిన వారికి, వాటి నిర్వహణకు ప్రభుత్వమే 1000 కోట్ల రుణ సదుపాయం అందించనుండడం ఆశ్చర్యకరం... 1947కు పూర్వం ఈస్టిండియా కంపెనీ చేతుల్లో బొగ్గు బావులు ఉండేవి. బ్రిటిష్ ప్రత్యక్ష పాలనలో 1894లో శేట్ ఖోరా రాంజీ చావడ అనే భారతీయుడు తొలిసారిగా ప్రైవేటు బొగ్గు కంపెనీ పెట్టాడు. 1956లో బొగ్గు గనుల నిర్వహణకు నేషనల్ కోల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పడింది. 1973 మేలో బొగ్గు గనుల జాతీయాకరణ జరిగింది. ఈ చట్టం రావడానికి ముందు కార్మికుల వేతనాలు, పని భద్రత, రక్షణ వంటి మౌలిక వసతులు అత్యంత దారుణంగా ఉండేవి. బొగ్గు గనుల జాతీయకరణ చట్టం చేయడంతో కార్మికులకు శ్రమకు తగ్గ వేతనాలు. రక్షణ, ఉద్యోగ భద్రత వంటి మౌలిక వసతులు, వెట్టి చాకిరి నుంచి విముక్తి లభించాయి. 50 వేల కోట్లకు పైగా గల టర్నోవర్‌తో రూపొందించబడి ప్రపంచంలోనే 6వ పెద్ద మైనింగ్ కంపెనీలలో ఒకటిగా ప్రసిద్ధి పొందింది. వేల మందికి బతుకు భరోసాను కల్పిస్తూ కార్మికుల పాలిట కల్పతరువు అయిన బొగ్గుగనులను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడం కార్మికుల, సామాన్య ప్రజల హక్కులను హరించడమే అవుతుంది.

3) ప్రజా రవాణా వ్యవస్థ-రైల్వేలు:

నేటి ఆధునిక యుగంలో రవాణా రంగం అత్యంత కీలకమైనది. అటువంటి రవాణా రంగంలో, ప్రజా రవాణా వ్యవస్థలో అతి ముఖ్యమైనది రైల్వే వ్యవస్థ. ప్రపంచ స్థాయిలోనే ప్రఖ్యాతిగాంచి ప్రతిరోజు మూడుకోట్ల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరుస్తూ ఉపయోగపడుచున్నవి రైల్వేలు. భారత ప్రభుత్వ రంగ సంస్థ యాజమాన్యంలో, భారత ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న అతి పెద్ద వ్యవస్థ. భారతదేశంలో రైల్వేలు మొట్టమొదటి సారిగా1853లో ప్రవేశపెట్టబడ్డాయి. 1947 నుంచి 1971 నాటికి దేశంలో మొత్తం 42 రైల్వే సంస్థలు నెలకొల్పారు. 1951లో ఈ సంస్థలన్నింటినీ కలుపుకొని ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే వ్యవస్థగా ఆవిర్భవించింది. రైలు మార్గాలు భారత్ నలుమూలలా విస్తరించి ఉన్నాయి. భారతీయ రైల్వే మార్గాలపై ప్రభుత్వం ఏకచ్ఛత్రాధిపత్యంను కలిగి ఉంది. రైలు మార్గాల మొత్తం దూరం 1,14,500 కిలోమీటర్లు. 7500 స్టేషన్లు కలవు. 2011 నాటికి రైల్వేల వద్ద 2,40,000 వ్యాగన్లు, 69 వేల కోచ్‌లు, 9000 ఇంజన్లు ఉన్నాయి. అంతేకాకుండా ప్రపంచంలోనే అత్యధిక ఉద్యోగులను కలిగిన సంస్థలలో రెండవదిగా పేరుగాంచినది భారతీయ రైల్వే వ్యవస్థ. మొదటి స్థానం చైనా మిలిటరీ వ్యవస్థ ఆక్రమించింది.

ప్రస్తుతం భారతీయ రైల్వేలు అధునాతనమైన కంప్యూటరీకరణ వ్యవస్థతో అత్యంత ఆధునిక సౌకర్యాలతో, ముందస్తు రిజర్వేషన్లు, ఆహార నిర్వహణ, పర్యాటక సంస్థలతో కూడి ఉన్నది. భారతీయ రైల్వేలు మొత్తం 8,702 ప్రయాణికుల రైళ్లను నడుపుతున్నది. ఇవి దేశంలోని 29 రాష్ట్రాలు మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రయాణికులను తమ తమ గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. మేఘాలయ, సిక్కిం, మిజోరాం, మణిపూర్, నాగాలాండ్ వంటి రైలు రవాణా సౌకర్యం లేని రాష్ట్రాలకు భారత ప్రభుత్వం రైలు సౌకర్యం కల్పించడానికి చర్యలు చేపట్టింది. గత సంవత్సరం మార్చి నెలలో కరోనా కారణంగా ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. దీంతో రైళ్లు కూడా ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఇప్పుడిప్పుడే పలు రైళ్లు పట్టాలెక్కాయి.

సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే అనేక ప్యాసింజర్ రైళు ్ల ఇంకనూ పట్టాల పైకి రాలేదు. ప్రజల జీవితాలలో అంతర్భాగమై వారి అభివృద్ధికి తోడ్పడిన రైలు గతంలో మాదిరిగా నడవకపోవడం మూలంగా ప్రజా జీవనం అతలాకుతలమవుతోంది. రైళ్లపై ఎంతో మంది ప్రజలు ఆధారపడి జీవించేవారు. వారి జీవితాలు దుర్భర పరిస్థితిలోకి నెట్టి వేయబడ్డాయి. ఎందరో అనాధలకు., అభాగ్యులకు,

దివ్యాంగులకు, చెత్త కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునే వారు, విధి వంచితులు ట్రాన్స్ జెండర్‌లు వంటి ఎందరో ఉపాధిని కోల్పోయి తిండికి ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాలలో కూలి పని చేసి సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లే భవన నిర్మాణ కార్మికులు, వివిధ రకాల షాపులలో, హాస్పిటల్స్‌లో, కార్యాలయాలలో, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌లో పని చేసే కార్మిక సోదరులు రైలు నడవకపోవడం మూలంగా ఉపాధిని కోల్పోయి నిరుద్యోగులుగా మిగిలిపోయారు. వీరంతా ఆకలితో అలమటిస్తూ ఉండగా రైళ్లను అన్నింటినీ సాధారణ స్థితిలోకి తీసుకొచ్చి వాటి మీద ఆధారపడ్డ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ఆదుకోవాల్సింది పోయి, అత్యంత ఉపయోగకరమైన అతి చౌకగా దూర ప్రాంతాలకు చేరవేసే ప్రజా రవాణా వ్యవస్థ బాధ్యతల నుండి తప్పుకొని బడా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి సిద్ధపడడం పాలకుల బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం.

2016లో నియమించిన బిబేక్ దేబ్రాయ్ కమిటీ ప్రకారం సికింద్రాబాద్, ఢిల్లీ, బెంగళూర్, చండీగఢ్, జైపూర్, ముంబై, ప్రయాగా రాజ్, హౌరా, చెన్నై లాంటి ప్రధాన రైల్వే స్టేషన్ల పరిధిలో 12 క్లస్టర్లలో ప్రైవేట్ రైళ్లు నడపాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే లక్నో నుండి ఢిల్లీకి, ముంబై నుండి అహ్మదాబాద్‌లకు తేజస్ ప్రైవేట్ రైలు నడుపుతున్నారు. ప్రభుత్వ సిగ్నలు, ప్రభుత్వ డ్రైవర్, ప్రభుత్వ గార్డులతో కూడిన ప్రైవేట్ రైళ్లు 2023 ఏప్రిల్ నుండి పట్టాలపై పరుగులు తీయనున్నాయి. సామాన్యుడు ప్రయాణించే రైళ్ల ప్రైవేట్ పరం వేయడం దేశ వ్యతిరేక చర్య. సామాన్యులకు అందుబాటులో లేకుండా చేయడం దారుణం. రైల్వే ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాల వారి కలలు కల్లలుగానే మిగిలి పోనున్నాయి. మూడు లక్షల మంది ఉద్యోగాలను తీసివేయడానికి రైల్వే శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ప్రైవేటు రైళ్లు నడపడానికి 20 బడా కార్పొరేట్ సంస్థలు ఆదాని ఫోర్బ్స్, టాట, ఎస్ఎల్ గ్రూప్, బొంబాడియో ఇండియా గ్రూపులకు చెందిన సంస్థలు ఉవ్విళ్లు ఊరుతున్నాయి. రైళ్లలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం, 109 రూట్లలో 150 ప్రైవేట్ ప్యాసింజర్ రైల్లకు అనుమతి ఇవ్వడాన్ని ప్రతిఘటించాలి. రైల్వేలను స్వదేశీ విదేశీ కార్పొరేట్లకు అమ్మివేసి దేశ స్వావలంబనకు హానిచేసే రైల్వే ప్రైవేటీకరణ విషాదం. ప్రైవేటీకరణ వల్ల చార్జీలు అత్యధికంగా పెరుగుతాయి. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు సామాన్యులకు అందుబాటులో లేకుండా బుల్లెట్ ట్రైన్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. రైల్వే ఉద్యోగాలు వాటి నియామక ప్రక్రియలో రిజర్వేషన్లు వర్తించవు. విద్యార్థులకు వికలాంగులకు జర్నలిస్టులకు, సీనియర్ సిటిజన్లకు సంబంధించిన రాయితీలు ఏవీ కూడా ఉండవు.

4) కార్మిక చట్టాలలో మార్పులు :

దేశ ఆర్థిక వ్యవస్థను ఆర్థిక మాంద్యంతో పాటు, కరోనా మహమ్మారి పతనావస్థకు చేర్చాయి. దీంతో ప్రజలు ముఖ్యంగా కార్మికవర్గం తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడింది. కార్మికుల, ప్రజల ఆదాయాలు గణనీయంగా పడిపోవడం వలన కొనుగోలుశక్తి తగ్గిపోయి నిత్యవసర సరుకులను కొనలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు దాపురించాయి. కార్మిక వర్గంను ఆదుకొని వారి కొనుగోలు శక్తి పెరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉండగా అందుకు వ్యతిరేకంగా ఆయా ప్రభుత్వాలు సహకారంతో కార్మిక చట్టాలలో మార్పులు చేసి పనిగంటల పెంపు, ఉద్యోగ భద్రత, మౌలిక సౌకర్యాలు ఎత్తివేసే పనికి ఉపక్రమించాయి. ముందుగా ఈ పని పువ్వు గుర్తు పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలలో ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు రక్తాన్ని చిందించి తెచ్చుకున్న ఎనిమిది గంటల పని విధానానికి బదులు 12 గంటల పని విధానం అమలుచేయడం, తాత్కాలికంగా మూడేళ్లపాటు అన్ని రకాల చట్టాలను నిషేధించడం తిరోగమన చర్యలుగా భావించాలి. ఈనిర్ణయాలు ఎవరి ప్రయోజనాల కోసం చేశారో అర్థం చేసుకోవచ్చు.

పాలకవర్గ అనుయాయులు అయిన, కార్పొరేట్ శక్తుల ఒత్తిడి మేరకు వారికి కోటాను కోట్ల రూపాయల లాభం చేకూర్చి పెట్టేందుకు పడుతున్న ఆరాటంలో తీసుకున్న నిర్ణయాలు. 44 రకాల కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కార్మిక కోడ్స్ మాత్రమే రూపొందించి అమలు చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మార్పులన్నీ ప్రభుత్వము, కార్మికుల, యాజమాన్యాలతో కూడిన త్రై పాక్షిక చర్చల ద్వారా చేయవలసి ఉండగా, ప్రభుత్వం ఏకపక్షంగా కార్మిక వర్గ ప్రయోజనాలనుగాలికి వదిలేసి పారిశ్రామికవేత్తలకు అదనపు ప్రయోజనం కలిగే విధంగా చట్టాలలో మార్పులు చేయడం జరిగింది. కార్మిక చట్టాలను మూడేళ్ల పాటు నిషేధించి ఇదే అదనుగా భావించి ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటినీ అమ్మకానికి పెట్టి ప్రైవేటీకరణకు బంగారు బాటలు వేయడం ప్రజా శ్రేయస్సుకు ప్రమాదకర చర్య. ఆంధ్రప్రదేశ్లోని విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మి వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో అక్కడి స్థానికులు ఉద్యోగులు, చివరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యతిరేకిస్తూ ఉండటం తెలిసిందే.

విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అని నినదించి బలి దానాల పునాదులపై 1971లో 32 వేల ఎకరాలలో శంకుస్థాపన జరిగింది. 16500 కుటుంబాలు నిర్వాసితులు అయ్యారు. కేవలం 8500 మందికి ఉద్యోగాలు ఇవ్వబడ్డాయి. ఇంకను చాలా మందికి నిర్వాసితులకు ఇచ్చే పరిహారం అందలేదు. రిహాబిలిటేషన్ కార్డు మాత్రమే ఇచ్చారు. అది బదలాయింపు జరుగుతుంది తప్ప ఎటువంటి పూర్తి ప్రయోజనాలు అందలేదు. దానిని పోక్సో కంపెనీకి అమ్మివేసి అప్పగిస్తే నిర్వాసితులందరికీ ఎటువంటి నష్టపరిహారం రాదు. దీంతో ఆందోళనతో చావో రేవో తేల్చుకుంటామని స్థానికులు ఉద్యమిస్తున్నారు.

5) బ్యాంకులు ప్రవేట్ పరం చేస్తే :

గతపాలకులు 1969లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో పద్నాలుగు బ్యాంకుల జాతీయకరణ, ఆ తర్వాత ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు, 1980లో మరో విడతగా సాగిన బ్యాంకుల జాతీయకరణతో బ్యాంకింగ్ రంగం విస్తరిస్తూ వచ్చింది. జాతీయకరణ మూలంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు, అందులో వ్యవసాయానికి, సామాన్య ప్రజలకు లభించిన పరపతి

అనేక రెట్లు పెరిగింది. 1969లో జాతీయకరణ జరిగే నాటికి వ్యవసాయరంగానికి బ్యాంకు రుణాలు కేవలం 0.2 శాతం మాత్రమే లభించేవి. 1991 నాటికి 19 శాతానికి పెరిగింది. ప్రజలకు విశేష సేవలు అందించడంతో పాటు, ఎన్నో రాయితీలు కల్పించిన ప్రభుత్వరంగ బ్యాంకులు ఏనాడు నష్టపోలేదు. నిర్వహణ లాభాలు ఆర్జించాయి. తాజా గణాంకాల ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకులకు 2019- 20లో ఒక లక్ష డెబ్బై నాలుగు వేల మూడు వందల ముప్పై ఆరు కోట్ల నిర్వహణ లాభం వచ్చింది. 2010- 11నుండి 2019- 20 వరకు 13 లక్షల 85 వేల కోట్ల నిర్వహణ లాభం వచ్చింది. అవి ఎంతగానో సమర్ధవంతంగా పనిచేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. అయినను ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి తీసుకున్న అప్పులను కార్పొరేట్ కంపెనీలు తిరిగి చెల్లించనందున అవి పాత బాకీలుగా మారి చివరకు బ్యాంకులకు గుదిబండగా మారుతున్నాయి. విదేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాంటి మోసగాళ్లతో పాటు అనిల్ అంబాని, సహారా తదితర బడా కార్పొరేటు వర్గాలు ఎగ్గొట్టిన రుణాలు ఎక్కువగా ఉన్నాయి. బ్యాంకుల సొమ్ము రుణాల పేరిట దోచిన కార్పొరేట్ రంగానికి రుణ మాఫీ చేయడం అత్యంత దౌర్భాగ్యం.

ఈ ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలలలో 1.15 లక్షల కోట్లు రద్దు చేశారు. మోదీ సర్కార్ వచ్చిన తర్వాత 7.98 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగింది. ఈ విధంగా బ్యాంకులలోని ప్రజల ధనాన్ని సంపన్న వ్యక్తులకు దోచి పెట్టారు. తొలుత ఎస్‌బిఐలో దాని అనుబంధ బ్యాంకుల విలీనంతో సుదీర్ఘ చరిత్ర గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ కనుమరుగయింది. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక మరికొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఆంధ్ర బ్యాంకు అంతర్ధానమైంది.

20 ఏళ్లుగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులు 12కు తగ్గిపోయాయి. మారుమూల ప్రాంతాలకు సేవలను విస్తరించిన ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను కూడా విలీనం చేశారు. ఇప్పుడు మరో రెండు బ్యాంకులను కూడా విలీనం చేస్తామని తాజా బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఇలా ఒక్కో బ్యాంకును ప్రైవేటీకరించి ఆశ్రిత కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తున్న మోడీ సర్కారు ఘనంగా ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న జన దన్ ఖాతాలలో 97 శాతం ప్రభుత్వ బ్యాంకులలోనే తెరిచారు. కేవలం 3 శాతం అకౌంట్లో ప్రైవేటు బ్యాంకులలో ఉన్నాయంటే సామాన్యులకు అవి ఎంత దూరముగా ఉన్నాయో అర్థం చేసుకో వచ్చు.

దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులలో నూట నలభై ఐదు లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. బ్యాంకులు ప్రైవేటుపరం అయితే ప్రజల సొత్తుకుగ్యారెంటీ ఉండదు. గతంలో చాలా ప్రైవేట్ బ్యాంకులు కృషి బ్యాంకు,చార్మినార్ బ్యాంకు, గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకుల, లక్ష్మీ విలాస్ బ్యాంకు బోర్డు తిప్పేసిన సందర్భాలున్నయి. ప్రైవేట్ బ్యాంకులు వ్యవసాయ రంగ రుణాలు, పేదలకులోన్లు , ఎస్సి, ఎస్టి, బిసి కార్పొరేషన్ రుణాల, సూక్ష్మ పరిశ్రమలకు అప్పులు ఇవ్వవు. బ్యాంకుల ప్రైవేటీకరణతో సామాన్యులకు వారి ప్రయోజనాలకు పెద్ద ముప్పు వాటిల్లు తుంది. ప్రైవేటు బ్యాంకులలో పది వేల రూపాయల కనీస నిల్వ లేనిదే ఖాతాలు తెరువవు. దేశంలోనే అత్యధిక శాతం ప్రజానీకం చిన్న వ్యాపారులు, ఉద్యోగులు, పెన్షనర్లు రైతులు, పట్టణపేదలు బ్యాంకు సేవలనుండి దూరమవుతారు.. ప్రైవేట్ బ్యాంకులు కనీస నిలువలేదని డబ్బు జమ చేసిన ఖాతానుండి తీసుకున్న ఇతర చార్జీల రూపంలో విధించే మొత్తం మోయలేని భారం అవుతుంది. గత ఐదేళ్ల కాలంలో ఈ బ్యాంకులు 12,500 కోట్ల మేరకు చార్జీలు కూడా వసూలు చేశాయి. బ్యాంకులో ప్రైవేటీకరణ చేయడం వల్ల డిపాజిట్లకు భరోసా ఉండదు, రాబోయేతరానికి ఉద్యోగాలు ఉండవు, ప్రతి సేవకు పన్నులు ఉంటాయి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు ఉండవు, రెట్టింపు చార్జీలు ఉంటాయి, ప్రజల డిపాజిట్లపై వడ్డీ రేట్లు భారీగా తగ్గుతాయి, రుణాలపై వడ్డీ రేట్లు పెరుగుతాయి. ఆన్లైన్ సేవలపై ప్రత్యేక వడ్డింపులు ఉంటాయి.

6) జీవిత బీమా సంస్థ ప్రవేటీకరణ చేయడం వల్ల :

2021, ఫిబ్రవరి 1న బడ్జెట్లో ఆర్థిక మంత్రి భీమా రంగాన్ని ప్రవేట్ పరం చేసే చర్యలకు పాల్పడింది. బీమా రంగానికి ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్‌ను జారీ చేయడం ద్వారా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ చేయబడుతుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పరిమితిని 49 శాతంనుండి 74 శాతం వరకు పెంచడానికి వీలు కల్పిస్తూ సవరణలు కూడా ఆర్థిక బిల్లులో చేర్చబడ్డాయి. తద్వారా భీమారంగంలో విదేశీ యాజమాన్యాన్ని అనుమతిస్తారు.ఈ లిస్టింగ్ వలన కార్పొరేషన్ కి మార్కెట్‌నుండి నిధులు సమీకరించు కోవడానికి వీలవుతుంది అనడం హాస్యాస్పదం. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్‌ఐసి అతిపెద్ద మదుపరి. ఎల్‌ఐసి ప్రతి సంవత్సరం 3.5నుండి 4 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్ట దగ్గ నిధులను ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి నిధుల సమీకరణ కోసం మార్కెట్కు వెళ్లవలసిన అవసరం ఎల్‌ఐసీకి లేదు.

మార్చి 31 2020 నాటికి కార్పొరేషన్ మొత్తం పెట్టుబడులు 30,69,942 కోట్లుగా ఉన్నాయి. అలాగే ప్రభుత్వ, సామాజిక రంగాలలో 24,0 1,457 కోట్ల పెట్టుబడులను ఎల్‌ఐసి పెట్టింది. 25 శాతం మించి ప్రభుత్వ రుణాలకు ఎల్ఐసి నిధులు సమకూరుస్తుంది. ప్రపంచం మొత్తం మీద ఏ ఒక్క సంస్థ కూడా ఈ స్థాయిలో ప్రభుత్వ రుణాలకు నిధులు సమకూర్చ లేదు. 440 బిలియన్ డాలర్ల విలువైన ఎల్‌ఐసి ఆస్తులు ఐక్యరాజ్యసమితి జాబితాలోని డెబ్బై ఐదు దేశాల జిడిపి కన్నా ఎక్కువ.

1999లో 26 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తూ బీమా రంగం ప్రైవేటీకరణకు దారి తీయబడింది. ఈరోజు జీవిత బీమా, సాధారణ బీమా రంగాలలో 40 కంటే ఎక్కువ ప్రైవేటు కంపెనీలు చలామణిలో ఉన్నాయి. అయినను ప్రభుత్వ పరంగా బీమా కంపెనీల ఆధిపత్యం కొనసాగింది. 70 శాతానికి మించిన మార్కెట్ వాటాతో ఎల్‌ఐసి మార్కెట్ లీడర్‌గా నిలిచింది. 2015లో ఎఫ్‌డిఐల పరిమితిని 26 శాతంనుండి 49 శాతానికి పెంచారు. తాజాగా ఈ

పరిమితిని 74 శాతం నకు పెంచే ప్రతిపాదన చేశారు. ప్రస్తుతం ఉన్న 49 శాతం పరిమితికి విదేశీ పెట్టుబడుల వాట క్రమంగా 35.3 6 శాతం మాత్రమే. అటువంటి సందర్భంలో 74 శాతం పెంచడం విడ్డూరం. బీమాకు ఆమోదయోగ్యమైన 60 కోట్ల జనాభాలో ఎల్ఐసి ఒకటే 42 కోట్ల మంది భారతీయులకు బీమా రక్షణ కల్పించడం జరిగింది. 1956లో ఎల్ఐసి ప్రజలకు, ప్రభుత్వానికి సేవలు అందించే ఉద్దేశంతో పార్లమెంట్ చట్టం ద్వారా స్థాపించబడింది. అప్పటి ప్రధాని జాతీయకరణతో లాభాపేక్ష సమసిపోయి ఆ స్థానంలో సేవయే ముఖ్య ఉద్దేశంగా ముందుకు వస్తుందని ప్రకటించారు. గడిచిన 65 సంవత్సరాలలో ఎల్ఐసి జాతీయకరణ లక్షణాలన్నింటినీ నెరవేర్చి దేశంలోని అత్యుత్తమ ఆర్థిక సంస్థలలో ఒకటిగా నిలిచింది. ఎల్ఐసిలో వాటాల ఉపసంహరణ ప్రైవేటీకరణకు ఆజ్యం పోయడమే. దీంతో ఆర్థిక వ్యవస్థ మీద, బడుగు బలహీనవర్గాల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది.

జాతీయకరణ లక్ష్యాలు తొలగించబడి షేర్ హోల్డర్లకు లాభాలు పెంచే దిశగా ఎల్ఐసి దృష్టి పెట్టవలసి వస్తుంది. తత్ఫలితంగా ప్రైవేటు కంపెనీల మాదిరిగా ఎల్ఐసి కూడా పెద్ద పాలసీలపై దృష్టి కేంద్రీకరించ వలసి వస్తుంది. దీంతో పేద బడుగు వర్గాల వారికి, కిందిస్థాయి మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే చిన్న పాలసీలు నిర్లక్ష్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. పేద ప్రజలకు బీమా రక్షణ కల్పించాలన్న సామాజిక లక్ష్యానికి భంగం కలుగుతుంది. వాటాల ఉపసంహరణ వలన మౌలిక, సామాజిక రంగాలకు పెట్టుబడి అందే అవకాశాలు మృగ్యం అయిపోతాయి. ఇన్సూరెన్స్‌ను లాభసాటి కానీ గ్రామీణ ప్రాంతాలకు కూడా వ్యాపింప చేయాలన్న లక్ష్యానికి కూడా తూట్లు పడతాయి.

ముగింపు :

ఈ విధంగా ఎయిర్ పోర్టుల ప్రైవేటీకరణ, వైద్యవిద్య సరళీకరణ పేరుతో ఆరోగ్య సేవల ప్రైవేటీకరణ, విద్యుత్ చట్టం పేరిట డిస్కంల ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ టెలికాం పరిశ్రమ బిఎస్ఎన్ఎల్ ప్రైవేటీకరణ, రేవుల ప్రైవేటీకరణ శరవేగంగా అమలవుతుంది. పలు కీలకమైన ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణగావించడం జరుగుతుంది. కానీ పలువురు మేధావులు ఆర్థికవేత్తలు అభిప్రాయం ప్రకారం దేశ ఆర్థిక వ్యవస్థను పట్టి పీడిస్తున్న అన్ని రుగ్మతలకు ప్రైవేటీకరణ అనేది దివ్యౌషధం కాదని ప్రభుత్వ అసమర్థతతో చేతులెత్తేసి ప్రైవేటీకరణ మార్గం అవలంభించడం సరైన విధానం కాదని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ రాజన్ తన 'వాట్ ఎకానమీ నీడ్స్ నౌ' అనే పుస్తకంలో పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నైపుణ్యంతో నడిపించాలని అలా కాకుండా ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా నష్టాలలోకితోయడం జరుగుతుందన్నారు.

దేశంలో నూతన సంస్కరణలకు ఆద్యుడిగా పేరొందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూడా ప్రభుత్వరంగ సంస్థలను అమ్మి వేయడం సరైన విధానం కాదని ఒకసారి అమ్మి వేసిన తర్వాత భవిష్యత్ కాలంలో ఏ ప్రభుత్వము మార్చ లేదని, 1991లో బంగారాన్ని తనఖా పెట్టడం వలన విడిపించి తెచ్చుకోవడం సాధ్యమైందని, తనఖా బదులు అమ్మి వేసి ఉంటే ఏమి చేయలేక పోయే వాళ్ల మనీ ఏఐసిసి సమావేశంలో అన్నారు. ప్రభుత్వ రంగానికి సంబంధించిన నిర్ణయాలు కేవలం ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు సంబంధించినవి మాత్రమే కావని, ప్రజల ఆస్తికి ధర్మకర్తగా ఉండాల్సిన ప్రభుత్వానికి ఆ ఆస్తిని అమ్మే హక్కు లేదని ఆయన ఉటంకించడం విశేషం.

లాభాల బాటలో పయనిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాలలో ఉన్నాయని చిత్రిస్తూ వాటికి పరిష్కారం ప్రవేట్ పరం చేయడమేనని పాలక ప్రభుత్వం తప్పుడు నివేదికలతో ప్రచారం చేస్తూ వాటిని తమకు కావలసిన వారికి కట్టబెట్టే ప్రయత్నంలో భాగమే. వాస్తవానికి 366 ప్రభుత్వ రంగ సంస్థలలో 43 మాత్రమే నష్టాలలో ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి సంపదను కేంద్రీకృతం చేస్తూ పేద వారిని కడు పేద వారిగా, ధనవంతులను అపర కుబేరులుగా ప్రపంచ కుబేరుల జాబితాలోకి అందలం ఎక్కించేందుకు ప్రజల చేత ఎన్నుకోబడిన, ప్రజల కొరకు ఆలోచించవలసిన ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయడం అత్యంత విషాదకరం..

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా గుప్పెడు మంది వ్యక్తుల సొంత ప్రయోజనాల కోసం దేశ ప్రజలందరి జీవితాలను చిన్నాభిన్నం చేసే విధానాలు అవలంబించడం మూలంగా ఆధిపత్య వర్గాల వారికి అధికార దాహం అర్థబలం అంగబలం సమకూర్చడం ఈ మేరకు సమంజసం? ఫలితంగా అట్టడుగు వర్గాల వారిని ఆధునిక బానిసలుగా తయారు చేసే కుట్రలో భాగంగానే నేడు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేయడం జరుగుతుంది.

ఈ ప్రైవేటీకరణ వలన భవిష్యత్ కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఉండవు, వాటి నియామక ప్రక్రియలో రిజర్వేషన్లు వర్తించవు. అట్టడుగు వర్గాల వారికి రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, సమానత్వము, హక్కులు మొదలైనవి ఏవీ కూడా అమలులో ఉండవు. అసమానతలు, అంతరాలు విరివిగా పెరుగుతాయి. ప్రస్తుత తరుణంలోనే 2014లో అంబానీ సంపద 5 వేల కోట్లు, అదే 2021లో ఆరు లక్షల 3000 కోట్లు.. అదేవిధంగా ఆదాని సంపద 2014లో కేవలం 14 వేల కోట్లు మాత్రమే, అది కాస్త 2021లో మూడు లక్షల అరవై మూడు వేల కోట్లకు చేరింది అంటే ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయో... ఎవరి సంక్షేమం కోసం పాటు పడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

80 శాతంగా ఉన్న బలహీన వర్గాల వారికి రాజ్యాధికారం సిద్ధించిన అప్పుడే అంతరాల వ్యవస్థ కనుమరుగయ్యే అవకాశం ఉంది. లేనిచో ఈ అంతరాలు తీవ్రతరం అవుతాయి. ఉన్న కొద్దీ అవకాశాలు రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులు మొదలగునవి అందనంత దూరంలో కి పోయే ప్రమాద ఘంటికలు మ్రోగుతున్నాయి. దీనిని ప్రతిఘటించడానికి మేధావులు బుద్ధిజీవులు ప్రజాస్వామికవాదులు జాగరూకతతో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. తస్మాత్ జాగ్రత్త.

(రచయిత టిపిటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు) వీ

పెట్టుబడిదారీ వ్యవస్థే హింసాత్మక అవరోధం

పెట్టుబడిదారీ వ్యవస్థే అసలైన హింసాత్మక అవరోధమనీ, సామాజిక పరివర్తన కోరేవారిని హింసావాదులు అనగూడదని అంటున్నారు **యానిస్ ఇక్బాల్**

తన 1845 రచన 'ఇంగ్లాండ్‌లో కార్మికవర్గపు పరిస్థితులు'లో "ఒక వ్యక్తిపైన మరొక వ్యక్తి దాడిజేసి గాయాలు జేస్తే, ఆ గాయాలు అతని మరణానికి దారితీస్తే, దాన్ని మనం హత్య అంటాం. ఆ దాడిజేసిన వానికి తను జేసిన గాయాలు మరణానికి దారితీస్తాయని ముందుగానే తెలిసి ఉంటే అతడు హంతకుడంటాం. కానీ, వ్యవస్థ కొన్ని వందల మంది కార్మికులను కత్తుల వల్లనో, తుపాకీ గుండ్లతోనే జరిగే మరణాలలాగే అసహజమైన, తప్పనిసరి మరణాలకు దారితీసే పరిస్థితులు కల్పిస్తే, అంతేగాక, ఆ వ్యవస్థకు ఈ వేలాది మంది చావక తప్పదని తెలిసీ, ఆ పరిస్థితులు కొనసాగేలా చేస్తే, ఈ మరణాలు కూడా ఒక వ్యక్తి చేసిన హత్య లాగే భావించాలని" ఫ్రెడెరిక్ ఎంగెల్స్ అంటారు.

ఫ్రెడెరిక్ ఎంగెల్స్ వెలిబుచ్చిన పై అభిప్రాయం నాడు, 1845లో ఎంత యుక్తమైనదో నేడూ అంతే యుక్తమైనదని చెప్పవచ్చు. 2020 ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా, కొవిడ్ 19 వల్ల, దాదాపు 88 నుండి 115 మిలియన్‌ల మంది ప్రజలు అతి దారిద్ర పరిస్థితికి, అంటే రోజుకు 1.90 డాలర్ల ఆదాయానికన్నా తక్కువ దిగజారుతారు. 1.90 రోజు అనేది అంతర్జాతీయ పేదరికపు సూచిక. అదే పరిహాసమైన సూచిక. ఎందుకంటే 2011లో ఆ ధరకు అమెరికాలో ఒక కప్పు కాఫీ మాత్రమే కొనగలము. అందువల్ల అనేక ప్రపంచ సంస్థలు చెప్పిన దానికన్నా ఎంతో ఎక్కువగా మహమ్మారి ప్రభావం పేద ప్రజలపై ఉందని చెప్పవచ్చు. అయితే పేద ప్రజలు మరింత పేదరికంలోనికి దిగజారడానికి కారణం కేవలం కొవిడ్ 19 మాత్రమే కాదు. ఈ పరిస్థితికి నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు లంకె ఉంది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ దేశాలపై మిత వ్యయాన్ని రుద్దింది. దాంతో అన్ని ప్రభుత్వాలు ఆరోగ్య వ్యవస్థపై ఖర్చును తగ్గించాయి. తాత్కాలిక ఉద్యోగాలు గల కార్మికుల జీవితాల్లో అభద్రత, ఉత్పాదక రంగం నుండి ప్రభుత్వాలు వైదొలిగాయి. ఒకవైపు మెజారిటీ ప్రజలు పేదరికంలో కూరుకపోతుంటే, మరో వైపు బిలియనీర్లు గతంలో ఎన్నడూ లేనంతగా సంపదను కూడగట్టుకుంటున్నారు.

నేడు సాంక్రమిక రోగం, ఆర్థిక సంక్షోభపు కలియక వల్ల ఏర్పడిన ఈ దుస్థితి కేవలం ఈ నాటిది కాదు. ఇది వందల సంవత్సరాలుగా పెట్టుబడిదారీ వ్యవస్థ చేసిన అంతంలేని హత్యల అభివ్యక్తీకరణ మాత్రమే. వేగవంతమైన పెట్టుబడి సంచయనం, విస్తరించిన దోపిడీ ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ బతుకులను అతలాకుతలం జేస్తూ, కొట్లాది మంది మరణాలకు కారణమయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ వ్యవస్థీకృత హింస ఎలాంటి లోపంలేని ఆర్థిక వ్యవస్థ పనితీరులో ఏదో అనుకోకుండా ఉత్పన్నమయిన ఉత్పత్తి కాదు. ఈ "వ్యవస్థీకృత హింస" వ్యవస్థ విడదీయరాని అంతర్భాగం. దాని ద్వారానే పెట్టుబడి తన అసంతుష్టమైన, అత్యాశపూరిత పునరుత్పత్తి అవసరాలను తీర్చుకుంటుంది. నయా ఉదారవాద వ్యవస్థలో పెట్టుబడి ఆర్థిక ఆకస్మిక అవసరాలు మరింత తీవ్ర రూపాలలో – శాశ్వత నిరుద్యోగం, ఉద్యోగ అభద్రత, ప్రజావసరాల నిధుల కోత, ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు ప్రజా సంపద అమ్మకం లాంటి రూపాలలో తమకు తాముగా బయటపడుతాయి.

దిగువశ్రేణి ప్రజలు, పెట్టుబడిదారీ వ్యవస్థపు 'వ్యవస్థీకృత హింస' భారీ దాడిని ఎదుర్కొన్నప్పుడు, వాళ్లు బతుకుతెరువుకయి ప్రత్యామ్నాయ మార్గాలు తప్పనిసరిగా వెతుక్కుంటారు. పెట్టుబడిదారీ వ్యవస్థ బాహ్య (ఆబ్జెక్టివ్) పీడన అనుభవ చైతన్యం, ఉత్పత్తి సంబంధాల వల్ల ఏర్పడిన వైరి వర్గాల మధ్య సామాజిక ఘర్షణలకు దారి తీస్తుంది. ఈ వర్గపోరాట సందర్భాలు, ఉత్పత్తి శక్తుల, సంబంధాల మధ్య జరిగే వ్యవస్థీకృత ఘర్షణలో వస్తుగత జోక్యంగా పనిజేస్తాయి. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందేకొద్దీ, అంతవరకు వాటిని ప్రోత్సహించిన ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తులు మరింత అభివృద్ధి చెందకుండా అడ్డుపడుతాయి. దిగువ శ్రేణి ప్రజల ప్రత్యక్ష చర్యల వల్ల ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ, శ్రమ సామాజికీకరణల వైరుధ్యాలు విప్లవానికి దారితీస్తూ పరిష్కరించబడుతాయి.

బూర్జువా ప్రజాస్వామ్యన్ని అర్థం చేసుకోవడం

విప్లవమనేది తప్పనిసరిగా హింసాత్మకంగా ఉండాల్సిన అవసరం లేదు. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ చారిత్రిక పరిస్థితులు, పాలక వర్గాలను కూలదోయడానికి హింసను అనివార్యం జేస్తాయి. పార్లమెంటరీ సంస్థల, 'ప్రజాస్వామ్య' రాజ్యం ఏర్పడ్డాక కూడా ప్రపంచీకరణ, నయా ఉదారవాద క్షుద్ర రాజకీయాలకు బలవుతున్న వారి కోసం విప్లవ హింస చివరి అస్త్రంగాక తప్పదు. 1878లో కార్ల్ మార్క్స్ జర్మనీలో సోషియలిస్ట్ వ్యతిరేక చట్టంపై రాసిన వ్యాసంలో విప్లవ హింస, బూర్జువా ప్రజాస్వామ్యం ఘర్షణ వాతావరణం గురించి చెబుతూ, తన పురోగమన మార్గానికి అధికారంలో ఉన్న శక్తులు బలంగా అడ్డంకులు కల్పించనంతవరకు చారిత్రిక అభివృద్ధి, శాంతియుతంగానే ఉంటాయి. కానీ, యథాతథ పరిస్థితుల కొనసాగింపుకై పాలక శక్తుల ప్రతిఘటనను శాంతియుత ఉద్యమం ఎదుర్కొన్నప్పుడు, ఆ ఉద్యమం హింసాత్మకం కావొచ్చు. వాస్తవంగా చట్టబద్ధంగా ప్రమాదకరం కానప్పటికీ, తనకు శత్రుపూరితమైన పరిణామాలను, ప్రభుత్వం హింసాత్మకంగా అణచివేయాలని చూస్తుందని ముతక వివరణ ఇస్తారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యం, 'హింసాత్మక అవరోధాల'ను నెలకొల్పుతుంది. పెట్టుబడి రాజ్యం స్వయం ప్రతిపత్తిగలది కాదు. అది సంచయనపు తర్కానికావల పనిచేయజాలదు. అది,

సంచయనము, చట్టబద్ధత మధ్య ఘర్షణను మూర్తీభవించే చాలా సంక్లిష్టమైన వర్గపోరాట ప్రాంగణం. ఒకవైపు, రాజ్యపు రాజకీఅ అధికారం స్వతంత్రంగా ఉత్పత్తిని నిర్వహించలేదు. సంపద ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉంటుంది. ఉత్పత్తి రంగమంతా ప్రైవేట్ కంపెనీల చేతుల్లో ఉంటుంది. వారి పనులకు రాజ్యం నిరంతరం ప్రతిస్పందిస్తూ ఉండాల్సిందే. రాజ్యం తను స్వంతంగా ఉత్పత్తి నెలకొల్పుకొని, అదనపు విలువ ద్వారా ఆదాయం పొందేదాక దాని శక్తి, సామర్థ్యాలను ప్రైవేట్ ఉత్పాదకత, లాభాలు పరోక్షంగా నిర్ణయిస్తాయి. అంటే, రాజకీయ నాయకులు, అధికారులు రాజ్యంలో తమ మనుగడకోసం, పెట్టుబడి సంచయనాన్ని బలోపేతం చేయక తప్పదు. మరోవైపు ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చిన పాలకులు తమ చట్టబద్ధతలో సంక్షోభం వల్ల తమ అధికారాన్ని కోల్పోకుండా ఉండేందుకు పౌరులలో తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలి.

పెట్టుబడిదారీ వ్యవస్థ సమాజం కేవలం క్రమ, క్రమమైన, అసంపూర్ణ మార్పులను మాత్రమే అనుమతిస్తుంది. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య నిర్మాణ పరిమితులలో పరిష్కరించలేని సమస్యలను లేవనెత్తే రాజకీయ శక్తులను బలప్రయోగం ద్వార అణచివేస్తూ వ్యవస్థ సంచయనానికి, చట్టబద్ధత మధ్య ఉత్పన్నమయ్యే ఘర్షణను నివారిస్తుంది, సమతుల్యత సాధిస్తుంది. దిగువ శ్రేణి ప్రజలు పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిమితులను గ్రహించినపుడు, తమ అజెండాను పునరుద్ధరించుకొనేందుకు, పాలకులకు స్పష్టం జేసేందుకు, వారు హింసాత్మక విప్లవ పంథా చేపట్టని పరిస్థితులు ఏర్పడతాయి.

నేటి సందర్భంలో, దిగువ శ్రేణి ప్రజలు ఈ దుర్మార్గపు బూర్జువా ప్రజాస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించే కొత్త డిమాండ్లను ముందుకు తెచ్చేకొద్దీ, బూర్జువా ప్రజాస్వామ్యపు అంతర్గత విభేదాలు ఎక్కువగా ఒత్తిడికి గురవుతాయి. ఉదాహరణకు అమెరికాలో, ఆ దేశ చరిత్రలోనే అత్యంత పెద్ద ఉద్యమంలో ఒకటిగా చెప్పుకోదగ్గ జార్జి ఫ్లోయిడ్ ఉద్యమం. పెట్టుబడిదారీ వ్యవస్థ జాతి వివక్షతను ఎత్తి చూపడమే గాక, ఆ వ్యవస్థ వ్యవస్థీకృత హింసను స్పష్టంగా తెరపైకి తెచ్చింది. అమెరికన్ తిరుగుబాటు, బూర్జువా ప్రజాస్వామ్యపు పరిధిలో పరిష్కరించే అవకాశం లేదు కాబట్టి ఆ తిరుగుబాటును రాజ్యం బలప్రయోగంతో అణచివేసింది. అమెరికన్ తిరుగుబాటు, దేశ పరిధులకావల కూడా దిగువ శ్రేణి ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించడం వల్ల, అమెరికాలోనే గాక, నయా ఉదారవాదంతో పోలీస్ హింస సహకరించడంతో, అది ప్రపంచ వ్యాప్తంగా పీడితులందరిపై జరుగుతున్న అన్యాయంతో గుర్తింపబడింది. అమెరికాలో నల్లజాతి తిరుగుబాటును అణచివేసినట్టుగా కొలంబియా నిరసనలు కూడా బలప్రయోగానికి గురయ్యాయి.

విప్లవ హింస : నైతిక కోణాలు

ప్రపంచ వ్యాప్తంగా వర్గ పోరాటం తీవ్రమయ్యేకొద్దీ, వామపక్ష శక్తులకు రాజకీయ-నైతిక ఆధిపత్య పునాది కల్పించేందుకు విప్లవ హింస సిద్ధాంతం రూపుదిద్దే అవకాశం ఉంది. ఒక హేతుబద్ధమైన విప్లవ హింస సిద్ధాంతం రూపుదిద్దుకుంటే, పార్లమెంటరీ హింస ఆ వృత్తాన్ని బద్దలుకొట్టి, సామాజిక శక్తుల కూటమిని సంఘటితం చేయగల పరికరం వామపక్ష శక్తులకు లభ్యమవుతుంది. వర్గ శత్రువులకు వ్యతిరేకంగా వినియోగించే విప్లవ హింస, రాజకీయాలకు ఎల్లప్పుడూ ఒక అనుబంధంగా పనిచేస్తుంది. అంతేగాక విప్లవ హింస, పెట్టుబడిదారీ సమాజపు గర్భంలో ఆధిపత్య వ్యతిరేక సైద్ధాంతిక పునాది ఏర్పడడానికి అవసరమైన ప్రయత్నాలకు అనుబంధంగా ఉంటుంది. అంతేగాక, విప్లవ హింస ఆ ప్రయత్నాలతో అల్లుకపోయి ఉంటుంది.

చివరి మాటగా, పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడంలో విప్లవ సిద్ధాంతం ప్రధాన అంశంగా పనిజేస్తుంది. ఫిడెల్ కాస్ట్రో మాటల్లో, 'అన్ని ప్రతీఘాతుక శక్తుల కలయిక కన్నా, భావాలు ఎక్కువ శక్తిని కలిగి ఉన్నట్టుగానే, బావాలు ఎల్లప్పుడూ అందరికీ అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆయుధాలు. ఒక గొప్ప విశ్వాసం, ఏమి చేయాలి అనేదానిపై ఒక స్పష్టమైన అభిప్రాయం – వీటికన్న శక్తివంతమైన ఆయుధం లేదు. పెద్దగా డబ్బు అవసరం లేని, కేవలం భావాలను, విలువలను సృష్టించి, వ్యాప్తిజేయగల ఇలాంటి ఆయుధాలతోనే మన ప్రజలు ఎక్కువగా సాయుధులవుతారు. ప్రపంచం బలప్రయోగంతో గాక, భావాలతో జయింపబడుతుంది.'

1899లో జర్మనీ సోషియల్ డెమోక్రటిక్ పార్టీ హనోవర్ కాంగ్రెస్ మాట్లాడుతూ, విప్లవ ప్రతిపాదకులు 'హింసా మార్గాన్ని అవలంబించే వారిలో చివర ఉంటారు, క్రూరమైన హింసను కోరేవారిలోనూ చివరే ఉంటారు. అటువంటి విషయాలు (విప్లవం హింసాత్మకంగా ఉండాలా? లేదా?) మనపై ఆధారపడి ఉండవు. అవి మన శత్రువుల పై ఆధారపడి ఉంటాయి' అని వాఖ్యానించారు. అందువల్ల ఆధునిక చరిత్రలో ప్రతీఘాతుక దాడులను ఎదుర్కొనేందుకు కార్మికవర్గం తప్పనిసరిగా అమలుజేయవలసి వచ్చే ఎత్తుగడే హింస. హింస అనేది తప్పనిసరిగా ఒక క్రియాత్మక అంశంగా ఉండగా, అది నైతిక కోణం గల ఒక పోరాట రూపం కూడా. అంటే అది విప్లవ క్రమంలో ఉద్భవించే నూతన మానవుల నిర్మాణంలో భాగమే. విప్లవ హింసకు నైతిక కోణం ఉన్నంత కాలం, దాని ఆచరణకై, ఒక నైతిక చట్రం తరచూ రూపొందబడుతుంది. ఈ నైతిక చట్రపు మౌలిక నిర్మాణాన్ని రెండు పాయింట్స్ ద్వారా తెల్పవచ్చు.

విప్లవ హింస, నిర్దిష్టంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ధ్వంసమనే నైతిక లక్ష్యానికి అనుగుణంగా ఆచరింపబడుతుంది. తదనుగుణంగా విప్లవ హింస వ్యవస్థీకృత హింసా ప్రపంచాన్ని ప్రక్షాళనం జేసి, అకారణ మరణాలను నివారిస్తుంది. అంటే, హింస దానికదే విప్లవ లక్ష్యంతో నైతికంగా రూపుదిద్దబడుతుంది. జార్జ్ లూకాక్స్ 'ఎత్తుగడలు, నైతికత' అనే వ్యాసపు ముగింపు మాటల్లో పై వివరణను మరింత స్పష్టంజేశారు. 'ఎవరైతే ధృఢ నిశ్చయంతో, ఎలాంటి షరతులు లేకుండా ఏ పరిస్థితుల్లోనూ 'హత్యను' అంగీకరించడో, అతడు మాత్రమే నిజంగా, విషాదంగా నైతికమైన హత్యా చర్యలకు పాల్పడాలి.' పెట్టుబడిదారీ వ్యవస్థ కింద మానవుల క్రూరత్వం, పతనం ముగుస్తుందని ఎప్పుడు వ్యక్తులు అర్థం జేసుకుంటారో అప్పుడే విప్లవ హింసకు పాల్పడవచ్చు అని పై మాటలు స్పష్టం జేస్తాయి. ఆ విధంగా విప్లవ హింసను భావించినపుడు ఆ విప్లవ హింస – మానవ సమాజ ప్రయోజనాలను, వ్యక్తుల జీవించే హక్కును ఉల్లంఘించే సామాజిక వ్యవస్థను నాశనం జేసే సామూహిక పోరాటాలను విస్మరించి వ్యక్తిగత పవిత్రతను, నైతిక స్వీయ ఆరాధనను సంరక్షించుకోవడాన్ని భర్తీ చేస్తుంది.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు)

(అనువాదం అరుణ్) వీ

కమ్యూనిస్టు సారంలేని చైనా కమ్యూనిస్టుపార్టీ

వంద సంవత్సరాల ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రయాణాన్నీ, పరిణామాలనూ వివరిస్తున్నారు **సి.యస్.ఆర్. ప్రసాద్**

ఈ సంవత్సరం చైనా కమ్యూనిస్టుపార్టీ వందేళ్ల ఆవిర్భావ సభల్ని జరుపుకుంటోంది. చైనాలోనేగాక వివిధ ప్రపంచ దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాతంత్రవాదులైన ఆలోచనాపరులు ఈ నూరేళ్ల ఉత్సవాల్ని ఆసక్తితో గమనిస్తున్నారు. దీనికి కారణం లేకపోలేదు. ప్రారంభమైన మూడు దశాబ్దాలలోనే చైనాలో అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టుపార్టీ, దాని నాయకుడు కామ్రేడ్ మావో సే తుంగ్ ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. పోరాట రంగంలోనూ, పార్టీ నిర్మాణంలోనూ, సైద్ధాంతిక అంశాలలోనూ ఆ పార్టీ కొత్త వెలుగుల్ని ప్రసరింపచేసింది. మార్క్సిస్టు మూల సూత్రాలకు కొన్ని ప్రధానమైన చేర్పులను చేసి దాన్ని శక్తిమంతం చేసింది. తదనంతరం చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవం ఒక గొప్ప మార్పుకు నాంది పలికింది. మావో మరణానంతరం అధికారంలోకి వచ్చిన కొత్త నాయకత్వం చైనా కమ్యూనిస్టుపార్టీని మార్క్సిస్టు లెనినిస్టు పంథా నుండి పక్కకు మళ్లించి పెట్టుబడిదారీ విలువల్లోకి నడిపించే ప్రయత్నాలు చేసింది. ఈ రోజున అమెరికాతో సమ ఉజ్జీగా అన్ని రంగాలలోనూ పోటీపడుతున్న ఏకైక దేశం చైనా. ఆ కారణంగానే చైనా కమ్యూనిస్టుపార్టీ వందేళ్ల ఆవిర్భావ సంఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చలు ప్రేరేపించింది.

1921 జూలైలో షాంఘై నగరంలో కమ్యూనిస్టుపార్టీ ప్రారంభం కావడానికి ముందునుండే చైనాలో మార్క్సిజం ప్రచారం సాగింది. అలా ప్రచారం చేసినవారిలో తొలివ్యక్తి లీ తా చావో. ఆయన 1918 చివరి రోజుల్లో అక్టోబర్ విప్లవాన్ని చైనాలో విస్తృతంగా ప్రచారం చేశాడు. అదే కాలంలో 1917లో హునాన్ ప్రాంతంలో మావో, 'న్యూ పీపుల్స్ స్టడీ సొసైటీ' అనే ఒక సంస్థను ఏర్పాటు చేశాడు. 1918లోనే షాంఘై నగరంలో 'మార్క్సిస్టు అధ్యయన కేంద్రం' స్థాపన జరిగింది. 1919లో బీజింగ్ నగరంలో మరొక అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించారు. 1920లో షాంఘైలో 'కమ్యూనిస్టు గ్రూపు' పేరుతో ఒక సంస్థ పనిచేయడం ప్రారంభమైంది. 1920లోనే 'న్యూ యూత్ లీగ్' అనే సంస్థ పేరుమీద 'కమ్యూనిస్టు' అనే పత్రిక ప్రచురణ కూడా జరిగింది. ఇవన్నీ చైనా కమ్యూనిస్టుపార్టీ ఏర్పడడానికి పూర్వం జరిగిన ప్రయత్నాలు.

చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రథమ మహాసభ 1921 జూలై 1న షాంఘైలో జరిగింది. దీనికి యాభైఏడు మంది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహించే పన్నెండు మంది ప్రతినిధులు హాజరయ్యారు. రష్యాలో విప్లవం విజయవంతం అయినట్లుగానే చైనాలో కూడా విప్లవ విజయం కోసం పనిచేయాలనే నిర్ణయం చేసుకున్నారు. పార్టీ ఏర్పడేనాటికి చైనా బాగా వెనుకబడిన అర్ధ వలస, అర్ధ ఫ్యూడల్ దేశంగా ఉండింది. దేశం అంతటా అనేకమంది ఫ్యూడల్ యుద్ధ ప్రభువుల పాలన సాగుతుండేది. చైనా సమాజంలో కన్‌ఫ్యూషియస్ భూస్వామ్య భావజాల ప్రభావం తీవ్రంగా ఉండేది. నామ మాత్రమైన ప్రజాస్వామ్యం కూడా అమలులో లేదు. రెండవ మహాసభ 1922లో జరిగింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ కొమిన్‌టర్న్ ప్రతినిధి చేసిన సూచనలను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశంలో పార్టీ కొన్ని ప్రధాన లక్ష్య నిర్ణయాలు చేసింది. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా జాతీయ ప్రజాతంత్ర విప్లవాన్ని కొనసాగించడం తక్షణ లక్ష్యంగా ప్రకటించింది.

కమ్యూనిస్టుపార్టీ ఏర్పడేనాటికే డాక్టర్ సన్‌యెట్‌సేన్ నాయకత్వంలో 1905లో ఒక విప్లవ సమితి ఏర్పడింది. అదే తరువాత కాలంలో కొమింగ్‌టాంగ్ పార్టీగా రూపొందింది. సన్‌యెట్‌సేన్ బూర్జువా ప్రజాతంత్ర విప్లవ వాదుల ప్రతినిధి. చైనాలో రాజరికాన్ని కూలదోసి, ఫ్రెంచి విప్లవ నినాదాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల ప్రాతిపదికన ఒక గణతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేయడం దాని లక్ష్యం.

1923లో జరిగిన మూడవ మహాసభలో కమ్యూనిస్టుపార్టీ కొమింగ్‌టాంగ్‌తో ఐక్యసంఘటన కట్టి పనిచేయాలనే నిర్ణయానికి వచ్చింది. 1925లో సన్‌యెట్‌సేన్ మరణం తరవాత భూస్వామ్యవర్గాల ప్రతినిధి అయిన చాంగ్ కై షేక్ కొమింగ్‌టాంగ్ నాయకత్వాన్ని చేజిక్కించుకున్నాడు. అతడి భూస్వామ్య అనుకూల విధానాల కారణంగా కమ్యూనిస్టుపార్టీకి కొమింగ్‌టాంగ్‌తో కలిసి పనిచేయడం సాధ్యం కాలేదు. కమ్యూనిస్టు పార్టీ నాయకుల, కార్యకర్తల ఊచకోతకు చాంగ్ కైషేక్ తలపడ్డాడు.

1927నాటికి కమ్యూనిస్టుపార్టీ రైతాంగ తిరుగుబాటుకు పిలుపునిచ్చింది. ఆ సంవత్సరం అక్టోబర్‌లో చింగ్‌కాంగ్ షాన్ పర్వత ప్రాంతంలో మొదటి విప్లవ స్థావరాన్ని పార్టీ ఏర్పాటుచేసి 'కార్మిక కర్షక సోవియట్ ప్రభుత్వం' ఏర్పడినట్లుగా ప్రకటించింది. చైనాను ఆక్రమించుకున్న పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలకు, స్థానిక యుద్ధ ప్రభువులకు, ఈ రెండు శక్తులకూ ఊడిగం చేస్తున్న చాంగ్ కై షేక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చైనా కమ్యూనిస్టుపార్టీ యుద్ధాన్ని ప్రారంభించింది. వ్యవసాయక విప్లవాన్ని తన లక్ష్యంగా ప్రకటించుకున్నది. 1928లో జరిగిన ఆరవ పార్టీ మహాసభలో కార్మిక కర్షక విప్లవ ప్రజాస్వామిక నియంతృత్వాన్ని ఏర్పాటుచేసే నిర్ణయాన్ని తీసుకున్నది. పార్టీ తీసుకున్న నిర్ణయాలు, దాని కార్యక్రమం,

ఆచరణలతోపాటు, నాయకత్వం, కార్యకర్తల జీవనశైలి ఫ్యూడల్ చైనాలోని అణగారిన ప్రజా సమూహానికి ఒక కొత్తమార్గాన్ని చూపినట్లయింది. పేద రైతాంగం, మైనారిటీ కొండప్రాంతాల ప్రజలు పార్టీ పిలుపులకు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వడం ప్రారంభమైంది. పట్టణ ప్రాంతాలలో ముఖ్యంగా, విద్యార్థి యువజనులలో పార్టీ పట్ల ఆకర్షణ పెరిగింది. అది సాధిస్తున్న విజయాలను చూసి బెంబేలెత్తిన సామ్రాజ్యవాద దేశాలు విప్లవాన్ని మొగ్గలోనే తుంచివేయడానికి చాంగ్ కై షేక్ ప్రభుత్వం మీద వత్తిడి తెచ్చాయి. ఆ ప్రభుత్వానికి అవసరమైన ఆర్థిక, సైనిక సహాయాన్ని అందించాయి.

చైనా కమ్యూనిస్టుపార్టీ విముక్తి పోరాట చరిత్రలో అత్యంత ప్రధానమైన చారిత్రిక ఘట్టం లాంగ్‌మార్చ్. ఇది 1934 అక్టోబర్ 16న ప్రారంభమై 1935 అక్టోబర్‌లో అంతమైంది. పదకొండు రాష్ట్రాలగుండా సాగిన ఈ లాంగ్‌మార్చ్ 12,500 కిలోమీటర్ల దూరం ప్రయాణించి లెక్కలేనన్ని ప్రకృతి ఆటంకాలను, సైనిక దాడులను, సాంస్కృతిక దాడులను అధిగమించి చివరికి ఉత్తర షెన్సీలో ఉన్న యేనాన్ విప్లవ స్థావరానికి చేరుకొని శక్తివంతమైన ఎర్ర సైన్యాన్ని ఏర్పాటుచేసింది. అది ప్రయాణించిన పదకొండు రాష్ట్రాలలోనూ అద్భుతమైన విజయాల్ని సాధించింది. లాంగ్‌మార్చ్ ఒక మ్యానిఫెస్టో అని మావో వర్ణించారు. ఒకవైపు దుర్మార్గమైన చాంగ్ కై షేక్ దాడులను ఎదుర్కొంటూనే మరొవైపు విప్లవ అవసరాన్ని, ఆవశ్యకతను ప్రచారం చేస్తూ ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని, సాంస్కృతిక చైతన్యాన్ని పార్టీ ప్రచారం చేయగలిగింది. కొన్ని లక్షల మంది పార్టీ సభ్యులయ్యారు. పార్టీ ఆయా విముక్తి ప్రాంతాలలో వ్యవసాయక విప్లవానికి ఇరుసుగా ఉన్న దున్నేవాడికే భూమి నినాదాన్ని ఆచరణలో విజయవంతం చేయగలిగింది.

1931లో జపాన్ సైనిక దురాక్రమణ ప్రారంభమైంది. మారిన పరిస్థితులకు అనుగుణంగా తన తక్షణ లక్ష్యాన్ని మార్చుకున్న కమ్యూనిస్టుపార్టీ కొమింగ్‌టాంగ్‌తో కలిసి ఐక్యసంఘటనను ఏర్పాటుచేసి జపాన్ వ్యతిరేక పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ పిలుపు చాంగ్ కై షేక్ అనుచర బృందంలో కూడా కొత్త ఆలోచనలను రేకెత్తించింది. దేశభక్తి, ప్రజాస్వామ్యం వంటి విలువలతో ప్రేరేపితులైన కొమింగ్‌టాంగ్ సైనిక అధికారులే చాంగ్ కై షేక్‌ను నిర్బంధించారు. తప్పనిసరి పరిస్థితుల్లో 1937 నుండి చాంగ్ కై షేక్ కమ్యూనిస్టులతో కలిసి పోరాడాల్సిన స్థితి ఏర్పడింది. ఈ క్రమంలో భాగంగా 1949 అక్టోబర్ 1న చైనాలో కమ్యూనిస్టుపార్టీ అధికారంలోకి వచ్చి చైనా ప్రజా రిపబ్లిక్‌ను స్థాపించింది. ఇది సూక్ష్మంగా చైనా కమ్యూనిస్టుపార్టీ పోరాట చరిత్ర.

అయితే ఈ పోరాటమంతా నల్లేరు మీద బండి లాగా సాగలేదు. పార్టీ అంతర్గతంగా అనేక సిద్ధాంత విభేదాలను ఎదుర్కోవల్సి వచ్చింది. అంతకు ముందు రష్యాలో విజయవంతమైన అక్టోబర్ సోషలిస్టు విప్లవ పంథా తమ దేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా ఉండని కారణంగా ఒక కొత్త పోరాట పంథాను రూపొందించుకోవల్సి వచ్చింది. ఈ రెండు బాధ్యతలను నిర్వహించే క్రమంలో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం, ముఖ్యంగా కామ్రేడ్ మావో కృషిని ఈ వందేళ్ల సందర్భంలో మనం తప్పనిసరిగా మననం చేసుకోవాలి.

పార్టీ ఏర్పడినప్పటి నుండి 1949లో అధికారాన్ని హస్తగతం చేసుకునేవరకు చైనా కమ్యూనిస్టుపార్టీలో రెండు పంథాల మధ్య పోరాటం కొనసాగుతూనే ఉంది. అనేక అంశాల పట్ల పార్టీ నాయకత్వంలో భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. ఒకప్పుడు మితవాదం, మరొకప్పుడు అతివాదం పార్టీకి నష్టాన్ని కలిగించాయి. ఈ రెండు పెదధోరణుల నుండి కాపాడుకుంటూ పార్టీని విజయం దిశగా నడిపించడంలో మావో అనుసరించిన వైఖరి ఉదాత్తమైనది. ఈ విభేదాలు ప్రధానంగా 1) విప్లవానికి నాయకత్వం ఎవరు వహించాలి. కార్మికులా, బూర్జువా వర్గమా? 2) కార్మికవర్గం ఎవరిని తన ప్రధాన స్నేహితుడుగా స్వీకరించాలి. రైతాంగాన్నా, బూర్జువాలనా? 3) కార్మిక కర్షక ఐక్యత అవసరం లేకుండా కేవలం కార్మికులు మాత్రమే విప్లవాన్ని విజయవంతం చేయలేరా? 4) ముందు పట్టణాలు విముక్తి కావాలా, గ్రామాలు విముక్తి కావాలా?

ఇలాంటి సందర్భాలలో మావో చేసిన అనేక సైద్ధాంతిక పరిశీలనలు, నివేదికలు మార్క్సిజం, లెనినిజానికి నూతన చేర్పులను అందించాయి. రష్యన్ విప్లవ నమూనాకి ఒక ప్రత్యామ్నాయాన్ని 'వ్యవసాయక విప్లవం' రూపంలో వెలుగులోకి తీసుకువచ్చాయి. ఆ క్రమంలోనే ఆయన అనేక సైద్ధాంతిక అంశాలమీద విలువైన వ్యాసాలు రాశారు. అవి 1) చైనాలో వర్గ విశ్లేషణ 2) ఐక్య సంఘటన 3) వైరుధ్యాలు 4) ఆచరణ 5) నూతన ప్రజాస్వామ్యం 6) ప్రజా సంస్కృతి, కళలు, 7) వ్యూహం, ఎత్తుగడలు 8) తత్వశాస్త్రం మాయాజాలం కాదు. ఇవన్నీ ఇప్పటివరకు ప్రపంచవాప్తంగా వ్యవస్థల మార్పుకోసం పోరాడుతున్న మార్క్సిస్టు లెనినిస్టులకు కొత్త చూపును అందించాయి. మార్క్సిజం లెనినిజాన్ని చైనా నిర్దిష్ట పరిస్థితులకు మావో ఎలా అన్వయించారో, అలానే తమ తమ దేశాల ప్రత్యేక స్థితులకు సిద్ధాంతాన్ని అన్వయించడం ప్రారంభమైంది. 1926 మార్చిలో మావో రాసిన 'చైనా సమాజంలో వర్గ విశ్లేషణ', 1927 మార్చిలో రాసిన 'హునాన్ రైతాంగ ఉద్యమ అధ్యయన నివేదిక' అత్యంత ప్రధానమైనవి.

చైనా కమ్యూనిస్టుపార్టీ, కామ్రేడ్ మావో విప్లవ పోరాటాన్ని కొనసాగిస్తునే పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటాన్ని కూడా కొనసాగించారు. ఇందులో మావో అనుసరించిన వైఖరి ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలన్నింటికీ ఆదర్శనీయమైనది. సుదీర్ఘకాలం ఓపికగా చర్చించడం ద్వారా మాత్రమే భిన్నాభిప్రాయాలను పరిష్కరించుకునే పద్ధతిని అనుసరించారు. ఎక్కడా ఎప్పుడూ అప్రజాస్వామికంగా వ్యవహరించలేదు. ఆయన వివిధ సందర్భాలలో పార్టీలో మైనారిటీలో ఉన్నప్పటికీ పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించే రీతిలో ప్రవర్తించలేదు. ప్రతి సందర్భంలోనూ పార్టీ సభ్యుల, కార్యకర్తల సైద్ధాంతిక స్థాయిని పెంచడానికే ప్రయత్నించారు. ఇలాంటి వైఖరి కారణంగానే చైనా కమ్యూనిస్టుపార్టీ చీలికలకు గురికాకుండా మహత్తరమైన విజయాన్ని సాధించగలిగింది.

ఈ క్రమమంతా జరుగుతూ ఉండగానే విజయానికి పూర్వం నుండే చైనా కమ్యూనిస్టుపార్టీ దిద్దుబాటు కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంటే నాయకత్వంలోనూ, కార్యకర్తలలోనూ ఉన్న

తప్పుడు భావాలను, అన్యవర్గ ధోరణులను, పెత్తందారీ పని పద్ధతులను, ఒంటెత్తు వాదాన్ని గుర్తించి, వాటికిగల కారణాలను, వాటివల్ల కలిగే నష్టాలను వివరించడం ద్వారా సభ్యులలో ఉండే తప్పుడు ధోరణులను సరిదిద్దే ప్రయత్నం చేసింది. మొదటి దిద్దుబాటు కార్యక్రమం 1942లోనే ప్రారంభించారు. అప్పటి నుండి అనేక సందర్భాలలో పార్టీలో తలెత్తిన మితవాద, అతివాద ధోరణులకు వ్యతిరేకంగా దిద్దుబాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పార్టీ సభ్యులలో ఉన్న స్వీయాత్మక ధోరణులకు వ్యతిరేకంగా పోరాటాలను నిర్వహించింది. ఈ విధంగా 1921 నుండి 1949 వరకు అంటే మూడు దశాబ్దాల కాలం చైనా కమ్యూనిస్టుపార్టీ ఏక కాలంలో నిర్మాణాన్ని సంఘటితం చేసుకున్నది, వీరోచితమైన సైన్యాన్ని నిర్మాణం చేసుకున్నది, తాత్విక స్థాయిలో మార్క్సిస్టు మూల సూత్రాలకు చేర్పులను అందించింది, అంతిమంగా అనూహ్యమైన విజయాన్ని సాధించింది.

ఒక్కమాటలో చెప్పాలంటే 1921 నుండి 49 వరకు జరిగిన చరిత్ర క్రమం చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రయాణంలో మహోజ్వలమైన దశ. ప్రపంచ విప్లవాలలో అంతటి వైవిధ్యభరితమైన కర్తవ్యాలను విజయవంతంగా నిర్వహించగలిగిన ఉద్యమం మరొకటి లేదేమో ననిపిస్తుంది. దీనికంతటికి కామ్రేడ్ మావో నాయకత్వం, నాయకత్వ శ్రేణుల మార్క్సిస్టు లెనినిస్టు పరిశీలనా పద్ధతి, ఆచరణలతోపాటు, వేలాది మంది పార్టీ సభ్యుల, సానుభూతిపరుల, సాధారణ ప్రజల అసాధారణమైన త్యాగాలే కారణం.

1949 తరవాత చైనా కమ్యూనిస్టుపార్టీ కొత్త బాధ్యతల్ని భుజాన వేసుకోవాల్సి వచ్చింది. అప్పటివరకు విప్లవోద్యమాన్ని నిర్మాణం చేసిన పార్టీ ఇప్పుడు అన్ని రంగాలలోనూ వ్యవస్థల్ని పునర్నిర్మాణం చేయాల్సిన బాధ్యతని చేపట్టింది. ఇది నాణేనికి ఒకవైపైతే మరోవైపు, నూతనంగా ఏర్పడిన చైనా ప్రజారిపబ్లిక్‌ను శైశవదశలోనే అంతం చేయడానికి అంతర్జాతీయ సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష, పరోక్ష కుట్రల నుండి దేశాన్ని కాపాడుకోవడం కొత్త ప్రభుత్వం ఎదుర్కొన్న మరొక గురుతరమైన బాధ్యత. ఈ రెండింటిని నిర్వర్తించే క్రమంలో పార్టీ అనేక ఒడుదుడుకుల్ని ఎదుర్కొన్నది. విప్లవం విజయవంతం అయిందంటే కమ్యూనిస్టు సమాజం ఏర్పడిందన్నట్టుగానే భావించిన నాయకత్వపు వ్యక్తులు కొందరైతే, తీవ్ర అలసత్వానికి గురైనవారు మరికొందరు. పునర్నిర్మాణ క్రమంలో అనుసరించాల్సిన ఆర్థిక, రాజకీయ సాంఘిక, సాంస్కృతిక విధానాల విషయంలో కూడా పార్టీలో, పోరాట క్రమంలో తలెత్తినట్టుగానే, అనేక సందర్భాలలో అవకాశవాద ధోరణులు అన్యవర్గ ధోరణులు తలెత్తాయి. అంటే రెండు పంథాల మధ్య పోరాటాన్ని పార్టీ మరోసారి చేపట్టాల్సి వచ్చింది. దీనితోపాటు నాయకత్వంలోనూ కార్యకర్తలలోనూ అధికార లాలసత్వం పెరిగి ఆర్థిక అరాచకం, అవినీతి కూడా చాపకింద నీరులాగా ప్రభుత్వంలోనూ పార్టీలోనూ ప్రవేశించింది.

వీటన్నిటికీ వ్యతిరేకంగా పోరాడుతూ పార్టీని, దేశాన్ని కాపాడుకోవాల్సిన కత్తిమీదసాము లాంటి బాధ్యతను పార్టీ నాయకత్వం తీసుకున్నది. విజయవంతమైన నూతన ప్రజాస్వామిక దశ నుండి సోషలిస్టు దశకు చైనాను తీసుకుపోవడానికి అవసరమైన ఆర్థిక కార్యక్రమాలను పార్టీ చేపట్టింది. దాని దృష్టి ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో భూ యాజమాన్య సంబంధాలలో మౌలికమైన మార్పులు తీసుకురావడంమీద ఉంచింది. అందులో భాగంగానే 1950లలో పెద్ద ఎత్తున భూ సంస్కరణలు, భూమి పునఃపంపిణీ కార్యక్రమాలను చేపట్టింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలని, కమ్యూన్లని ఏర్పాటుచేసింది. పారిశ్రామిక రంగంలో స్వావలంబనకు, ప్రజల సృజనాత్మక శక్తి వికాసానికి, ప్రజాస్వామికీకరణకు ప్రయత్నించింది. ఇక్కడి నుండే పార్టీలో అంతర్గత విభేదాలు క్రమక్రమంగా ప్రారంభమయ్యాయి. పార్టీలో ఉండే ఒక బలమైన వర్గం మావో నాయకత్వాన్ని అంగీకరిస్తున్నట్టు నటిస్తూనే మరోపక్క ఈ కొత్త ఆర్థిక సంస్కరణలకు లోపల్నుండి తూట్లు పొడవడం ప్రారంభమైంది. దీన్ని ఎదుర్కోవడానికి పార్టీ కార్యకర్తలను సైద్ధాంతిక రంగంలో చైతన్యవంతుల్ని చేయడానికి పెద్ద ఎత్తున రాజకీయ శిక్షణా కార్యక్రమాన్ని పార్టీ చేపట్టింది.

1950లలోనే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో రష్యా, చైనా పార్టీల మధ్య ప్రధానమైన సైద్ధాంతిక విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో చైనా పార్టీ నిర్వహించిన గ్రేట్ డిబేట్ చాలా చారిత్రాత్మకమైనది. కామ్రేడ్ స్టాలిన్ మరణం తరవాత అధికారంలోకి వచ్చిన రివిజనిస్టు నాయకత్వంలో రష్యన్ కమ్యూనిస్టు పార్టీ క్రమంగా సోషలిస్టు పంథా నుండి దూరమైపోయిందని, తన అంతర్జాతీయ బాధ్యతలను అవకాశవాదంతో వదిలివేసిందని చైనా పార్టీ విమర్శ పెట్టింది. గ్రేట్ డిబేట్ సందర్భంగా చైనా కమ్యూనిస్టుపార్టీ విడుదల చేసిన సాహిత్యం మార్క్సిస్టు లెనినిస్టులకు విలువైన భావజాల సంబంధమైన పాఠాలను అందించింది.

దీనితోపాటు దేశంలో వ్యవసాయ రంగంలోనూ పారిశ్రామిక రంగంలోనూ ఉత్పత్తిని పెంచడానికి, స్వావలంబనను సాధించడానికి, ఇతర దేశాల నుండి దిగుమతి అయ్యే నిపుణుల మీద ఆధారపడకుండా స్వదేశీ పరిజ్ఞానం మీద ఆధారపడి స్థానికంగా ఉండే మానవ వనరును, ఇతర సహజ వనరును ఉపయోగించుకోవడానికి అవసరమైన చర్యలను పార్టీ చేపట్టింది. వీటికి అనుగుణంగా పార్టీ కార్యకర్తలలో చొరవను, నైపుణ్యాన్ని పెంచడానికి, వాటి అవసరాన్ని వాళ్లచేత గుర్తింపచేయడానికి పెద్ద ఎత్తున ఎడ్యుకేషన్ కార్యక్రమాల్ని చేపట్టింది. కేవలం నైపుణ్యానికి మాత్రమే ప్రాధాన్యతను ఇవ్వకుండా వ్యక్తుల రాజకీయ చైతన్యాన్ని పెంచడానికి కూడా ప్రాధాన్యతనిచ్చింది. వీటితోపాటు పార్టీలో తలెత్తుతున్న అవాంఛనీయ ధోరణుల నుంచి నిర్మాణాన్ని కాపాడుకోవడానికి అవసరమైన దిద్దుబాటు కార్యక్రమాల్ని మళ్లీ చేపట్టింది.

చైనా కమ్యూనిస్టుపార్టీ చేపట్టిన కార్యక్రమాలలో విలువైన మరొక ప్రజా ఉద్యమం సాంస్కృతిక విప్లవం. నిజానికి ఇది ఒక కొత్త తరహా విప్లవం. సాధారణంగా విప్లవాలు అంటే రాజకీయ విప్లవాలనే అర్థం. విప్లవం అంటే అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి సాగే పోరాటమని అవగాహన. కాని ఈ అవగాహనలకు భిన్నంగా చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రజల ఆలోచనల్లో, సంస్కృతిలో మౌలికమైన మార్పులు తీసుకురావల్సిన అవసరాన్ని గుర్తించి సాంస్కృతిక విప్లవాన్ని

ప్రారంభించింది. కేవలం రాజకీయ ఆర్థిక రంగాలలో తీసుకువచ్చిన మార్పులు వ్యవస్థ పునర్నిర్మాణానికి పూర్తిగా ఉపయోగపడవని, పునాదిలో ఎంత మార్పు వచ్చినా ఉపరితలంలోకూడా తదనుగుణమైన మార్పులు రాకపోతే అది పునాది మీద ప్రభావం వేసే అవకాశం ఉందని పార్టీ భావించింది. అలా ఉపరితలంలో గుణాత్మకమైన మార్పులు తీసుకువచ్చే లక్ష్యంతోటే సాంస్కృతిక విప్లవం ప్రారంభమైంది. 1966లో ప్రారంభమైన సాంస్కృతిక విప్లవం 1969దాకా కొనసాగింది. ఇది ఒకరకంగా పార్టీలోనూ ప్రభుత్వంలోనూ పేరుకుపోయిన కల్మషాన్ని తొలగించే ప్రక్షాళనా ఉద్యమం. సాంస్కృతిక విప్లవం సమాజంలోని అన్ని పార్శ్వాలనూ తాకింది. రాజకీయ, పరిపాలనా రంగాలతోపాటు, విద్య, కుటుంబం, సాహిత్యం, కళలు మొదలైన రంగాలన్నింటిలో చొరబారిన అన్యవర్గ ధోరణులను , నిర్భయంగా, నిశితంగా బహిరంగంగా ప్రశ్నించటానికి, వ్యతిరేకించడానికి సాధారణ ప్రజలకి అవకాశాన్నిచ్చింది. ఇలాంటి సాంస్కృతిక విప్లవాలు ఎప్పటికప్పుడు జరగకపోతే పార్టీలోనూ ప్రభుత్వంలోనూ పేరుకున్న కల్మషం సమాజాన్నంతటినీ తినివేస్తుందని మావో హెచ్చరించారు.

సాంస్కృతిక విప్లవం విజయవంతమైన కొద్దికాలానికే, 1976లో మావో చనిపోయారు. ఆ తరవాత అధికారంలోకి వచ్చిన డెంగ్‌జియావో పింగ్ నుండి నేటి వరకు పార్టీ నాయకులందరూ సాంస్కృతిక విప్లవ లక్ష్యాలకు తూట్లు పొడుస్తూ పార్టీని ప్రభుత్వాన్ని మార్క్సిస్టు మూల సూత్రాలకు భిన్నంగా నడిపించడం ప్రారంభమైంది. విప్లవ క్రమంలోనూ, తదనంతర కాలంలోనూ పార్టీ రూపొందించిన అనేక సైద్ధాంతిక సూత్రాలను తిరగదోడడం ప్రారంభమైంది. రష్యాలో వర్గాలు రద్దు అయ్యాయి అని కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వంలో అక్కడి కమ్యూనిస్టుపార్టీ చేసిన సూత్రీకరణను మావో నాయకత్వంలో ఆనాటి కమ్యూనిస్టు పార్టీ విమర్శించింది. అదే చైనా కమ్యూనిస్టుపార్టీ 1979లో ఒక తీర్మానం చేస్తూ 'ఇక మన దేశంలో వర్గపోరాటం అవసరం లేదు, సోషలిస్టు ఆధునికీకరణమీద మనం దృష్టి నిలపాలి' అని ప్రకటించింది. చైనాలో వర్గ వైరుధ్యాలకు కాలం చెల్లిందని కూడా ప్రకటించింది. 1979 మే 9న పీపుల్స్‌డైలీ తన సంపాదకీయంలో ఇలా రాసింది. 'ఏ సోషలిస్టు దేశానికైనా తనదైన స్వంత విధానాలని అనుసరించే హక్కు ఉంది. ఏ దేశాన్నీ 'సోషలిస్టు' అనో 'రివిజనిస్టు' అనో పిలవడం సరికాదు' అంటూ 'ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి మాత్రమే అంకితం కావడం రివిజనిజం' అని గతంలో పార్టీ చేసిన సూత్రీకరణను తప్పుపట్టింది.

1980ల నుండి క్రమక్రమంగా భూ యాజమాన్యంలో తిరోగమన మార్పుల్ని ప్రవేశపెట్టింది. సహకార వ్యవసాయ సంఘాల్ని రద్దుచేసింది. దాని స్థానంలో రైతు కుటుంబాలకు సొంత భూ యాజమాన్యాన్ని కలిగిస్తూ చట్టాలను చేసింది. ఆర్థిక ఉద్దీపనలు లేకుండా ప్రజలు సమష్టి ఉత్పత్తి కార్యక్రమాలలో పాల్గొనరని, అందుచేతనే సమష్టి వ్యవసాయ క్షేత్రాలలో అసమర్థత పెరిగి నష్టాలు వస్తున్నాయని పేర్కొన్నది. భూమి మీద వ్యక్తిగత ఆస్తి హక్కు ఇచ్చినప్పుడే రైతులు కష్టపడి పనిచేస్తారనే బూర్జువా ఆలోచనకు పార్టీ లోనైంది. అక్కడి నుండి ప్రారంభమై క్రమ క్రమంగా పెట్టుబడిదారీ వ్యవసాయ పద్ధతులవైపు ప్రయాణించింది. అలాచేస్తే తప్ప భూమిని సంఘటితం చేసుకోవడం సాధ్యంకాదని పెద్ద పెద్ద భూ ఖండాలలో చేసే సాగుబడిద్వారానే అధికోత్పత్తి సాధ్యమవుతుందని ప్రచారం చేసింది.

ఈ చర్యల ఫలితంగా 1984 నాటికే సమష్టి వ్యవసాయపద్ధతి రద్దు అయిపోయి దాని స్థానంలో సొంత భూ యాజమాన్య పద్ధతి చైనా గ్రామీణ ప్రాంతాలన్నింటా అమలులోకి వచ్చేసింది. ఈ మార్పు ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక సంబంధాలలో అసమానత క్రమంగా పెరగడం ప్రారంభమైంది. కమ్యూన్ల పద్ధతి అమలులో ఉన్నంతకాలం ఉత్పత్తి పరికరాలను, నీటి వనరులను, హేతుబద్ధంగా సమిష్టి అవసరాలకోసం వాడుకోవడం, రైతులు తమ తమ కమ్యూన్లలో అధికోత్పత్తిని సాధించడంకోసం ప్రయోగాలు చేయడం, వీటితోపాటు కమ్యూన్ల ఆదాయ వనరులు పెరిగి విద్య, వైద్యం, గృహవసతి వంటి ప్రజా అవసరాలను తీర్చగలిగే స్థితి ఏర్పడింది. కొత్త పద్ధతిలో వీటన్నింటికీ ఉన్న అవకాశాలు సన్నగిల్లిపోయాయి.

సమిష్టి వ్యవసాయాన్ని రద్దుచేయడం కేవలం ఒక ఆర్థిక అంశం మాత్రమే కాదు. దాని ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగుల రిజర్వు సైన్యం తయారైంది. ప్రభుత్వం వాళ్లందరినీ పెద్ద ఎత్తున పట్టణాలకు తరలించింది. ఇది అంతిమంగా పట్టణాలలో నగరాలలో ఉండే బూర్జువా వర్గానికి, బడా పెట్టుబడిదారీ వర్గానికి చౌక శ్రమశక్తిని సమకూర్చే సాధనంగా మారింది. లక్షల సంఖ్యలో కార్మికులు గ్రామాల నుండి పట్టణాలకు తరలించబడడంతో, అప్పటికే అక్కడ స్థిరపడిన శ్రామికులకు, కొత్తగా వలసవచ్చిన శ్రామికులకు మధ్య కొత్త వైరుధ్యం తలెత్తింది. దీన్ని ఆసరా చేసుకుని పారిశ్రామికవేత్తలు వారి శ్రమను ఇతోధికంగా దోపిడీ చేసే అవకాశం కలిగింది.

దీనితోపాటు సాంస్కృతిక విప్లవకాలంలో విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణలన్నింటినీ తిరగదోడారు. పై చదువులకు ఎంట్రెన్స్ పరీక్షల పద్ధతి, వాటికి శిక్షణ ఇవ్వడానికి కోచింగ్ సెంటర్‌ల వ్యవస్థ ప్రారంభమై ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ధనిక, శిష్ట వర్గాలకు చెందిన బిడ్డలకు సాధ్యమైంది. అంతేగాకుండా చదువుపై పెద్దమొత్తంలో మదుపు పెట్టలేక సామాన్య కుటుంబాలు కిందిస్థాయి చదువులతోటే ముగించాల్సి వచ్చింది.

చైనా కమ్యూనిస్టుపార్టీ మావో మరణానంతరం భావజాలరంగంలో వేగంగా తిరోగమించడం ప్రారంభమైంది. 1) వర్గ విశ్లేషణ స్థానంలో సమర్థత, యాదృచ్ఛికత అనే అంశాలకు ప్రాధాన్యత పెరిగింది. 2) భూ యాజమాన్యంలో వచ్చిన మార్పుల ఫలితంగా పెట్టుబడిదారీ పరివర్తనకు మార్గం సుగమమైంది. 3) శ్రామికులకుండే సమష్టి బేరసారాలాడే శక్తి కుదించుకుపోయింది. 4) గ్రామీణ ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాలకు మధ్య, సంపద కలిగినవాళ్లకీ లేనివాళ్లకీ మధ్య వ్యత్యాసాలు బాగా పెరిగాయి. 5) ప్రభుత్వం అనుసరించే విధానాలన్నీ ప్రధానంగా నగర, పారిశ్రామిక రంగాలమీదే దృష్టి పెట్టాయి. దీని ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వనరుల సదుపాయాల కల్పనపై ప్రభుత్వం వ్యయం బాగా తగ్గిపోయింది. 6) 2016 నాటికి దాదాపు 280 మిలియన్‌ల మంది గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ

ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

2008లో చైనా కమ్యూనిస్టు పార్టీ చేసిన తీర్మానంలో, 'రైతులు భూమి మీద తమకున్న హక్కును బదిలీ చేయడం ద్వారా భూ యాజమాన్యం కొంతమందిచే కేంద్రీకృతమై దాని ఫలితంగా భారీస్థాయిలో ఉత్పత్తి సాగించడానికి సాధ్యమవుతుంద'ని పేర్కొన్నది.

చైనా కమ్యూనిస్టుపార్టీ దృష్టి ఇంకెంత మాత్రమూ వర్గపోరాటం మీద లేదనీ, ఆధునికీకరణ మీదనే కేంద్రీకరించామని పేర్కొన్నది. చైనాలో ఉన్న ప్రధాన వైరుధ్యాలలో వర్గపోరాటం ఒకటిగా తాము భావించడంలేదని తీర్మానించింది.

పార్టీ భావజాలంలో వచ్చిన ఈ మార్పులకు అనుగుణంగా చైనా రాజ్యాంగాన్ని కూడా సవరించారు. 13వ నిబంధనలో ఇలా పేర్కొన్నారు. "పౌరులకుండే చట్టబద్ధమైన వ్యక్తిగత ఆస్తిహక్కు అనుల్లంఘనీయమైనది. ఆస్తిపై యాజమాన్యాన్ని కలిగివుండటానికి, దాన్ని వారసులకు అందచేయడానికి ప్రజలకున్న హక్కును రాజ్యం రక్షించాలి." 15వ నిబంధన ప్రకారం "రాజ్యం సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థను అమలులో పెట్టాలి." 45వ నిబంధన ప్రకారం "చైనా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నిసార్లయినా పదవికి ఎన్నికకావచ్చు." 36వ నిబంధనలో ఇలా ఉంది. "సోషలిస్టు వ్యవస్థ చైనా ప్రాథమిక వ్యవస్థ. అయితే చైనాలో అమలులో ఉండే సోషలిజం లక్షణాల్ని చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం నిర్ణయిస్తుంది. అది చైనా తరహా సోషలిజం."

రాజ్యాంగానికి ఉన్న ప్రవేశికలో ఇలా రాసుకున్నారు. "నూతన ప్రజాస్వామిక సమాజం నుండి మన దేశం క్రమంగా సోషలిస్టు సమాజంగా పరిణామం చెందడం పూర్తి అయింది. ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్యాన్ని సోషలిస్టు యాజమాన్యంగా మార్చే ప్రక్రియ కూడా పూర్తి అయింది. సోషలిస్టు వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. శ్రామిక వర్గ నియంతృత్వాన్ని సంఘటితం చేసి అభివృద్ధి చేసుకున్నాం. ఇప్పుడు మనం ప్రధానంగా మన దృష్టిని కేంద్రీకరించాల్సింది సోషలిస్టు ఆధునికీకరణమీద. తద్వారా మనం చైనా తరహా సోషలిజం వైపుగా ప్రయాణించగలం. మనదేశంలో దోపిడీవర్గాలు ఒక వర్గంగా నిర్మూలించబడ్డాయి."

రాజ్యాంగంలో చైనా కమ్యూనిస్టుపార్టీ తీసుకువచ్చిన మార్పులన్నీ ఆ సమాజాన్ని క్రమంగా పెట్టుబడిదారీ సమాజంగా మార్చే దిశగానే ఉద్దేశించబడ్డాయి. దీనికి అనుగుణంగా పార్టీ సారధ్యంలోని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలన్నీ అంతిమంగా చైనాలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా సాగుతున్నాయి.

చైనా కమ్యూనిస్టుపార్టీ క్రమక్రమంగా మార్క్సిస్టు మౌలిక సూత్రాలను వదిలేసిందని చెప్పడానికి ఇటు పార్టీలోనూ అటు ప్రభుత్వంలోనూ తీసుకువస్తున్న మార్పులే తార్కాణాలు. అవి 1) పార్టీలో సభ్యత్వాన్ని ఇవ్వడానికి వ్యక్తుల వర్గ పునాది అనే అర్హతను రద్దు చేసి, పెట్టుబడిదారులను కూడా పార్టీ సభ్యులుగా తీసుకోవాలని నిర్ణయించింది. 2) తన అవగాహననుండి 'సామ్రాజ్యవాదం' అనే పదాన్ని ఉపసంహరించుకుంది. 3) సరుకుల ఉత్పత్తి కొనసాగినంతకాలం వాటి వినిమయం కోసం తప్పనిసరిగా మార్కెట్ వ్యవస్థ ఉండాలి అని నిర్ణయించింది. 4) అంతర్జాతీయ రాజకీయ రంగంలో మతం ఒక బలీయమైన శక్తిగా ఉందికాబట్టి మన దేశంలో మతానికి స్వేచ్ఛ ఇవ్వడంవల్ల ఇతర దేశాలతో సంబంధాలను బలపరుచుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని భావించి, సాంస్కృతిక విప్లవానంతర కాలంలో ప్రభుత్వం నాలుగు మతాలను గుర్తించింది. ఒకటి బౌద్ధం, రెండు తావోయిజం, మూడు క్రైస్తవం, నాలుగు ఇస్లాం. చైనాలో నిరంకుశ భూస్వామ్య పీడనకు, అణచివేతకు బలీయమైన అండగా నిలబడి, ప్రజలలో బానిస మనస్తత్వాన్ని ప్రేరేపించిన కన్‌ఫ్యూషియస్ మతాన్ని చైనా సాంస్కృతిక వారసత్వంలో ఒక ప్రధాన అంశంగా గుర్తించింది. 2004లో ప్రభుత్వం "చైనా సంస్కృతిని రక్షించడం కోసం" అనే లక్ష్యంతో కన్‌ఫ్యూషియస్ ఇనిస్టిట్యూట్‌ను కూడా ప్రారంభించింది. అలజడులు, వత్తిళ్లు లేని సమాజాన్ని నిర్మాణం చేయడంలో మతానికున్న పాత్రను పార్టీ, ప్రభుత్వం గుర్తించాయి.

ఇలా చూస్తే చైనా కమ్యూనిస్టుపార్టీ దృక్పథంలో మౌలికంగా వచ్చిన మార్పులన్నీ చైనా సమాజాన్ని పెట్టుబడిదారీ ఆధునికత పేరుతో ఆర్థిక రంగంలో మార్పులను సాగిస్తూ, మానవ సంబంధాలలో పాత భూస్వామ్య విలువలను తిరిగి నెలకొల్పే దిశగా ప్రయాణిస్తున్నట్లు స్పష్టమవుతున్నది.

ఏడు దశాబ్దాల కాలం కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో పరిపాలించబడిన దేశంలో వ్యక్తిగత సంపద హద్దులు లేకుండా పెరగడం ఆ పార్టీ నిజంగా కమ్యూనిస్టు పార్టీయేనా కాదా అనేదానికి అద్దం పడుతోంది. ప్రభుత్వం విడుదల చేసిన లెక్కల ప్రకారమే 2021 నాటికి ప్రపంచంలో మొత్తం ఉన్న 3228 బిలియనీర్లలో ఒక్క చైనాలోనే 1058 మంది బిలియనీర్లున్నారు. చైనాలో 10 లక్షల డాలర్లకన్నా ఎక్కువ సంపద ఉన్న వారి సంఖ్య 52.82 లక్షలు. దిగువశ్రేణికి చెందిన 50 శాతం ప్రజలకన్నా ఎన్నోరెట్లు ఎక్కువ సంపద ఒకశాతం ప్రజలవద్ద పోగుపడింది. ఫార్చ్యూన్ గ్లోబల్ 500 నివేదిక ప్రకారం అత్యధిక విలువైన ఆస్తులగల పరిశ్రమల జాబితాలో ఉన్న చైనా కంపెనీల సంఖ్య 133. ఇది ఆ జాబితాలో ఉన్న అమెరికన్ కంపెనీల సంఖ్యకన్నా ఎక్కువ. బ్యాంకింగ్ రంగంలోగాని రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలోగాని అంతర్జాల కంపెనీలలోగాని పెద్ద మొత్తంలో మదుపులు పెడుతున్న, లాభాలు ఆర్జిస్తున్న కంపెనీలలో చైనా కంపెనీలే ఎక్కువ ఉన్నాయి. అక్కడ వ్యక్తిగత ఆస్తి ఎంత ఎక్కువగా పోగుపడుతుందో తెలుసుకోవడానికి ఒక్క ఉదాహరణ చాలు. ఝాంగ్ షాన్సన్ అనే వ్యక్తి సాంస్కృతిక విప్లవ కాలంలో స్కూల్ డ్రాపవుట్. అతడు భవన నిర్మాణరంగంలో కూలీగా ప్రారంభమై ఇప్పుడు మందుల కంపెనీలు, తాగునీటి సరఫరా కంపెనీలకు అధిపతి అయ్యాడు. అతడి ఆస్తి విలువ 70.2 బిలియన్‌ల అమెరికన్‌ల డాలర్లు. ఇదంతా ఇలా ఉండగా చైనాను పెట్టుబడిదారీ ఆధునికీకరణ వైపుగా నడిపించడానికి వీలుగా పెద్ద ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడానికి తన ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులను ప్రభుత్వం చేసింది.

మొత్తంమీద వందేళ్ల ఉనికి తరవాత చైనా కమ్యూనిస్టుపార్టీ పయనం ఎలా సాగుతుందో, ఎక్కడ ప్రారంభమై ఎక్కడికి చేరుకున్నదో విశ్లేషించుకుంటే అది ఇంకెంతమాత్రం కమ్యూనిస్టు సూత్రాలకు

కట్టుబడిన పార్టీ కాదని స్పష్టమవుతుంది. కేవలం ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి ఉత్పత్తి సంబంధాలలో పరిణామానికి గండికొట్టడం, కమ్యూనిస్టుపార్టీకి ఉండాల్సిన అంతర్జాతీయ కర్తవ్యాలను వదిలి శక్తివంతమైన జాతీయ శక్తిగా రూపొందడానికి ప్రాధాన్యతనివ్వడం, తన వద్ద పేరుకున్న ఆర్థిక వనరులను ఉపయోగించి 'బెల్ట్ రోడ్డు ఇనీషియేటివ్' పేరుతో ఆసియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాలలో అనేక దేశాలలో పెట్టుబడులు పెట్టి రుణాలిచ్చి వాటిపై తన రాజకీయ ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించడం, దేశంలోపల పెరుగుతున్న వర్గ, ప్రాంత వైరుధ్యాలను పరిష్కరించడానికి బదులు రాజ్య బలంతో అసమ్మతిని, నిరసనను అణచివేయడం, శ్రామికవర్గ నియంతృత్వ సూత్రాన్ని వదిలి, చైనాతరహా సోషలిజం పేరుతో మార్క్సిస్టు మూల సూత్రాలకు తూట్లుపొడవడం, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని వ్యక్తి నియంతృత్వంగా మార్చే దిశగా రాజ్యాంగాన్ని సవరించడం, కమ్యూనిస్టుపార్టీ అధికార పత్రికలలో రాశిఫలాలను ప్రకటిస్తూ, మరోపక్క కాలంచెల్లిన కన్‌ఫ్యూషియస్ భావాలకు పెద్ద పీటవేయడం ఇవన్నీ చైనా కమ్యూనిస్టుపార్టీ ఎంతగా దారితప్పిందో తెలియజేస్తున్నాయి.

మార్క్సిజం పరిణామశీలమైన రాజకీయార్థిక తత్వశాస్త్రం. అది మానవ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, విశ్లేషించుకోవడానికి ఉపయోగపడే అద్భుతమైన పరిశీలనా పద్ధతిని మనకి అందించింది. మార్క్సిజాన్ని తమ తమ సమాజాల నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకోవడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదు. సాయుధ పోరాట కాలంలో మావో చేసింది అదే. రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవ పంథాను యథాతథంగా అమలుపరచడంకాక, చైనా నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా దానిని అన్వయించి, అభివృద్ధిచేసి, మార్పులు చేసి విప్లవాన్ని విజయవంతం చేశాడు. అంతేగాని అన్వయం పేరుతో మూల సూత్రాలను వదిలిపెట్టలేదు. కాని ప్రస్తుత చైనా కమ్యూనిస్టుపార్టీ, చైనా తరహా కమ్యూనిజం పేరుతో, వ్యక్తిగత ఆస్తి హక్కును పునరుద్ధరించడం, చైనాలో వర్గవైరుధ్యాలు రద్దయిపోయాయని ప్రకటించడం, ఉత్పత్తి సంబంధాలకంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యతనివ్వడం, అంతర్జాతీయ శ్రామికవర్గ కర్తవ్యాలను విడనాడి దేశంలో జాతీయవాద వైఖరిని మితిమీరేటట్లు పెంచడం, ప్రజల జీవితాలలో మతానికి మళ్లీ ప్రత్యేక ప్రాధాన్యత కల్పించడం, సామ్రాజ్యవాదాన్ని తన ఎజెండా నుండి పక్కన పెట్టటం, వ్యక్తిగత ఆస్తికి అవకాశాన్ని కలిగించడం, కన్‌ఫ్యూషియస్ భావజాలాన్ని చైనా సాంస్కృతిక వారసత్వంగా ప్రకటించి దాని అధ్యయనాన్ని ప్రోత్సహించడం, శ్రామికవర్గ నియంతృత్వాన్ని తన ఎజెండా నుండి తొలగించడం వంటి కమ్యూనిస్టేతర భావాలను ప్రచారం చేస్తోంది, అమలుపరుస్తోంది. అందుకే నేటి చైనా కమ్యూనిస్టుపార్టీలో కమ్యూనిజం ఎంతమాత్రమూ లేదు. అది కమ్యూనిస్టుపార్టీనూ కాదు, చైనా మావో స్వప్నించిన చైనానూ కాదు.

(రచయిత విప్లవ రచయితల సంఘం సభ్యులు) వీ

(...4పేజీ కొనసాగింపు)

వస్తున్నాయి. అభ్యుదయం గురించి ఆలోచించేవాళ్ల మధ్యనే ఏదైనా రాజకీయ విషయాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలని చాల తేడాలు వస్తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్ గురించి అభ్యుదయవాదులే వేరువేరుగా మాట్లాడడం చూసే ఉంటారు. కనుక సిద్ధాంత అవగాహన మరింత లోతుగా కలిగించే వ్యాసాలు ఎక్కువ వేస్తే బాగుంటుంది.

– జి గంగారాం
నిజామాబాద్

నేను వీక్షణం మొదటగా 2012 నుంచి చదవడం ప్రారంభించాను. మొదట్లో అన్ని పత్రికల్లాగే ఉంటుందనుకున్నాను. కానీ చదవడం ప్రారంభించాక ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలు అంత తొందరగా అర్థం అయ్యేవి కావు. కానీ కాల క్రమంలో పదాల అర్థాలు తెలుసుకొని అర్థం చేసుకుంటూ చదివాను. దాంతో నాకు ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల పట్ల కొంత అవగాహన కలగడానికి వీక్షణం దోహదపడిందనడంలో సందేహం లేదు. పత్రికను చదువుతుంటే దిన, వార, మాస పత్రికలకు వీక్షణానికి ఉన్న వ్యత్యాసాన్ని గమనించాను. ఈ పత్రిక ప్రత్యేకంగా సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిష్పక్షపాతంగా విశ్లేషిస్తూ పాఠకులను చైతన్యపరుస్తోంది. వ్యవస్థలోని అన్ని కోణాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి తోడ్పాటునందిస్తోంది. ఈ మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వ్యాసాలు రావడం తగ్గిపోయింది. ప్రతి సంచికలో చిమ్మె జాన్ బర్నబాస్ వ్యాసం మాత్రం క్రమం తప్పకుండా ఉంటోంది. కానీ ఎక్కువ సమాచారాన్ని ఇచ్చేలా ఉంటున్నాయి. కొంత విశ్లేషణతో కూడి ఉంటే బాగుంటుంది. గతంలో రోహిణి ప్రసాద్ గారు సైన్స్ వ్యాసాలు క్రమం తప్పకుండా రాసేవారు. ఆయన వ్యాసాలు చదవడం వల్ల చాలా అపోహలు తొలిగిపోయాయి. ధనిక దేశాలు తమ ఆధిపత్యం కోసం ఇతర దేశాల మధ్య చిచ్చుపెట్టి వనరులను దోసుకుంటూ ఎలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నాయో వీక్షణం ద్వారానే తెలుసుకున్నాను. ప్రభుత్వాలు ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్‌లలో చెప్పే తప్పుడు లెక్కల గుట్టును వీక్షణం ఎప్పటికప్పుడు విప్పిచెప్పడం వల్ల ప్రభుత్వాలు చేసే మోసాలు తెలుస్తున్నాయి. ఆయా సందర్భాల్లోని జరుగుతున్న పరిణామాలపై రెండు, మూడు వ్యాసాలు ఒకే సంచికలో రావడం వల్ల ఆ అంశం పట్ల పూర్తి అవగాహన కలగడానికి తోడ్పడింది. పత్రిక చదువుతున్న క్రమంలో ఒక సంచికలో చదవాల్సిన పుస్తకాలను రచయితలు సూచించారు. దానివల్ల మనిషి మనిషిగా నిలబడడానికి ఏ పుస్తకాలు చదవాలో తెలుసుకునే అవకాశం వీక్షణం కలిగించింది. అందుకు వీక్షణం పత్రికకు కృతజ్ఞతలు.

– ఎ. యాదగిరి
కరీంనగర్

మత వేదన వాస్తవ వేదనకు వ్యక్తీకరణే. అదే సమయంలో అది వాస్తవ వేదన పట్ల నిరసన కూడా. మతం అణచబడ్డ జీవి నిట్టూర్పు. హృదయంలేని ప్రపంచపు హృదయం. ఉత్సాహంలేని పరిస్థితుల ఉత్సాహం. అది ప్రజలకు మత్తు మందు. ప్రజల భ్రమాజనిత ఆనందంగా ఉన్న మతాన్ని రద్దుచేయడమంటే ప్రజల వాస్తవమైన ఆనందాన్ని ఆకాంక్షించడమే. ప్రస్తుత స్థితిపట్ల భ్రమల్ని వదిలేయమని కోరడమంటే, భ్రమలు అవసరమయ్యే పరిస్థితుల్ని వదిలేయమని కోరడమే. అందుకే మతం మీద విమర్శ ఏ కన్నీటి ప్రవాహాల వెలుగు మతమో, ఆ కన్నీటి ప్రవాహాల మీద విమర్శకు బీజరూపమే.

– కార్ల్ మార్క్స్

వివిధ రూపాలలో భావవాదం

యు.ఎ. ఖారిన్ *రాసిన 'ఫండమెంటల్స్ ఆఫ్ డయలెక్టిక్స్' పుస్తకంలోని మొదటి అధ్యాయంలో అయిదవ ఉపశీర్షిక : అనువాదం - రాజేంద్రబాబు అర్విణి*

తత్వశాస్త్రానికి సంబంధించిన ప్రాథమికమైన ప్రశ్నకు భౌతికవాదం ఒక సమాధానం ఇస్తే, దానికి పూర్తిగా భిన్నమైన సమాధానం ఇచ్చే భావవాదానికి పలు రూపాలు ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి వస్తుగత భావవాదము, ఆత్మాశ్రయ లేదా వ్యక్తి కేంద్రిత భావవాదము. ఈ రెండు పాయలు కూడా పదార్థం కంటే చైతన్యమే ప్రధానమైనదని వాదిస్తాయి కానీ, చైతన్యానికి, ఆలోచనకు సంబంధించిన విషయాలలో రెండు వేర్వేరు అభిప్రాయాలు కలిగి ఉంటాయి. తత్వశాస్త్ర చరిత్రను పరిశీలిస్తే వీటి మధ్య ఉండే భేదాభిప్రాయం బాగా అర్థమవుతుంది.

పురాతన కాలంలో గ్రీకు దేశానికి చెందిన ప్లేటో (427-347క్రీ.పూ.) భౌతిక వాదానికి వ్యతిరేకంగా దృఢంగా వాదించిన తత్వవేత్త. బానిసలపై ఆధిపత్యం కలిగిన ధనిక స్వామ్య వ్యవస్థకు సిద్ధాంత కర్తగా వ్యవహరించిన ఆయన వస్తుగత భావవాదంలో దాదాపుగా మొట్టమొదటి ఆలోచనా క్రమాన్ని ప్రతిపాదించాడు. భౌతికవాది అయిన డెమోక్రిటస్ వాదనను ఖండిస్తూ ప్లేటో శాశ్వతమైన, నిత్యమైన, మార్పులేని, దేనిపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఉనికిలో ఉండే 'ఆధ్యాత్మిక సారం' ప్రాముఖ్యాన్ని బలపరిచాడు. ఇంద్రియ సంబంధమైన అనుభవాలతో కూడిన ప్రపంచానికి అంతగా ప్రాముఖ్యం లేదని, అది ఈ లోకానికి అతీతంగా ఆధ్యాత్మిక భావ ప్రపంచం ఆధీనంలో ఉంటుందని, ఆ ఆధ్యాత్మిక ప్రపంచమే నికార్సయినదని ప్రకటించాడు. "స్వర్గానికి పైన ఉండే అత్యున్నతమైన స్వర్గం - అదే భావాల నివాస స్థలం". "వాస్తవమైన జ్ఞానానికి సంబంధించిన మూలం అక్కడే ఉంది: దానికి రంగు లేదు, రూపం లేదు, అది తాకడానికి వీలులేని అంతఃసారం, ఆత్మను నడిపించే మనస్సుకు మాత్రమే గోచరమవుతుంది''. (ఇర్విన్ ఎడ్మన్ సంపాదకత్వంలో వెలువడ్డ 'ది వర్క్స్ ఆఫ్ ప్లేటో' అన్న పుస్తకంలోంచి, పేజీ 288).

పదార్థం జీవం లేనిది అని ప్లేటో నమ్మకం. ఇంద్రియ జ్ఞానంతో అనుభవంలోకి వచ్చే విషయాలు భావాల ప్రతిబింబాలు మాత్రమే. ఉనికిలో లేని పదార్థంలోని అంశాలు ఎప్పుడూ మార్పుకు లోనయ్యేవి, కొద్దికాలం మాత్రమే ఉనికిలో ఉండేవి. ఎల్లప్పుడూ శాశ్వతంగా, నికార్సుగా, మార్పు లేకుండా ఉండేది ప్రపంచానికతీతంగా ఉండే ఆధ్యాత్మిక సారం మాత్రమే అని ప్లేటో భావించాడు. మంచిదైన, సౌందర్యవంతమైన దైవిక సామ్రాజ్యానికి సంబంధించినది, సంపూర్ణ సత్యానికి సంబంధించినదే భావ ప్రపంచమని ప్లేటో బోధించాడు. మనిషి పుట్టుకకు ముందు ఆ దేహానికి మూలమైన ఆత్మ నివసించిన స్థలం ఇదే. ఆ వ్యక్తి మరణం తర్వాత భౌతికమైన ఆ దేహాన్ని వీడి ఆత్మ ఈ అతీంద్రియ ప్రపంచానికి వెళ్లిపోతుంది.

ప్లేటో తత్వశాస్త్ర భావాలు ప్రాచీన భారతదేశంలోని తొలి వస్తుగత భావవాద సిద్ధాంతాలతో పోలి ఉన్నాయి. వేదాంత శాస్త్రం బ్రహ్మణ వాదానికి సిద్ధాంతపరమైన సమర్థన సమకూర్చింది. బ్రహ్మణుడు అంటే అవ్యక్తమైన లోకానికి చెందిన ఆత్మ. అదే ప్రాథమికమైన వాస్తవం, అదే నిజమైన ప్రాపంచిక సారం. ప్రపంచంలో సహజమైన విషయాలన్నీ ఈ ఆత్మ నుండి సృష్టించబడ్డవే. ఇవన్నీ స్వప్నావస్థలో కనపడేవి, లేదా "బ్రహ్మణుని స్వప్నం లోనివి". ప్రకృతిలో సంభవించే విషయాలు, ఈ ప్రపంచం అంతా 'మాయ', ఇవి ఒక భ్రమ మాత్రమే, ఇవే పైకి కనిపించేవి మాత్రమే, ఇవి సంపూర్ణమైన అస్తిత్వం అయిన బ్రహ్మణున్ని మనిషి నుండి మరుగుపరచే 'అలలు, నీటి బుడగలు, నురుగు' మాత్రమే. మనిషి శరీరం అంటే శాశ్వతమైన ఆత్మకు బయట కప్పబడిన ఒక చిప్ప మాత్రమే. శాశ్వతమైన ఆ ఆత్మ బ్రహ్మ అవతారం లేదా ఒక రేణువు.


"అన్నింటికన్నా ముందు ఆ శాశ్వతమైన బ్రహ్మ! వెనక కూడా ఆ బ్రహ్మణే! కుడి ఎడమల బ్రహ్మ. కిందా, పైనా అంతటా బ్రహ్మ. మొత్తం అంతా బ్రహ్మ. అదే అత్యుత్తమమైనది." (ఉపనిషత్తులు – రెండవ భాగం, మోతిలాల్ బనారసిదాస్, న్యూ ఢిల్లీ 1965, పేజీ 37). అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని బలంగా ప్రతిపాదించిన భారత తత్వవేత్త శంకరాచార్యుడు (788–820 క్రీ. శ.) ఈ విధంగా బోధించాడు: "బ్రహ్మ తప్ప మరే వ్యక్తీకరణ లేదు", "కాబట్టి, వ్యక్తమైనదంతా బ్రహ్మనే... మరేది ఏమీ లేదు.... జీవులందరు బ్రహ్మ నుండి పుట్టినవారే, దైవికమైన ఆత్మ నుండి ఉద్భవించిన వారే. కాబట్టి అందరూ బ్రహ్మలే. ఈ విషయం అర్థం చేసుకోవాలి."

చైతన్యం, పదార్థం, ప్రకృతి – వీటికి సంబంధం లేకుండా మనిషి చైతన్యానికి దూరంగా వ్యక్తమైన ఆధ్యాత్మిక భావన మనకు ప్లేటో సిద్ధాంతంలో వలే వేదాంత తత్వంలోను కనిపిస్తుంది. అంతిమ విశ్లేషణలో వస్తుగత భావవాదం తత్వశాస్త్ర భావనలో, తత్వశాస్త్ర పదజాలంలో వ్యక్తమైన మతనానికి చెందిన ప్రాపంచిక దృక్పథం అని పేర్కొనవచ్చు. ఇది శాస్త్రీయ అవగాహనకు, ప్రకృతి శాస్త్రానికి, మానవుని సామాజిక – చారిత్రిక అనుభవానికి పూర్తిగా, ప్రాథమికంగా వ్యతిరేకమైన దృక్పథం. అయితే, అభ్యుదయ భౌతికవాద తత్వవేత్తలు శాస్త్రీయ విజ్ఞానం ఆధారంగా అతీంద్రియ శక్తుల గురించి, ప్రపంచపు ఆధ్యాత్మిక పునాదుల గురించిన భావవాద వక్కాణింపులను స్థిరంగా సమర్థవంతంగా తిప్పికొట్టారు.

వ్యక్తిగత లేదా ఆత్మాశ్రయ భావవాదులు వ్యక్తి లేదా కర్తకు సంబంధించిన చైతన్యమే ముఖ్యమని, వ్యక్తిగతం కాని ఆత్మ ముఖ్యం కాదని భావిస్తారు. ఉదాహరణకు 18వ శతాబ్దంలో ఇంగ్లీష్ తత్వవేత్త

జార్జ్ బెర్కెలీ (1685-1753) భౌతికవాదులను కఠినంగా విమర్శించాడు. వ్యక్తి ఇంద్రియ అనుభవంలో ఉన్న విషయాలను, చైతన్యాన్ని మాత్రమే ఉనికిలో ఉన్నాయని పరిగణించాలని వాదించాడు. మన అనుభవంలోకి వచ్చేది, చూసి, తెలుసుకునే విషయాలనే మనం పరిగణనలోకి తీసుకోవాలి అన్నది ఆయన సిద్ధాంతం. మనిషి ఇంద్రియ జ్ఞానం ద్వారా అనుభవంలోకి వచ్చేవి మాత్రమే నిజమైనవి కాబట్టి మనిషి చైతన్యంతో సంబంధం లేకుండా ఏ విషయానికి స్వతంత్రమైన ఉనికి ఉండదు అన్నది ఆయన వాదన. మనిషి ఆలోచనా శక్తికి అతీతంగా ఏ వస్తువుకు గాని, ఏ విషయానికి గాని, ఏ ప్రక్రియకు గాని సూత్రాలు, నియమాలు, వాటి మధ్య అనుకోకుండా ఆకస్మికంగా ఏర్పడే సంబంధాలు ఉండవని, ఎందుచేతనంటే ఏ ప్రక్రియ అయినా మనిషి ప్రత్యక్ష జ్ఞానం సృష్టేనని వస్తుగత భావవాదులు బోధిస్తారు. ఈ దృక్కోణాన్ని తర్క బద్ధంగా పరిశీలిస్తే అది ఎంతో అసంబద్ధమైన వాదన అని బోధపడుతుంది. ఒక వ్యక్తికి సంబంధించిన ఇంద్రియ జ్ఞానమే కొలబద్ద అయితే, తన అనుభవంలోకి వచ్చిన సంగతులే వాస్తవాలని, మిగతావాటికి ఉనికి లేదని విశ్వసిస్తే ఇతరుల అనుభవ జ్ఞానం సంగతేమిటి? ఆ వ్యక్తి సొంత తల్లితండ్రుల అనుభవాలు కూడా అతని పరిగణనలోకి రావు కదా! బెర్కెలీకి కూడా ఈ ప్రశ్న ఎదురయింది. కాబట్టి, దానిని పరిష్కరించే ఉద్దేశంతో ఆధ్యాత్మిక భావన అయిన దేవుని ఉనికిని నమ్మాడు. ఆ విధంగా తన సిద్ధాంతాన్ని తానే ఉల్లంఘించి, తాను ప్రతిపాదించిన మూల సూత్రాన్ని తానే ఖండించాడు. ప్రపంచం అంతటినీ భగవంతుడే సృష్టించాడని ప్రకటించాడు. తాను ఏర్పరచిన సూత్రాలకు అనుగుణంగా తాను సృష్టించిన వస్తువులన్నీ మనిషి ఇంద్రియ జ్ఞానం అనుభవంలోకి వస్తాయని భగవంతుడు ఆదేశించాడని ఘోషించాడు. ఆ రకంగా బెర్కెలె ప్రతిపాదించిన తత్వం అసంబద్ధంగా ఉండి, చివరికి ప్లేటో నమ్మిన వస్తుగత భావవాదానికి మారిపోయాడు. వ్యక్తిగత భావవాదము తర్కబద్ధమైన వాదనకు నిలిచే సిద్ధాంతం కాదు. దీర్ఘంగా ఆలోచిస్తే ఎన్నో వైరుధ్యాలు గోచరిస్తాయి. కాబట్టి అది అంగీకార యోగ్యం కాదు. అది నిజ జీవితంలో మానవ ఆచరణలో తప్పని నిరూపించబడ్డది. ప్రజల భాగస్వామ్యం ద్వారా జరిగే వస్తు ఉత్పత్తి, శాస్త్రీయ విజ్ఞానం ద్వారా సాధించిన సమాజపు అభివృద్ధి వలన మనిషి చైతన్యంతో ప్రమేయం లేకుండా ప్రపంచం ఉనికిలో ఉందని నిర్ద్వందంగా నిరూపించబడింది. కాబట్టి శాస్త్రీయ పరిజ్ఞానానికి, ప్రజల నిజ జీవిత అనుభవాలకు విరుద్ధంగా ఉండినందున, 17, 18వ శతాబ్దపు భౌతికవాద తత్వవేత్తలు బెర్కెలె వాదనను చాలా సహజంగానే తోసిపుచ్చారు.

తత్వశాస్త్రానికి సంబంధించి మౌలిక ప్రశ్న



పై ఉదాహరణల ద్వారా పురాతన కాలంలో భౌతికవాదానికి సంబంధించిన రూపాలు, భావవాదంలో ఉన్న వైరుధ్యాల గురించి తెలుసుకున్నాము. ఇప్పుడు గతితార్కిక, చారిత్రిక భౌతికవాదానికి సంబంధించి ప్రాథమిక విశేషాంశాలను పరిశీలిద్దాం. వీ

ఫాసిస్టు రాజకీయాలకు అద్దం పట్టిన పుస్తకం

- కేశవ్

'నిరసన అల్లర్లుగా మారిపోతాయి' అంటాడు జాసన్ స్టేన్లీ తన How Fascism Works - The Politics of Us and Them పుస్తకంలో.

అమెరికాలోనే కాక భారతదేశం లాంటి ఇతర దేశాల్లో ప్రజాస్వామ్యం గొడుగు కింద చాపకింద నీరులా ప్రవహిస్తున్న ఫాసిజం తీరుతెన్నులను చాలా స్పష్టంగా, వివరంగా విశ్లేషిస్తాడు ఈ పుస్తకంలో ఫాసిస్టు ధోరణులను అర్థం చేసుకోవడానికీ, వాటిని అడ్డుకునే చైతన్యం సంపాదించుకోవడానికి తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం ఇది. రచయిత తను చెప్పదలచుకున్న, విశ్లేషించదలచుకున్న విషయాల్ని యిలా అధ్యాయాలుగా విభజించి ఒక అచ్చు పుస్తకంలా వివరిస్తాడు.


1. ఊహాజనిత గతం/కల్పిత గతం 2. ప్రచారం 3. మేథో వ్యతిరేక/మూర? శిఖామణి 4. అవాస్తవికత 5. అధికార క్రమం 6. బలి పశుత్వం 7. శాంతి భద్రతలు 8. లైంగిక వ్యాకులత 9. సోడోమ్ మరియు గొమొరా 10. అర్బీట్ మార్జ్ ఫ్రెడ్.

ఈ పది అధ్యాయాలు చదివేస్తే, ఫాసిజం మీద మనకున్న సందేహాలు తీరిపోయినట్టే. ప్రపంచాన్నే కాదు, మన భారతదేశం ముఖ్యంగా 2014 నుండి ఏ దిశలో పయనిస్తుందో, ఏయే యుక్తులూ, కుయుక్తులూ ఫాసిస్టులు వేయడంలో ఉద్దండులో మనకున్న ప్రత్యక్ష అనుభవంతో మరింత బాగా అర్థమవుతుంది. హంగేరీ, పోలెండ్, భారతదేశం, మయన్మార్, అమెరికా మొదలైన దేశాల ఫాసిస్టు తీరుతెన్నుల్ని రచయిత అద్భుతంగా విశ్లేషిస్తాడు. హిట్లర్ నాజీ జర్మనీ దగ్గరకు మధ్యమధ్యలో వెళుతూ, వస్తూ విషయాలను మరింత స్పష్టం చేస్తాడు.

ప్రజాస్వామ్యం నుండి ఫాసిజంలోకి పయనించే దేశాల్లో కొన్ని సారూప్యతలు ఆయన చూస్తాడు. ఇవి గతాన్ని నెమరు వేసుకుంటాయి. గతం కీర్తిని ఆకాశానికెక్కిస్తాయి. పుక్కిటి పురాణాల్ని, అవాస్తవాలతో, ఊహలతో నిండిపోయిన గతాన్ని ముందుకు తేవాలనుకుంటాయి. గతంలోనే ప్రజలు హాయిగా ఉండేవారనీ, స్వేచ్ఛ, సమానత్వ విలువలు వచ్చి మన పవిత్రమైన సాంప్రదాయాల్ని మంటగలిపాయనీ, మరలా గతంలోకి పయనించడంలోనే మన మేలు ఉందనీ ప్రజల్ని నమ్మింపజేస్తాయి.

ఇటీవల భారతదేశం 2014 నుండి ప్రొమోట్ చేస్తున్న వైదిక యుగం, ఆవు పేడ సిద్ధాంతాలూ, అశాస్త్రీయ భూతవైద్యాలూ, యోగా విద్యలూ దీన్ని రుజువు చేస్తున్నాయి. కరోనా సమయంలో కూడా పలానా సమయంలో గంటలు మోగించండనీ, కరోనాను అతీత శక్తితో తరమండనీ దేశ నాయకులు బోధించే వైనం చూస్తోంటే, ఫాసిస్టు ధోరణులు పకడ్బంధీగా ప్రజల్లో ఎలా నాటుతాయో అర్థమవుతుంది. మన వేదాల్లోనే అంతా ఉందనీ, ఆధునిక శాస్త్రాన్నీ, వైద్యశాస్త్రాన్ని చిన్నబుచ్చే ప్రక్రియను మనం చూస్తున్నాం. విశ్వవిద్యాలయాల స్థాయి సెమినార్ల లోపలికి కూడా ఈ పురాతన వైభవం జొరబడడం చూశాం.

ఇదంతా ఆకస్మికంగా, అనాలోచితంగా జరిగే ప్రక్రియ కాదు. ఒక వధకం ప్రకారం ప్రజాస్వామ్య విలువలవను వదిలేస్తూ, ఫాసిస్టు ధోరణులను ప్రజలు మెల్లమెల్లగా ఆరగించే ప్రణాళికా బద్ధమైన ప్రక్రియ అని స్టేట్స్ రచనతో మనకు తేటతెల్లమవుతుంది.



స్టేన్లీ ఇలా అంటాడు...

"మనం మనకు కావలసిన భ్రమను సృష్టించుకున్నాము. ఈ భ్రమ ఒక విశ్వాసం. ఒక ఉద్వేగం. ఇది వాస్తవం కానక్కరలేదు. జాతి మన భ్రమ. జాతి ఔన్నత్యం మనం సృష్టించుకున్న మరో భ్రమ. ఈ భ్రమను, ఈ ఔన్నత్యాన్ని వాస్తవీకరించాలని మనం కోరుకుంటున్నాము. ఈ ఆశయం ముందు మనకు ఏదీ గొప్ప కాదు" (5) ఊహా జనితమైన పురాతన యుగాల్ని ప్రొమోట్ చేయ్యడానికి మనం తర్కాన్నీ, హేతువునీ, శాస్త్రాన్నీ అణచేస్తాం. తక్కువ చేసి మాట్లాడతాం. మన పురాతన సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవనీ మన దేశ గౌరవం వీటిని ముందుకు తేవడం మీదనే ఆధారపడి ఉందనీ, మన సంస్కృతి మనకు గర్వకారణమనే ఫాసిస్టు ప్రభుత్వాలు ఘోషిస్తాయి. స్టేన్లీ అందుకే యిలా అంటాడు...

"ఇందుకు భిన్నంగా గతాన్ని స్వర్ణ యుగంగా మార్చి, రాజకీయ ప్రయోజనం కోసం ఒక ఆయుధంగా మలచటం కోసం ఈ స్వర్ణయుగాన్ని జాతి వారసత్వ సంపదకు మరో రూపంగా సృష్టించాలనే డిమాండ్ ఫాసిస్ట్ రాజకీయాల స్వభావంలోనే ఉంది" (19).

రచయిత ప్లేటో రాసిన రిపబ్లిక్ పుస్తకం 8వ వాల్యూం గురించి ప్రస్తావిస్తాడు. ప్రజలు తమకు బలమైన నాయకుడు సారథ్యం వహించాలని భావిస్తారు. ప్రజాస్వామ్య విలువలతో, ప్రజస్వామ్య పంథాలో ఎన్నికల ప్రక్రియతో యిలానే ముందుకొచ్చిన బలమైన నాయకుడు ప్రజాస్వామ్య విలువల్ని ఒక్కొక్కటి మంటగలుపుతూ ఫాసిస్టు తరహా ఆధిపత్య భావజాలానికి పునాది వేస్తాడు. రచయిత విశ్లేషణ చూస్తోంటే, మన దేశానికి అన్వయించుకుంటే, చిన్న చిన్న నిరసనలకే భయపడి జాతీయ భద్రతా చట్టాల కోరల్లోకి పౌరుల్ని ఇరికించే వైనం చూస్తోంటే, చిన్న చిన్న ఫేస్‌బుక్ పోస్టులు రాసినందుకే జాతీయ భద్రతా చట్టాల్లోకి తోసేసిన వైనం చూస్తోంటే, రచయిత రాసిన విషయాలు ఎంత వాస్తవమో అర్థం అవుతుంది.

ఫాసిస్టులు నిరసనను భరించలేక ప్రతి నిరసనను ఒక దొమ్మీలాటగానో, ఒక టెర్రరిస్టు చర్యగానో చిత్రీకరిస్తారు. హేతువునీ, తర్కజ్ఞానాన్నీ, సామాజిక శాస్త్రాలనూ, ప్రగతిశీల భావజాలాలను,

చర్చలనూ కొనసాగించే విశ్వవిద్యాలయాలను కూడా చూసి ఓర్వలేరు. వీటిపై దుమ్మెత్తి పోస్తారని స్టేన్లీ అంటాడు....

"అందుకనే అణగారిన వర్గాల దృక్పథాలకు ఎంతోకొంత చోటు ఇవ్వటానికి సిద్ధపడే విశ్వవిద్యాలయాలను మార్క్సిజాన్ని పెంచిపోషించే కేంద్రాలని నిందించటం జరుగుతుంది (43వ పేజీ).

జెఎన్‌యు విషయంలో పాలకవర్గాల తీరు, మూకల దమనకాండ, విశ్వవిద్యాలయం యొక్క అంతర్జాతీయ కీర్తిని కాలరాయడంలో ప్రణాళికాబద్ధమైన కుట్రను నెమరువేసుకుంటే, రచయిత మాటలు ఎంత వాస్తవమో అర్థం అవుతుంది. తన చర్చలో రచయిత అమెరికా, పోలెండ్, హంగేరీ మొదలైన దేశాలను ఉల్లేఖిస్తాడు. ఫాసిస్టుల ధోరణి, కార్యక్రమాలు, వాటిమధ్య సమన్వయం చూస్తాడు.

విద్యావ్యవస్థను పాసిస్టులు ఎలా మారుస్తారో స్టేన్లీ యిలా అంటున్నాడు....

''ఫాసిస్ట్ భావజాలంలో భ్రమాజనిత గత ఔన్నత్యాన్ని సమర్థించటం, జాతి నాయకుల విజయాలను కీర్తించటం, సంబంధంలేని వారి దృక్పథాలను, విజయాలను మసకబార్చటం విద్యా వ్యవస్థ కర్తవ్యంగా ఉంటుంది. (47)

.... ఫాసిస్ట్ భావజాలంలో భ్రమాజనిత గత ఔన్నత్యాన్ని చూచి గర్వపడేలా చెయ్యటమే లక్ష్యంగా పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో బోధించే సాధారణ విద్య ఉంటుంది. (48).

ఫాసిస్టు ప్రభుత్వాల్లో మీడియా కూడా నామమాత్రంగానే మిగిలిపోతుంది. అందులోనూ ఎలక్ట్రానిక్ మీడియా గురించి మరి చెప్పాల్సిన అవసరమే లేదు. ప్రజలకు నిజాన్ని అందించి నాలుగో స్తంభంగా నిలుచొని ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన మీడియా వినోద వస్తువుగా మారిపోతుంది. 'వార్త' అనేది ఓ ఆటగా మారిపోతుందని స్టేన్లీ అంటాడు. వార్తను చర్చతోనూ, విశ్లేషణతోనూ కూడిన విషయం నుండి ఒక బలమైన వ్యక్తినీ, బలమైన లక్షణాలు గల వ్యక్తినీ ఆరాధ్య దైవంగా మార్చేసే దృశ్యంగా మార్చేస్తుంది. 'వార్త' కోసం ప్రేక్షకులు కూర్చుంటే, 'వార్త'కు బదులు ఒక వ్యక్తి బలమైన వ్యక్తిగా, ఒక నక్షత్రంగా మనకు ప్యాకింగ్ చేసి అందించే ప్రక్రియ కొనసాగుతుంది. ఇదేదో ఒక రోజో రెండు రోజులో కొనసాగే అసంకల్పిత ప్రతీకార చర్య కాదు. ప్రణాళికాబద్ధంగా వార్తను మాయం చేసి ప్రేక్షకుల్ని దూడూ బసవన్నలుగా మార్చేసే ప్రక్రియ. స్టేట్స్ యిలా అంటున్నాడు......

వార్త అనేది ఒక క్రీడగా మారిపోయినప్పుడు బలమైన నాయకుడే పాపులర్ అవుతాడు. ఫాసిస్టు రాజకీయాలు వార్తల్ని సమాచారం నుంచి, తార్కికమైన చర్చలనుంచి బయటకు తెచ్చి ఒక దృశ్యంగా మార్చేస్తాయి. ఈ దృశ్యంలో బలమైన నాయకుడినే నక్షత్రంగా చూపిస్తాయి. (71)

ఫాసిస్టులు 'మనం', 'వారు' అని ప్రజల్ని విడదీసి పాలిస్తారు. చట్టాన్ని పాటించేవారు, మంచి పౌరులు 'మనం' అనీ, చట్టాల్ని వ్యతిరేకించేవారు, పాటించని వారూ 'వారు' అని ప్రజల్ని 'మతం' పరంగానో, 'రంగు' పరంగానో, యింకా యితర విధానాల ద్వారానో విడదీస్తారు. విద్వేషాన్ని నింపుతారు. ఈ విషయాలను చాలా చక్కగా రెండు అధ్యాయాల్లో వివరించారు. 'వారి' వల్ల 'మనం' చాలా నష్టపోతున్నామనీ, 'వారు' 'మన'కు సంబంధించినవన్నీ తీసేసుకుంటున్నారనీ, 'మనం' బాధితుల పాత్రలో బతకాల్సి వస్తుందనీ, యిది 'వారి' కారణంగానే అనీ ప్రజలకు నూరిపోస్తారనీ స్టేన్లీ ఎంతో చక్కగా రాస్తున్నాడు! సరిగ్గా మన దేశాన్ని పరిశీలించి, హిందువులను 'మనం' గానూ, ముస్లింలను 'వారు' గానూ విభజించి పాలిస్తోన్న ప్రభుత్వాన్ని పరిశీలించి రాశారా అనిపిస్తుంది. అయితే, ఫాసిస్టు ప్రభుత్వాలన్నీ ఇదే దారిలో పయనిస్తాయని వివిధ దేశాల ఉదాహరణలతో రాస్తాడు. ఈ సిద్ధాంతాలు మన దేశానికి కూడా వర్తిస్తాయి. విద్వేష రాజకీయాలు ప్రజల్ని ఇలానే మన దేశంలో కూడా విడగొట్టి సొమ్ము చేసుకోవడం, ఓట్ల పంట పండించుకోవడం మనం చూస్తున్నాం.

ఫాసిస్టు ప్రభుత్వాలను అధ్యయనం చేసి రాసిన ఈ పుస్తకం తప్పక చదవాల్సిన పుస్తకం. మన దేశం తీరుతెన్నులు కూడా మరింత స్పష్టంగా అర్థం చేసుకోగలం. ప్రజాస్వామ్య, సోషలిస్టు విలువలను పరిరక్షించుకోగలం.

మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదు. అది ఆచరణలో తేలే ప్రశ్న. సత్యాన్ని, అంటే, తన ఆలోచనకు సంబంధించిన వాస్తవికతనూ, శక్తినీ, తాను చూసే పార్శ్వాన్నీ మనిషి ఆచరణలోనే రుజువు చేయవలసి ఉంటుంది. ఆలోచన వాస్తవికమైనదా, అవాస్తవికమైనదా అనే వివాదాన్ని ఆచరణ నుంచి వేరు చేస్తే అది కేవలం పండిత చర్చే అవుతుంది.

– కార్ల్ మార్క్స్

జయశ్రీ మృతి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాకుమాని జయశ్రీ (61) ఆగస్టు 1న హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. జయశ్రీ 1960 ఏప్రిల్ 15న కడప జిల్లా ప్రొద్దుటూరులో జన్మించారు. 1986లో న్యాయవాద కోర్సులో పట్టా పొందారు. 1988లో పౌరహక్కుల సంఘంలో చేరి ప్రజల హక్కుల కోసం పనిచేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రజల కోసం పనిచేస్తున్న వారిపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సాయుధ ముఠాల వ్యతిరేక పోరాట కమిటీలో క్రియాశీలకంగా పనిచేశారు. రాయలసీమలోని ఫ్యాక్షన్ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలతో కలిసి పనిచేశారు. 1998లో మానవ హక్కుల వేదికలో చేరి జిల్లా కన్వీనర్‌గా యూరేనియం, కుందూ – పెన్నానది, కడపకు వైఎస్ఆర్ పేరు, పెద్ద పసుపులలో మద్యం వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలతో పాటు గండికోట ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిర్వాసితులు చేపట్టిన ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. మైనింగ్ శాఖలో 160 మంది గిరిజనుల ఉద్యోగాలు తొలగించడంపై నేషనల్ షెడ్యూల్ ట్రైబ్ కమిషన్‌తో న్యాయపరంగా పోరాడారు.

జలాల వివాదంపై వెబినార్

తెలుగు రాష్ట్రాల మధ్య తలెత్తిన జలాల వివాదాన్ని పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం దీన్ని సాకుగా తీసుకొని, నదీ బోర్డులు ఏర్పాటుచేసి పెత్తనం చేస్తోందని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని పర్యావరణవేత్త మేధా పాట్కర్ అన్నారు. 'కృష్ణా నదీ జలాల వివాదం, కేంద్ర గెజిట్ పర్యవసానాలు–తెలంగాణ భవిష్యత్'పై పాలమూరు అధ్యయన వేదిక, తెలింగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 1న నిర్వహించిన వెబినార్‌లో ప్రొ. హరగోపాల్, ప్రొ. ఎం. కోదండరామ్ మాట్లాడారు. కేంద్రం చర్చలు జరిపి సమస్యను పరిష్కరించే అవకాశమున్నా, రాష్ట్రాలపై పెత్తనానికే గెజిట్‌ను విడుదల చేసిందని విమర్శించారు. రెండు రాష్ట్రాల హక్కులను కాపాడేలా పౌర సమాజం ఉద్యమించాలన్నారు. ఈ ఏడేళ్ల పాలనలో ముఖ్యమంత్రి కెసిఆర్ దక్షిణ ప్రాంత జిల్లాలను పట్టించుకోలేదని అన్నారు. కృష్ణానదీ జలాల వివాదం తెలంగాణ ఉద్యమంలో భాగమైందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైనపుడు తెలంగాణ ప్రజలు నీటి విషయంలో ఆందోళన చెందారని, తెలంగాణకు దక్కాల్సిన నీరు దక్కలేదని తెలిపారు. కేంద్రం కృష్ణా జలాలను పంచకుండా, అధికారాలను తన చేతిలోకి తీసుకోవడమంటే తెలంగాణకు అన్యాయం చేసినట్లేనన్నారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన

విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని విద్యుత్, పంపిణీ సంస్థల ముందు కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పార్లమెంటు సమావేశాల్లో విద్యుత్ సవరణ బిల్లుపెట్టే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్‌లోని కెటిపిపిలో ఉద్యోగులు, సిబ్బంది; భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కెటిపిఎస్ 5,6,7 దశల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యలో ఆగస్టు 10న ఆందోళన చేపట్టారు. విద్యుత్ సౌధలో ధర్నా నిర్వహించారు. పార్లమెంట్‌లో విద్యుత్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన రోజే దేశవ్యాప్తంగా విధులు బహిష్కరించి, మెరుపు సమ్మెకు దిగుతామని జాతీయ విద్యుత్ ఉద్యోగుల సమన్వయ కమిటీ హెచ్చరించింది.

నిరుద్యోగ యువత ఆందోళన

'విద్యారంగ, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి. విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలి.. ఉద్యోగ నోటిఫికేషన్ వేయాలి. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి' అని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 11న కలెక్టరేట్లను ముట్టడించింది. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్ ముందు బైటాయించి లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు, యువకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటుచేసుకుంది. నాయకులను అరెస్టుచేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేయడం వల్ల నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న లక్షా 90 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 11న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌వద్ద తెలంగాణ రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కరించి, జీతాలు పెంచాలని అడిగితే ఉద్యోగాల నుంచి తొలగించడంతో 7,600 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్‌ల కోసమే కాకుండా ఆరోగ్య శ్రీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, తొలగించిన నర్సుల కోసం పోరాటం చేస్తామన్నారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో సిపిఐ(ఎం) నుండి నంద్యాల నర్సింహారెడ్డి, బి.సి. సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య హాజరయ్యారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ధర్నా

బీమా రంగాన్ని ప్రైవేటీకరిస్తూ రాజ్యసభలో బిల్లు ఆమోదించుకున్న కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రభుత్వరంగ సాధారణ బీమా ఉద్యోగులు ఆగస్టు 12న భారీ ధర్నా నిర్వహించారు. మోడీ ప్రభుత్వం బిల్లును అప్రజాస్వామికంగా, అనైతికంగా ఆమోదించుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ కమిటీ పిలుపుమేరకు హైదరాబాద్‌లోని యునైటెడ్ ఇండియా రీజనల్ కార్యాలయం, బషీర్‌బాగ్‌లో భోజన విరామ సమయాన బీమా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. బీమా కంపెనీల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ప్రాథమిక పాఠశాలల విభజనను వ్యతిరేకిస్తూ నిరసన

నూతన విద్యావిధానం అమలును నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆగస్టు 14న ధర్నాలు నిర్వహించారు. సిపిఎస్‌ను, నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, ఎయిడెడ్ విద్యా సంస్థలను కొనసాగించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నినదించారు. ప్రాథమిక పాఠశాలల విభజనను అడ్డుకోకపోతే భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మెమో 172ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యావిధానం అమలులో భాగంగా 3,4,5 తరగతులకు బదిలీ చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నాచేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉక్కు పరిపాలనా భవనాన్ని ముట్టడించిన కార్మికులు

విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకంపై ఉక్కు కార్మికవర్గం ఆందోళనవ్యక్తం చేస్తోంది. ఉక్కు కర్మాగారాన్ని వంత శాతం వ్యూహాత్మక అమ్మకానికి ట్రాన్సాక్షన్ అడ్వయిజరీ, లీగల్ అడ్వయిజర్‌ల నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టెండర్ల ప్రక్రియను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ఆగస్టు 17న ముట్టడించారు. అడ్వయిజర్‌ల అడ్డుకుంటామని హెచ్చరిస్తూ ఉక్కు పరిపాలనా భవనం జంక్షన్ గేటు వద్ద 'స్టాప్ ప్రైవేటైజేషన్–సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్' అన్న నినాదాలు ఉన్న గొడుగులతో వేలాది మంది కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు.

పోడు రైతులపై దాడులు ఆపాలి

తెలంగాణలో పోడు సాగుదారులపై నిర్బంధం ఆపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధికారుల వేధింపులు తట్టుకోలేక రైతు ఆత్మహత్య సంఘటనకు నిరసనగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ వద్ద ఆగస్టు 12న నిరసన తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అటవీ అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైతులపై అటవీ అధికారులు, పోలీసులు చేస్తున్న దాడులను ఆపివేయాలని తెలంగాణ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ నిజనిర్ధారణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పోడు రైతుల సమస్యలపై నాలుగు జిల్లాల్లో నిజనిర్ధారణ కమిటీ పర్యటించి దాదాపు 250 మంది రైతుల నుండి సేకరించిన సమాచారాన్ని ఆగస్టు 20న హైదర్‌గూడలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అటవీ ప్రాంత భూములపై శాశ్వత హక్కులు పొందేందుకు పట్టాలు ఇవ్వాలని, రిజర్వ్ ఫారెస్టు పేరిట పంటలను నాశనం చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. వీ

జడ్జీని చంపిన మాఫియా

మాఫియా హత్య కేసులను విచారిస్తున్న జిల్లా జడ్జీ హత్యకు గురయ్యారు. జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జీ ఉత్తమ్ ఆనంద్ జూలై 29న ఉదయం జాగింగ్‌కు వెళ్లగా వెనకనుంచి ఆటోరిక్షాతో ఢీకొట్టారు. దీంతో తీవ్రగాయాలైన ఆనంద్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా చనిపోయారు. ఆయన భార్య కీర్తి సిన్హా ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. ఆనంద్ మాఫియా హత్యలకు సంబంధించిన 5 కేసులను విచారిస్తున్నారు. ఇటీవల ఓ హత్యకేసులో యుపికి చెందిన ఇద్దరు గ్యాంగ్‌స్టర్ల బెయిల్‌ను నిరాకరించారు. వారే ఈ హత్యకు పాల్పడి ఉంటారని జార్ఖండ్ హైకోర్టు, ధన్‌బాద్ జిల్లా కోర్టు న్యాయవాదులు జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవి రంజన్‌కు లేఖ రాశారు. ఆ లేఖను రిట్‌పిటిషన్‌గా మార్చిన హైకోర్టు సిజె విచారణ జరిపారు.

కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టాన్ని రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరల భరోసా, వ్యవసాయ సేవల చట్టాన్ని (కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం) వెంటనే రద్దు చేయాలని కిసాన్ సంసద్ (రైతుల పార్లమెంట్) డిమాండ్ చేసింది. కిసాన్ సంసద్ జూలై 29న జోరు వానలోనూ జరిగింది. ఇది మూడు సెషన్లుగా జరగగా, అందులో సభ్యులు కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టంపై సుదీర్ఘంగా చర్చించారు. ఆ తరువాత రైతు వ్యతిరేక చట్టాన్ని కిసాన్ సంసద్ రద్దు చేసింది. కనుక కేంద్ర ప్రభుత్వం కూడా ఈ చట్టాన్ని రద్దుచేయాలని కిసాన్ సంసద్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

తమిళనాడులో అశోక్ లేలాండ్ కార్మికుల నిరసనలు

తమిళనాడులోని అశోక్ లేలాండ్ కార్మికులు నిరసనలకు దిగారు. గత వేతన ఒప్పందం గడువు ముగియడంతో ముందస్తుగా దీనిని పరిష్కరించాలని కోరుతూ హోసూర్‌లోని అశోక్ లేలాండ్ వాహనాల తయారీ ప్లాంట్‌లో యూనిట్-2 కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి జూలై 28న నిరసన వ్యక్తంచేశారు. జూలై 16న వేతన ఒప్పందానికి సంబంధించిన అంశాన్ని త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. సంస్థ లాభాలపై బోనస్ ఇవ్వాలన్నారు. కరోనా సమయంలోనూ ఈ యూనిట్ కార్మికులు అధిక ఉత్పాదకతను సాధించినట్టు తెలిపారు. ఎన్నోర్‌లోని ప్లాంట్ కార్మికులకు అందిస్తున్న వేతనాలు తమకు అందించాలనీ, పదవీ విరమణ వయస్సును 58 నుంచి 60 ఏండ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులపై పోలీసుల దాడి

జర్నలిస్టులపై పోలీసులు లాఠీలు, కర్రలతో దాడిచేశారు. జమ్మూకశ్మీర్‌లో మొహర్రం ఊరేగింపు కవరేజికి వెళ్లిన 10 మంది జర్నలిస్టులపై పోలీసులు దాడిచేశారు. శ్రీనగర్‌లో స్టేషన్ హెడ్ ఆఫీసర్... కవరేజికి వెళ్లిన హిందూస్థాన్ టైమ్స్ జర్నలిస్టు వసీం ఆంద్రాబీతో వాగ్వాదానికి దిగి అడ్డుకున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి వెళ్లిన బుర్హాన్ అనే ఫ్రీలాన్స్ జర్నలిస్టుపై పోలీసులు లాఠీలతో దాడిచేశారు. హమీద్ దివైర్‌తో మాట్లాడుతూ పోలీసులు దాడి చేయడంవల్ల తన 60డి కెమెరా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ఈ దాడికి నిరసనగా బిబిసి ఉర్దూ ఫొటో జర్నలిస్టు అక్కడే నేలపై కూర్చొని నిరసన తెలిపారు. జర్నలిస్టులపై జరిగిన దాడిని ఖండిస్తూ అంతర్జాతీయ మీడియా వాచ్‌డాగ్ కమిటీ ఈ ఘటనపై విచారణకు ఆదేశించాలనీ, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జమ్మూకశ్మీర్ ప్రభుత్వాన్ని కోరింది.

ఉన్నావ్ బాధితురాలికి వ్యక్తిగత భద్రతాధికారుల వేధింపులు

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2017 ఉన్నావ్ లైంగిక దాడి బాధితురాలిని వేధింపులకు గురిచేస్తున్నారు. వ్యక్తిగత భద్రతాధికారులు (పిఎస్ఓ) తనను వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఆమె ఢిల్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆమె చేసిన ఆరోపణలపై నివేదికను అందించాల్సిందిగా సిబిఐ విచారణాధికారిని జిల్లా సెషన్ జడ్జి ధర్మేష్ శర్మ ఆదేశించారు. తనను, తన కుటుంబ సభ్యులను పిఎస్ఓలు వేదనకు గురిచేస్తున్నారని ఆమె పిటిషన్ దాఖలు చేసినట్టు వీడియో కాన్ఫరెన్స్ విచారణలో జడ్జి తెలిపారు.

మిజోరాంపై తొలిగిన ఆర్థిక దిగ్బంధనం

మిజోరాంపై ఆర్థిక దిగ్బంధనాన్ని అస్సోంలోని కొచార్ జిల్లా లైలాపూర్ స్థానికులు తొలగించారు. దీంతో గతకొన్ని రోజులుగా రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో నిలిచివున్న తొమ్మిది గూడ్స్ ట్రక్కులు ఆగస్టు 7న ముందుకు కదిలాయి. ఇది జాతీయ రహదారి 306 మీదుగా మిజోరాంలోకి ప్రవేశించాయని అధికారులు ఆగస్టు 8న తెలిపారు. అస్సోంకు చెందిన ఇద్దరు మంత్రులు, ఇతర అధికారులు ట్రక్కుల నిలిపివేతపై చర్చించారు. సరిహద్దు వివాదం కారణంగా జూలై 26న జరిగిన ఘర్షణల్లో ఆరుగురు పోలీసులతో సహా ఒక పౌరుడు మరణించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని స్థానికులకు హామీ ఇవ్వడంతో వారు ట్రుక్కులను ముందుకు పోనిచ్చారు.

లవ్ జిహాద్ వ్యతిరేక చట్టంపై గుజరాత్ హైకోర్టు స్టే

లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మాదిరిగా తీసుకొచ్చిన చట్టంపై గుజరాత్ ప్రభుత్వానికి ఆ రాష్ట్ర హైకోర్టు అడ్డుపడింది. గుజరాత్ మతస్వేచ్ఛ (సవరణ) చట్టం-2021లోని 6 సెక్షన్లపై స్టే విధిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం ఆగస్టు 19న మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. మేజర్ అయిన యువతీ యువకులు తమ ఇష్టపూర్వకంగా మతాంతర వివాహం చేసుకుంటే అనవసర వేధింపుల నుంచి రక్షించేందుకే 6 సెక్షన్లపై స్టే విధించినట్లు జస్టిస్ విక్రమ్‌నాథ్ తెలిపారు. లవ్ జిహాద్‌ను అడ్డుకునేందుకు గుజరాత్ సర్కారు ఏప్రిల్‌లో సవరణ చట్టాన్ని తెచ్చింది. దీన్ని సవాలు చేస్తూ జమాత్ ఉలేమా-ఎ-హింద్ గుజరాత్ శాఖ తరపున మహమ్మద్ ఈసా హకీం హైకోర్టులో పిటిషన్ వేశారు.

రాజ్య సభలో బీమా బిల్లుకు ఆమోదం

పార్లమెంట్ సమావేశాల్లో ఆగస్టు 12న రాజ్యసభలో రైతు సమస్యలు, పెగాసస్‌పై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొని సభను వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఒబిసి బిల్లుపై చర్చ జరిగి బిల్లు ఆమోదం పొందింది. ఆ తరువాత జనరల్ ఇన్సురెన్స్ బిజినెస్ సవరణ బిల్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. దీన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం అంగీకరించకుండా బిల్లుపై చర్చను ప్రారంభించింది. దీంతో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ గందరగోళంలోనే సభ్యులు ప్రవేశపెట్టిన సవరణలను మూజువాణి ఓటుతో తిరస్కరించి, బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు.

'మోడీ సర్కార్ హటావో, దేశ్ బచావో'

'మోడీ సర్కార్ హటావో... దేశ్ బచావో' అంటూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది నినదించారు. క్విట్ ఇండియా వార్షికోత్సవం సందర్భంగా ఎఐకెఎస్, సిఐటియు, ఎఐఎడబ్ల్యుయు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. మోడీ సర్కార్ హటావో, కార్పొరేట్ లూట్ బంద్ కరో, దేశ్ బచావో నినాదాలతో ప్రజలు దేశ వ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. ఆగస్టు 9న 25 రాష్ట్రాల్లోని వందలాది జిల్లాల్లో లక్షలాది మంది ప్రజలు ఆందోళనలో పాల్గొన్నారు. మూడు వ్యవసాయ చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి. కార్పొరేట్‌లకు అమ్మకాన్ని ఆపాలి. డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్‌తో సహా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను ఆపాలని డిమాండ్ చేశారు. వీ

మయన్మార్‌లో పెరుగుతున్న మృతుల సంఖ్య

సైన్యం మయన్మార్ ప్రభుత్వాన్ని కూలదోసిన 2021 ఫిబ్రవరి నుండి ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా పౌరులు మరణించారని అసిస్టెన్స్ అసోసియేషన్ ఫర్ పొలిటికల్ ప్రిజనర్స్ (ఎఎపిపి) తెలిపింది. 999 మంది పౌరులను మిలిటరీ హత్య చేసిందని ఆగస్టు 17న ఎఎపిపి ట్విట్టర్‌లో తెలుపగా, ఆగస్టు 18 ఉదయానికి ఈ సంఖ్య 1001కి చేరిందని మీడియాకు తెలిపింది. వాస్తవానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని గ్రూపు కార్యదర్శి టాటే నైయింగ తెలిపారు. 7,320 మంది అరెస్టు కాగా, ప్రస్తుతం 5,712 మంది నిర్బంధంలో ఉండడమో లేదా మరణ శిక్ష పడడమో జరిగిందని ప్రసార మాధ్యమాలు తెలిపాయి. మిలిటరీ పాలనను వ్యతిరేకిస్తూ వేలాదిమంది నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నారు.

నైజీరియాలో ప్రభుత్వ డాక్టర్ల సమ్మె

జీతాల పెంపు, ఇతర సౌకర్యాల కల్పన డిమాండ్ చేస్తూ నైజీరియాలో ప్రభుత్వ రెసిడెంట్ డాక్టర్లు నిరవధిక సమ్మెకు దిగారు. ప్రభుత్వ ఒప్పందం ప్రకారం రావాల్సిన బకాయిలు, ప్రమాదకర పరిస్థితిల్లో పనిచేస్తున్నందుకు ఒప్పుకున్న ప్రత్యేక అలవెన్స్, ఇన్సూరెన్స్ సౌకర్యం తక్షణమే అమలుచేయాలని డాక్టర్లు కోరుతున్నారు. ఇవే సమస్యలపై గత ఏప్రిల్‌లో 10 రోజులపాటు వైద్యులు సమ్మె చేశారు. కరోనా తీవ్రత దృష్ట్యా ప్రజలకు అసౌకర్యం కలిగించ వద్దనే ఉద్దేశంతో విరమించుకున్నారు. ఇప్పుడు ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా మారి కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో నిరవధిక సమ్మెకు దిగినట్లు యూనియన్ నాయకులు ప్రకటించారు. నైజీరియాలో మొత్తం 40,000 మంది డాక్టర్లు పనిచేస్తున్నారు. అందులో 16,000 మంది రెసిడెంట్ డాక్టర్లు ఇప్పుడు సమ్మెలో ఉన్నారు.

మలేషియాలో పార్లమెంట్ సభ్యుల నిరసనలు

మలేషియాలో ప్రతిపక్ష సభ్యులు ఆగస్టు 2న పార్లమెంట్ భవన్‌కు నిరసన ప్రదర్శన చేశారు. దాదాపు 100 మంది పార్లమెంట్ సభ్యులు మిర్‌డెకా కూడలి నుంచి తమ నిరసన ప్రారంభించారు. మాజీ ప్రధాని మహతీర్ ప్రస్తుత ప్రతిపక్ష నాయకులు అన్వర్ ప్రదర్శకు నాయకత్వం వహించారు. ప్రస్తుత ప్రధాని ముహైయదిన్ కరోనా కట్టడిలో పూర్తిగా విఫలమైనారనీ, అందుకు బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. నిరసన తెలుపుతున్న పార్లమెంట్ సభ్యులపై పెద్ద ఎత్తున పోలీసులను దింపి నీటి ఫిరంగులను సిద్ధంచేశారు. దీంతో ప్రతిపక్షాలు తమ వాణి వినిపించకుండా ప్రభుత్వం నోర్లు నొక్కేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని రాజీనామా చేయాలనీ, కొవిడ్–19 నియంత్రణకు తక్షణ ప్రాధాన్యత ఇచ్చి అన్ని ఏర్పాట్లు చేయాలనీ కోరారు.

దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు

దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ రక్షణ బలగాలు ఆగస్టు 6న బాంబు దాడులు జరిపాయి. దీంతో గొలాన్ హైట్స్, ఎగువ గెలిలే ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. లెబనాన్ రాకెట్ దాడులకు ప్రతిగానే తాము ఈ చర్య తీసుకున్నామని ఇజ్రాయిల్ ప్రభుత్వం సమర్థించుకుంది. దక్షిణ లెబనాన్ వైపు నుండి పదికి పైగా రాకెట్లు ప్రయోగించారని, వాటిల్లో చాలా వాటిని తాము తిప్పికొట్టామని ఇజ్రాయిలీ రక్షణ శాఖ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 2006లో కూడా లెబనాన్‌పై ఇజ్రాయిల్ ఇదే విధంగా పెద్ద ఎత్తున విరుచుకుపడింది. లెబనాన్‌పై రాత్రి పూట ఇజ్రాయిల్ వైమానిక దాడులు జరపడం ఇజ్రాయిల్ విస్తరవాద కాంక్షను తెలియజేస్తున్నదని లెబనాన్ అధ్యక్షుడు మైఖెల్ అవూన్ విమర్శించారు.

అమెజాన్ అడవుల నుంచి ఆదివాసులను గెంటివేసే కుట్ర

బ్రెజిల్‌లోని అమెజాన్ అడవులు ప్రపంచంలోనే పెద్దవి. అందులో దాదాపు తొమ్మిది లక్షల మంది ఆదివాసీ తెగలకు చెందిన వారు, 462 ప్రత్యేక గుర్తింపు ఉన్న ప్రాంతాల (రిజర్వుడ్ ఫారెస్ట్)ల్లో నివసిస్తున్నారు. ఇప్పుడు బోల్సనారో ప్రభుత్వం వారిని అక్కడ నుంచి గెంటివేసి ఆ ప్రాంతాలను పెద్ద పెద్ద ఆయిల్, మైనింగ్ సంస్థలకు కట్టబెట్టేందుకు సిద్ధమయింది. అమెజాన్ అడవి అనేది పర్యావరణ సమతుల్యత సాధించడంలో చాలా కీలకమైనది. ప్రకృతిలోని కార్బన్‌ను అది పీల్చుకుంటుంది. మైనింగ్ కోసం చెట్లు నరికివేస్తే సమతుల్యత పూర్తిగా దెబ్బతింటుంది.

హైతీలో భూకంపం

భారీ భూకంపం వల్ల అతలాకుతలమై దాని నుంచి ఇంకా కోలుకోక ముందే హైతీని గ్రేస్ పెను తుపాను కుదిపేసింది. దీంతో సహాయక చర్యలు చేపట్టడానికి తీవ్ర విఘాతమేర్పడింది. భూకంప మృతుల సంఖ్య 2 వేలకు పెరిగింది. ఆగస్టు 13న రిక్టర్ స్కేలుపై 7.2 తీవ్రతతో భారీ భూకంపం హైతీని కుదిపేసింది. ఈ విపత్తు కారణంగా 2,207 మంది మరణించారని, 344 మంది కనిపించడం లేదని, మరో 10 వేల మంది వరకు గాయపడ్డారని ఆ దేశ సివిల్ ప్రొటక్షన్ ఏజెన్సీ ఆగస్టు 17న వెల్లడించింది. తుపాను కారణంగా భూకంప బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేశారు.

బ్యాంకాక్‌లో వెల్లువెత్తిన నిరసనలు

బ్యాంకాక్‌లోని థాయ్‌లాండ్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తాయి. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంతో పాటు ఆర్థిక పరిస్థితులను గాడిలో పెట్టడంలో ప్రభుత్వం విఫలమైందంటూ ఆగస్టు 7న వేలాది మంది ఆందోళన నిర్వహించారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని విక్టరీ మాన్యుమెంట్ సమీపంలోని రహదారుల్లో వేలాది మంది ర్యాలీగా వెళ్ళి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ క్రమంలో నిరసనకారులపై జల ఫిరంగులు, టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లను పోలీసులు ప్రయోగించారు. దీంతో మరింతగా ఆగ్రహించిన ఆందోళనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. ప్రధాన మంత్రి ప్రయుత్ చాన్‌వోచా కార్యాలయం వైపు ర్యాలీ వెళ్లడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రజలకు వ్యాక్సిన్లు అందించడంలో ప్రభుత్వం విఫలమైందనీ, దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

మెక్సికోలో చర్చలు ప్రారంభం

వెనుజులా ప్రభుత్వం, ఆ దేశ ప్రతిపక్షాల మధ్య చర్చలు మెక్సికోలో నార్వే మధ్యవర్తిత్వంలో ఆగస్టు 13న ప్రారంభం అయ్యాయి. ఈ చర్చలకు వెనిజులా జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడు రాడ్‌రిక్స్ హాజరయ్యారు. ప్రధాన ప్రతిపక్షాలు హాజరయ్యాయి. చర్చల ప్రారంభానికి ముందు చర్చల ప్రక్రియ నియమ నిబంధనల గురించి ఒక అంగీకారానికి వచ్చి సంతకాలు చేశారు. చర్చలలో రాజకీయ హక్కులు, ఎన్నికల గ్యారంటీ గురించి, ఆంక్షల ఎత్తివేత, సామాజిక శాంతి పునరుద్దరణ, విదేశాలలో చట్ట విరుద్దంగా జప్తు చేసిన వెనిజులా సంపదను విడుదల చేయడం లాంటి అంశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా నార్వే ప్రతినిధి చర్చలు సఫలం కావడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు.

ఆకలితో అల్లాడుతున్న జనం

ప్రపంచ మానవాళి ఆకలి సమస్యల్ని కొవిడ్ సంక్షోభం మరింత పెంచింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఆకలితో బాధపడేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. ఆఫ్రికా, ఆసియాకు చెందిన 76 దేశాల్లోని 120 కోట్ల మందికి తినడానికి తిండి లేదని అమెరికా వ్యవసాయ విభాగం (యుఎస్‌డిఏ) తాజా నివేదిక అంచనావేసింది. ఆకలి సమస్య పెరిగిన దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. రోజుకు కనీసం 2100 కాలరీల శక్తినిచ్చే ఆహారం తీసుకోకపోతే ఆ వ్యక్తి ఆకలి సమస్యతో ఉన్నాడని అర్థం. ప్రతి ఏటా అమెరికా నుంచి ఆహార సహాయాన్ని పొందుతున్న 76 దేశాల్లో ప్రస్తుతం ఎలా ఉందన్నదానిపై యుఎస్‌డిఏ అధ్యయనం చేయగా పై విషయాలు తెలిసాయి. వీ


VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society-238 - September 2021 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/08/2021 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th



కె.జి.కన్నబీరన్

ఆత్మకథాత్మక సామాజిక చిత్రం



సమాజంలో ఒక కొత్త సంఘటన, ఒక కొత్త పరిణామం జరిగినప్పుడల్లా ఇప్పుడు ఫలానా వారుంటే ఎంత బాగుండును అనిపిస్తుంది. గతంలో అటువంటి సంఘటనల మీద, పరిణామాల మీద వారి వ్యాఖ్యలు గుర్తుకొస్తాయి. ఇది సమాజంలో మౌలిక మార్పుల లేమికీ చిహ్నం కావచ్చు. అంత ప్రతిభావంతమైన వ్యాఖ్యలు చేసే కొత్త వ్యక్తులు పుట్టుకు రాకపోవడానికీ చిహ్నం కావచ్చు. లేదా ఆ గతకాలపు వ్యక్తి పట్ల మన గౌరవానికీ, ఆ వ్యక్తి దూరదృష్టికీ, నిశితమైన మేధా విశ్లేషణా శక్తికీ, స్పందనా శీలతకూ గుర్తు కావచ్చు.

అటువంటి అద్భుత మేధావి కె జి కన్నబిరాన్.

ఒక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లైంగిక వేధింపుల ఆరోపణకు గురై తన కేసు మీద తీర్పరిగా తానే కూచున్నప్పుడు, అదే ప్రధాన న్యాయమూర్తి గద్దె దిగిన కొన్ని నెలల లోపే అంతకన్న చాల దిగువ స్థానంలో ఉండే రాజ్యసభ సభ్యుడి స్థానానికి వెంపరలాడినప్పుడు, అత్యున్నత న్యాయస్థానాలు అన్యాయమైన తీర్పులు ఇస్తున్నప్పుడు, ఎనభై నాలుగు సంవత్సరాల అనారోగ్య పీడితుడికి బెయిల్ ఇవ్వడానికి తాత్సారం చేసి మరణానికి కారణమైనప్పుడు, దొంగ సాక్ష్యాధారాల కూటసృష్టి జరిగిందని అన్ని ఆధారాలూ బైటపడినా ఏళ్ల తరబడి విచారణ కూడ లేకుండా ప్రక్రియనే శిక్షగా అమలు జరుపుతున్నప్పుడు, తమ నిర్బంధంలో ఉన్న ఖైదీలను పట్టపగలు నడిరోడ్డు మీద కాల్చి చంపినప్పుడు, నేరస్థలంలో నేర పునర్నిర్మాణ దర్యాప్తు పేరిట నిందితుల ప్రాణాలు బలిగొన్నప్పుడు, రచయితల, కళాకారుల, పౌరహక్కుల సంఘాలతో సహా అనేక ప్రజాసంఘాలను నిషేధించినప్పుడు...

న్యాయవ్యవస్థ, అధికార యంత్రాంగం, శాసన నిర్మాణ వ్యవస్థ రాజ్యాంగ బద్ధ విధులకూ, చట్టబద్ధ పాలనకూ దూరం జరుగుతున్నప్పుడు...

అటువంటి అనేకానేక సందర్భాలలో సరిగ్గా అటువంటి సందర్భంలోనే కన్నబిరాన్ చేసిన వ్యాఖ్యలు, నిర్వహించిన పాత్ర, జోక్యం చేసుకున్న తీరు మళ్లీ మళ్లీ గుర్తుకొస్తాయి.

కె జి కన్నబిరాన్ ఆత్మకథాత్మక సామాజిక చిత్రం '24 గంటలు'ను రెండు సంవత్సరాల పాటు ధారావాహికంగా ప్రచురించి, పుస్తకంగా కూడ ప్రచురించిన ప్రజాతంత్ర ఆ జ్ఞాపకాలను సవినయంగా గుర్తు చేసుకుంటున్నది.

సరిగ్గా అటువంటి పరిణామాలే మళ్లీ మళ్లీ జరుగుతున్న ఈ చారిత్రక సందర్భంలో పదిహేను సంవత్సరాల కిందటి ఆ ధారావాహికను మళ్లీ ఒకసారి ప్రచురించాలని తలపెడుతున్నది.

వీక్షణం సంపాదకుడు ఎన్. వేణుగోపాల్ అక్షరీకరించిన
కె జి కన్నబిరాన్
'24 గంటలు – ఆత్మకథాత్మక సామాజిక చిత్రం'

మళ్లీ ఒకసారి ధారావాహికగా ప్రజాతంత్రలో ప్రతి ఆదివారం...

చూడండి www.prajatantranews.com for epaper & facebook

If undelivered please return to:

VEEKSHANAM

Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 73307 95849

To:
Mr./Mrs.________________________

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at NAVYA PRINTERS, 2-3-655/C/16/B, Durga Nagar, Amberpet, Hyderabad -500013 (New Declaration filed) for Charitha Impressions (as per RNI records) and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao